


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 139

శనివారం 9-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నా చెల్లెలే నా మదర్.. - 13లో
మా అన్నయ్య ఫాదర్ ఫిగర్



కనకం.. కొత్త శిఖరం! - 14లో
ఢిల్లీలో ధర రూ.1,03,420



'పీఎం-ఉజ్వల'కు రూ.12వేల కోట్లు

రక్షాబంధన్ వేడుకల వేళ మహిళలకు శుభవార్త.. 'ఉజ్వల యోజన'కు ఈ ఏడాది కేంద్రం రూ.12,060 కోట్లు వెచ్చించనుంది.

- వివరాలు 6లో ▶



పార్లమెంట్‌లో మిన్నంటిన నిరసనలు

బిహార్‌లో చేపట్టిన 'ఎస్‌ఐఆర్'పై ప్రభుత్వం వెంటనే చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఉభయసభల్లో నినదించాయి.

- వివరాలు 6లో ▶



ఇకపై రాష్ట్ర విద్యా విధానం

జాతీయ విద్యా విధానానికి (ఎన్ఈపీ) ప్రత్యామ్నాయంగా తమిళనాడు రాష్ట్ర విద్యా విధానాన్ని (ఎస్ఈపీ) తీసుకొచ్చింది.

- వివరాలు 6లో ▶



రష్యా నుంచి కొనకుంటే భారమే!

ట్రంప్ సుంకాల మోత నేపథ్యంలో రష్యా నుంచి ముడి చమురు కొనడం ఆపేస్తే భారత్‌పై మోయలేని భారం పడడం ఖాయం.

- వివరాలు 6లో ▶

'కోర్' వదిలి.. కల చెదిరి..



సాక్షి, హైదరాబాద్

అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు పెద్దలు. ఇప్పుడు కంప్యూటర్ ఇంజనీర్ల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆకర్షణీయమైన జీతం, జీవితం దక్కుతుందన్న ఆశతో కోర్ గ్రూపులు వదిలేసి, కంప్యూటర్ ఇంజనీరింగ్ వైపు పరుగులు పెట్టిన వారు.. ఇప్పుడు చిన్నపాటి ప్యాకేజీలకు కూడా ఉద్యోగాలు లభించక, ఇప్పటికే ఫీల్డులో ఉన్న వారు అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దెబ్బకు నిలబడలేక తలలు పట్టుకుంటు న్నారు. ప్రస్తుతం ఐటీ పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. కొన్ని నెలలుగా ఉద్యోగుల తొలగింపు (లే ఆఫ్స్)లు పెరుగుతు న్నాయి. సరైన నైపుణ్యాలు లేవని చెబుతూ సీనియర్లను కూడా తొలగిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలతో భారత సర్వీస్ సెక్టార్ వణికిపోతోంది. కరోనా తర్వాత ఏఐ వేగం పెరిగి అతిపెద్ద డేటా కేంద్రాలు వస్తు న్నాయి. ఐటీ దిగ్గజాలన్నీ వీటికే కనెక్ట్ అవుతున్నాయి. ఫలితంగా మానవ వనరుల అవసరం తగ్గింది. టెక్నాలజీతో సమానంగా ఉద్యోగులు పరుగులు పెట్టలేకపోతున్నారు. అందుకు కారణం ఇంజనీరింగ్‌లో కోర్ గ్రూపులను నిర్లక్ష్యం చేయడమేనని నిపుణులు చెబుతున్నారు.

2024 చివరి నుంచి మారిన పరిస్థితి

ప్రముఖ ఐటీ కంపెనీలన్నీ ఉద్యోగులను పెద్ద ఎత్తున తొలగిస్తున్నాయి. టీసీఎస్ 12 వేల మందికి లే ఆఫ్ అనేసింది. ఇన్ఫోసిస్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. విప్రో, కాగ్నిజెంట్, యాక్సెంచర్ సంస్థలదీ ఇదే బాట. 2010 నుంచి 2025 వరకు ఐటీ కంపెనీలు ఉద్యోగ నియామకాలు భారీగా పెంచాయి. ఇన్ఫోసిస్ 153%, టీసీఎస్ 278%, విప్రో 116 శాతం, కాగ్నిజెంట్ 223%, యాక్సెంచర్ 291% ఉద్యోగ నియామకాలు పెంచుకున్నాయి. కరోనా (2020–21) కాలంలోనూ ఉద్యోగ నియామకాలు ఎక్కువే. ఇదే సమయంలో యాంత్రీకరణ వైపు కంపెనీలు మళ్లాయి. దీంతో 2024 వరకు ఉద్యోగుల

మిగతా 3వ పేజీలో ▶

తీవ్ర ఒడిదుడుకుల్లో ఐటీ ఉద్యోగులు

- కోర్ గ్రూపులు వదిలి సీఎస్ఈ వైపు పరుగులు
- కొన్నేళ్లుగా ఇదే విధానం సాగటంతో మారిపోయిన పరిస్థితులు
- నాడు ఏరికోరి పిలిచిన కంపెనీల ముందే నేడు జాబ్ కోసం క్యూలు
- కొత్తవారికి ప్యాకేజీలు కరువు.. ఉన్నవారికి లే ఆఫ్‌ల గుబులు



ఐటీ ఉద్యోగంపై మోజు దశాబ్ద కాలంగా ఇంజనీరింగ్ విద్యలో మార్పులు తెచ్చింది. విద్యార్థులు కంప్యూటర్ కోర్సులు తప్ప వేటికీ భవిష్యత్ లేదని భావిస్తున్నారు. దీంతో ఈ కోర్సులు చేసిన వారి సంఖ్య భారీగా పెరిగింది. 2010–11లో దేశవ్యాప్తంగా కంప్యూటర్ కోర్సులు చదివినవారు 4,75,870 మంది ఉంటే, 2023–24 నాటికి ఈ సంఖ్య 21,62,266కు చేరింది. 14 ఏళ్లలోనే 354 శాతం పెరిగింది. సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి కోర్ గ్రూపులకు డిమాండ్ తగ్గుతోంది. ఆయా సెక్టార్లలో ఉపాధి అవకాశాలున్నా విద్యార్థులు వెళ్లడం లేదు. మరోవైపు ఐటీ సెక్టార్‌లో యాంత్రీకరణ, ఏఐ పాత్ర పెరగటంతో ఉద్యోగి కోసం కంపెనీలు వెతుక్కునే పరిస్థితి లేదు. కోర్ గ్రూప్‌లను నిర్లక్ష్యం చేయడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నిపుణులు అంటున్నారు.

కంప్యూటర్ కోర్సులపై మోజే కారణం..

న్యూస్‌రీల్

వరద సమస్యకు మూసీ పునరుజ్జీవమే పరిష్కారం



హైదరాబాద్‌లో భారీ వర్షాలను తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవం ద్వారానే వరద నీటిని సమర్థంగా నిర్వహించవచ్చని అన్నారు. - 7లో

ఫార్మాపైనా టారిఫ్ పిడుగు?



ఫార్మాను కూడా సుంకాల్లో చేరుస్తామని, 250% టారిఫ్‌లు వేస్తామని ట్రంప్ వార్నింగ్‌లు ఇస్తున్నారు. ఇదే జరిగితే అమెరికాయే ప్రధాన ఆదాయ వనరుగా సాగుతున్న భారత ఫార్మా కంపెనీలకు ఇబ్బందులు తప్పవు. - 16లో

బదులివ్వకుండా బెదిరింపులా?

పార్లమెంట్‌లో ప్రమాణం చేశా.. మళ్లీ చేయాలా?



- ఎలక్ట్రానిక్ ఓటర్ డేటా అందజేస్తే.. ప్రధాని పదవిని మోదీ చోరీ చేశారని నిరూపిస్తాం
- ఎన్నికల సంఘం అధికారులు ఇప్పటికైనా నిజాలు చెప్పాలి.. లేకపోతే ఏదో ఒక రోజు వారిపై చర్యలు తీసుకోవడం ఖాయం
- రాజ్యాంగంపై మీరు దాడి చేస్తే.. మేము మీపై దాడి చేస్తాం
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హెచ్చరిక
- బెంగళూరులో 'ఓటు అధికార్ ర్యాలీ'

6లో

సీబీఐ విచారణ జరిపించాలి

- ఫోన్ ట్యాపింగ్‌పై బండి సంజయ్
- సీబీఐ నేరుగా విచారించే పక్షంలో కేసీఆర్, కేటీఆర్‌లను ఎప్పుడో జైల్లో వేసేవాళ్లమన్న కేంద్రమంత్రి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐతోవిచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరిపే విచారణపై తమకు నమ్మకం లేదని అన్నారు. సిట్ విచారణ పేరుతో డ్రామాలు ఆపాలని వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ

మిగతా 2వ పేజీలో ▶

క్షమాపణ చెప్పకుంటే కోర్టుకు లాగుతా

- నీ చిల్లర వ్యాఖ్యలను వెనక్కి తీసుకో..
- 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలి.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కేటీఆర్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై చేసిన అడ్డగోలు, చిల్లర వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బండి సంజయ్ 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయనను కోర్టుకు లాగుతామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు హాజరైన అనంతరం

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

సీఎం రమేశ్‌పై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు బీఆర్‌ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన ఏపీ ఎంపీ సీఎం రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ శుక్రవారం బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నేర చరిత్ర కలిగిన సీఎం రమేశ్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, ప్రజాధనాన్ని లూటీ చేశారని కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తూ.. వాటిని సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 'బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అవుతుందని సీఎం రమేశ్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. సారా వ్యాపారంతో వందల కోట్ల రూపాయలు సంపాదించిన సీఎం రమేశ్, ఫోర్జరీ సంతకాలతో బ్యాంకులకు రూ.450 కోట్లు ఎగవేశారు. ఆంధ్రా బ్యాంకుకు రూ.70 కోట్లు ఎగవేసిన ఆయన ఈడీ దాడుల భయంతో బీజేపీలో చేరారు. ఎమ్మెల్సీ కవితకు ఎప్పుడో బెయిల్ వచ్చినా ఎంపీ హోదాలో ఉండి కూడా అవాకులుచవాకులు పేలుతున్నారు. కంచగచ్చిబౌలి భూముల తాకట్టులో రేవంత్ ప్రభుత్వానికి బ్రోకర్‌గా వ్యవహరించిన సీఎం రమేశ్, ఫోర్త్ సిటీలో రూ.1,600 కోట్ల కాంట్రాక్టును దక్కించుకున్నారు. పదేళ్లలో తెలంగాణవైపు కన్నెత్తి చూడని వాళ్లు కూడా ఇక్కడ పెత్తనం చేస్తున్నారు. హైదరాబాద్‌లో తిరగాలంటే సీఎం రమేశ్ నోరు అదుపులో పెట్టుకోవాలి'అని హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డే.. ఒకప్పటి జైలు పక్షి

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'రేవంత్‌రెడ్డీ.. నువ్వే ఒకప్పటి జైలు పక్షివి.. నీలాగే అందరూ జైల్లో ఉండాలనుకొనే రాక్షస మనస్తత్వం నీది'.. అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బిల్లు, కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇకనైనా గాలి మాటలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే పనిలో ఉండాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో ఢిల్లీలో చేసిన ధర్నాకు.. కూతవేటు దూరంలో ఉన్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేల్లో ఒక్కరన్నా ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని గ్రహించాలని కోరారు.

ఇదండీ జగత్



ఎలా డీల్ చేయాలో ప్రతీ దేశానికి చెప్పే బదులు ప్రపంచంతో ఎలా డీల్ చేయాలో ట్రంప్‌కే చెబితే సరిపోతుందిగా సార్!

అలనాటి సీబీఎస్ ఆపన్న హస్తం!

ఆ స్థలాన్ని తనఖా పెట్టి రూ.400 కోట్ల రుణం తీసుకున్న ఆర్టీసీ

- ఆర్థిక పరమైన పెండింగ్ సమస్యలు పరిష్కరించే యోచన
- రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, వేతన సవరణ ప్రయోజనాన్ని కల్పించటం, ఆర్జిత సెలవుల మొత్తం చెల్లింపు తదితరాలకు వినియోగించనున్న సంస్థ!



సాక్షి, హైదరాబాద్: గౌలిగూడ బస్టాండ్‌గా పేరొందిన సెంట్రల్ బస్ స్టేషన్ ఒకప్పటి హైదరాబాద్ తొలి ప్రధాన బస్టాండ్. ఎంజీబీఎస్‌కు ముందు దశాబ్దాల పాటు ఇక్కడి నుంచే ఉమ్మడి ఏపీలోని అనేక నగరాలు, పట్టణాలకు సర్వీసులు నడిచేవి. భాగ్యనగర చారిత్రక కట్టడాల్లో ఇదీ ఒకటి. తదనంతర కాలంలో మిసిసిపీ హ్యాంగర్‌గా పిలిచే ఈ భారీ ఐరన్ ఫ్రాబ్రికేటెడ్ నిర్మాణం శిథిలమై, కుప్పకూలి కనుమరుగైంది. కానీ ఆ బస్టాండ్ స్థలం ఆర్టీసీకి ఇప్పటికీ సేవలందిస్తూనే ఉంది. ప్రస్తుతం సిటీ సర్వీసులు నిలిపే స్థలంగా వినియోగంలో ఉంది. దీని పక్కనే హైదరాబాద్–1 డిపో ఉంటుంది. ఆర్టీసీకి సంబంధించిన కొన్ని ఇతర నిర్మాణాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ కలిపి దాదాపు 5.8 ఎకరాల విస్తీర్ణంలో ఉంటాయి. అయితే తాజా గా ఈ స్థలాన్ని కొలెటరల్ సెక్యూరిటీగా ఉంచిన ఆర్టీసీ హడ్కో నుంచి రూ.400 కోట్ల రుణాన్ని సమకూర్చుకున్నట్టు తెలిసింది. సంస్థలో పెండింగులో ఉన్న ముఖ్యమైన పనులు పూర్తి చేసేందుకు ఈ నిధులు సేకరించినట్టు సమాచారం. ముఖ్యంగా.. ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆర్థిక పరమైన సెటిల్‌మెంట్లు పూర్తి చేయడం, 2017 వేతన సవరణ ప్రయోజనాన్ని కల్పించటం, ఆర్జిత సెలవుల మొత్తాన్ని అందించటం, ఆర్టీసీ సహకార పరపతి సంఘం (సీసీఎస్)కు చెందిన వాడేసుకున్న నిధులను తిరిగి జమ చేయటం, పీఎఫ్ బకాయిలు చెల్లించటం లాంటి వాటి కోసం ఈ రుణాన్ని తీసుకున్నట్టు తెలిసింది.

సర్కారు ఆదేశంతో.. : రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో వారు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేసేందుకు సిద్ధమయ్యారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని ఆర్టీసీని ఆదేశించింది. ఇక సీసీఎస్, పీఎఫ్‌లకు సంబంధించి హైకోర్టులో కేసులు నడుస్తున్నాయి. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సరిగా అమలు చేయకపోవటంతో కోర్టు ధిక్కార కేసులు నమోదు కావటం, పీఎఫ్ నుంచి షోకాజ్ నోటీసులు రావటం లాంటి వాటి నేపథ్యంలో.. వీటన్నింటినీ చెల్లించటం ఆర్టీసీకి అత్యవసరమైంది. గతంలో ఆర్టీసీకి బడ్జెట్ కేటాయింపుల్లో కొన్ని గ్రాంట్లు కూడా ఉండేవి. అలాగే మరికొన్ని పూచీకత్తు రుణాలుండేవి. కానీ, ఇప్పుడు ఆ తీరు పూర్తిగా మారిపోయింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించటం ద్వారా సంస్థకు ఏర్పడే లోటును ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ద్వారా భర్తీ చేయాల్సి వస్తోంది. దీంతో బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా దానికే పరిమితం చేసి గ్రాంట్లు, లోన్లను అనధికారికంగా రద్దు చేసింది. దీంతో సంస్థ అవసరాలకు నిధులు లేకుండా పోయాయి. గతంలో ఏవైనా అవసరాలకు ప్రభుత్వ పూచీకత్తుతో రుణాలు పొందే విధానం ఉండగా, కొంతకాలంగా ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని దృష్టిలో ఉంచుకుని పూచీకత్తు ఇవ్వటానికి వెనకాడుతోంది. దీంతో ఆర్టీసీనే సొంతంగా రుణాలు సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఇందుకోసం ఆస్తులను తాకట్టు పెడుతోంది. ఈ క్రమంలోనే గౌలిగూడ పాత బస్టాండు స్థలం ఆర్టీసీకి కీలక మేలు చేసి పెట్టింది.

సీబీఐ విచారణ జరిపించాలి

▶ మొదటి పేజీ తరువాయి

కోరుతూ లేఖ రాస్తే విచారణకు ఆదేశించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. సీబీఐ నేరుగా విచారణ చేసే అధికారముంటే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను ఎప్పుడో జైల్లో వేసేవాళ్లమని అన్నారు. ట్యాపింగ్‌లో భాగంగా కాంట్రాక్టర్లు, ఇతర వర్గాల వారిని బెదిరించి వేలకోట్ల వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చినందున దీని దర్యాప్తును ఈడీకి కూడా అప్పగించాలన్నారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని, అందుకే కేసీఆర్ కుటుంబానికి రేవంత్ క్లీన్‌చిట్ ఇచ్చారన్నారు. ట్యాపింగ్ కేసులో బాధితుడు, ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్ కూడా విచారణకు హాజరై స్టేట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం దిల్‌కుశ గెస్ట్‌హౌస్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

అలాంటప్పుడు విచారణ ఎందుకు?

'గతంలో బీఆర్‌ఎస్ దోచుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది. ఫోన్ ట్యాపింగ్ అడ్డుపెట్టుకుని కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు దోచుకుంటే..ఆ సొమ్ములో వాటా కోసం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు కన్పిస్తోంది. ఆ సొమ్మును ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టాలనుకుంటున్నారేమో..అందుకే కేసీఆర్ తానా అంటే రేవంత్‌రెడ్డి తందానా అంటున్నాడు. ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్‌కు రేవంత్ క్లీన్ చిట్ ఇస్తున్నడు. ఆయనను అరెస్ట్ చేయబోమని చెబుతున్నడు. సీఎం ఎవరు ఆ మాట చెప్పడానికి? అట్లాంటప్పుడు ఈ కమిషన్లు, ఈ విచారణలు ఎందుకు?..' అని సంజయ్ నిలదీశారు.

కేసీఆర్, కేటీఆర్‌లను విచారణకు పిలుస్తారా?

'అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసును విచారించిన జడ్జి ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్, కేటీఆర్‌లను సిట్ విచారణకు పిలవగలదా? కేసీఆర్, కేటీఆర్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ మినహా ఎమ్మెల్సీ కవిత, ఆమె భర్త అనిల్, అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఇతర మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతల ఫోన్లు, మావోయిస్టుల నుంచి ప్రమాదం పేరుతో నా ఫోన్‌తో పాటు అప్పట్లో టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. మొత్తం 6,500 మంది ఫోన్లను కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసింది. తన కుటుంబసభ్యులు, వ్యక్తిగత సహాయకులు, పనిమనుషుల ఫోన్లు, భార్యాభర్తల ఫోన్లు కూడా ట్యాప్ చేసి విన్నారు..'



కార్యకర్తలతో కలిసి వస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

డబ్బులు ఎవరు తిన్నారో తేల్చాలి..

ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దగ్గర రూ.7 కోట్లు పట్టుకున్నారు. మరికొందరు కాంగ్రెస్ వాళ్ల దగ్గర కోట్ల రూపాయలు పట్టుకున్నారు. ఆ పైసలన్నీ ఎటుపోయినయ్? ట్యాపింగ్ గ్యాంగ్ తిన్నారా? ట్విట్టర్ టిల్లు తిన్నాడా? తేల్చాలి..' అని సంజయ్ అన్నారు. అన్ని ఆధారాలు ఉన్నా కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిని కూడా ఇంతవరకు అరెస్టు చేయలేదని దుయ్యబట్టారు. సిట్ విచారణ సందర్భంగా ట్యాపింగ్‌నకు సంబంధించి తన వద్ద ఉన్న సమాచారం, ఆధారాలు అందజేసినట్లు తెలిపారు. కాగా శుక్రవారం సంజయ్‌తో పాటు ఆయన పీఆర్‌వో పసునూరి మధు, వ్యక్తిగత సహాయకులు బోయినపల్లి ప్రవీణ్‌కుమార్, పోగుల తిరుపతి స్టేట్‌మెంట్లు కూడా పోలీసులు రికార్డ్ చేశారు. కాగా సిట్ విచారణకు వెళ్లే ముందు బంజారాహిల్స్‌లోని తన నివాసం వద్ద కూడా ఆయన మీడియాతో మాట్లాడారు.

అని కేంద్రమంత్రి ఆరోపించారు.

ఎస్‌ఐబీని అడ్డుపెట్టుకుని ట్యాపింగ్‌కు పాల్పడ్డారు..

'ఎస్‌ఐబీని అడ్డం పెట్టుకుని కేసీఆర్, కేటీఆర్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రాజకీయ నాయకులతో పాటు వ్యాపారులు, సినిమావాళ్లు, ప్రొఫెసర్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. కాంట్రాక్టర్లను, లీడర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఎస్‌ఐబీ అధికారులు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావు క్షణక్షణం బాధపడేలా శిక్షవేయాలి. కానీ రేవంత్ ప్రభుత్వం వీరిని కాపాడే ప్రయత్నం చేస్తోంది. కాంట్రాక్టర్లు, ఇతర వర్గాల వారిని బెదిరించి వేలకోట్ల వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చినందున దీని దర్యాప్తును ఈడీకి అప్పగించాలి. రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే వెంటనే ఈడీ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.

ఫిరాయింపు ఎమ్మెల్సీలపై సుప్రీంకోర్టుకు!

లీగల్ సెల్ బృందంతో కలిసి ఢిల్లీకి వెళ్లిన కేటీఆర్

- సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు
- పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇవ్వాలని సర్కారుకు కేసీఆర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీలపైనా న్యాయ పోరాటం చేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన లీగల్ సెల్ బృందంతో కలిసి శుక్రవారం ఢిల్లీకి వెళ్లారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో మూడు నెలలలోపు చర్యలు తీసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలను కూడా అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ సుప్రీంకోర్టులో కేటీఆర్ సోమవారం స్వయంగా పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఢిల్లీలోని ప్రముఖ న్యాయ నిపుణులతో ఈ అంశంపై చర్చించనున్నారు. ఇటీవల ఎర్రవల్లి నివాసంలో పార్టీ కీలక నేతలతో జరిపిన వరుస భేటీల్లో ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ సుప్రీంకోర్టుకు వెళ్లాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించడంతో కేటీఆర్ ఢిల్లీ వెళ్లినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

మండలి చైర్మన్‌పైనా పిటిషన్?

బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన 8 మంది ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్, దండె విఠల్, భానుప్రసాద్‌రావు, ఎంఎస్ ప్రభాకర్‌రావు కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో గవర్నర్ కోటాలో నామినేట్ అయిన బొగ్గారపు దయానంద్, బస్వరాజు సారయ్యను మినహాయించి మిగతా ఆరుగురిని అనర్హులుగా ప్రకటించాలని శాసన మండలి చైర్మన్‌కు బీఆర్‌ఎస్ గతంలో పిటిషన్లు ఇచ్చింది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా బీఆర్‌ఎస్ నుంచి గెలిచినా 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీకి దూరంగా ఉంటున్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే కోటాలో ఎన్నికై న ఎగ్గె మల్లేశం పదవీకాలం ఇప్పటికే పూర్తయింది. పట్నం మహేందర్‌రెడ్డి (రంగారెడ్డి), భానుప్రసాద్‌రావు (కరీంనగర్), కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), దండె విఠల్ (ఆదిలాబాద్) పదవిలో కొనసాగుతున్నారు. వీరి పదవీకాలం 2028 జనవరిలో ముగుస్తుంది. వారిని అనర్హులుగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తోంది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరును కూడా పిటిషన్‌లో పేర్కొనే అంశంలో న్యాయ నిపుణులతో కేటీఆర్ చర్చిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రధాన కార్యదర్శిని కలిసిన హరీశ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఇచ్చిన 665 పేజీల నివేదికను తమకు ఇవ్వాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. సచి వాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును శుక్రవారం కలిసి కేసీఆర్‌తోపాటు తన తరపున రెండు లేఖలు అందజేశారు. హరీశ్‌రావు వెంట ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. ఘోష్ కమిషన్ నివేదికపై అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలనే యోచనలో బీఆర్‌ఎస్ ఉన్నట్లు తెలిసింది.

కేటీఆర్ నాకు దేవుడు ఇచ్చిన అన్న

గిరిజన మహిళ జ్యోతి



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న గిరిజన మహిళా రైతులు

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాలకు చెందిన గిరిజన మహిళలు శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి రాఖీలు కట్టారు. లగచర్ల ఘటన బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో పులిచర్లకుంట తండాకు చెందిన జ్యోతి, ప్రవీణ్ దంపతుల కుమార్తెకు కేటీఆర్ .. భూమి అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆయన తనను కలసిన జ్యోతితో పాటు ఇతర గిరిజన ఆడపడుచులను ఆప్యాయంగా పలకరించారు. అందరికీ ప్రత్యేకంగా నేయించిన చీరలు పెట్టారు. 'కేటీఆర్ నాకు దేవుడు ఇచ్చిన అన్న.. నా బిడ్డకు మేనమామ. ప్రభుత్వం మా భూములు లాక్కుని నా భర్తను జైలుకు పంపి, దాడులు చేస్తుంటే కేటీఆర్ అన్నగా అండగా నిలిచారు. నా బిడ్డకు మేనమామలా 'భూమి నాయక్'అని పేరు పెట్టారు'అని జ్యోతి ఈ సందర్భంగా భావోద్వేగానికి గురయ్యారు. వీరి వెంట కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, లగచర్ల సురేశ్ ఉన్నారు.

పది డిసెంబర్‌లు వచ్చినా సీఎం రేవంతే

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే సత్యం ఫైర్

సాక్షి, హైదరాబాద్: ఈ డిసెంబర్ కాదు, మరో పది డిసెంబర్‌లు వచ్చిన తర్వాత కూడా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డే ఉంటారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. చాలా రోజుల తర్వాత బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డికి ముఖ్యమంత్రి గుర్తుకు వచ్చారని, ఢిల్లీలో సీఎంని చూసి ఉలిక్కిపడి మతితప్పి పిచ్చిపిచ్చిగా వాగుతున్నాడని అన్నారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ముందు తన పార్టీలోని గ్రూపుల గురించి మహేశ్వర్‌రెడ్డి చూసుకోవాలని హితవు పలికారు.

క్షమాపణ చెప్పకుంటే కోర్టుకు లాగుతా

▶ మొదటి పేజీ తరువాయి

దిల్‌కుషా అతిథిగృహం వద్ద బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై కేటీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఫోన్ ట్యాపింగ్‌పై బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా నిరూపించాలని నేను సవాల్ విసురుతున్నా. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేస్తున్న బండి సంజయ్‌కి నిఘా వ్యవస్థ ఎలా పని చేస్తుందో కనీస అవగాహన లేదు. నిఘా వ్యవస్థల నిర్వహణపై కనీస పరిజ్ఞానం కూడా లేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ అబద్ధాలు, అనుచిత వ్యాఖ్యలు, ప్రకటనలు అన్ని హద్దులు దాటాయి. ఇంత దిగజారుడు ఆరోపణలు, చిల్లర మాటలు, బజారు మాటలు మాట్లాడడం ఆయనకు అలవాటుగా మారింది. ప్రతిసారి మరింత దిగజారి మాట్లాడుతున్నారు. బాధ్యత కలిగిన కేంద్ర మంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసుల చెప్పులు మోసినంత ఈజీ కాదని బండి సంజయ్ ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది. కేవలం తనకు రాజకీయ ప్రాధాన్యత దక్కకపోవడంతోనే, వార్తల్లో నిలవాలని తనకు అలవాటైన చౌకబారు వీధి నాటకాలకు తెరలేపిండు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏం సాధించారని వేడుకలు?: సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన కేటీఆర్

తెలంగాణ కాంగ్రెస్ మోడల్ అంటే అమలుకాని హామీలు, అనవసర వేడుకలు చేసుకోవడమేనా అని సీఎం రేవంత్‌రెడ్డిని ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగ హోదా రాకున్నా, కామారెడ్డి డిక్లరేషన్‌లోని ఏ ఒక్క హామీని అమలు చేయకుండానే కాంగ్రెస్ పార్టీ సంబరాలు ఎందుకు చేసుకుంటుందో చెప్పాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని నిలదీశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు ప్రభుత్వ సివిల్, మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో 42 శాతం పనులను బీసీలకు కేటాయించడానికి 'అనుముల బ్రదర్స్'అనుమతి కావాలా? అని ఎద్దేవా చేశారు. ఇప్పటికే రెండు రాష్ట్ర బడ్జెట్లు సమర్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీ సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. ఎంతమంది బీసీ యువకులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేశారో చెప్పే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా? అని రాహుల్‌ను ప్రశ్నించారు. రూ.50 కోట్లతో నిర్మిస్తామన్న ప్రొ.జయశంకర్ బీసీ ఐక్యతా భవన్ నిర్మాణం ఎంతవరకు వచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ తన నినాదాన్ని 'జిత్నీ డిక్లరేషన్స్, ఉత్నా జూట్'(ఎన్ని డిక్లరేషన్లు ఉంటే అన్ని అబద్ధాలు)గా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నగరవాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే సీఎం రేవంత్‌రెడ్డి మసి అవుతారని కేటీఆర్ హెచ్చరించారు.

రానున్న మూడేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

హనుమకొండలో 592 మంది లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ



డబుల్ బెడ్‌రూం ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో నాయిని, నాగరాజు, సారయ్య, సుధారాణి, స్నేహశబరీష్, సత్యశారద

హనుమకొండ అర్బన్: రానున్న మూడేళ్లలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అర్హులైన పేదల కోసం 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని అంబేడ్కర్ నగర్‌లో 592 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లను డ్రా పద్ధతి ద్వారా కేటాయించారు. లబ్ధిదారులతో కలిసి మంత్రి పొంగులేటి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు.. కలిసి గృహ ప్రవేశాలు చేశారు. అనంతరం కాళోజి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన పట్టాల పంపిణీలో మంత్రి పాల్గొని మాట్లాడారు. వరంగల్ నగరం నడిబొడ్డున అత్యంత విలువైన స్థలంలో 7.09 ఎకరాల్లో 2015లో నిర్మాణ పనులు ప్రారంభించి 2019లో నాలుగు బ్లాకులు, నాలుగు అంతస్తుల్లో 592 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేతకానితనం, నిర్లక్ష్యం కారణంగా వాటిని పేదలకు పంచలేదని, ఓటు బ్యాంకు కోసం వాడుకుందని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం విమర్శలకు తావులేకుండా పార్టీలతో, ఓటు బ్యాంకులతో సంబంధం లేకుండా అర్హులకు ఇళ్లు కేటాయించిందన్నారు. అవినీతిలో కూరుకుపోయిన గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో కోట్లు కొల్లగొట్టిందని, దానిపై కమిటీ నివేదిక వచ్చిందని, అయినా పింక్ పార్టీ నేతలు సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సారయ్య, నగర మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద తదితరులు పాల్గొన్నారు.

నిన్ను చంపేస్తాం

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపు ఫోన్ కాల్
- 3 నెలల్లో ఆరుసార్లు ఇలాంటి ఫోన్లు రావడంపై అనుయాయుల్లో ఆందోళన
- ప్రభుత్వం వెంటనే తగిన భద్రత కల్పించాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: 'హైదరాబాద్‌లోనే ఉన్నాం.. సాయంత్రం వరకు చంపేస్తాం. ఎవరు కాపాడుతారో చూద్దాం'అంటూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బీజేపీ మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావుకు బెదిరింపు ఫోన్ వచ్చింది. బీఎస్ఎన్ఎల్ నంబర్ నుంచి ఫోన్ రావడంతో ఎంపీ రఘునందన్ ఎత్తి మాట్లాడగా, ఫోన్ చేసిన వ్యక్తి తాను.. మావోయిస్టును అని బెదిరించాడు. 'ఎవరు మావోయిస్టు, పేరేమిటి'అని ఆయన అడగ్గా.. 'మావోయిస్టు అంటే తెలియదా, సాయంత్రంలోగా చంపేస్తాం'అని హిందీలో ఆగంతకుడు హెచ్చరించాడు. పదేపదే బెదిరింపు ఫోన్లు చేయడం ఎందుకు ఎక్కడున్నారో చెబితే తానే స్వయంగా అక్కడకు వస్తానంటూ ఎంపీ పేర్కొనడంతో ఆ వ్యక్తి దూషణలకు దిగినట్టు తెలిసింది. కాగా, ఈ ఫోన్ వచ్చిన ఐదు నిమిషాల్లోనే రఘునందన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకొచ్చారు. ఈ ఫోన్లు మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తదితర రాష్ట్రాల నుంచి వస్తుండటంతో ట్రేస్ చేయలేకపోతున్నామని పోలీసులు సమాధానం ఇచ్చినట్టు తెలుస్తోంది. శుక్రవారం 9404348431 నంబర్ నుంచి వచ్చిన ఈ ఫోన్ కాల్‌తో ఎంపీ అనుయాయులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్దిరోజుల వ్యవధిలోనే ఆరోసారి ఈ విధంగా ఫోన్ రావడంతో, ఇలా బెదిరింపులకు ఎవరు పాల్పడుతున్నారనేది చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా గత మూడు నెలలుగా ఇలాంటి కాల్స్ వస్తున్నా.. పోలీసు యంత్రాంగం ఈ బెదిరింపు కాల్స్‌ను ట్రేస్ చేయలేకపోవడం, ఫోన్లు చేస్తున్నది ఎవరో గుర్తించకపోవడం ఏమిటని రఘునందన్, ఆయన అనుయాయులు ప్రశ్నిస్తున్నారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో తగిన పోలీసు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం తాత్సారం చేయడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న అధికార పార్టీకి చెందిన ఎంపీని చంపేస్తామంటూ ఫోన్లు వస్తున్నా, తగిన చర్యలు తీసుకోకపోవడం, భద్రత కల్పించకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రఘునందన్ రక్షణకు వెంటనే అవసరమైన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రేవంత్ తలుచుకుంటే మీరు ఒక్కరైనా మిగులుతారా?

బెడ్‌రూంలోకి వెళ్లి ఇబ్బంది పెట్టిన చరిత్ర మీది

- ఇప్పుడు సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారు
- కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాటలకు విలువలేదు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ నేతలు ప్రతిపక్ష నేతలను సతాయించినట్టు ఇప్పుడు రేవంత్‌రెడ్డి సతాయించడం లేదని, అలా రాజకీయ కక్ష సాధించాలనుకుని రేవంత్ తలుచుకుంటే ఆ పార్టీ నేతలు ఒక్కరైనా మిగులుతారా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన బెడ్‌రూంలోకి వెళ్లి మరీ ఇబ్బంది పెట్టారని, అయినా రేవంత్ ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదని, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోపిడీ చేసిందని, ఇంతచేసి ఇప్పుడు సుద్దపూసల్లాగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ కుటుంబంలోని ఆలీబాబా 40 దొంగల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఒక దొంగ అని వ్యాఖ్యానించారు. ప్రభాకర్‌రెడ్డి క్యారెక్టర్ ఏంటో, హరీశ్‌రావు క్యారెక్టర్ ఏంటో, జగ్గారెడ్డి క్యారెక్టర్ ఏంటో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. నిజంగా ప్రభాకర్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తన దగ్గర ఉన్న వెయ్యి కోట్లను ప్రజలకు పంచాలని అన్నారు. తనకు డబ్బులు మిగుల్చుకోవాలనే ఆలోచన లేదని, అందుకే పేదలకు, క్యాన్సర్ రోగులకు పంచుతున్నానని చెప్పారు. ఏ విషయంలోనైనా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు మాట్లాడే మాటలకు విలువ లేదని అన్నారు.

రేపు బీజేపీలోకి గువ్వల బాలరాజు

రాంచందర్‌రావుతో భేటీ అనంతరం ముహూర్తం ఖరారు



లాలాపేట (హైదరాబాద్): అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదివారం బీజేపీలో చేరనున్నారు. ఇటీవల ఆయన బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును తార్నాకలోని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో మరోమారు సంప్రదింపులు జరిపారు. తొలుత సోమవారం తర్వాత పార్టీలో చేరదామని గువ్వల భావించారు. అయితే, పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అందుబాటులో ఉండని కారణంతో ఆదివారమే చేరాలని నిర్ణయించుకున్నారు. పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో కిషన్‌రెడ్డితోపాటు ఎంపీ డీకే అరుణ, రాంచందర్‌రావుల సమక్షంలో గువ్వల బీజేపీలో చేరనున్నారు.

సౌకర్యాలు లేకున్నా.. అడ్మిషన్లకు సరే!

- నేటి నుంచి నీట్ యూజీ రాష్ట్ర కోటా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్
- ప్రైవేటు వైద్య కళాశాలల్లో విద్యార్థుల చేరికలకు రంగం సిద్ధం
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 కాలేజీల్లో కాళోజీ వర్సిటీ, ఎన్ఎంసీ తనిఖీలు
- 80 శాతం కళాశాలలు నిబంధనలను పాటించడం లేదని తేల్చిన వర్సిటీ
- కేవలం 4 కళాశాలలకే జరిమానా విధించిన అధికారులు
- జాతీయ వైద్య కమిషన్ సైతం మెతక వైఖరి అవలంబించిందనే విమర్శలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు తెర లేస్తోంది. శనివారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే పలు ప్రైవేటు కళాశాలల్లో నిబంధనల ప్రకారం మౌలిక వసతులు లేకపోయినా, అడ్మిషన్ల కోసం అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసినా.. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)తో పాటు కాళోజీ ఆరోగ్య విశ్వ విద్యాలయం చూసీ చూడనట్టుగా వ్యవహరించి అడ్మిషన్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిబంధనలను పాటించని కళాశాలలకు ఎంబీబీఎస్ సీట్లలో కోత పెట్టడంతో పాటు కళాశాలల అనుమతి కూడా రద్దు చేసే అవకాశమున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 80 శాతం ప్రైవేటు కళాశాలలు రాజకీయ నేతలవి కావడం వల్లే తనిఖీలు చేసినా, ఏం చర్యలు తీసుకోలేకపోయాయని అంటున్నారు.

తనిఖీలు చేసినా..

రాష్ట్రంలో 34 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండగా, ప్రైవేటు రంగంలో 26 ఉన్నాయి. అందులో ఒక కళాశాలలో ప్రవేశాలను ఈసారి అనుమతించలేదు. మిగిలిన 25 కళాశాలలకు గాను దాదాపు 20 కళాశాలల్లో ఎన్ఎంసీతో పాటు కాళోజీ వర్సిటీ వేర్వేరుగా తనిఖీలు నిర్వహించాయి. వర్సిటీ తనిఖీల్లో కేవలం 20 శాతం కళాశాలల్లో మాత్రమే నిబంధనలను పాటిస్తూ వైద్య విద్య బోధన సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. 80 శాతం ప్రైవేటు కళాశాలలు నిబంధనలను పాటించడం లేదని, విద్యార్థుల నుంచి ఫీజులు దండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని తేలినా..వర్సిటీ కేవలం 4 కళాశాలలకు మాత్రమే జరిమానా విధించి సరిపుచ్చుకోవడం గమనార్హం. మరోవైపు ఎన్ఎంసీ అధికారులు ప్రైవేటు కళాశాలల్లో జరిపిన తనిఖీల్లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీ కూడా 8 ప్రైవేటు కళాశాలలపై జరిమానాలు విధించింది. ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను తనిఖీ చేసి, 26 కళాశాలలు నిబంధనలు పాటించడం లేదని తేల్చిన ఎన్ఎంసీ అధికారులు.. ప్రైవేటు కాలేజీలపై మెతకవైఖరి అవలంబించారనే ఆరోపణలున్నాయి. కొన్ని కళాశాలల యాజమాన్యాలు, డమ్మీ పేషెంట్లు, డాక్టర్లను సమకూర్చుకొనేందుకు అవకాశం కల్పించి ఎన్ఎంసీ తనిఖీలు జరిపిందనే ఫిర్యాదులు రావడం గమనార్హం.

లెక్కల్లోనే రోగులు, బెడ్లు..

కాళోజీ యూనివర్సిటీ నిర్వహించిన తనిఖీల్లో ప్రైవేటు కళాశాలలకు సంబంధించిన ఏ బోధనాసుపత్రిలోనూ ఎంబీబీఎస్, పీజీ సీట్లకు అనుగుణంగా బెడ్ల సామర్థ్యం, రోగుల సంఖ్య లేదని తేలింది. 80 శాతం కాలేజీలు కేవలం లెక్కల కోసమే బెడ్లు, రోగులు, ఫ్యాకల్టీని కాగితాలపై చూపించినట్లు స్పష్టమైంది. జాతీయ వైద్య కమిషన్ నిబంధనల ప్రకారం.. 100 ఎంబీబీఎస్ సీట్లు ఉన్న కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో ప్రతీరోజు 600 మంది ఔట్ పేషెంట్లు, 400 మంది ఇన్‌పేషెంట్లు ఉండాలి. అదే 150 మంది విద్యార్థులు ఉంటే 610 ఇన్‌పేషెంట్ పడకలు, ఓపీ కింద కనీసం 900 మంది రోగులు ప్రతీరోజు రికార్డు కావాలి. కానీ 20 కళాశాలల్లో తనిఖీలు జరిపితే అన్ని చోట్లా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పరిస్థితులే కనిపించినట్టు సమాచారం.

జరిమానాలు ఇలా..

రికార్డుల్లో 1,000 బెడ్లు ఉన్నట్లు చూపుతున్న కరీంనగర్‌కు చెందిన ఓ ఆసుపత్రిలో.. పది శాతం బెడ్లపై కూడా రోగులు లేనివైనంపై ఫొటోలతో సహా ఎన్ఎంసీకి నివేదిక పంపారు. ఈ కాలేజీకి వర్సిటీ అధికారులు రూ.20 లక్షల జరిమానా విధించారు. అయితే దీనిపై కళాశాల కోర్టుకు వెళ్లినట్లు తెలిసింది.- 720 పడకలు కలిగిన సంగారెడ్డి ఎంఎన్ఆర్ కళాశాలకు, 850 పడకలు ఉన్న మహేశ్వర కళాశాలకు కూడా రూ.10 లక్షల చొప్పున జరిమానా విధించారు. అలాగే 150 ఎంబీబీఎస్ సీట్లు, 202 పీజీ సీట్లు 1,300 బెడ్లు కలిగిన అతిపెద్ద రాజరాజేశ్వరి వైద్య కళాశాలకు రూ.15 లక్షల జరిమానా విధించారు. ఈ మూడు కాలేజీలు తమకు విధించిన జరిమానాను చెల్లించాయి. ఇలావుండగా అరుంధతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, 'ఆయాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్', ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీకి రూ.15 లక్షల చొప్పున ఎన్ఎంసీ జరిమానా విధించింది. అలాగే డాక్టర్ వీఆర్కే ఉమెన్స్ మెడికల్ కాలేజీ, 'నోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్', 'ఆర్‌వీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్'కు రూ.10 లక్షల చొప్పున, ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీ, టీఆర్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు రూ.20 లక్షల చొప్పున ఎన్ఎంసీ జరిమానా విధించింది.

నిబంధనల ఉల్లంఘనలు..

- అన్ని ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో నాలుగున్నరేళ్ల ఎంబీబీఎస్ కోర్సు కోసం ఐదేళ్ల కాలానికి ఫీజు వసూలు చేస్తున్నారు.
- ఏ ప్రైవేటు కాలేజీలోనూ ఇంటర్న్‌షిప్ చేసే విద్యార్థులకు స్టైపెండ్ ఇవ్వడం లేదు. కొన్ని కాలేజీల్లో నామమాత్రంగా రూ.3 వేల నుంచి రూ. 5 వేలు మాత్రమే ఇస్తున్నారు.
- చాలా మెడికల్ కాలేజీల అనుబంధ ఆసుపత్రులు వార్డు రూమ్‌లు తాళాలు వేసి ఉన్నాయి. బెడ్లు, పరికరాలు ఉన్నాయే తప్ప సిబ్బంది లేరు.
- ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏ ఒక్క కాలేజీలో కూడా కనీసం ఫ్యాకల్టీ, కింది స్థాయి సిబ్బంది కూడా లేరు.


'కోర్' వదిలి.. కల చెదిరి..

మొదటి పేజీ తరువాయి

అవసరం ఉండేది. 2024 చివరి నుంచి ఏఐ వేగం పెరగడంతో ఉద్యోగుల అవసరం తగ్గుతూ వచ్చింది. దీంతో ఒక్కో కంపెనీ 20 నుంచి 40 శాతం వరకు ఉద్యోగులను తగ్గించుకునే ఆలోచనలో ఉన్నాయి. 2025లో ఇప్పటివరకు ప్రధాన కంపెనీల్లో కనీసం 15 శాతం ఉద్యోగులను తొలగించారు.

వేతనాలు అంతంతే..

పదేళ్ల క్రితం ఐటీ ఉద్యోగం హాట్‌కేక్. భారీ ప్యాకేజీలు.. కంపెనీ మారితే రూ.లక్షల్లో పెరుగుదల. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కాలేజీల్లో క్యాంపస్ నియామకాలు అరకొరగా ఉన్నాయి. ఆఫ్ క్యాంపస్‌లో అనేక దశల్లో పరీక్షలు పెడుతున్నారు. ఆఫర్ లెటర్ ఇచ్చినా అపాయింట్‌మెంట్ ఎప్పుడు వస్తుందో తెలియదు. వేతనాల్లోనూ నిరాశే. 2010లో ఇన్ఫోసిస్ ఫ్రెషర్స్‌కు రూ.3.25 లక్షల వార్షిక వేతనం ఆఫర్ చేసింది. ఈ 15 ఏళ్లలో 49 శాతం ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ లెక్క ప్రకారం ఈ సంవత్సరం రూ.6.40 లక్షల వేతనం ఇవ్వాలి. కానీ రూ.3.60 లక్షలు మాత్రమే ఇస్తోంది. ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఇప్పుడిచ్చే వేతనం రూ.3.15 లక్షలు మాత్రమే. టీసీఎస్‌లో 2007లో రూ.3.15 లక్షల వార్షిక వేతనం ఉంది. అప్పటి నుంచి 60 శాతం ద్రవ్యోల్బణం పెరిగింది. దీని ప్రకారం ఇవ్వాల్సింది రూ.4.73 లక్షలు. కానీ, ఆఫర్ చేస్తున్నది రూ.3.36 లక్షలే. దీన్నిబట్టి ఫ్రెషర్స్ వార్షిక ప్యాకేజీ దారుణంగా తగ్గిపోయిందని అర్థమవుతోంది.



2010 - 2025 మధ్య ప్రధాన ఐటీ కంపెనీల్లో ఉద్యోగులు

కంపెనీ	2010	2025	పెరుగుదల శాతం
ఇన్ఫోసిస్	1,27,779	3,17,240	153
టీసీఎస్	1,60,429	6,06,998	278
విప్రో	1,08,071	2,34,054	116
కాగ్నిజెంట్	1,04,000	3,36,300	223
యాక్సెంచర్	2,04,000	7,99,000	291

ఇది అనారోగ్య పరిస్థితి



కంప్యూటర్ కోర్సుల వైపు పరుగులు పెట్టడం అనారోగ్యకరమైన పరిస్థితి. కోర్ గ్రూపులకు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు భారీగా పెరిగే వీలుంది. దీన్ని విద్యార్థులు గుర్తించడం లేదు. కోర్ గ్రూపుల విలువ తెలియజెప్పేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ఆ దిశగా మండలి ముందడుగు వేస్తోంది. తల్లిదండ్రులు, విద్యార్థులు కంప్యూటర్ కోర్సులే భవిష్యత్ కాదని గుర్తించాలి. – ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

స్కిల్ లేకుంటే కష్టమే

యాంత్రీకరణ, ఏఐ వచ్చిన తర్వాత సాధారణ కోడింగ్‌తో పని ఉండదు. ఏఐతో సమానంగా ఉద్యోగి అప్‌డేట్ అవ్వాలి. అలా ఎదగలేనివారిని కంపెనీలు తొలగిస్తున్నాయి. ఇప్పుడు కంప్యూటర్ కోర్సులు చేశామని ధీమాగా ఉండే పరిస్థితి పోయింది. కోర్ గ్రూపు చేసిన వాళ్లు కూడా అప్‌గ్రేడ్ అయితే ఐటీలో రాణించే అవకాశాలు ఉన్నాయి. – భట్నాకర్ త్రిపాఠి, ఎంఎన్‌సీ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్

ముందు కౌన్సెలింగ్... తర్వాతే క్లాసులు

- ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం ముఖ్యం
- విద్యా సంస్థల్లో పెరిగిన ఆత్మహత్యలను దృష్టిలో ఉంచుకుని ఏఐసీటీఈ ప్రత్యేక ప్రణాళిక
- రాష్ట్రాలకు మార్గదర్శకాలు విడుదల



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఇంజనీరింగ్ విద్యలోకి ప్రవేశించే విద్యార్థులకు మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు ముందుగా కౌన్సెలింగ్ నిర్వహించాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) దేశంలోని అన్ని యూనివర్సిటీలు, ఉన్నత విద్యా మండళ్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. మానసికంగా బలోపేతం అయ్యేలా కొన్ని రోజుల పాటు కార్యక్రమాలు ఉండాలని పేర్కొంది. ప్రతీ కాలేజీలోనూ కౌన్సెలింగ్ కేంద్రాన్నిఏర్పాటు చేయాలని సూచించింది. అర్హులైన కౌన్సెలర్లతో కచ్చితంగా కౌన్సెలింగ్‌లు అమలయ్యేలా యూనివర్సిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీలే కాకుండా, ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు కూడా ఈ మార్గదర్శకాలను పాటించాలని స్పష్టంచేసింది.

ఒత్తిడిని గుర్తించాలి

ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల్లో గత కొన్నేళ్లుగా తీవ్ర మానసిక ఒత్తిడి కనిపిస్తోంది. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి, జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు సాధించినా ఒత్తిడికి గురవుతున్నారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో ఇది తీవ్రంగా ఉందని ఐఐటీలు నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. 2018 నుంచి 2025 వరకు ఐఐటీల్లో 39 మంది, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 25 మంది, ఎన్ఐటీల్లో 25 మంది, ఇతర సంస్థల్లో ఐదుగురు విద్యార్థులు ఈ ఒత్తిడితోనే ఆత్మహత్యలు చేసుకున్నారు. రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ఆత్మహత్యలు మూడేళ్లలో 120 వరకు నమోదయ్యాయి. ఇంటర్‌లో బట్టీ విధానం ద్వారా మంచి ర్యాంకులు పొందుతున్నారు. ఇంజనీరింగ్ తొలి ఏడాది నుంచే సొంతంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఉంటోంది. దీంతో ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు.

కౌన్సెలింగే మార్గం

క్లాసులు మొదలయ్యే ముందు విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేయాలి. న్యూనతా భావంతో ఉన్న విద్యార్థులను వ్యక్తిగతంగా కౌన్సెలర్లు పిలిచి మాట్లాడాలి. వాళ్ల కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలని ఏఐసీటీఈ సూచించింది. విద్యార్థి ఎక్కడ, ఏ విషయంలో భయపడుతున్నాడు? ఎందుకు భయపడుతున్నాడు? అనే విషయాలను పరిశీలించాలి. వారికి అర్థమయ్యే విధానంలో బోధన చేయడం ముఖ్యం. ఇంటర్మీడియెట్‌తో పోలిస్తే ఇంజనీరింగ్‌లో సిలబస్ భిన్నంగా ఉంటుంది. విశ్లేషణాత్మకంగా ఉండటం, దాన్ని మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా బేరీజు వేసుకోవడం తప్పనిసరి. ఈ దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఏఐసీటీఈ పేర్కొంది. ఉన్నత విద్యా మండళ్లు, వర్సిటీలు కౌన్సెలింగ్ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించి, పురోగతిని విశ్లేషించడం ద్వారా విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంచాలని సూచించింది.

విక్రమ్-1 తొలిదశ బూస్టర్ పరీక్ష విజయవంతం

భారతదేశ ప్రైవేట్ రాకెట్ రంగంలో చరిత్రాత్మక ఘట్టం

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో మొదటిసారిగా అభివృద్ధి చేస్తున్న ప్రైవేట్ కక్ష్యనౌక విక్రమ్-1 తొలి ప్రయోగానికి ముందు కీలక మైలురాయిని అధిగమించింది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ శుక్రవారం శ్రీహరికోటలోని సతీశ్‌ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో, కలామ్-1200 పేరు గల మొదటి దశ కార్బన్ కాంపోజిట్ ఘన ఇంధన బూస్టర్‌ను స్థిర పరీక్ష (స్టాటిక్ టెస్ట్)లో విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షను ఇస్రో పర్యవేక్షణలో నిర్వహించారు. 11 మీటర్ల పొడవు కలిగిన కలామ్-1200, భారత అంతరిక్ష రంగంలో ఇప్పటివరకు ప్రైవేట్ రంగం అభివృద్ధి చేసిన అతిపెద్ద ఏకరూప ఘన రాకెట్ మోటార్‌గా గుర్తింపు పొందింది. ఇది శూన్యావస్థలో సుమారు 1,200 కిలోన్యూటన్ గరిష్ట థ్రస్ట్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది బోయింగ్ 737 మాక్స్ విమాన ఇంజిన్ శక్తి కంటే దాదాపు 10 రెట్లు ఎక్కువ. ఈ మోటార్‌లో ప్రత్యేక ఘన ఇంధనాన్ని కార్బన్ కాంపోజిట్ కాస్టింగ్‌లో పోసి ఆకారం ఇవ్వడం (కాస్టింగ్) అనే సంక్లిష్ట ప్రక్రియను శ్రీహరికోట షార్‌లోని ఇస్రో నిపుణులు పూర్తి చేశారు. పరీక్షలో బూస్టర్ దశ బెలిస్టిక్ పనితీరు, దహన రేటు, థర్మల్ ప్రొటెక్షన్ సిస్టమ్, రాకెట్‌కు దిశ మార్చే ఫ్లెక్స్ నాజిల్ సిస్టమ్‌ను సమగ్రంగా అంచనా వేశారు. సుమారు 110 సెకన్ల పాటు సాగిన ఈ పరీక్షలో మోటార్ అన్ని అంచనా పరిమితులలోనే అవసరమైన థ్రస్ట్‌ను అందించింది. ప్రయోగ సమయంలో, కలామ్-1200 విక్రమ్-1ను 50 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి, ఆపై అధునాతన వాయు-సంచాలిత వ్యవస్థ (న్యూమాటిక్ సిస్టమ్) ద్వారా రెండవ దశ వేరు పడటం (స్టేజ్ సెపరేషన్) సాఫీగా జరుగుతుంది. యువ ఇంజినీర్ల కృషి, ఇస్రోలోని వసతులు, ఇన్‌స్పేస్ సహకారంతో ఈ విజయం సాధించినట్టు స్కైరూట్ సహ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగ భారత్ డాకా హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగం నిర్మించిన అతిపెద్ద ఘన మోటార్ స్టాటిక్ టెస్ట్ విజయవంతం కావడం చరిత్రాత్మక ఘట్టమని ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్‌గోయంకా అభినందించారు. విక్రమ్-1 ప్రయోగం ఈ ఏడాది చివర్లో జరగనుంది. ఇది చిన్న ఉపగ్రహాల కోసం తక్షణం, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ప్రయోగ సేవలు అందించనుంది.

దోస్త్ రిపోర్టింగ్ గడువు 12 వరకు పెంపు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో సీట్లు పొందిన వారు కాలేజీల్లో రిపోర్ట్ చేసే గడువును పొడిగించినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రత్యేక విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు 6వ తేదీ వరకూ రిపోర్టు చేయాల్సి ఉంది. దీన్ని ఈ నెల 12 వరకూ పొడిగించారు. స్పాట్ అడ్మిషన్ల గడువును కూడా 14వ తేదీ వరకూ పెంచినట్టు తెలిపారు. వర్షాల కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి చెప్పారు.

> ఏ విధముగ అగ్నిలో కట్టెలు కాలిపోవుచున్నవో,
> అదే విధముగా జ్ఞానాగ్నిలో సర్వకర్మలు కాలిపోవుచున్నవి.
> – హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 9 ఆగస్టు 2025

ఎట్టకేలకు అమెరికా–రష్యా భేటీ

ఎటుచూసినా యుద్ధాలూ, ఊచకోతలూ, దురాక్రమణలూ కనబడుతున్న వర్తమానంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య శిఖరాగ్ర చర్చలు జరగబోతున్నాయన్న కబురు కాస్తంత ఉపశమనం కలిగిస్తుంది. అయితే అలవికాని డిమాండ్లు పెట్టడంలో, మొండి పట్టుదలకు పోవటంలో ఇద్దరికిద్దరే గనుక ఈ చర్చల వల్ల ఒరిగేదేమైనా ఉంటుందా అన్నది సందేహమే. చర్చల ఫలితం మాట అటుంచి, వాటి కోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ట్రంప్ 'త్యాగం' చేశారా అనే అనుమానాలు అందరిలో తలెత్తాయి. చర్చల తేదీలు ఖరారు కాకపోయినా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో వచ్చేవారం అధినేతలిద్దరూ సమావేశమవుతారని రెండు దేశాల అధికార వర్గాలూ ప్రకటించాయి. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ పాటించాలంటూ రష్యాకు ట్రంప్ పెట్టిన గడువు శుక్రవారంతో ముగిసింది. చర్చలపై స్పష్టత వచ్చింది గనుక ఈ గడువు విషయంలో ట్రంప్ ఏం చేస్తారన్నది చూడాలి. మూడున్నరేళ్లుగా సాగిస్తున్న యుద్ధాన్ని విరమించమని అధికారంలోకొచ్చింది మొదలు తన సొంత సామాజిక మాధ్యమం ద్వారా రష్యాను బెదిరించటం తప్ప, ట్రంప్ నిర్దిష్టమైన ప్రతిపాదనలు పెట్టింది లేదు. ఆయన దూత స్టీవ్ విట్‌కాఫ్ రష్యా ఉన్నతాధికార బృందంతో నాలుగు దఫాలు చర్చించిన మాట వాస్తవమే అయినా ఒరిగిందేమీ లేదు. ట్వీట్ల ద్వారా ప్రపంచ సమస్యలు పరిష్కారం కావని ఆర్నెల్ల తర్వాత ట్రంప్‌కు అర్థమైనట్టుంది. అమెరికా విజ్ఞప్తి మేరకు చర్చలు జరుగుతున్నాయని రష్యా ప్రతినిధి చెప్పటం గమనించదగింది.

మొన్న ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో మీడియా సాక్షిగా ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఇష్టానుసారం మాట్లాడారు. అటు తర్వాత జెలెన్‌స్కీ ఉక్రెయిన్‌లోని విలువైన ఖనిజాలను అమెరికాకు దఖలుపరచటానికి అంగీకరించారు. ఆ తర్వాత నుంచి పుతిన్‌పై అమెరికా ఒత్తిళ్లు తీసుకురావటం మొదలెట్టింది. ట్రంప్‌లో అసహనం పెరుగుతున్నదని తెలిసినా రష్యా వెనక్కి తగ్గలేదు. పుతిన్ లక్ష్యాలు వేరు. ఉక్రెయిన్‌ను నాటో కూటమికి దూరంగా ఉంచటం, భవిష్యత్తులో నాటో విస్తరణ ఉండబోదన్న హామీ తీసుకోవటం వాటిల్లో ప్రధానమైనవి. రష్యా ఆగ్నేయ భాగంలో పాక్షికంగా ఉక్రెయిన్ ఆక్రమించుకున్న ప్రాంతాల నుంచి వైదొలగాలని, దాంతోపాటు ఉక్రెయిన్ నుంచి తమ దళాలు చేజిక్కించుకున్న డొనెట్స్క్‌తో పాటు మరో నాలుగు ప్రాంతాలూ, 2014లో తాము ఆక్రమించిన దక్షిణ క్రిమియా ద్వీపకల్పం రష్యాకే చెందుతాయని గుర్తించాలని పుతిన్ కోరుకుంటున్నారు. మొత్తంగా ఉక్రెయిన్‌కి చెందిన 1,719 చదరపు కిలోమీటర్ల భూభాగం రష్యా ఆక్రమణలో ఉంది.

పుతిన్‌తో సమావేశానికి ట్రంప్ ఎంత తహతహలాడుతున్నారో తాజా పరిణామాలు తెలియజెబుతున్నాయి. అమెరికా, రష్యాల మధ్య ద్వైపాక్షిక చర్చలు కాకుండా, జెలెన్‌స్కీని కూడా కలుపుకొని త్రైపాక్షిక చర్చలైతేనే సమస్య పరిష్కారం తేలికవుతుందని అమెరికా ప్రతిపాదిస్తూ వచ్చింది. అయితే ఇందుకు రష్యా సుముఖంగా లేదు. ముందు అమెరికా, రష్యాల మధ్య చర్చలు జరిగి, అవి సత్ఫలితాన్నిచ్చాకే త్రైపాక్షిక సమావేశం సంగతి చూడొచ్చని అది చెబుతోంది. కానీ ఇందుకు జెలెన్‌స్కీ మొదటి నుంచీ వ్యతిరేకం. రష్యా దాడుల పర్యవసానంగా నష్టపోయేది తామైతే... చర్చల్లో తమ ప్రమేయం లేకపోవడమేమిటన్నది ఆయన ప్రశ్న. కానీ నెలలు గడిచాక ఆయన వైఖరి మారింది. శిఖరాగ్ర సమావేశాన్ని స్వాగతిస్తూ తాజాగా జెలెన్‌స్కీ ట్వీట్ చేశారు. ఆయనకు అంతకన్నా గత్యంతరం లేదు.

అమెరికా, రష్యాల మధ్య చివరిగా జో బైడెన్ హయాంలో 2021లో శిఖరాగ్రం జరిగింది. ఆ తర్వాత కొన్నాళ్లకే పుతిన్ దండయాత్ర మొదలైంది. ఆర్నెల్లుగా చర్చలకు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించని నేపథ్యంలో ఇప్పుడెలా సాధ్యమైందన్న ప్రశ్నకు రెండు పక్షాల నుంచీ జవాబు లేదు. ఈ శిఖరాగ్ర సమావేశం తర్వాత ఉక్రెయిన్‌ను కూడా కలుపుకొని త్రైపాక్షిక చర్చలు సాగిస్తామని అంటున్నా అందువల్ల పెద్దగా ఫలితం ఉండకపోవచ్చు. ఘర్షణలకు మూలకారణం నాటో కూటమి, దాన్ని ప్రోత్సహించిన అమెరికా. ఉక్రెయిన్‌లో 2014లో ప్రజామద్దతుతో ఎన్నికైన అధ్యక్షుడు విక్టర్ యెనుకోవిచ్ రష్యాతో సన్నిహితంగా ఉండటాన్ని సహించలేని అమెరికా, నాటోలు... అక్కడ అల్లర్లు రెచ్చగొట్టి ప్రజావిప్లవం సాకుతో ఆయన దేశం విడిచిపోయేలా చేశాయి. అటు తర్వాత జెలెన్‌స్కీ దేశాధ్యక్షుడయ్యారు. నాటో ప్రాపకంతో రష్యాతో గిల్లికజ్జాలకు దిగింది జెలెన్‌స్కీయే. కనుక నాటో కూటమి, దాని ద్వారా కథ నడిపించిన అమెరికా తమ వైఖరులు మార్చుకోక తప్పదు. అధినేతగా దేశ ప్రయోజనాల కోసం పాటుబడాలి తప్ప అగ్రరాజ్యాల చేతుల్లో పావుగా మారకూడదని తాజా పరిణామాల తర్వాతైనా జెలెన్‌స్కీ గ్రహించాల్సి ఉంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** పౌర్ణమి ప.1.32 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** శ్రవణం ప.3.36 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.7.35 నుండి 9.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.27 వరకు, **అమృత ఘడియలు:** లేవు, **శ్రావణ పౌర్ణమి, రాఖీ పండుగ.**

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

విఫలమయ్యాం!



అన్ని రకాలుగా యూఎస్‌కు చైనా ఒక్కటే ముప్పు. అయినా ఇండియా సహా ఎన్నో దేశాలతో పోల్చితే దాని మీద విధించిన సుంకాలు చాలా తక్కువ. ఇది కేవలం యూఎస్ కపటత్వం కాదు, చైనా అద్భుతమైన విదేశాంగ విధానం.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

మిత్రుల పైనా?



ట్రంప్ తనకు ప్రియమైన పుతిన్‌కు వ్యతిరేకంగా ఏమీ చేయకుండా – ప్రజాస్వామిక, పాశ్చాత్య దేశాలకు సన్నిహితమైన ఇండియా మీద సుంకాల మీద సుంకాలు విధిస్తున్నారు. పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా... చైనా, రష్యా కోసం ట్రంప్ ఎంతో కష్టపడుతున్నారు.

– ఆండర్స్ ఓస్లుండ్, ఆర్థికవేత్త

రక్షాబంధన్



పండుగ స్వీట్లలో అయినా, లేదా రుచికరమైన చిరుతిండిగా అయినా పిస్తాపప్పలను మీ తోబుట్టువులకు కానుకగా ఇవ్వటం అంటే మీరు వారి ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఆకాంక్షించటమే! ఈ రాఖీకి పిస్తాపప్పల రక్షణ ఇవ్వండి.

– పూజా మఖిజా, డైటీషియన్


ఖండించాల్సిందే!



ఇప్పుడు కనుక మనం నోరెత్తక పోతే, ప్రస్తుతం వీధుల్లో జరుగుతున్న ఆధిపత్య ప్రదర్శనలు మన ఇంటి గుమ్మాల వరకూ చేరవచ్చు. నాగరిక ప్రపంచంలోని అనాగరిక చర్యలను, దాడులను మొదట ఖండించవలసింది పౌర సమాజమే. ఆ తర్వాతే చట్టం బాధ్యత.

– మీరన్ చద్దా బోర్వాంకర్, మాజీ పోలీస్ కమిషనర్


మీకు తోడుగా..!



మీరు ఇష్టపడే దాని కోసం కష్టపడి పనిచేయండి. దాన్ని సాధించటంలో మీ ప్రయత్నానికి ఈ విశ్వం మీకు సహాయం చేస్తుంది. నేనెప్పుడూ గుర్తింపు కోసం, టైటిల్స్ కోసం స్కైడైవింగ్‌కు వెళ్లలేదు. స్కైడైవింగ్ నాకు సంతోషాన్ని ఇస్తుంది కనుక దానిని నా అభిరుచిగా మార్చుకున్నాను.

– రేచల్ థామస్, తొలి మహిళా స్కైడైవర్

పెద్ద ఆలోచన



గిరి గీసుకుని ఉంటే మీరు ఉన్నచోటే ఉండిపోతారు. మిమ్మల్ని దాటి మీరు ఆలోచిస్తేనే ఏదైనా సాధిస్తారు. విజయానికి కావలసింది డిగ్రీలు, నైపుణ్యాలు, విస్తృతమైన పరిచయాలు కాదు. ఉన్నతమైన ఆలోచనలు!

– జయ రో, పర్సనాలిటీ ఎక్స్‌పర్ట్

యాభై శాతం హద్దు తొలగేనా?

విశ్లేషణ



జి. శ్రీరామమూర్తి

దేశ రాజకీయం మళ్ళీ బీసీల చుట్టూ తిరుగుతున్నది. ఇందుకు తెలంగాణ ఒక వేదికగా మారింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పంచాయతీ రాజ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం స్థానాలను కేటాయించాలని నిర్ణయించి శాసన పరమైన చర్యలు చేపట్టింది. దీనిని పార్లమెంటు చేత ఆమోదింపజేసి రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించేలా కేంద్రంపై ఒత్తిడి కల్పించడానికి సన్నాహాలు మొదలుపెట్టింది. తమిళనాడులో చాలా కాలం కిందటే 69 శాతం కోటా అమల్లోకి వచ్చింది. అంతే కాకుండా కేసులు వేయకుండా న్యాయ సమీక్షకు అతీతం చేస్తున్న రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్లో ఈ కోటాను తమిళనాడు ప్రభుత్వం చేర్పించుకున్నది.



తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చినా...

రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి, లక్షణానికి విరుద్ధంగా ఉండే చట్టాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చినా వాటిని సమీక్షించే అధికారం తనకున్నదని సుప్రీంకోర్టు ప్రకటించి ఉంది. తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నట్టు పంచాయతీల్లో బీసీలకు 42 శాతం కోటా బిల్లును పార్లమెంటు ఆమోదించడం గానీ, అది 9వ షెడ్యూల్‌లో చేర్చడం గానీ సులభ సాధ్యమైనవి కావు. కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లే పనులను బీజేపీ ఎందుకు చేస్తుంది? పని కాకపోతే బీజేపీ బీసీలకు వ్యతిరేకి అని ప్రచారం చేయవచ్చన్నది కాంగ్రెస్ ఎత్తుగడ.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా కల్పిస్తే సుప్రీం కోర్టు మొత్తం రిజర్వేషన్లపై విధించిన 50 శాతం హద్దును అది మీరిపోతుంది. ఇలా హద్దు మీరిన రిజర్వేషన్లను కోర్టులు చాలా సార్లు రద్దు చేశాయి. తాజాగా మహారాష్ట్రలో మరాఠాలకు కేటాయించిన 16 శాతం రిజర్వేషన్లు వివాదాస్పదమయ్యాయి. దీనితో మహారాష్ట్రలో రిజర్వేషన్లు 50 శాతం హద్దును దాటిపోతున్నాయంటూ బొంబాయి హైకోర్టును కొందరు ఆశ్రయించగా అది వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాను 16 నుంచి 12 శాతానికి, విద్యాసంస్థల్లో 13 శాతానికి తగ్గించివేసింది. దీని మీద సుప్రీం కోర్టు స్టే ఇచ్చి, ఇప్పుడు విచారణ జరుపుతోంది.

1931 నాటి లెక్కలతో...

విచిత్రమేమిటంటే ఇదే కాంగ్రెస్ పార్టీ 1980–90 మధ్య పదేళ్ల పాటు మండల్ కమిషన్ నివేదికను అమలుపరచకుండా ఆటకెక్కించింది. 1990లో వి.పి.సింగ్ ప్రధానిగా ఈ నివేదికను పాక్షికంగా అమలుచేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను ఆచరణలోకి తెచ్చారు. తిరిగి 2006లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం కేంద్ర విద్యా సంస్థలలోనూ బీసీలకు 27 శాతం కోటాను అమలు చేసింది. 1979లో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం నియమించిన బి.పి. మండల్ కమిషన్ 1931 కులగణన ప్రకారం దేశ జనాభాలో ఇతర వెనుకబడిన తరగతులవారు 52 శాతం ఉంటారని నిర్ధారించి, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండేందుకు వారికి 27 శాతం కోటాను సిఫారసు చేసింది.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో కుల గణన జరిపిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. మోదీ ప్రభుత్వం ఈ విషయంలో తన చిరకాల వ్యతిరేకతకు తెర దించి, త్వరలో జరగబోతున్న దేశ జనాభా గణనలో భాగంగా కులాలవారీ గణనను చేపట్టడానికి అంగీకరించింది. ఇందుకు కారణం లేకపోలేదు. ఇంతవరకూ కేవలం ధనిక, మధ్యతరగతి వర్గాల పార్టీగా మాత్రమే ఉన్న బీజేపీ వైపు ఇప్పుడు పేదలు, అణగారిన వర్గాలు కూడా గణనీయంగా మళ్ళినట్టు భావిస్తున్నారు.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని 1992 నవంబర్ 16న సుప్రీం కోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం విధించింది. ఇంద్ర సాహనీ కేసు లేదా మండల్ కమిషన్ కేసుగా ప్రసిద్ధమైన వ్యాజ్యంలో ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పు దేశంలో రిజర్వేషన్లపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయాలను ప్రకటించింది. కులం ప్రాతిపదిక వెనుకబాటుతనాన్ని ఈ తీర్పు గుర్తించింది. అంటే సామాజిక న్యాయ అవసరం రాజ్యాంగ విహితమైనదని చెప్పింది. అదే సమయంలో పరిమితులను విధించింది. 50 శాతం హద్దు, బీసీలలో మీగడ వర్గం, లేదా ముందుబడిన వర్గాన్ని (క్రీమీ లేయర్‌ను) గుర్తించి కోటా నుంచి దూరం చేయడం, పదోన్నతులలో రిజర్వేషన్లు ఉండరాదనడం ఈ కోవలోకి వస్తాయి.

కేంద్రం తలుచుకుంటే...

పదోన్నతులలో రిజర్వేషన్లను సుప్రీం కోర్టు రద్దు చేసినా 1995లో 77వ రాజ్యాంగ సవరణ ద్వారా 16(4ఎ)ను చేర్చి ఎస్సీ, ఎస్టీల విషయంలో వాటికి తిరిగి ప్రాణం పోశారు. వాస్తవానికి రాజ్యాంగం 340, 341, 342 అధికరణాలు బీసీ, ఎస్సీ, ఎస్టీల పరిస్థితులను మెరుగుపరచడానికి, వారి యెడల సానుకూల వివక్షను ఉద్దేశించి చేర్చినవి. అయితే సుప్రీం కోర్టు 50 శాతం పరిమితి ఉల్లంఘన రాజ్యాంగం 14వ అధికరణం హామీ ఇస్తున్న సమానత్వ సూత్రానికి విరుద్ధమని ప్రకటించింది. అత్యంత ప్రత్యేక పరిస్థితులలో 50 శాతానికి మించి రిజర్వేషన్లను కేటాయించవచ్చని సైతం ఈ తీర్పు చెప్పింది. కానీ కోర్టులు ప్రధానంగా 50 శాతం హద్దును అమలు పరచడమే కర్తవ్యంగా తీర్పులు వెలువరిస్తున్నాయి.

కేంద్రం తలచుకుంటే 50 శాతం హద్దును ప్రభావరహితం చేయడం కష్టమేమీ కాదు. విద్యకు, హక్కులకు సుదూరంగా విసిరివేసిన ప్రజలను పైకి తేవడానికి ఉద్దేశించిన అధికరణాలు రాజ్యాంగం ప్రసాదించినవి కాగా, 50 శాతం హద్దు సుప్రీం కోర్టు విధించినది. నిజానికి రాజ్యాంగం కేవలం సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకే విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇచ్చింది. ఇందులో ఆర్థిక వెనుకబాటుతనం ప్రస్తావనే లేదు. అయినా మోదీ ప్రభుత్వం 103 రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థిక బలహీన (ఈడబ్ల్యూఎస్) వర్గాలకు 10% రిజర్వేషన్లను కల్పించింది. ఇది 50 శాతం పరిమితిని దాటిపోడమే కదా! రాజ్య సభలో పిల్లి సుభాష్ చంద్రబోస్ ఈ విషయాన్నే ప్రశ్నించగా, సామాజిక న్యాయ శాఖ మంత్రి విచిత్రమైన సమాధానంతో సమర్థించుకున్నారు. ఇంద్ర సాహనీ కేసులో సుప్రీం కోర్టు విధించిన 50 శాతం హద్దు సామాజికంగా విద్యాపరంగా (ఎస్.ఇ.బి.సి.) వెనుకబడిన వర్గాలకు మాత్రమే వర్తిస్తుందని, ఆర్థిక బలహీన వర్గాలకిచ్చిన 10 శాతం రిజర్వేషన్లకు, దానికి సంబంధం లేదని చెప్పారు. ఇటువంటి ద్వంద్వ ప్రమాణాలు రాజకీయ అవకాశవాదాన్నే రుజువు చేస్తాయి. అందుకే 'మేమెందరమో మాకు అంత కోటా' అనే నినాదం రోజు రోజుకీ పుంజుకుంటున్నది. అందుకోసం మరొక రాజ్యాంగ సవరణ ద్వారా 50 శాతం హద్దును కూడా రద్దు చేయడమే ఏకైక మార్గంగా తోస్తున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

> ◆ 1979లో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం నియమించిన బి.పి. మండల్ కమిషన్ 1931 కులగణన ప్రకారం దేశ జనాభాలో ఇతర వెనుకబడిన తరగతులవారు 52 శాతం ఉంటారని నిర్ధారించి, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండేందుకు వారికి 27 శాతం కోటాను మాత్రమే సిఫారసు చేసింది.

> ◆ కేంద్రం తలచుకుంటే 50 శాతం హద్దును ప్రభావ రహితం చేయడం కష్టమేమీ కాదు. మెజారిటీ ప్రజలను నెమ్మదిగానైనా పైకి తేవడానికి ఉద్దేశించిన అధికరణాలు రాజ్యాంగం ప్రసాదించినవి కాగా, 50 శాతం హద్దు సుప్రీం కోర్టు మాత్రమే విధించినది.

ఛిద్రమవుతున్న ఆదివాసీ జీవనం

ప్రకృతి ఒడిలో జీవించే ఆదివాసీల హక్కులు, సంస్కృతులు, భాషలు, జీవన శైలుల గురించి చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినాన్ని నిర్వహిస్తున్నారు. అయితే అసలు లక్ష్యాన్ని మరచి పాలకులు దీన్ని ఒక జాతరలాగా మార్చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో జరుగుతోన్న ప్రకృతి విధ్వంసం ఆదివాసీల జీవితాల పాలిట శాపంగా మారింది. కనీస వసతులు వారికి అందుబాటులోకి రాలేదు. రాకపోగా తమవైన ప్రత్యేక ఆచార వ్యవహారాలను, హక్కులను కోల్పోతున్నారు.

ఆదివాసీల హక్కులు, సంస్కృతుల రక్షణ కోసం ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తీర్మానాలు, విధానాలు, అభివృద్ధి ఆశయాలు... ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం చేపడుతోన్న ఆదివాసీ వ్యతిరేక చర్యలు వారిని నిత్య నిర్వాసితులుగా మారుస్తున్నాయి. 805 ఆదివాసీ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని 1980లో వేసిన 'భూరియా కమిషన్' చేసిన సిఫార్సులు సైతం బుట్టదాఖలు అయ్యాయి. ఐదవ షెడ్యూల్‌లో ఈ ఆదివాసీ గ్రామాలు లేకపోవడం వల్ల 1/70 లాంటి చట్టాలు అమలు కావడం లేదు. శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా ఆదివాసీలు అనేక హక్కులు సాధించుకోగలిగారు. ఉద్యమాల ద్వారా 1/70 చట్టం, పెసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం వంటివి సాధించుకోగలిగారు. కానీ ప్రభుత్వాలు వీటిని పట్టించుకోవడం లేదు.



◆ ఆదివాసీ ప్రాంతాల్లోని దీర్ఘకాలిక పోషకాహార లోపం, రక్తహీనత వారిని అనారోగ్య కుహరంలోకి నెడుతున్నాయి. రక్షిత మంచి నీరు, వైద్యం ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఆదివాసీలు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అటవీ, అటవీయేతర భూములను, ఉమ్మడి భూములను ప్రైవేటు కంపెనీలకు ధారదత్తం చేయడానికి పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు ఆటంకంగా ఉన్నందున వీటిని నిర్దాక్షిణ్యంగా రద్దు చేయడానికి 'అటవీ సంరక్షణ నియమాల' పేరుతో 2023లో తీసుకొచ్చిన ఒక చట్టంతో... ఆదివాసీలు ఇప్పటి వరకు పోరాడి సాధించుకున్న అన్ని హక్కులూ అణచివేతకు గురవుతాయి. గత మార్చి నెలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 7,000 ఎకరాల్లోని చెట్ల నరికివేతకు నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్ర గత మే నెలలో 2,324 ఎకరాల్లో 1,23,000 చెట్ల నరికివేతకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో బైలదిల్లా 1, బైలదిల్లా 2, బైలదిల్లా 3 గనులను ప్రైవేటు పరం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన దంతెవాడ, కాంకేరు జిల్లాల్లో 7 వేల ఎకరాలను గనుల కోసం 50 ఏళ్లు లీజుకిచ్చారు. బాక్సైట్ ఖనిజం కోసం తూర్పు కనుమలను జల్లెడ పడుతున్నారు. అలాగే రెడ్ జోన్, గ్రీన్ జోన్‌ల పేరుతో ఆదివాసీ ప్రాంతాలను విభజించి, వారి హక్కులను కాలరాస్తున్నారు. అటవీ భూములలో టైగర్ జోన్లు, ఎలిఫెంట్ జోన్లు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ఆదివాసీలను అక్కడి నుంచి ఖాళీ చేయమంటున్నారు.

ఆదివాసీ ప్రాంతాల్లోని దీర్ఘకాలిక పోషకాహార లోపం, రక్తహీనత వారిని అనారోగ్య కుహరంలోకి నెడుతున్నాయి. రక్షిత మంచి నీరు, వైద్యం ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసీలు తమ హక్కుల కోసం, ప్రత్యేక సంస్కృతీ సంప్రదాయాల రక్షణ కోసం, అడవులు, పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజ మార్పు కోసం జరిగే ఉద్యమాల్లో ఆదివాసీల హక్కుల సాధన కూడా ఒక భాగం. ఆ ఉద్యమాల ద్వారానే ఆదివాసీల హక్కుల సాధన సాధ్యమవుతుంది.

– వంకల మాధవరావు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులు । 81793 84630


(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం)

అక్షర యోధుడు

ఇన్ బాక్స్

సరస్వతీ వరపుత్రుడు, అనువాదంలో అద్వితీయుడు, తెలుగు పత్రికా రంగాన 'పద్మశ్రీ' అందుకొన్న పాత్రికేయుడు, రాజకీయ పార్టీలకు అతీతుడు, తెలుగు భాషా పరిరక్షకుడు తుర్లపాటి కుటుంబరావు. పుట్టు మచ్చంత అవినీతి కూడా లేని వ్యక్తి ఆయన. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థకు అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఒక పబ్లిషర్ ఆయన ఇంటికి వచ్చి ఆయన పుస్తకాలు గ్రంథాలయ సంస్థ కొంటే కమిషన్ ఇస్తానన్నారు. తుర్లపాటికి కోపం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఎంతోమంది ప్రధానులు, ముఖ్యమంత్రులతో సన్నిహితంగా ఉన్నా తన కోసం ఏ రోజూ ఆ పరిచయాలను వాడుకోలేదు, పదవుల కోసం పాకులాడలేదు. ఆయన సంస్కృతీ – సంప్రదాయాలకూ, సామాజిక విలువలకూ అద్దం పట్టిన విలక్షణ మనిషిగా కీర్తిగాంచారు. ఎటువంటి జటిల సమస్యకైనా త్రుటిలోనే పరిష్కారం కనుగొనటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యగా మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కితాబునిచ్చారు.

ప్రధాన మంత్రులకు, ముఖ్యమంత్రులకు తన లేఖల ద్వారా సమకాలీన సమస్యలను తెలియజేసి, సుపరిపాలన కొనసాగించేలా సహకరిస్తూ ఉండేవారు. నెహ్రూ హయాంలో కృష్ణా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరాజయానికి కారణాలను విశ్లేషిస్తూ ఆయనకు రాసిన సుదీర్ఘ లేఖను చదివిన నెహ్రూ... 'ఎవరీ తుర్లపాటి' అని ఆరా తీయడం ఈ అక్షర యోధుడి ప్రతిభకు తార్కాణం. ప్రసంగాలలో ఆయన గళం విప్పితే గంగా ప్రవాహం. కలం కదిపితే పలు ఆసక్తి విషయాలు బయటకు వచ్చేవి. ఒకసారి ప్రముఖ కవి దాశరథి ఈయన గురించి 'కలం సారింపులో చమక్కులు, గళం సవరింపులో... చమత్కారాలతో విశిష్టంగా నిలబడ్డ తెలుగు వెలుగు తుర్లపాటి' అన్నారు. తుర్లపాటి దాదాపు 20 వేల ఉపన్యాసాలు ఇచ్చారంటే, అందులో 10 వేల సభలకు అధ్యక్షత వహించారంటే ఆయన మీద ప్రజలకు ఉన్న గౌరవం, అభిమానం అర్థమవుతాయి.



తుర్లపాటి కుటుంబరావు

50 ఏళ్ల సుదీర్ఘకాలంపాటు ఆయన రాసిన 'వార్తలలోని వ్యక్తి' కాలమ్ సమకాలిక అంశాలకు నిలువుటద్దంగా ఉండేది. 'నా కలం – నా గళం', 'బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ పి.వి. నరసింహారావు', 'జాతి నిర్మాతలు' వంటి పుస్తకాలు చాలా రాశారు. 1932 ఆగస్టు 10వ తేదీన విజయవాడలో జన్మించి, 2021 జనవరి 11న తుదిశ్వాస విడిచిన తుర్లపాటి అజాతశత్రువు.

– జె.ఎస్.టి. శాయి । హైదరాబాద్


(రేపు తుర్లపాటి కుటుంబరావు జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

రైలు భోజనం బాగాలేదు!

దేశంలోని రైళ్లలో అందించే ఆహారం బాగాలేదంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గత 5 ఏళ్లలో 19 వేలకు పైగా ఫిర్యాదులు రాగా, 3 వేలకు పైగా కేసుల్లో ఫైన్ విధించారు.



ఆధారం: రైల్వే శాఖ

ఏ పేరుతో పిలిచినా...

కలియుగంలో మోక్షానికి ఏకైక మార్గం నామ సంకీర్తన అని అందరికీ తెలుసు. అయితే పాడటం తెలీదని చింతించనక్కర్లేదు. భజనలు ఎలా చేయాలో కూడా తెలీదు అని చింతించనక్కర్లేదు. సంస్కృత శ్లోకాలను తప్పులు లేకుండా ఉచ్చరించలేనుగా అని చింతించనక్కర్లేదు. నిజాయతీగా, భక్తితో ఉచ్చరించడం ద్వారా మోక్షాన్ని పొందవచ్చని పెద్దలు చెబుతారు.

జ్యోతిర్మయం

**'శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే'** – దీనిని చెప్పుకుంటే విష్ణు సహస్రనామం మొత్తం పఠించిన ప్రయోజనం పొందుతాం అంటారు. అది కూడా సాధ్యం కాదా? ఐదు నామాలు చాలు. అయిదింటిలో **మొదటి నామం:** 'రామ'. చింతలు, దుఃఖాలు తలెత్తినప్పుడు ఏకాంత ప్రదేశంలో కూర్చుని రామ నామాన్ని జపిస్తే చాలు, రామ నామం విన్న వెంటనే హనుమంతుడు ఆ ప్రదేశంలోకి వచ్చి కూర్చుంటాడని అంటారు. **'యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్/ తత్ర తత్ర కృతమస్త కాంజలిమ్'.**

రెండవ నామం: 'కృష్ణ'. ఈ నామమే పాండవులను రక్షించింది. 'కృష్ణా! నాకు కష్టాలు ఇవ్వు! అప్పుడే, నిన్ను నేను ఎప్పటికీ మర్చిపోలేను' అని కృష్ణుడిని వరం అడిగింది కుంతి. మానసిక బలాన్నీ, కష్టాలను భరించే ఓర్పునూ ఇచ్చే నామమిది. **మూడవ నామం:** 'నారాయణ'. బాలుడు ప్రహ్లాదుడిని రక్షించిన నామం. ఎన్ని ప్రమాదాలు ఎదురైనా రక్షించిన నామం. **నాలుగవ నామం:** 'గోవింద'. దుశ్శాసన సభలో ద్రౌపది తన రెండు చేతులను పైకెత్తి 'గోవింద! గోవింద!' అని అన్నప్పుడు ఆమె గౌరవాన్ని కాపాడిన నామమిది. తిరుమలలో ఎల్లవేళలా ప్రతిధ్వనించే నామం. **ఇక ఐదవ నామం:** 'నరసింహ'. నీవే శరణాగతి అని నమ్మిన భక్తులకు కష్టాల నుంచి విముక్తిని ఇస్తాడు నరసింహుడు. వేరు వేరు పేర్లతో ఉన్న దేవుని ఏ పేరుతో ఎక్కడ స్మరించినా ఆయన ఆలకించి ఆదుకుంటాడు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

జోగుళాంబ సన్నిధిలో హైకోర్టు జడ్జి


హైకోర్టు జడ్జి జస్టిస్ రేణుక యారకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లాలోని దక్షిణకాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను శుక్రవారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రేణుక యార కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ ఈవో పురేందర్ కుమార్, అర్చకులతో కలిసి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి జోగుళాంబ అమ్మవారి, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చక స్వాములు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. వారిని ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు.

మా జోలికి వస్తే తొక్కేస్తాం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: 'నువ్వు ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ రాజకీయం చేస్తున్నావు. నేను ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగాను.. మా జోలికి వస్తే తొక్కిపడేస్తాం' అంటూ ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి శ్యామ్‌నాయక్‌ను హెచ్చరించారు. రేషన్‌కార్డుల పంపిణీలో భాగంగా ఈ నెల 7న జన్కాపూర్ రైతు వేదికలో జరిగిన ఘటన నేపథ్యంలో శుక్రవా రం ఆమె విలేకరులతో మాట్లాడారు. శ్యామ్‌నాయక్ తనపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. రాజకీయాలు కాకుండా కుటుంబ విషయాలు మాట్లాడుతూ, తనపై అభాండాలు వేస్తే ఊరుకోనన్నారు. తమ కుటుంబం నిజాయితీకి మారుపేరని, రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు రక్షణ లేదని, పోలీసులు భద్రత కల్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అవినీతి ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు.

దురుద్దేశంతోనే ఫిర్యాదు చేశారు..

- నాటి అధికారికి శిక్ష విధించలేమన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నేరుగా ఫిర్యాదుదారుడే.. తాను దురుద్దేశంతోనే ఫిర్యాదు చేశానని చెబుతు న్నప్పుడు నాటి అధికారికి శిక్ష విధించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దాఖలు చేసిన కేసును కొట్టివేసింది. కేసు వివరాలు.. నిందితుడు, ప్రతివాది అర్షిత్‌కుమార్ 1993 నుంచి 2005 వరకు సికింద్రాబాద్ డివిజన్‌లోని అదనపు కమిషనర్ (నాడు ఎంసీహెచ్) కార్యాలయంలో పన్ను విభాగ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. 2005, ఏప్రిల్ 21న ఇంటి మ్యుటేషన్ కోసం రూ.500 లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. వాదనలు విన్న ట్రయల్‌కోర్టు నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఏసీబీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. అర్షిత్‌కుమార్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సరైన పత్రా లు లేకుండా రికార్డుల్లో తన పేరును మార్చమని ఫిర్యాదుదారుడి అభ్యర్థన తిరస్కరించినందునే పగతో ఏసీబీకి ఫిర్యాదు చేశాడని చెప్పారు. అదే విషయాన్ని క్రాస్ ఎగ్జామినేషన్‌లో అతను అంగీకరించాడని నివేదించారు. దురుద్దేశంతోనే ఫిర్యాదు చేశానని ఫిర్యాదుదారుడే చెబుతున్నందున.. ట్రయల్‌కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఏసీబీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేశారు.

78 ఏళ్ల వృద్ధురాలిపై లైంగికదాడి

- ఆదిలాబాద్‌లో ఘటన

ఆదిలాబాద్ టౌన్: సభ్యసమాజం తలదించుకునేలా ఓ 78 ఏళ్ల వృద్ధురాలిపై లైంగికదాడి జరిగింది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన వృద్ధురాలు భిక్షాటన చేస్తోంది. శివాజీచౌక్‌లో రోడ్డుపక్కన నిద్రిస్తుండగా.. అర్ధరాత్రి సమయంలో 20 నుంచి 30 ఏళ్ల వయసు గల యువకుడు ఆమె వద్దకు వెళ్లి బలవంతంగా పక్కకు తీసుకెళ్లాడు. చంపుతానని బెదిరించి రెండుసార్లు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. తర్వాత ఆమెను కింద పడేయగా, తలతో పాటు శరీరంపై గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను రిమ్స్‌కు తరలించారు. తల్లి నుంచి విషయం తెలుసుకున్న బాధితురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. కాగా ఆ వ్యక్తిని చూస్తే గుర్తు పడతానని బాధితురాలు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.


గూడూరు పీఏసీఎస్‌లో ఉదయం యూరియా కోసం బారులు తీరిన రైతులు


రుద్రంగిలో రాత్రి యూరియా కోసం వేచి చూస్తున్న రైతులు

పగలనక.. రాత్రనక..

రైతులకు తప్పని పడిగాపులు

రుద్రంగి(వేములవాడ)/గూడూరు: రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఎదురు చూశారు. రుద్రంగిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్దకు శుక్రవారం మండలం రుద్రంగితోపాటు మానాల, గైదిగుట్ట తండా, అడ్డాబోర్ తండా, వీరునితండా, దెగావత్ తండా, సర్పంచ్ తండా, బడితండా, చింతామణి తండా, రూప్లానాయక్ తండా గ్రామ పంచాయతీలకు చెందిన రైతులు దాదాపు 300 మంది వరకు వచ్చారు. వీరంతా మధ్యాహ్నమే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి చేరుకోగా.. యూరియా లోడ్ మాత్రం సాయంత్రం వచ్చింది. ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క బస్తా మాత్రమే ఇచ్చారు. రాత్రి కావడంతో చాలామంది రైతులు ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. అటు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎరువుల కోసం రైతులు ఎగబడ్డారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం ఒక లారీ లోడ్ యూరియా వచ్చింది. సమాచారం అందుకున్న రైతులు ఒక్కసారిగా చేరుకుని ఎగబడ్డారు. కాగా, కొందరు రైతులు వేరే గ్రామాల్లోని తమ బంధువులకు అందించేందుకు మళ్లీమళ్లీ తీసుకుంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. తమ దగ్గర యూరియా కొరత లేదని ఏవో అబ్దుల్‌మాలిక్ స్పష్టం చేశారు.

ఎస్ఎల్‌బీసీపై మాగ్నటిక్ సర్వే

- డెన్మార్క్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహణ
- భూగర్భంలో కి.మీ. వరకు పరిస్థితులపై స్పష్టత
- జీఎస్ఐ ద్వారా లైడార్ సర్వే సైతం నిర్వహణ
- రెండు సర్వేల సమాచారంతో పనుల పునరుద్ధరణ
- సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ వెల్లడి
- సింగూరు జలాశయం రక్షణకు తక్షణ చర్యలకు ఆదేశం
- నీటిపారుదల శాఖలో ఇంజనీర్ల పదోన్నతులకు ఉత్తర్వులు


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల పునరుద్ధరణకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హెలికాప్టర్ ద్వారా 'వీటీఎమ్ ప్లస్ మాగ్నటిక్ జియోఫిజికల్ సర్వే' నిర్వహించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెలికాప్టర్‌కు అమర్చిన అత్యాధునిక పరికరాలు భూమి ఉపరితలం నుంచి కిలోమీటర్ లోతు వరకు పరిస్థితులు గుర్తిస్తాయని, ఆ సమాచారం ఆధారంగా పనుల పునరుద్ధరణకు కార్యాచరణ సిద్ధం చేస్తామని చెప్పారు. సొరంగం తవ్వాల్సిన చోట భూగర్భంలోని ఫాల్ట్ లైన్లు, ఇతర సంక్లిష్టతలను గుర్తించడానికి ఈ సర్వే దోహదపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పునరుద్ధరణపై శుక్రవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సహకారంతో ఏరియల్ లైడార్ సర్వేను సైతం నిర్వహించి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాక సొరంగం తవ్వకాలను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. రెండు వేర్వేరు లక్ష్యాలతో రెండు విభిన్న సర్వేలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ పనులను మరింతగా వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల పునరుద్ధరణకు సంబంధించి ఇంధన, ఆర్థిక, ఇతర శాఖల నుంచి అనుమతుల కోసం త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశం కానున్నట్టు తెలిపారు. 9 కి.మీ.ల సొరంగం తవ్వకాలు పూర్తికాకపోవడంతో రాష్ట్రం శ్రీశైలం జలాశయం అడుగు భాగం నుంచి గ్రావిటీ ద్వారా నీళ్లను తీసుకునే అవకాశాన్ని పొందలేకపోతోందని, దీంతో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు నీటి సరఫరా కోసం నీళ్లను లిఫ్టు చేసి ఏటా రూ.750 కోట్ల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోందని చెప్పారు. కాగా, వీటీఎమ్ ప్లస్ మాగ్నటిక్ జియోఫిజికల్ సర్వే కోసం రూ.2.36 కోట్ల అంచనాలతో పరిపాలన అనుమతులు జారీ చేస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డెన్మార్క్‌కు చెందిన కంపెనీ ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది.

నీటిపారుదల శాఖలో భారీగా పదోన్నతులు

దాదాపు మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో శాశ్వత ప్రాతిపదికన ఇంజనీర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. 47 మంది ఈఈలకు ఎస్ఈలుగా, 127 మంది డీఈఈలకు ఈఈలుగా, 13 మంది ఎస్ఈలకు సీఈలుగా పదోన్నతి కల్పించినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరికీ మేలు చేయలేదని స్పష్టం చేశారు. పదోన్నతులకు సంబంధించి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సింగూరుకు తక్షణమే రక్షణ

సింగూరు జలాశయానికి ఏ క్షణమైనా గండిపడే ప్రమాదం ఉందని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తక్షణమే నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. రివిట్‌మెంట్ దెబ్బతినడంతో మట్టి కట్టలు బలహీనంగా మారిన చోట ఇసుక బస్తాలతో రక్షణ కల్పించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎలాంటి విపత్తులకు తావు లేకుండా రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లు, రిజర్వాయర్లు, బరాజ్‌ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

సమ్మక్కతో ఛత్తీస్‌గఢ్‌లో 40 హెక్టార్లలోనే ముంపు..

ఏపీలోని పోలవరం ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని సమ్మక్క బరాజ్‌తో ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడే ముంపు ప్రభావంపై ఐఐటీ ఖరగ్‌పూర్ నిపుణులు నివేదిక సమర్పించినట్లు అధికారులు మంత్రికి నివేదించారు. 36 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరద వచ్చినా సమ్మక్క సాగర్ వద్ద 93 మీటర్ల ఎత్తులో ప్రవాహం ఉండనుందని, దీంతో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో కోటూరు, తార్లగూడ, గంగారామ్, కంబాలపేట, సీతంగారం గ్రామాల్లో సుమారు 10.9 చదరపు కి.మీ.ల భూమి మాత్రమే ముంపునకు గురికానుందని తేల్చారు. అందులో వ్యవసాయ, అటవీ, ప్రభుత్వ భూములున్నట్టు నివేదికలో పేర్కొన్నట్లు మంత్రికి వివరించారు. బరాజ్ నిర్మాణంతో కేవలం 0.4 చదరపు కి.మీ.ల ప్రాంతంలోని 40 హెక్టార్లలో మాత్రమే ముంపు ఉండనుందని తేలినట్లు తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి బరాజ్ నిర్మాణానికి ఎన్ఓసీ కోసం ప్రయత్నిస్తుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుతో దేవాదుల కింద ఉన్న 16.4 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, 6.94 టీఎంసీల జలాల నిల్వకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు.

ఒక జ్ఞాపకం.. ఒక వేధింపు.. ఒక పగ

- తనయుడి మృతి తట్టుకోలేక తండ్రి మృతి
- మరో ఘటనలో కుమారుడిని హత్య చేసిన తల్లిదండ్రులు
- గతంలో దాడి చేశాడని తండ్రికి నిప్పంటించిన కొడుకు


దేశ్యా


సక్రు

రఘునాథపాలెం/మణుగూరు టౌన్/జనగామ: ఎదిగిన కుమారుడి మృతిని జీర్ణించుకోలేక ఓ తండ్రి గుండె పగిలి చనిపోయాడు. మరోచోట కుమారుడి వేధింపులు భరించలేక తల్లిదండ్రులే కన్నపేగును హతమార్చారు. మరో ఘటనలో గతంలో తండ్రి కొట్టాడన్న కారణంతో కుమారుడు పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తండ్రి మృతిచెందాడు. ఖమ్మం, జనగామ జిల్లాల్లో శుక్రవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు...

అంత్యక్రియలు చేసిన చోటే..

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామానికి చెందిన అజ్మీరా సక్రు (35) గతనెల 22న ఖమ్మంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగానే ఈనెల 3న మృతి చెందాడు. కుమారుడు గాయపడినప్పటి నుంచి ఆవేదనలో ఉన్న సక్రు తండ్రి దేశ్యా (62) ఆయన మృతితో మరింత కుంగిపోయాడు. ఈ క్రమంలోనే శుక్రవారం కుమారుడి కర్మకాండలు జరిగిన ప్రదేశానికి వెళ్లి రోదిస్తూ కుప్పకూలాడు. గుర్తించిన స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఐదు రోజుల వ్యవధిలో తండ్రీకుమారుల మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కుమారుడిని హతమార్చిన తల్లిదండ్రులు

గంజాయి, మద్యానికి బానిసైన ఓ యువకుడు నిత్యం వేధిస్తుండటంతో తట్టుకోలేక ఆయనను తల్లిదండ్రులే హతమార్చిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. మణుగూరు మున్సిపాలిటీ పరిధి చేపల మార్కెట్ ఏరియాకు చెందిన కుంజా రవికుమార్ – పార్వతి దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు మోహనకృష్ణ(22) ఎనిమిది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మోహనకృష్ణ కొంతకాలంగా గంజాయి, మద్యానికి బానిసగా మారాడు. నిత్యం ఇంట్లో గొడవపడుతూ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కూడా గొడవకు దిగగా, తల్లిదండ్రులు తాడుతో కట్టేసి, గొంతుకు ఉచ్చు వేసి హత్య చేశారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు.

ఒంటిపై పెట్రోలు పోసి..నిప్పంటించి

ఓ కుమారుడు పెట్రోల్ పోసి నిప్పంటించి తండ్రిని హతమార్చాడు. ఈ ఘటన జనగామ జిల్లా జనగామ మండలం పెద్దపహాడ్ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన బోయిని సిద్దులు (52), అనసూయ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురు వివాహం కాగా, నలుగురు కుటుంబ సభ్యులు కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాస ముంటున్నారు. చిన్న కుమారుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి, తండ్రి, పెద్ద కుమారుడు బాలరాజు రోజువారీ కూలీ పని చేసుకుంటున్నారు. ఎనిమిది నెలల క్రితం స్వగ్రామంలో తండ్రి సిద్దులు, కొడుకు బాలరాజు మధ్య గొడవ జరగగా, ఇందులో కుమారుడి తలకు గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ ఘటనలో తలకు గాయం కావడంతో బాలరాజు అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో తండ్రి సిద్దులు నెల రోజుల క్రితం గ్రామానికి రాగా, వారం క్రితం కుమారుడు బాలరాజు కూడా వచ్చాడు. గతంలో తనపై తండ్రి చేసిన దాడితోపాటు కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నాడనే నెపంతో కుమారుడు బాలరాజు ఈనెల 7వ తేదీ రాత్రి తండ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో సిద్దులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

వాగులో కొట్టుకుపోయిన కారు

- ఆ సమయంలో అందులోనే ఉన్న ఏడుగురు
- చెట్టుకు తగిలి ఆగిన కారు... ఒక్కొక్కరుగా సురక్షితంగా బయటకు


వాగులో చిక్కుకున్న కారును బయటకు తీసే ప్రయత్నం చేస్తున్న స్థానికులు

చౌటుప్పల్ రూరల్: వరద ఉధృతికి వాగులో ఓ కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న ఏడుగురు ప్రాణభయంతో ఆర్తనాదాలు చేస్తూ వాగు ఒడ్డుకు చేరారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లో గురువారం భారీ వర్షం కురవడంతో మూసీ నదికి వరద పోటెత్తింది. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల గ్రామం పక్కన ఉన్న ఈదులవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో తమ బంధువుల ఇంట్లో జరగనున్న పెళ్లికి చౌటుప్పల్‌కు చెందిన ఉబ్బు లింగస్వామి తన బంధువులతో కలిసి వెళ్లాడు. అయితే శుక్రవారం చౌటుప్పల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి ఉండగా, అక్కడ ఏర్పాట్ల కోసం గురువారం సాయంత్రం వర్షంలోనే వంట సామగ్రిని కారులో తీసుకెళ్లి అక్కడ వదిలేసి వర్కట్‌పల్లికి తిరుగు పయనమయ్యాడు. ఇదే సమయంలో పెద్దకాపర్తికి చెందిన లింగస్వామి బావ జక్కలి మల్లేశం, చెల్లి మమత వారి పిల్లలు ప్రియాన్స్, చిట్టీ బైక్‌పై వర్కట్‌పల్లికి వస్తున్నారు. వీరితోపాటు ఈరటి నవీన్, వట్టిమర్తికి చెందిన సైదులు కూడా బైక్‌పై వస్తున్నారు. ఎంతకీ వర్షం ఆగకపోవడంతో బైక్‌పై పిల్లలు తడుస్తున్నారని, కారులో తీసుకెళ్లమని లింగస్వామికి చెల్లి మమత ఫోన్ చేసింది. దీంతో ఆయన కారును అస్నోనిగూడెం వైపునకు తీసుకెళ్లాడు.

కల్వర్టు వద్దకు చేరగానే....

రాత్రి 9:45 గంటలకు అందరూ కారు ఎక్కగానే నవీన్ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఇదే సమయంలో వర్షం పెరగడంతో ఈదులవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కారును నడుపుతున్న నవీన్‌కు ఈ రూట్ కొత్త. కల్వర్టు దగ్గరకు పోగానే నీళ్లలో రోడ్డు తెలియక కారును కల్వర్టు అంచుకు తీసుకెళ్లాడు. దీంతో కారు ఒక్కసారిగా వాగులోకి వెళ్లింది. వరదలో కారు చిక్కుకోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఏడుగురు ఆర్తనాదాలు చేశారు. కారులో నుంచి మొదటగా లింగస్వామి, సైదులు దూకారు. ఆ తర్వాత ఒకవైపు కారు డోర్ తెరుచుకోవడంతో అందరూ బయటకు దిగారు. మమత తన ఇద్దరు పిల్లలను భుజాలపై ఎత్తుకొని వాగు ఒడ్డుకు చేరింది. వాగులో కొట్టుకుపోతున్న కారు ఓ చెట్టుకు తగిలి ఆగిపోయింది. లేకుంటే కారు ఇంకొంత దూరం కొట్టుకుపోయి ఉంటే అందులో ఉన్న వారికి ప్రాణాపాయం సంభవించేది. లింగస్వామి తన బంధువులకు ఫోన్‌చేయగా, వారు డయల్ 100 కాల్ చేయడంతో వలిగొండ పోలీసులు, చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ సంఘటన స్థలానికి వచ్చారు.. వాగులో చిక్కుకుపోయిన కారును బయటకు తీసేందుకు ప్రయత్నించారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటం, కారు చెట్టుకు తగిలి ఇసుకలోనే కూరు కుపోవడంతో బయటకు తీయడానికి వీలు పడలేదు. అయితే కారు వాగులో కొట్టుకుపోకుండా తాళ్లతో కట్టివేశారు. శుక్రవారం ఉదయానికి కూడా వాగులో వరద ఉధృతి తగ్గకపోవడంతో కానిస్టేబుల్‌ను వాగు వద్ద బందోబస్తుకు ఉంచారు. అయితే కారులోనే ఉన్న ఓ బ్యాగులో ఐదు తులాల బంగారం ఉందని, దాని కోసం శుక్రవారం ఉదయం వెతకగా ఆ బ్యాగు కనిపించలేదని లింగస్వామి వాపోయారు.

హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించారా?

- దేవరాజ్‌ను కస్టడీకి తీసుకొని విచారించిన సీఐడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష ఎన్నికలో నిబంధనల ఉల్లంఘన, హెచ్‌సీఏ నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో సీఐడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసులో ఏ–2 , ఈ మొత్తం కుంభకోణంలో అత్యంత కీలకవ్యక్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్‌సీఏ సెక్రెటరీ దేవరాజ్ రామ్‌చందర్‌ను సీఐడీ అధికారులు తమ కస్టడీకి తీసుకొని విచారిస్తున్నారు. కేసు నమోదైన తర్వాత పరారీలో ఉన్న దేవరాజ్‌ను సీఐడీ అధికారులు జూలై 25న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కేసులో కీలక నిందితుడు కావడంతో పలు అంశాలపై సమాచారం సేకరించేందుకు కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు కోర్టును ఆశ్రయించారు. గురువారం నుంచి ఈ నెల 13 వరకు ఏడు రోజుల పాటు దేవరాజ్‌ను కస్టడీకి ఇస్తూ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు అనుమతించింది. విచారణలో భాగంగా శుక్రవారం రెండోరోజు దేవరాజ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి సీఐడీ కార్యాలయానికి తరలించారు. దేవరాజ్‌ను ఆయన న్యాయవాది సమక్షంలోనే అధికారులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా జగన్ మోహన్‌రావు దాఖలు చేసిన ఫోర్జరీ డాక్యుమెంట్లు సహా బీసీసీఐ నుంచి వచ్చిన గ్రాంట్స్‌ను ఎలా ఖర్చు చేశారు? వాటికి సంబంధించిన ఆర్డర్లు, బిల్లులు సహా హెచ్‌సీఏ అకౌంట్ నుంచి బదిలీ అయిన నగదుకు సంబంధించిన వివరాలను సీఐడీ అధికారులు సేకరించారు. బీసీసీఐ నిధులను ఎక్కడెక్కడ ఖర్చు చేశారన్న అంశాలపైనా సీఐడీ ప్రశ్నించినట్టు తెలిసింది. కాగా, సీఐడీ కేసు నమోదు చేసినట్టు తెలియగానే, ఉప్పల్ మాజీ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి ఇచ్చిన ముందస్తు సమాచారంతో దేవరాజ్ రామ్‌చందర్ తప్పించుకు పారిపోయాడు. అప్పటి నుంచి వైజాగ్, తిరుపతి, తమిళనాడు, బెంగళూరు, గోవా సహా టూరిస్ట్ ప్రాంతాలకు మకాం మారుస్తూ వచ్చిన దేవరాజ్‌ను 17 రోజుల తర్వాత సీఐడీ ప్రత్యేక బృందాలు పక్కా సమాచారంతో మహారాష్ట్ర పూణేలోని ఓ త్రీస్టార్ హోటల్‌లో అరెస్ట్ చేశాయి. తన వద్ద కీలక సమాచారం ఉండటంతోనే దేవరాజ్ తప్పించుకు పారిపోయాడని భావిస్తున్న సీఐడీ అధికారులు అతడి నుంచి కీలక సమాచారం తెలుసుకునే దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. సీఐడీ అధికారులు శనివారం మరోమారు దేవరాజ్‌ను కస్టడీకి తీసుకొని ప్రశ్నించనున్నారు.

రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేస్తే పెనుభారమే!

- ఇంధనం బిల్లు ఏడాదిలో 9 బిలియన్ డాలర్లకు పెరిగే ప్రమాదం
- భారత చమురు అవసరాలకు దిగుమతులే దిక్కు
- 35.1 శాతం రష్యా నుంచే కొనుగోలు

భారత్ తన చమురు అవసరాల కోసం ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. దేశంలో ఉపయోగిస్తున్న చమురులో ఏకంగా 80 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. ఇందులో ప్రధాన వాటా రష్యాదే. రష్యా నుంచి చౌకగా ముడిచమురు లభిస్తోంది. ఇండియాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేయడానికి, 50 శాతం సుంకాలు విధించడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండడమే కారణం. ఒకవేళ రష్యా నుంచి ముడిచమురు కొనడం ఆపేస్తే భారత్‌పై మోయలేని భారం పడడం ఖాయం. అది దేశ ఆర్థిక వ్యవస్థనే ప్రతికూలంగా మార్చేయగలదు. రష్యా చమురును వద్దనుకుంటే ఇండియా ఆయిల్ దిగుమతుల బిల్లు భారీగా పెరిగిపోతుందని ఎస్‌బీఐ ఒక నివేదికలో తేల్చిచెప్పింది. 2026లో 9 బిలియన్ డాలర్లకు, 2027లో 12 బిలియన్ డాలర్లకు చేరుతుందని వెల్లడించింది. చమురు కోసం పూర్తిగా అరబ్ దేశాలపైనే ఆధారపడితే విపరీతంగా ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. అంతిమంగా ఆ భారం మోయాల్సింది ప్రజలేనన్న సంగతి తెలిసిందే.

1.7 శాతం నుంచి 35.1 శాతానికి..

భారత్ 2022 నుంచి రష్యా నుంచి ముడిచమురును చౌక ధరకే కొంటోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. రష్యా చమురు ధరపై పరిమితిని నిర్దేశించాయి. దాంతో రష్యా తన చమురును ఇండియాకు విక్రయిస్తోంది. దీనివల్ల ఇండియాకు ఎనలేని మేలు



జరుగుతోంది. చమురు బిల్లుల భారం చాలావరకు తగ్గిపోయింది. మన దేశానికి చమురు ఎగుమతి చేస్తున్న దేశాల్లో తొలి స్థానం రష్యాదే. 2020లో ఇండియా చమురు అవసరాల్లో రష్యా వాటా కేవలం 1.7 శాతం ఉండేది. ప్రస్తుతం అది ఏకంగా 35.1 శాతానికి చేరడం గమనార్హం. 2025లో 245 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురు దిగుమతి చేసుకోగా, ఇందులో రష్యా వాటా 88 మిలియన్ మెట్రిక్ టన్నులు.

ధరలు 10 శాతం పెరిగే అవకాశం

అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా ఆయిల్‌ను ఇండియాతోపాటు ఇతర దేశాలు కొనడం ఆపేస్తే ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు పెరిగే ప్రమాదం ఉంది. ఎందుకంటే ప్రపంచమంతటా ఉపయోగిస్తున్న ఆయిల్‌లో 10 శాతం రష్యా నుంచే వస్తోంది. ఈ ఆయిల్ సరఫరాను హఠాత్తుగా నిలిపివేస్తే.. కొరత వల్ల చమురుకు డిమాండ్ పెరిగి ధరలు కనీసం 10 శాతం పెరుగుతాయి. ఇండియాతోపాటు అన్ని దేశాలపైనా భారం పడుతుంది. ఇండియాకు ఉన్న సానుకూలత ఏమిటంటే.. రష్యా నుంచే కాకుండా మరో 40 దేశాల నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తోంది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. రష్యా నుంచి సరఫరా ఆగిపోయినా ఇప్పటికిప్పుడు ఇబ్బంది ఉండకపోవచ్చు. ధరల భారం మాత్రం తప్పదు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పుతిన్‌కు ప్రధాని మోదీ ఫోన్

- రష్యా అధ్యక్షుడితో సమగ్ర చర్చ జరిగిందన్న మోదీ
- ద్వైపాక్షిక ఎజెండా ప్రగతిని సమీక్షించిన ఇరువురు నేతలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధినేత పుతిన్‌తో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. రష్యాతో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి తాము కట్టుబడి ఉన్నట్లు పుతిన్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. తన మిత్రుడు పుతిన్‌తో చక్కటి, సమగ్రమైన సంభాషణ జరిగిందన్నారు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు ప్రతీకారంగా ఇండియా ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో పుతిన్‌తో మోదీ చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పుతిన్‌తో మాటామంతీ అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ ఏడాది జరిగే 23వ ఇండియా–రష్యా వార్షిక సదస్సులో పుతిన్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. ఉక్రెయిన్ విషయంలో తాజా పరిణామాలను తనతో పంచుకున్నందుకు పుతిన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారని చెప్పారు. భారత్–రష్యా ద్వైపాక్షిక ఎజెండా ప్రగతిని సమీక్షించామని వెల్లడించారు. ఉక్రెయిన్–రష్యా ఘర్షణ విషయంలో ఇండియా వైఖరి స్థిరంగా ఉన్నట్లు పుతిన్‌కు మోదీ తెలియజేశారని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. శాంతి చర్చలు ప్రారంభించాలని, ఘర్షణకు సాధ్యమైనంత ముగింపు పలకాలని ఉక్రెయిన్, రష్యాలను ఇండియా కోరుతున్న సంగతి తెలిసిందే. భారత భద్రతా సలహాదారు గురువారం రష్యాలో పర్యటించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఏడాది భారత్‌లో పర్యటించబోతున్నారని ఆయన నిర్ధారించారు.

ప్రధాని మోదీని స్వాగతించిన చైనా

బీజింగ్: ప్రధాని మోదీ త్వరలో చైనాలో పర్యటించబోతున్నారు. ఈ నెల 31న, వచ్చే నెల 1న చైనాలో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఎస్సీఓ సదస్సుకు నరేంద్ర మోదీని స్వాగతిస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ సదస్సు భాగస్వామ్యపక్షాలకు స్నేహపూర్వక, ఫలవంతమైన ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీఓ సభ్యదేశాలతోపాటు మొత్తం 20 దేశాల అధినేతలు సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు.

పుతిన్‌తో జిన్‌పింగ్ చర్చలు

బీజింగ్: చైనా అధినేత షీ జిన్‌పింగ్ శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో ప్రస్తుత పరిస్థితిని జిన్‌పింగ్‌కు పుతిన్ తెలియజేశారు. అలాగే రష్యా–అమెరికా మధ్య ఇటీవల జరుగుతున్న సంప్రదింపుల సారాంశాన్ని వివరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పుతిన్ త్వరలో భేటీ కాబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన చైనా అధ్యక్షుడితో మాట్లాడడం విశేషం. ఉక్రెయిన్‌పై యుద్ధం ఆపాలని రష్యాపై ట్రంప్ ఒత్తిడి పెంచుతున్నారు. ఇదిలా ఉండగా, పుతిన్, జిన్‌పింగ్‌ల మధ్య వ్యక్తిగతంగా స్నేహ సంబంధాలున్నాయి. 2013 నుంచి వారి బంధం కొనసాగుతోంది. అమెరికాతోపాటు యూరప్ దేశాల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ వ్యతిరేకంగా వారిద్దరూ చేతులు కలిపారు. త్వరలో చైనాలో జరిగే ఎస్సీఓ సదస్సుకు పుతిన్ హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

టారిఫ్‌ల వ్యవహారం తేలేదాకా.. భారత్‌తో వాణిజ్య చర్చల ప్రశ్నే లేదు: ట్రంప్

వాషింగ్టన్: టారిఫ్‌ల వ్యవహారం తేలేదాకా, భారత్‌తో వాణిజ్య చర్చలు జరిపే ప్రసక్తే లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. భారత్ వస్తువులపై టారిఫ్‌లను 50 శాతానికి పెంచిన నేపథ్యంలో వాణిజ్య చర్చలను ముమ్మరం చేస్తారా అన్న ప్రశ్నకు ట్రంప్..భారత్‌తో ముందు టారిఫ్‌ల వ్యవహారం కొలిక్కిరావాలని, అప్పటి వరకు వాణిజ్య చర్చలు జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. ట్రంప్ రెండో విడత పెంచిన 25 శాతం టారిఫ్‌లు 21 రోజుల తర్వాత ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ పరిణామంపై ప్రముఖ భారతీయ అమెరికన్ అటార్నీ రవి బాత్రా స్పందించారు. ట్రంప్ కోరిన విధంగా ఉక్రెయిన్‌తో రష్యా కాల్పుల విరమణకు రాకపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. భారత్‌ను బాధపెడితే రష్యాను బాధపెట్టినట్లే. అదే సమయంలో అది మమ్మల్నీ మరింతగా బాధపెడుతుంది'అని ఆయన వ్యాఖ్యానించారు.

బదులివ్వకుండా బెదిరింపులా?

- పార్లమెంట్‌లో ప్రమాణం చేశా.. మళ్లీ చేయాలా?
- ఎలక్ట్రానిక్ ఓటర్ డేటా అందజేస్తే.. ప్రధాని పదవిని మోదీ చోరీ చేశారని నిరూపిస్తాం
- రాజ్యాంగంపై దాడి చేస్తే.. మేము మీపై దాడి చేస్తాం
- ఈసీ అధికారులకు రాహుల్ హెచ్చరిక
- బెంగళూరులో 'ఓటు అధికార్ ర్యాలీ'



ర్యాలీ వేదికపై సుర్జేవాలా, రాహుల్, ఖర్గే, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్

బెంగళూరు: దేశంలో ముమ్మాటికీ ఓట్ల చౌర్యం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలపై తాను గణాంకాలు విడుదల చేసిన తర్వాత ప్రజలు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. దాంతో దిక్కుతోచని ఎన్నికల సంఘం సంబంధిత వెబ్‌సైట్‌ను మూసివేసిందని అన్నారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్, బిహార్‌లో ఈసీ వెబ్‌సైట్లు మూతపడ్డాయని తెలిపారు. ఎన్నికల బాగోతాలపై ప్రజలంతా నిలదీయడం ప్రారంభిస్తే మొత్తం వ్యవస్థ కుప్పకూలిపోతుందని ఈసీకి బాగా తెలుసని వ్యాఖ్యానించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓటు అధికార్ ర్యాలీ'లో రాహుల్ గాంధీ రాజ్యాంగం కాపీని చేతబూని ప్రసంగించారు. తాను చేసిన ఆరోపణలు నిజమని అంగీకరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని, ప్రమాణం చేయాలని ఎన్నికల సంఘం డిమాండ్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్‌లో భారత రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేశానని వ్యాఖ్యానించారు. మళ్లీ ఈసీ ఎదుట ప్రమాణం చేయాలా? అని మండిపడ్డారు. ఎన్నికల సంఘానికి రాహుల్ ఐదు ప్రశ్నలు సంధించారు. తనను బెదిరించడం పక్కన పెట్టి, వాటికి సమాధానం చెప్పాలని అన్నారు. రాహుల్ గాంధీ ఇంకా ఏం మాట్లాడారంటే...

కొత్త ఓట్లన్నీ బీజేపీకే...

''మోదీ గత లోక్‌సభ ఎన్నికల్లో 25 స్థానాల్లో రిగ్గింగ్ చేసి మళ్లీ ప్రధాని అయ్యారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటర్ డేటా మాకు అందజేస్తే.. ప్రధానమంత్రి పదవిని మోదీ చోరీ చేశారని నిరూపిస్తాం. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మా కూటమి మెజార్టీ సీట్లు గెల్చుకుంది. కేవలం నాలుగు నెలల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నెగ్గింది. ఇది చాలా ఆశ్చర్యం కలిగించింది. ఎందుకలా జరిగిందో ఆరా తీస్తే కోటి మంది కొత్త ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసినట్లు తేలింది. 4 నెలల్లోనే కోటి మంది ఎలా ఓటర్లయ్యారు? ఆ కొత్త ఓట్లన్నీ బీజేపీకే పడ్డాయి. భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు నమోదైన చోట బీజేపీ గెలుస్తోంది. దీని వెనుక మతలబు ఏమిటి?

రాజ్యాంగంపై మోదీ దాడి

కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 16 సీట్లు వస్తాయని అంచనా వేశాం. సర్వేలు కూడా ఇదే విషయం చెప్పాయి. కానీ, 9 సీట్లే వచ్చాయి. అక్కడ ఏదో మాయ జరిగినట్లు తేలిపోయింది. ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీ ఇవ్వాలని కోరితే ఎన్నికల సంఘం ఇవ్వలేదు. వీడియో రికార్డింగ్‌లు ఇవ్వాలని అడిగితే తిరస్కరించారు. తర్వాత చట్టాన్ని మార్చేశారు. ఎన్నికలు పూర్తయ్యాక 45 రోజుల్లో వీడియో ఆధారాలను తొలగిస్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పూర్తి డేటా ఇవ్వాలి. లేనిపక్షంలో మహాదేవపుర స్థానంలో నిర్వహించినట్లుగానే ఇతర నియోజకవర్గాల్లో ప్రత్యేక పరిశోధన చేస్తాం.

ఈసీకి రాహుల్ 5 ప్రశ్నలు

1. ఓటర్ల జాబితాలను డిజిటల్ మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లో ప్రజలకు ఎన్నికల సంఘం ఎందుకు ఇవ్వడం లేదు?
2. ఎన్నికలకు సంబంధించిన వీడియో ఆధారాలను ఎందుకు ధ్వంసం చేశారు?
3. ఓటర్ల జాబితాల్లో గోల్‌మాల్ ఎందుకు జరిగింది?
4. మేము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్ప కుండా ఈసీ మమ్మల్ని ఎందుకు బెదిరిస్తోంది?
5. ఎన్నికల సంఘం అధికార బీజేపీకి ఏజెంట్‌గా ఎందుకు పనిచేస్తోంది?

ఎప్పటికైనా చర్యలు తథ్యం

ఎన్నికల సంఘం అధికారులు ఇప్పటికైనా నిజాలు అంగీకరించాలి. అసలేం జరిగిందో చెప్పాలి. వాస్తవాలకు ముసుగేయాలనుకోవడం సరైంది కాదు. ఏదో ఒకరోజు మీరు మమ్మల్ని(ప్రతిపక్షం) ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎన్నికల కమిషనర్ సహా ప్రతి అధికారీ ఈ విషయం గుర్తించుకోవాలి. రాజ్యాంగంపై దాడి చేసి తప్పించుకుంటామంటే కుదరదు. మీపై చర్యలు తీసుకోవడానికి సమయం పట్టొచ్చు. కానీ, ఎప్పటికైనా చర్యలు మాత్రం తథ్యం. అక్రమార్కులు ఒకరి తర్వాత ఒకరు దొరికిపోవడం ఖాయం. నేను చెప్పేది రాసి పెట్టుకోండి. రాజ్యాంగంపై దాడికి దిగితే మేము మీపై దాడి చేస్తాం'' అని రాహుల్ ధ్వజమెత్తారు.

'పీఎం–ఉజ్వల'కు రూ.12వేల కోట్లు

- గ్యాస్ సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ కొనసాగింపు
- సుమారు 10.33 కోట్ల గృహ వినియోగదారులకు లబ్ధి
- ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు రూ.30 వేల కోట్ల సాయం
- ప్రధాని మోదీ సారథ్యంలో కేబినెట్ కీలక నిర్ణయాలు

సాక్షి, న్యూఢిల్లీ: రక్షాబంధన్ వేడుకల వేళ దేశ మహిళలకు కేంద్రం శుభవార్త తెలిపింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల మహిళలకు చేయూత నిచ్చే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకానికి 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.12,060 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ఉజ్వల యోజన లబ్ధిదారులుగా ఉన్న 10.33 కోట్ల గృహ వినియోగదారులకు మేలు చేకూర్చనుంది. ఉజ్వల లబ్ధిదారులకు ఏటా 9 రీఫిల్‌ల వరకు 14.2 కిలోల సిలిండర్‌కు రూ.300 వరకు రాయితీ ఇస్తుంది. ఉజ్వల వినియోగదారుల సగటు తలసరి వినియోగం 2019–20లో కేవలం 3 రీఫిల్స్, 2022–23లో 3.68 రీఫిల్స్‌గా ఉండగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి 4.47కి చేరింది. 2016లో ప్రారంభమైన ఈ పథకం కింద 2024–25 వరకు రూ.52 వేల కోట్లను ఖర్చు చేసినట్లు కేంద్ర కేబినెట్ భేటీ అనంతరం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగిందన్నారు. ఎల్పీజీ ధరల స్థిరీకరణకుగాను చమురు మార్కెటింగ్ కంపెనీలకు రూ.30వేల కోట్ల ప్రధాన సబ్సిడీ ప్యాకేజీని కూడా మంత్రివర్గం ఆమోదించిందని ఆయన వివరించారు. అంతర్జాతీయంగా అధిక ధరల కారణంగా దేశీయ ఎల్పీజీ అమ్మకాలపై చమురు మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొంటున్న నష్టాలను పూడ్చేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు. మన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం వరకు దిగుమతులే తీరుస్తున్నాయన్నారు. దీంతోపాటు, 175 ఇంజనీరింగ్ సంస్థలు, 100 పాలిటెక్నిక్‌లతో కూడిన 275 సాంకేతిక సంస్థల్లో 'మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్'(ఎంఈఆర్ఐటీఈ) పథకాన్ని అమలు చేసే ప్రతిపాదనపై సైతం కేబినెట్ ఆమోదముద్ర వేసింది. జాతీయ విద్యా విధానం–2020కి అనుగుణంగా సాంకేతిక విద్యలో నాణ్యత, సమానత్వం, పాలనను మెరుగుపరచడమే ఈ పథకం లక్ష్యం. 2025–26 నుంచి 2029–30 వరకు మొత్తం రూ.4,200 కోట్లను ఈ పథకం కింద ఖర్చు చేయనుండగా, ఇందులో ప్రపంచ బ్యాంకు రుణం రూ.2100 కోట్లని కేంద్ర మంత్రి తెలిపారు. వీటితో పాటే అస్సాం, త్రిపురల్లో అమల్లో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీల పథకం (ఎస్‌డీపీ) కింద రూ.4,250 కోట్లు వ్యయం చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వైష్ణవ్ వివరించారు.వీటితోపాటు కేంద్ర కేబినెట్ తమిళనాడులోని మరక్కణమ్‌– పుదుచ్చేరిని కలిపే నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణానికి రూ.2,157 కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.



అశ్వినీ వైష్ణవ్

ఉత్తరకాశీలో 650 మందిని కాపాడాం



ధరాలి గ్రామం: జల విలాయానికి ముందు– తర్వాత
- ఇస్రో విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలివి

సీఎం పుష్కర్ సింగ్ ధామి వెల్లడి

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో కుండపోత వానలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో గల్లంతైన వారి కోసం స్నైఫర్ శునకాలు, డ్రోన్లతో సహాయక బృందాల ముమ్మర గాలింపు శుక్రవారం నాలుగో రోజూ కొనసాగింది. ఈ ప్రకృతి విలయానికి ధరాలీ గ్రామం సగానికి సగం సమాధి కావడం తెల్సిందే. ఈ గ్రామంలోని పలు చోట్ల 50 నుంచి 60 అడుగుల మేర బురద, రాళ్లు పేరుకుపోయాయి. ఇప్పటి వరకు వేర్వేరు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 650 మందిని సహాయక బృందాలు కాపాడాయని సీఎం ధామి శుక్రవారం తెలిపారు. దెబ్బతిన్న సమాచార సంబంధాలను చాలా వరకు పునరుద్ధరించారన్నారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ మెరుగైందన్నారు.

ఇక నుంచి రాష్ట్ర విద్యా విధానం

ఎన్ఈపీకి వ్యతిరేకంగా తీసుకొచ్చిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నై: జాతీయ విద్యా విధానా(ఎన్ఈపీ)నికి ప్రత్యామ్నాయంగా తమిళనాడు రాష్ట్ర విద్యా విధానా(ఎస్ఈపీ)న్ని తీసుకొచ్చింది. దీనిని సీఎం స్టాలిన్ శుక్రవారం ఆవిష్కరించారు. కొత్తూరుపురంలోని అన్నా సెంటెనరీ లైబ్రరీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం ఆది నుంచి వ్యతిరేకిస్తోంది. అందుకు గాను కేంద్రం సమగ్ర శిక్ష నిధులను రాష్ట్రానికి నిలిపేసింది. అయినా.. రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ఈ ఉద్రిక్తతల సమయంలోనే రాష్ట్ర విద్యా విధానాన్ని విడుదల చేసింది. కొత్త విధానాన్ని రూపొందించడానికి 2022లో రిటైర్డ్ జస్టిస్ మురుగేశన్ నేతృత్వంలో 14 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ గతేడాది జూలైలో సీఎం స్టాలిన్‌కు తన సిఫార్సులను సమర్పించింది. వాటిని ప్రభుత్వం శుక్రవారం ఆవిష్కరించింది. ఎస్ఈపీ ప్రకారం.. ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు బదులుగా 11, 12వ తరగతుల్లోని ఏకీకృత మార్కుల ఆధారంగా డిగ్రీ ఆర్ట్స్, సైన్స్ కోర్సుల ప్రవేశం కల్పిస్తారు. 3,5, 8 తరగతుల్లో పబ్లిక్ పరీక్షల విధానాన్ని కూడా ఎస్ఈపీ వ్యతిరేకించింది. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని, దీనివల్ల డ్రాపౌట్లు పెరుగుతాయని, విద్యను వ్యాపారీకరించడమేనని తెలిపింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలకు గణనీయమైన పెట్టుబడులతో పాటు.. కృత్రిమ మేధ, ఆంగ్ల భాషలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహాన్ని అందించాలని కమిటీ ప్రతిపాదించింది. అంతేకాదు.. విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి తిరిగి తీసుకు రావాలని కమిటీ సిఫార్సు చేసింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, రాష్ట్ర బోర్డుతో సహా అన్ని బోర్డుల్లో విద్యార్థులు తమిళం చదువుతారని విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని తెలంగాణ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్‌నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ విమర్శించారు. ఇది రాష్ట్ర అహంకార విధానంగా అభివర్ణించారు.

అమెరికాతో రక్షణ ఒప్పందాలు యథాతథం

న్యూఢిల్లీ: భారత్ వస్తువులపై టారిఫ్‌లను 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన వేళ రక్షణ ఒప్పందాలను నిలిపి వేసినట్లు వస్తున్న వార్తలను కేంద్రం కొట్టివేసింది. రక్షణ ఒప్పందాలను రద్దు చేసుకునే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. రక్షణ సామాగ్రి కొనుగోలు ఒప్పందాలు యథాతథంగా అమలవుతాయని పేర్కొంది. అమెరికా నుంచి అందాల్సినవి ఒప్పందం ప్రకారం అందుతూనే ఉంటాయని, తదుపరి ఆర్డర్లపై చర్చలు కూడా కొనసాగుతాయని వివరించింది. అమెరికా నుంచి రక్షణ కొనుగోళ్లను భారత ప్రభుత్వం ఆపేసిందంటూ వస్తున్న వార్తలు అసత్యాలు, అభూత కల్పనలు అని రక్షణ శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. టారిఫ్‌ల పెంపు నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అమెరికా వెళ్లి, కొత్తగా ఒప్పందాలు కుదుర్చుకుంటారంటూ వస్తున్న వార్తలను కూడా ఆయన తోసిపుచ్చారు. అయితే, ఆ పర్యటనను ప్రభుత్వం రద్దు చేసిందని విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. టారిఫ్‌ల పెంపు వేళ..రెండు వ్యూహాత్మక భాగస్వామ్య దేశాల మధ్య విశ్వాసం సడలిన మాట వాస్తవమేనని, అయితే దీని ప్రభావం రక్షణ సంబంధాలపై ప్రత్యక్షంగా పడబోదని ఐజీ డ్రోన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రిటైర్డ్ మేజర్ జనరల్ పథి విశ్లేషించారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య 20 వరకు రక్షణ ఒప్పందాలున్నాయన్నారు. అమెరికాకు చెందిన అపాచీ, చినూక్, పీ–81 విమానాలు, ఎంక్యూ–9 డ్రోన్లను భారత్ ఎక్కువగా కొనుగోలు చేస్తోందని, వీటిపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం పడదని ఆయన పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో మిన్నంటిన నిరసనలు

- ఎస్ఐఆర్‌తోపాటు ఓట్ల చౌర్యంపై చర్చించాలని విపక్షాల పట్టు
- ఆందోళనలు, నినాదాలతో హోరెత్తిన లోక్‌సభ, రాజ్యసభ
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా
- లోక్‌సభలో 'ఇన్‌కం ట్యాక్స్ బిల్లు–2025' ఉపసంహరణ

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో విపక్షాల ఆందోళనలు, నిరసనలు, నినాదాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. శుక్రవారం సైతం పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై ప్రభుత్వం వెంటనే చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో నిరసన వ్యక్తంచేశాయి. దాంతో లోక్‌సభ, రాజ్యసభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వెంటనే జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మృతిపట్ల స్పీకర్ ఓంబిర్లా నివాళులర్పించారు. క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం గురించి ప్రస్తావించారు. అనంతరం ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. వెల్‌లోకి దూసుకొచ్చారు. ఎస్ఐఆర్‌పై చర్చించాలని తేల్చిచెప్పారు. ఈ సమయంలో స్పీకర్ కొంతసేపు ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. విపక్షాల రగడ ఆగకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత విపక్షాల నినాదాలు ఆగలేదు. విపక్షాల ఆందోళన ఆగకపోవడంతో చేసేది లేక సభాపతి లోక్‌సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత మరోవైపు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 'ఇన్‌కం ట్యాక్స్ బిల్లు–2025'ను ఉపసంహరించుకున్నారు. నూతన బిల్లును ఈ నెల 11 లోక్‌సభలో ప్రవేశపెట్ట బోతున్నారు. ఎస్ఐఆర్‌పై సభలో నినాదాలు మిన్నంటడంతో స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు.

ఓట్లు చోరీ చేసింది కాంగ్రెస్ నేతలే: రవనీత్ సింగ్ బిట్టూ

బిహార్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్‌తోపాటు గత లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన ఓట్ల చౌర్యంపై చర్చించాలని రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. సభా కార్యకలాపాలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. చర్చ కోసం రూల్ 267 కింద విపక్షాలు ఇచ్చిన 20 నోటీసులను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. దాంతో విపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. నినాదాలతో హోరెత్తించారు. దాంతో సభ మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా పడింది. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితి యథాతథంగా కొనసాగింది. ప్రశ్నోత్తరాలకు సహకరించాలని సభాపతి స్థానంలో ఉన్న ఘనశ్యామ్ తివారీ విజ్ఞప్తి చేయగా, విపక్షాలు పట్టించుకోలేదు. కర్ణాటకలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై చర్చించాలని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ డిమాండ్‌చేశారు. ఓట్ల దొంగతనానికి పాల్పడింది కాంగ్రెస్ నేతలేనని కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ మండిపడ్డారు. దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఆయనపై విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపు తప్పేలా ఉండడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ఘనశ్యామ్ తివారీ ప్రకటించారు.



లోక్‌సభలో విపక్షాల నిరసన

సాక్షిప్లస్ జాతీయం పేజీలో..

గాజాపై పూర్తి నియంత్రణ

నెతన్యాహూ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదం

'మదురో అరెస్టు' బహుమతి రెట్టింపు

సాక్షి
హైదరాబాద్
శనివారం । 9 । ఆగస్టు । 2025

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి జల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ఆధ్యాత్మిక ఒరవడి!

శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. చార్మినార్ పరిసరాల్లో భారీ సంఖ్యలో క్యూ కట్టారు. అమ్మవారికి పలువురు అధికార, అనధికార ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. - చార్మినార్





ఆడపడచుల సందడి!

తరిగిపోని అనురాగం అన్నగా.. చెరిగిపోని మమకారం చెల్లిగా.. అక్కా తమ్ముళ్ల మమతల పాలవెల్లిగా.. రక్షా బంధన్ ప్రతీక. రాఖీ పౌర్ణమి సందర్భంగా అంతటా సందడి వాతావరణం నెలకొంది. మార్కెట్‌లో రాఖీల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మహిళలు పుట్టింటికి సంబరంగా బయలుదేరారు. సోదరులకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకోనున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

న్యూస్‌రీల్

కంట్రోల్ రూమ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్



లక్డీకాపూల్ : జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాల నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై శుక్రవారం ఆయన ఓఎస్‌డీ అనురాధను ఆరా తీశారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రియల్‌- టైమ్ మానిటరింగ్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఒక్కరోజే 5.36 లక్షల మంది

- గురువారం మెట్రో రైళ్లలో వెళ్లిన ప్రయాణికులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ మెట్రో కారిడార్‌లలో గురువారం రికార్డు స్థాయిలో పయనించారు. భారీ వర్షం కారణంగా అత్యధిక మంది మెట్రో రైళ్లను ఆశ్రయించారు. దీంతో ఈ ఒక్కరోజే 5.36 లక్షల మంది ప్రయాణం చేసినట్లు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో అధికారులు తెలిపారు. గతంలో వివిధ సందర్భాల్లోనూ ప్రయాణికుల సంఖ్య 5 లక్షల మార్కును దాటింది. సాధారణంగా మెట్రో ప్రయాణికుల సంఖ్య 4.7 లక్షల నుంచి 4.9 లక్షల మధ్య నమోదవుతుంది. చాలా రోజుల తర్వాత 5.36 లక్షల మంది ప్రయాణం చేసినట్లు అధికారులు తెలిపారు. రాయదుర్గం నుంచి అమీర్‌పేట్, నాగోల్ రూట్‌లో, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ కారిడార్‌లో అత్యధిక మంది ప్రయాణం చేశారు. ప్రతి 3 నుంచి 5 నిమిషాలకు ఒకటి చొప్పున మెట్రో నడిచినప్పటికీ వేలాది మంది మెట్రో స్టేషన్‌లలోనే పడిగాపులు కాశారు. రద్దీ కారణంగా అన్ని రూట్లలో మెట్రో రైళ్లు కిక్కిరిసి నడిచాయి. గురువారం సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ మెట్రో రైళ్లలో రద్దీ నెలకొంది.

విన్యాసాలు అదుర్స్



గురునానక్ కళాశాలలో ఎన్‌ఎస్‌జీ కమాండోల ప్రత్యేక విన్యాసం

ఇబ్రహీంపట్నం: గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో దేశ రక్షణ, వాయుసేన దళాలు శుక్రవారం ప్రత్యేక విన్యాసాలు నిర్వహించాయి. హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రానికి చెందిన నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ), భారత రక్షణ వాయుసేన (ఐఏఎఫ్) సంయుక్తంగా హెలికాప్టర్ల సాయంతో 'హై–ఇంటెన్సిటీ రూఫ్ టాప్ స్లిదరింగ్' పేరిట విన్యాసాలు ప్రదర్శించాయి. ఉగ్రమూకల దాడులు, యుద్ధ పరిస్థితులు, ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటే విపత్కర, అత్యవసర సమయాల్లో కమాండోలు ప్రజలను ఎలా కాపాడతారో కళ్లకు కట్టినట్లుగా చూపించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి, ఎండీ హెచ్‌ఎస్ సైనీ, ఎన్‌ఎస్‌జీ దళాల కమాండోలు, అధికారులు పాల్గొన్నారు.

దారి తప్పిన ప్లానింగ్

ట్రాఫిక్ టెర్రర్‌తో నగరంలో నరకం

- నాలాల సమస్యకు పరిష్కారం శూన్యం
- ఇంజినీరింగ్ లోపాలే ప్రధాన కారణం
- ప్రణాళికలు లేని అధికారులు, పాలకులు
- బుట్టదాఖలైన కిర్లోస్కర్ కమిటీ నివేదిక



సాక్షి, సిటీబ్యూరో: చిన్న వర్షం కురిస్తే రోడ్లన్నీ జలమయం... ఎక్కడి వాహనాలక్కడే నిలిచిపోవాల్సిందే.. ఇక ఎక్కడైనా ప్రమాదం జరిగినా.. రోడ్డు గుంత పడినా.. వాహనం బ్రేక్‌డౌన్ అయినా గంటల తరబడి ట్రాఫిక్ జామే.. వీటన్నింటికీ ప్రధాన కారణం ఇంజినీరింగ్ లోపాలే. రహదారులు, కూడళ్లను శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్మించకపోవడం. ట్రాఫిక్ కానీ, నాలాల విషయంలో కానీ మన అధికారులు, పాలకులు ఇంజినీర్ల పాత్ర విస్మరించడంతోనే ఈ పరిస్థితులు దాపురించాయి.

నాటి నివేదికలే ఇప్పటికీ దిక్కు..

నిజానికి ట్రాఫిక్ నియంత్రణ బాధ్యత పూర్తిగా పోలీసులదే అనుకుంటే పొరపాటే. వాస్తవానికి ప్రధాన కూడళ్లలో సిగ్నళ్ల వద్ద నిలబడి ట్రాఫిక్ క్రమబద్ధంగా వెళ్లేందుకు మాత్రమే వారు దోహదపడతారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించడం వంటివి అదనంగా చేస్తారు. ట్రాఫిక్ సజావుగా, సాఫీగా సాగిపోయేందుకు రోడ్లు, కూడళ్లలోని జంక్షన్లు, ఫ్లైఓవర్లు, ప్రధాన రోడ్లను కలిపే యాక్సెస్ రోడ్లు వంటివి ప్రణాళికాబద్ధంగా రూపొందించకపోవడంతోనే నగరంలో ఈ సమస్యలంటున్నారు ట్రాఫిక్ నిపుణులు. నాలాల విషయంలో ఇంజినీరింగ్ ప్రముఖుడు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1920లో రూపొందించిన నివేదికలే ఇప్పటికీ పనికి వస్తున్నట్లే.. రోడ్ల విషయంలో అలాంటి ప్రణాళికలు లేకపోవడమే ఈ సమస్యకు మూలకారణమని స్పష్టం చేస్తున్నారు.

లోపాలతోనే వేగానికి తూట్లు...

నగరంలో వందల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వేల కిలోమీటర్ల పొడవున రోడ్లు ఉన్నాయి. విపరీతంగా విస్తరిస్తున్న ప్రధాన రోడ్లు, వాటిని కలిపే యాక్సెస్ రోడ్లు, చిన్నా చితకా రోడ్లతో పాటు చిన్నచిన్న గల్లీలనూ లెక్కేస్తే ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. వీటి నిర్మాణంలో ఎలాంటి ప్రణాళిక లేదన్నది నిపుణులు చెబుతున్న వాస్తవం. అత్యంత ప్రధానమైన రోడ్లలోనూ నానాటికీ రద్దీ పెరిగిపోతోంది. వాటికి సమాంతర రోడ్ల అభివృద్ధి అనే ఊసే లేకపోవడంతో ట్రాఫిక్ అనేక పద్మ వ్యూహంలా మారిపోతోంది. వాస్తవానికి నగరంలోని ప్రధాన ఆర్టీరియల్ రోడ్లు (ప్రధాన రహదారులు) అయిన పంజగుట్ట, అమీర్‌పేట్, బేగంపేట్, సికింద్రాబాద్, తార్నాక తదితర రోడ్లన్నీ వాహనాలు కనీసం గరిష్ఠంగా 60 కి.మీ. వేగంతో వెళ్లగలిగే సామర్థ్యం ఉన్న పెద్దరోడ్లే. కానీ కేవలం ఇంజినీరింగ్ ప్రమాణాల లోపాలతోనే ఇప్పుడీ రోడ్లన్నీ ట్రాఫిక్ వలయంలో చిక్కిపోతూ సరాసరిన గంటకు కనీసం 30 కిమీ వేగంతోనూ వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాయి.

అన్నీ ఉన్నా అధ్యయనమేది?

రోడ్ల నిర్మాణంలో సరైన ప్రణాళిక అవలంబించకపోవడంతోనే అసలు సమస్య వస్తోందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదైనా ఒక ప్రదేశంలో రోడ్డు నిర్మించాల్సి వస్తే దాని వల్ల ఎక్కువగా ఎవరి ప్రయోజనం... అంటే స్కూల్ జోనా? వాణిజ్య ప్రాంతమా? తదితర విషయాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరగాలి. దానికి తగ్గట్టు మార్పుచేర్పులతో రహదారి నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సిటీలో మాత్రం ఆర్టీరియల్ రోడ్లు, ఇన్నర్ రోడ్లు, ఇంటర్మీడియట్ రోడ్లు దేనికీ సరైన ప్రణాళిక, అధ్యయనం లేకుండానే నిర్మితమవుతాయి. అందుకే ట్రాఫిక్ అస్తవ్యస్తంగా కొనసాగుతోంది.

కిర్లోస్కర్ కమిటీ నివేదికా బుట్టదాఖలే..

నగరంలో 2000వ సంవత్సరం ఆగస్టులో కురిసిన భారీ వర్షం–వరద తీవ్రత ప్రజలతో పాటు ప్రభుత్వానికీ ముచ్చెమటలు పట్టించింది. దీంతో వరద నివారణ చర్యలు సిఫార్సు చేయడానికి 2003లో కిర్లోస్కర్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ అప్పట్లో ఉన్న ఎంసీహెచ్ పరిధిలో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలను 170 కిలోమీటర్ల మేర విస్తరణ తక్షణం చేపట్టాలని, అందుకు రూ.264 కోట్లు వ్యయం అవుతుందని తెల్పింది. 2007లో నగర శివార్లలోని పన్నెండు మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమై జీహెచ్‌ఎంసీ ఏర్పడింది. ఇలా 625 చ.కి.మీల్లో విస్తరించిన గ్రేటర్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్, సూక్ష్మస్థాయి వరదనీటి పారుదల, మేజర్, మైనర్ వరద నీటి కాలువ ఆధునీకరణ కోసం సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) బాధ్యతను ఓయంట్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. దాని ప్రాథమిక అంచనా మేరకు గ్రేటర్‌లో వరద నీటి సమస్య పరిష్కారానికి అప్పట్లోనే రూ. 6247 కోట్లు అవసరం అవుతాయని తెల్పింది. ఈ నివేదికలు ప్రాథమిక స్థాయిలోనూ అమలు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు.

ఆ 'భుజం'కు ఊతమేది?

నగరంలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా, బస్సు వంటివి బ్రేక్ డౌన్ అయినా గంటల తరబడి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవాల్సిందే. నిజానికి ప్రధాన ఆర్టీరియల్ రోడ్డు ఒక్కోటి 2.5 మీటర్ల వెడల్పుతో కనీసం నాలుగు లైన్లుగా ఉండాలి. దీనితో పాటు ఆ రోడ్డుకు సాంకేతికంగా 'షోల్డర్స్' అని పిలిచే ఖాళీ ప్రదేశం ఉండాలి. ఎందుకంటే ఆ మార్గంలో ఏదైనా వాహనం పాడయితే అది మిగతా వాహనాలకు అవాంతరం కాకుండా ఉండేందుకు దాన్ని షోల్డర్స్‌లో నిలిపివేస్తారు. కానీ మనదగ్గర ఇవి ఏ ప్రాంతంలోనూ మచ్చుకు కూడా కనిపించవు. ఫుట్‌పాత్‌లుగా పిలిచే కాలిబాటలపై ఉన్న ఆక్రమణలను తొలగించి వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలంటూ అనేకసార్లు హైకోర్టు, లోకాయుక్త వంటి వ్యవస్థలు హెచ్చరించాయి. రహదారికి పక్కన తప్పనిసరిగా కాలిబాటలు ఉండాలి. ఫలితంగా పాదచారులు వీటిని ఆశ్రయిస్తే ట్రాఫిక్ జామ్స్ తగ్గడంతో పాటు ప్రమాదాలు అదుపులోకి వస్తాయి. సిటీలో ప్రధాన రోడ్లతో పాటు యాక్సెస్ రోడ్లకూ ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణలో ఉన్నాయి. ఇలా జరగడానికి ఇంజినీరింగ్ లోపమే ప్రధాన కారణం.

వరద నీటి సమస్యకు మూసీ పునరుజ్జీవమే పరిష్కారం

భారీ వర్షాలు కురిసినా తట్టుకొనేలా వ్యవస్థల ప్రక్షాళన

- నీటి ప్రవాహానికి వీలుగా డ్రైనేజీలు, ట్రాఫిక్ చిక్కుల్లేకుండా చర్యలు
- చెరువులు, కుంటలు, నాలాలు ఎస్టీపీల ద్వారా మూసీకి అనుసంధానం
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరంలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారానే వరద నీటిని సమర్థంగా నిర్వహించవచ్చని ఆయన పేర్కొన్నారు. వర్షాలతో నగర జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే శాశ్వత ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల భవిష్యత్ అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఢిల్లీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి.. గురువారం రాత్రి హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షంతో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్‌లో మరోసారి పునరావృతం కాకుండా అనుసరించాల్సిన తక్షణ, శాశ్వత చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు.

వాతావరణ మార్పులతోనే..

నగరంలో గురువారం రాత్రి కుండపోత వర్షానికి వాతావరణ మార్పులే ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునీకరించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయపడ్డారు. భారీ వర్షాలతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థంగా అనుసరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలాంటి భారీ వర్షాన్నైనా తట్టుకొనేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వెంటనే చేపట్టాలన్నారు. నగరంలో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరీవాహక ప్రాంతంతో పాటు అన్ని ప్రాంతాలు, కాలనీలకు వరద ముప్పును నివారించవచ్చన్నారు.

మూసీలో వరద నీరు చేరేలా..

ఓఆర్‌ఆర్ లోపల ఉన్న కోర్ అర్బన్ ప్రాంతంలో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అన్ని వైపుల నుంచి వరద నీరు మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. హుస్సేన్ సాగర్, దుర్గం చెరువు, మీరాలం చెరువులతో పాటు అన్ని చెరువులు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలన్నారు. డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీ (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు) ద్వారా శుద్ధి చేసి మూసీలోకి వదలాలని చెప్పారు. నగరంలో ఎక్కడ వర్షం పడినా మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలన్నారు. ఈ ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాత నగరంలో పెడస్ట్రియల్ జోన్ ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలని సీఎం సూచించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్‌ఎండీఏ పరిధిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఇలంబర్తి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, జేఎండీ గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో అత్యవసర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఎలివేటెడ్ కారిడార్ పనులు షురూ

- పట్టాలెక్కిన సికింద్రాబాద్–డెయిరీఫామ్ ప్రాజెక్ట్
- కొనసాగుతున్న భూ సామర్థ్య పరీక్షలు



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ నుంచి డెయిరీ ఫామ్ వరకు నిర్మించనున్న 5.4 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభమయ్యాయి. పిల్లర్ల నిర్మాణానికి ప్రస్తుతం భూ సామర్థ్య పరీక్షలు చేస్తున్నారు. మరో మూడు నెలల్లో అన్ని రకాల ప్రాథమిక పనులు పూర్తి చేసుకొని పిల్లర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనేది లక్ష్యం. కారిడార్ మార్గంలో బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వద్ద సుమారు 600 మీటర్ల దూరం నిర్మించనున్న టన్నెల్‌కు ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి అనుమతి లభించింది. ప్యారడైజ్ నుంచి సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి మీదుగా డెయిరీఫామ్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ కోసం రూ.652 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. భూసేకరణ అయ్యే ఖర్చులతో కలిపి ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.1550 కోట్లు అవుతుందని అంచనా.

కంటోన్మెంట్‌లో ప్రహరీ నిర్మాణం..

సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ ఔటర్‌రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో రక్షణ శాఖకు చెందిన ప్రాంతంలో హెచ్‌ఎండీఏ ప్రహరీ నిర్మాణం చేపట్టింది. రక్షణశాఖ నుంచి దాదాపు 113.48 ఎకరాల భూమిని సేకరించిన సంగతి తెలిసిందే. భవిష్యత్తులో చేపట్టనున్న కారిడార్ పనులతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ గోడ ఒక సరిహద్దులా ఉపయోగపడనుంది. సుమారు 10 కి.మీ. వరకు ప్రహరీని నిర్మించే అవకాశం ఉంటుందని అధికారుల అంచనా. కాగా.. రెండు భారీ మంచినీటి రిజర్వాయర్లను సైతం హెచ్‌ఎండీఏ నిర్మించి ఇవ్వనుంది. పనులు వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఈ మార్గంలోనూ హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్ వద్ద 500 మీటర్ల టన్నెల్ నిర్మించనున్నారు. ఇది పూర్తిగా ఎలివేటెడ్ పద్ధతిలోనే నిర్మించనున్నప్పటికీ విమానాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సొరంగ మార్గం ఉంటుంది. దాదాపు రూ.2 వేల కోట్ల (పరిహారం చెల్లింపుతో సహా) నిర్మాణ అంచనాలతో ఈ కారిడార్‌కు హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు చేసింది. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మల్కం చెరువు మునకకు కారణమేంటి?

- గచ్చిబౌలి ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్



క్షేత్రస్థాయి పర్యటనలో రంగనాథ్, గజరావ్ భూపాల్, అవినాష్ మహంతి

సాక్షి, సిటీబ్యూరో: మల్కం చెరువు పరిసరాల్లో వరద పోటెత్తడానికి గల కారణాలను గుర్తించేందుకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. చెరువులోకి వచ్చే వరద ఎక్కువగా ఉండి, బయటకు వెళ్లే నీరు ఆ స్థాయిలో లేకపోవడంతోనే సమస్య తలెత్తిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అలుగు పారడం ద్వారా మాత్రమే నీరు బయటకు వెళ్తోందని స్లూయిజ్ గేట్లు కూడా ఏర్పాటు చేస్తే వర్షాకాలంలో ఔట్‌ఫ్లోకి ఆస్కారం ఉంటుందని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే ఈ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. చెరువు పరిసరాల్లో రహదారులే కాకుండా నివాసాలు కూడా నీట మునుగుతున్నాయని, వెంటనే ఈ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. మల్కం చెరువు చుట్టూ వరద నిలవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సూచించారు. బయోడైవర్సిటీ పార్కు పరిసరాలతో పాటు షేక్‌పేట ప్రాంతాల నుంచి కూడా భారీ వరద వచ్చి ఫ్లైఓవర్ ఆరంభంలో నిలిచిపోతోందని, ఈ వరదంతా మల్కం చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలని రంగనాథ్ సూచించారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ట్రాఫిక్ విభాగం జాయింట్ సీపీ గజరావు భూపాల్ తదితరులు హైడ్రా కమిషనర్‌తో పాటు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కాగా.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం అర్ధరాత్రి వరకు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నారు. వరద నీటి తొలగింపు పనులు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంపై దృష్టి పెట్టారు. హైడ్రాకు వచ్చిన 78 ఫిర్యాదులను పరిష్కరించారు. 41 చోట్ల పడిపోయిన చెట్లను తొలగించారు. 36 చోట్ల నిలిచిన వరద నీటిని క్లియర్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఎస్బీఐ ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్ గ్రీన్ వ్యాలీ సమీపంలో వరదలో చిక్కుకున్న మహిళను హైడ్రా బృందాలు రక్షించాయి.

కరడుగట్టిన దొంగ అరెస్టు



దొంగ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న కరుడు గట్టిన దొంగను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 15 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపి రవికిరణ్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి,డిఐ రవికుమార్‌లు వివరాలు వెల్లడించారు. ఏపీకి చెందిన కనపర్తి శివ (41) కేపీహెచ్‌బీ కాలనీ తొమ్మిదో ఫేజ్‌లో నివాసం ఉంటూ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్నాడు. అనుమానస్పద స్థితిలో సంచరిస్తున్న శివను కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించడంతో మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు తెలిపాడు.

‘సృష్టి’కి అప్పట్లో అలా సాగింది!

- 2020లోనే కొన్ని అక్రమాలు చేసిన డాక్టర్ నమ్రత
- ఐవీఎఫ్ విధానం పేరుతో అనేకమందికి మోసాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కొందరు బాధితులు
- ‘మేనేజ్‌మెంట్’తో తప్పించుకున్న నమ్రత గ్యాంగ్



సాక్షి, సిటీబ్యూరో: సరోగసి పేరుతో శిశువుల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత గతంలో వ్యవస్థల్ని మేనేజ్ చేసిందా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2020లో విశాఖపట్నంలో ఈమెపై క్రిమినల్ కేసులు నమోదైన తర్వాత హైదరాబాద్‌లోనూ కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. వీటి విషయంలో ఆమె అప్పట్లో పోలీసులను మేనేజ్ చేయడంతో బయటపడ్డారని తెలుస్తోంది. ఆపై కరోన విజృంభణ, లాక్‌డౌన్ తదనంతర పరిణామాలతో మరికొందరు బాధితులు వెనక్కు తగ్గారు. ఇవన్నీ కలిసి రావడంతోనే నమ్రత యథేచ్ఛగా తన దందా కొనసాగించగలిగారని సమాచారం. సృష్టి సెంటర్‌కు అనుకూలంగా 2019, 2020ల్లో ఇంటర్‌నెట్‌లో జరిగిన ప్రచారం అనేక మంది దృష్టికి ఆకర్షించింది. దీంతో వివాహమై కొన్నేళ్లు అయినా సంతాన లేమితో బాధపడుతున్న భార్య భర్తలు సికింద్రాబాద్‌లోని ఈ సెంటర్‌ను సంప్రదించారు. వీరికి పరీక్షలు చేసే నమ్రత వారిలో ఉన్న లోపాలను గుర్తించేది. ఆ విషయాలను మాత్రం వారికి చెప్పకుండా దాచి పెట్టేది. ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో సంతానం కలిగే అవకాశం ఉందంటూ చెప్పి భారీ మొత్తం వసూలు చేసేది. ఐవీఎఫ్ విధానంలో భార్య నుంచి అండం, భర్త నుంచి వీర్యం తీసుకుని ల్యాబ్‌లో పిండాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఆ పిండాన్ని తిరిగి భార్య గర్భంలో ఉంచి సంతానం కలిగేలా చేయడం ఈ విధానం ముఖ్య ఉద్దేశం. అయితే దీనికి విరుద్ధంగా వ్యవహరించిన నమ్రత వేరే వారికి చెందిన అండం, వీర్యాలను సేకరించి (ఏది అవసరమైతే అది) పిండాన్ని అభివృద్ధి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఈ విషయం గుర్తించిన ఒకరిద్దరు బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వీటిని స్వీకరించే సమయంలో అధికారులు సైతం బాధితుల తరఫునే నిలిచేవారు. ప్రాథమిక విచారణ పేరు నమ్రత లేదా ఆమె తరఫు వారిని పోలీసుస్టేషన్‌కు పిలిచే వారు. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకునే నమ్రత ఆయా అధికారులను మేనేజ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే మరోసారి ఠాణాకు వచ్చే బాధితులతో ఆయా అధికారుల ప్రవర్తన పూర్తిగా మారిపోయేది. తాజాగా నమ్రతపై వరుస కేసులు నమోదు అవుతుండటంతో అప్రమత్తమైన అధికారులు గతాన్ని అధ్యయనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇలాంటి కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. డాక్టర్ నమ్రత నెట్‌వర్క్‌లో ఆమెతో కలిసి విద్యనభ్యసించిన వైద్యులు కూడా ఉండి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తూ వివరాలు ఆరా తీస్తున్నారు. గాంధీ ఆస్పత్రి వైద్యుడు సదానందం మాదిరిగానే వైజాగ్‌కు చెందిన ప్రభుత్వ వైద్యులు నమ్రతకు సహకరించారని తెలుస్తోంది. నమ్రతపై నమోదైన కేసుల్లో గోపాలపురం పోలీసులు ఇప్పటి వరకు 25 మంది నిందితులను అరెస్టు చేశారు. దర్యాప్తుల్లో వెలుగులోకి వస్తున్న వివరాల ఆధారంగా మరికొందరు వైద్యులు, టెక్నీషియన్లు, సహాయకులతో పాటు ఏజెంట్లు, శిశువుల్ని విక్రయించిన, ఖరీదు చేసిన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లోనేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాసాబ్ ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌ఏయు కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. ‘సాక్షి’ ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బంజారాహిల్స్: విధులకు వెళ్తున్న ఓ యువకుడిని బస్సు రూపంలో మృత్యువు కాటేసింది. శుక్రవారం ఉదయం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ ఎంఎంపహాడ్ సులేమాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఆదిల్ (31) బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లో కార్ డేకార్ షోరూంలో డెకార్ వర్క్ చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1లోని విరించి హాస్పటల్ వైపు నుంచి బైక్‌పై వెళ్తుండగా కేర్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న బస్టాప్ వద్ద బ్యాలెన్స్ తప్పి కిందపడిపోయాడు. అదే సమయంలో బస్టాపులో ఆగి ఉన్న మెహిదీపట్నం డిపో బస్సు (టీజీ 09జెడ్ 0504) అప్పుడే కదిలింది. అప్పటికే కిందపడ్డ ఆదిల్ మెడపై నుంచి బస్సు ముందు చక్రాలు వెళ్లడంతో ఆదిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ కూడా ముందు చక్రాల కింద నలిగిపోయింది. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న మరో యువతికి కూడా గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ ముందు చూసుకోకుండా స్టార్ట్ చేయడం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకుని ఆదిల్ మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యాపారి ఆత్మహత్య


బ్రహ్మయ్య మృతదేహం

సికింద్రాబాద్: వృత్తిలో నష్టాలు రావడంతో ఓ వ్యాపారి సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ కే.పండరి తెలిపిన మేరకు.. వనస్థలిపురానికి చెందిన బ్రహ్మయ్య (69) వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుపాలయ్యాడు. అప్పుల భారం ఎక్కువ కావడంతో గురువారం రాత్రి మల్కాజిగిరి రైల్వేస్టేషన్ బ్యారక్ వద్దకు చేరుకొని సిద్దిపేట నుంచి నగరానికి వస్తున్న డెమో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

10న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. జై గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సర్వాయి పాపన్న 375వ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆయన రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ..సర్వాయ్ పాపన్న బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షులు పట్టికోట రామారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీ అడ్మిషన్లకు చివరి తేదీ ఆగస్టు 13

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025–26 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, డిప్లొమా కోర్సుల అడ్మిషన్లకు చివరి తేదీ ఆగస్టు 13 అని ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్మీడియెట్, రెండు సంవత్సరాల ఐటీఐ, ఓపెన్ ఇంటర్, 10 ప్లస్ 2 కోర్సు చదివిన వారు, పాలిటెక్నిక్ కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు అడిమషన్ తీసుకోవచ్చన్నారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఎంచుకున్న స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు 040–23680333/555 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

గంజాయి స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ధూల్‌పేట్‌లో నిర్వహించిన దాడుల్లో 1.9 కిలోల గంజాయి, రూ.1.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో నలుగురిపైన కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. కార్వాన్ నుంచి రహీమ్‌పురా వరకు నిర్వహించిన తనిఖీల్లో ధన్‌రాజ్‌సింగ్ అలియాస్ ధన్‌రాజ్ అనే వ్యక్తి గంజాయి అమ్మకాలు సాగిస్తుండగా పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుంచి గంజాయిని, నగదును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. గంజాయి అమ్మకాలతో సంబంధం ఉన్న బస్సీ కావల్ సింగ్, కొమల్, ఉత్తరేష్ అలపతి అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌టీఎఫ్ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

‘ప్రైడ్ ఆఫ్ తెలంగాణ’ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలోని వివిధ రంగాల్లో విశేషంగా రాణించినవారినుంచి రౌండ్ టేబుల్ ఇండియా అందించే ‘ప్రైడ్ ఆఫ్ తెలంగాణ’ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ అభివృద్ధికి గణనీయంగా దోహదపడిన వ్యక్తులు, సంస్థలను గౌరవిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కళలు, సంస్కృతి, ఎన్జీఓ, మహిళలు, పిల్లలు, వినోదం, విద్య, స్టార్టప్, హెల్త్‌కేర్, బేవరేజెస్, రిటైల్, మౌలిక వసతులు, క్రీడలు వంటి రంగాల్లో రాణించిన వారికి ఈ అవార్డులను అందిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఆయా రంగాల వారు ఆగస్టు 9 నుంచి 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు www.prideoftelangana.com వెబ్‌సైట్ ను సందర్శించాలన్నారు.

నిమ్స్‌లో సుందరీకరణ పనులు ప్రారంభం


హెచ్ఎండీఏ అధికారులతో నిమ్స్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్

లక్డీకాపూల్: నిమ్స్ సుందరీకరణ పనులను శుక్రవారం నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప భూమి పూజ చేశారు. ఈ పనులకు హెచ్ఎండీఏ రూ. 4 కోట్లు కేటాయించింది. రోగులకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించడమే లక్ష్యంగా ఆస్పత్రి ప్రాంగణాన్ని ఆహ్లాదకమైన వాతావరణంతో రూపుదిద్దనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దోనెపూడి చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్, నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లక్ష్మీ భాస్కర్ పాల్గొన్నారు.

సవాళ్లుఉన్నా సమర్థంగా పని చేశారు

- అధికారులు, సిబ్బందికి కొత్వాల్ కితాబు
- 2025 అర్ధ వార్షిక రివార్డుల అందజేత


సీపీ నుంచి రివార్డ్ అందుకుంటున్న ఏసీపీ ఎన్ఎల్ఎన్ రాజు

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగం అనేక సవాళ్లను అధిగమిస్తూ సమర్థంగా పని చేస్తోందని కొత్వాల్ సీవీ ఆనంద్ అన్నారు. సిటీలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న నిరంతర కృషిని అభినందించారు. 2025 సంవత్సరానికి సంబంధించి అర్ధ వార్షిక రివార్డు మేళాను శుక్రవారం ఐసీసీసీలో ఉన్న ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన 446 మంది అధికారులు, సిబ్బందిని సత్కరించారు. ఈ రివార్డు గ్రహీతల్లో ఇద్దరు ఏసీపీలు, 49 మంది ఇన్‌స్పెక్టర్లు, 38 మంది ఎస్సైలు, 21 మంది ఏఎస్సైలు, 30 మంది హెడ్‌–కానిస్టేబుళ్లు, 220 మంది కానిస్టేబుళ్లు, 11 మంది హోమ్ గార్డ్స్, 45 మంది మినిస్టీరియల్ సిబ్బందితో పాటు 25 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఈ సందర్భంగా కొత్వాల్ ఆనంద్ మాట్లాడుతూ... ‘ఇంత పెద్ద నగరంలో పోలీసులు తమ విధులకు అంకితమై, నిరంతర కృషి చేయడంతోనే శాంతిభద్రతలు నెలకొన్నాయి’ అన్నారు. కార్యక్రమంలో అదనపు సీపీ పి.విశ్వ ప్రసాద్, బీసీపీ ఎస్.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి

- వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్, ఎమ్మెల్యే


బుల్కాపూర్ నాలాను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్, ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: వర్షాల నేపథ్యంలో వరద సహాయక చర్యలను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌తో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలు టోలిచౌకీ, హకీంపేట్, నానల్‌నగర్, గోల్కొండ, నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శాతం చెరువులో ప్రమాకర స్థాయికి చేరుకున్న వరద నీటిని వేగంగా బయటకు వెళ్లేలా యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని సూచించారు. వరద నీరు రహదారులపై నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారాలు చేపట్టాలన్నారు. వర్షాలు ఇంకా కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీమ్ కాలనీ, టోలిచౌకీ చౌరస్తా, బుల్కాపూర్ నాలాలలో వర్షపు నీరు ముందుకు కదలడం లేదని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై తాను గతంలో అనేకసార్లు సంబంధిత అధికారులతో కలిసి చూసి సూచనలు చేసినా వారు తూతూమంత్రంగానే చర్యలు తీసుకున్నారని చెప్పారు. కమిషనర్ వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఈఈ లాల్ సింగ్, ఏఎంవోహెచ్ ఇర్షాద్ ఎక్బాల్, హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

పూజల పేరిట మోసం..

ఇద్దరు నిందితుల అరెస్టు..



బంజారాహిల్స్: నెత్తి మీద తిష్టవేసిన దరిద్రం దూరమై ఇంట్లో బంగారం తులతూగాలంటే హిమాలయాల్లో మాత్రమే దొరికే అరుదైన మూలికకు పూజలు చేయాలని నమ్మించి అమాయకుల నుంచి రూ.10 లక్షలు దండుకున్న ఇద్దరు మోసగాళ్లను బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్–12లోని కమాన్ ఎన్‌బీటీనగర్‌లో నివసించే గోపాల్ ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే కాలనీ వైపు వెళ్తుండగా కోయ దొరల వేషంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆయనను ఆపి ఎందుకంత డల్‌గా ఉన్నావంటూ ప్రశ్నించారు. దీంతో గోపాల్ తనకు ఏ పనీ కలిసి రావడం లేదని, ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు చెప్పుకొచ్చాడు. నీ తల మీద దరిద్రం తిష్టవేసింది.. చచ్చేవరకు ఇలాగే ఉంటుంది.. అయితే ఒక మూలికకు పూజలు చేస్తే ఇంట్లోకి బంగారం వస్తుందంటూ నమ్మించాడు. హిమాలయాల్లో మాత్రమే దొరికే ఈ మూలిక కూకట్‌పల్లి నిజాంపేటలోని ఓ ఆయుర్వేద షాపులో మాత్రమే దొరుకుతుందని అడ్రస్ ఇచ్చి పంపించాడు. గోపాల్ ఆ షాపునకు వెళ్లి సదరు మూలికను అడగ్గా రూ.10 లక్షలు అవుతుందని చెప్పాడు. తనకు బంగారం వస్తుందని, దరిద్రం పోతుందని, ఇంట్లో మహాలక్ష్మీ తిష్టవేస్తుందని నమ్మిన గోపాల్ ఆ మూలికను ఇంట్లోకి తీసుకువచ్చి భార్యాపిల్లలతో కలిసి పూజలు చేశాడు. నాలుగు రోజులు గడిచినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిజాంపేటలోని ఆయుర్వేద షాపు నిర్వాహకులు సుధీర్‌కుమార్‌సింగ్, సాగర్‌లను నమ్మకద్రోహం కింద అరెస్టు చేసి విచారించగా వీరిది బీహార్ అని, కొంతమంది మహారాష్ట్ర, బీహార్‌లకు చెందిన వ్యక్తులకు రుషుల అవతారంలో దుస్తులు వేయించి అమాయకులనే లక్ష్యంగా చేసుకుని మూలికలు, ఆయుర్వేద చూర్ణం పేరుతో మోసాలు చేస్తున్నట్లుగా తేలింది. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించారు. వీరి వెనుక ఉన్న ముఠా కోసం గాలింపు చేపట్టారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు వెళ్లిన సెక్యూరిటీ గార్డు మృతి

వెంగళరావునగర్ : విధులకు వెళ్లిన సెక్యూరిటీ గార్డు మృతిచెందిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. పాపిరెడ్డినగర్‌లో నివాసముంటున్న రవికుమార్ (43) సెక్యూరిటీ గార్డు విధులు నిర్వహిస్తుంటాడు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని రెయిన్‌గోల్డ్ రెసిడెన్సీలో విధులకు వెళ్ళాడు. రాత్రి వరకు తిరిగి రాలేదు. రాత్రి స్థానికులు భార్య అమల కుమారికి ఫోన్ చేసి రవికుమార్ విధులు ముగించుకుని ఇంటికి వెళ్ళే సమయంలో కుప్పకూలి పోయాడని తెలియజేశారు. అతనిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా వైద్యుడు అప్పటికే మృతిచెందినట్లు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టాప్-10 బిజినెస్ స్కూల్స్‌లో అంబేడ్కర్ వర్సిటీ


వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: ప్రతిష్టాత్మక ప్రచురణా సంస్థ అకడమిక్ ఇన్‌సైట్స్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని దేశంలోని టాప్-10 విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తించడం గర్వకారణంగా ఉందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. విద్యా సంవత్సరం–2025లో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి దేశంలోనే ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్)లో మొదటి పది బిజినెస్ స్కూల్స్‌లో ఒకటిగా నిలిచినట్లు రీసెర్చ్ అండ్ అనాలిసిస్ మ్యాగజైన్‌లో ప్రచురించారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి ఈ గౌరవం ఎంబీఏ హాస్పిటల్ హెల్త్‌కేర్ డొమైన్‌లో నాణ్యతా నిర్వహణ విద్యను అందించడంలో విశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలిచిందన్నారు. విశ్వవిద్యాలయంలో ఎంఏబీ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సు 2008–09లో ప్రారంభమై, యూజీసీ దూర విద్యా సంస్థ (యూజీసీ–డీఈబీ) గుర్తింపు పొందిన కోర్సుగా ఆదరణ పొందిందన్నారు. ఇదిలా ఉండగా ఎంబీఏ, ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్‌ను ఆగస్టు 24వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 14వ తేదీ అని వివరించారు.

బీజేఆర్‌నగర్‌లో వినాయక విగ్రహ కర్రపూజ



కర్ర పూజ చేస్తున్న బస్తీ నేతలు

ఫిలింనగర్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక విగ్రహం ఏర్పాటు కోసం ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో శుక్రవారం శుభ ముహూర్తంలో కర్రపూజ నిర్వహించారు. క్రేజీ బాయిస్ యూత్ అసోసియేషన్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. బస్తీ నేతలు యాదగిరి, దామోదర్, కుమార్‌యాదవ్, వెంకటేష్, భాగ్యమ్మ, యూత్ అధ్యక్షుడు యాది తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయం గడప పూజ



గడప పూజలో పాల్గొన్న విజయారెడ్డి

పంజగుట్ట: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని ఎర్రమంజిల్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయంలో శుక్రవారం గడప పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి గడపకు పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్మిస్తున్న దేవాలయం పనులు, నూతనంగా నిర్మిస్తున్న ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల, రవీంద్ర నికేతన్ పాఠశాల పనులు పర్యవేక్షించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని మున్ముందు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు.

డబుల్ ఇళ్లు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

రహమత్‌నగర్: డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తానని మోసానికి పాల్పడ్డ వక్తిపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బోరబండ సైట్-3 టీ కొట్టు నడిపే వెంకటేశ్వర్‌రావు వివేకానంద నగర్‌కు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తానని నమ్మించి చెందిన దుర్గ నాగలక్ష్మి దగ్గర 2023 సంవత్సరంలో రూ. 3.50 లక్షలు తీసుకున్నాడు. రెండు నెలల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తానని బాండు పేపర్‌పై రాసి ఇచ్చాడు. అప్పటి నుండి ఏదో ఒక సాకులు చూపుతూ నెట్టుకొస్తున్నాడు. మోస పోయాయని గ్రహించిన బాధితురాలు గురువారం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు



అంబేద్కర్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత

శ్రీనగర్‌కాలనీ: వర్షపు నీరు నిల్వ ఉండకుండా, బస్తీల్లోకి చేరకుండా అధికారులతో కలిసి పలు పటిష్ట చర్యలను తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. శుక్రవారం అంబేడ్కర్‌నగర్ బస్తీలో గురువారం రాత్రి కురిసిన భారీవర్షానికి నివాసల్లోని నీరు వెళ్లడంతో ఆయా ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. అమీర్‌పేట నాలాను పరిశీలించి వర్షపునీరు నిల్వ ఉండకుండా నాలాల నుంచి నీరు వెళ్లేలా అక్కడి పరిసరాల వ్యర్థాలను తొలగించారు. నేతలు శ్రీనివాసయాదవ్, అంబేడ్కర్‌నగర్ బస్తీ నేతలు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్: నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడ, మధురానగర్ ప్రాంతాల్లో ఇటీవల విదేశీ సిగరెట్లు ఎక్కువగా విక్రయిస్తున్నట్టు మధురానగర్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో శుక్రవారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మధురానగర్‌లోని ఓ షాపులో రూపాని నిర్మలా కుమార్ అనే వ్యక్తి రూ. 10 వేల విలువైన వివిధ రకాలకు చెందిన 85 సిగరెట్ పాకెట్లు విక్రయిస్తున్నాడు. దాంతో అతనిని అరెస్టు చేసి సిగరెట్ పాకెట్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కేసీపీ జంక్షన్‌లో వరద దృశ్యం



ప్రహరీ కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి



సాగర్ సొసైటీ కమలాపురికాలనీలో...

వదలని వరద!

తెల్లవార్లూ ట్రాఫిక్‌జాం
- జాడలేని జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది
- రాత్రంతా విధుల్లో ట్రాఫిక్ పోలీసులు
- మోటార్లతో హైడ్రా సిబ్బంది హైరానా

బంజారాహిల్స్: వర్షం వస్తుందంటేనే పంజగుట్ట, లక్డీకాపూల్, అమీర్‌పేట, మైత్రీవనం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్ వాసులు వణికిపోతున్నారు. కొద్దిరోజులుగా కుండపోత వర్షాలకు రహదారులన్నీ వరదతో ముంచెత్తుండగా ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. జీహెచ్‌ఎంసీ ప్రణాళికా లోపాలు వాహనదారుల పాలిట శాపంగా మారుతున్నాయి. వరదనీటి నాలాలు నిండిపోయి నీళ్లన్నీ వెనక్కి తన్నుకొస్తూ రోడ్లను, ఇళ్లను ముంచెత్తుండగా, జలమండలి డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ఎక్కడికక్కడ పొంగిపొర్లుతున్నాయి. వరద బీభత్సం వాహనదారులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నది. గురువారం రాత్రి కురిసిన వర్షం అర్ధరాత్రి దాటినా రోడ్లపై వరద వదల్లేదు. మైత్రీవనం, కమలాపురికాలనీ, యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్, వెంకటగిరి, జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36 నీరూస్ చౌరస్తా, బంజారాహిల్స్, చింతల్‌బస్తీ, కేసీపీ గెస్ట్‌హౌస్ చౌరస్తా, పంజగుట్ట మోడల్ హౌస్, నిమ్స్, ఖైరతాబాద్ ద్వారకా హోటల్, లక్డీకాపూల్ చౌరస్తా, రవీంద్రభారతి చౌరస్తాలతో పాటు ఫిలింనగర్‌లోని బస్తీలు, ఎంఎస్‌మక్తా, బీఎస్‌మక్తా, హకీంపేట, టోలిచౌకి తదితర ప్రాంతాలన్నీ నీట మునిగి స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూశారు.

◆ శుక్రవారం తెల్లవారుజాము వరకు అటు వరద, ఇటు ట్రాఫిక్ దిగ్బంధం స్థానికులకు నరకాన్ని చూపించాయి. జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులు జాడ లేకుండాపోయారు. ట్రాఫిక్ పోలీసులంతా రోడ్ల పైనే ఉండాలని సంబంధిత పోలీసు అధికారులు ఆదేశించడంతో అన్ని పోలీస్ స్టేషన్ల ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు రోడ్ల పైనే ఉండిపోయారు.

◆ హైడ్రా సిబ్బంది కూడా మోటార్లతో ఎక్కడికక్కడ వరదనీటిని తోడే ప్రయత్నం చేశాయి.

◆ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ముందు నాలుగు గంటల పాటు వరద నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్వాకం, ఇంజనీర్ల నిర్లక్ష్యంతో వరద ముందుకువెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

◆ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ డివిజన్లకు చెందిన జీహెచ్‌ఎంసీ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఏమాత్రం పనిచేయకుండా కేవలం వసూల్‌రాజాలుగానే ఉండిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీరి నిర్లక్ష్యంతోనే రోడ్లపై గుంతలు, వరదనీరు ముందుకు వెళ్లలేకపోవడం తదితర సమస్యలు తలెత్తుతున్నాయి.

◆ ముఖ్యమంత్రి నివాసం ఉండే డివిజన్‌లోనే జీహెచ్‌ఎంసీ పనితీరు అత్యంత అధ్వాన్నంగా ఉంది. జీహెచ్‌ఎంసీ వరద విషయంలో పూర్తిగా చేతులెత్తేయడంతో పాటు పనిలో అట్టర్‌ఫ్లాప్‌గా నిలుస్తున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి.



పంజగుట్ట మోడల్ హౌస్ వద్ద వరద బీభత్సం

కూలిన గోడలు: మూడు వాహనాలు ధ్వంసం

బంజారాహిల్స్: భారీ వర్షాల ధాటికి తట్టుకోలేక నాలా ప్రహరీలతో పాటు ఖాళీ స్థలాల ప్రహరీలు కుప్పకూలుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన భారీ వానకు బంజారాహిల్స్ రోడ్ నెం. 13లోని అంబేద్కర్‌నగర్ బస్తీని ఆనుకొని ఉన్న నాలా ప్రహరీ సుమారు 30 అడుగుల మేర నాలాలో కుప్పకూలింది. ఈ ప్రమాదకర నాలాలో ఎవరూ పడిపోకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. మరో వైపు బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీని ఆనుకొని ఉన్న హుడా లే అవుట్ చుట్టూ హెచ్‌ఎండీఏ అధికారులు నిర్మించిన ప్రహరీ వరద ధాటికి కుప్పకూలడంతో పక్కనే ఉన హకీంపేట బస్తీలు పార్కింగ్ చేసి ఉన్న వాహనాలపై పడింది. ఈ ఘటనలో రెండు ఆటోలు, ఓ కారు ధ్వంసం అయ్యాయి. పక్కనే ఉన్న నివాసం ధ్వంసమైంది. ఘటనా స్థలానికి షేక్‌పేట మండల తహసీల్దార్ అనితా రెడ్డి వెళ్లి విచారణ చేశారు. ఆస్తి నష్టంపై పంచనామా నిర్వహించారు.



బంజారాహిల్స్‌రోడ్ నెం.13లో కూలిన నాలా ప్రహరీ



ఎమ్మెల్యే కాలనీలో ధ్వంసమైన వాహనాలు

ప్రియాంక గాంధీతో అజహరుద్దీన్ భేటీ



బంజారాహిల్స్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్ ఏఐసీసీ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. శుక్రవారం ఆయన ఢిల్లీలోని ప్రియాంక గాంధీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుతెన్నులతో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న పార్టీ కార్యక్రమాలను వివరించారు. ఈ ఉప ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవబోతుందని ఈ సందర్భంగా ఆయన ప్రియాంక గాంధీకి వివరించారు.

గులాబీ జెండా రెపరెపలాడాలి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గులాబీజెండా రెపరెపలాడాలని ఎర్రగడ్డ డివిజన్ ఇంచార్జ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ ప్రెసిడెంట్ డి.సంజీవ, సీనియర్ నేతలు, బూత్‌కమిటీ నేతలతో సమావేశమయ్యారు. ఎర్రగడ్డ డివిజన్‌లో పార్టీ బలంగా ఉందని, మైనార్టీలు, బడుగు బలహీనవర్గాలు కాంగ్రెస్ చేసిన మోసపూరిత హామీలపై ఆగ్రహంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నారని అన్నారు. ప్రతి కార్యకర్త బూత్ కమిటీలో బలంగా నిలబడి భారీ మెజారిటీని తీసుకువచ్చేలా కృషిచేయాలని సూచించారు. నేతలు షరీఫ్ ఖురేషి, జావీద్, సయ్యద్, బాలు, నర్సింగరావు, శ్రీనివాస్, శ్రీకాంత్, బుజంగరావు, రవి, కళ్యాణి పాల్గొన్నారు.

'స్థలాల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించండి'



మాట్లాడుతున్న వినోద్‌కుమార్‌గౌడ్

రహమత్‌నగర్: కార్మికనగర్ బస్తీలోని స్థలాల రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.వినోద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కార్మికనగర్ బస్తీ కళ్యాణ్‌నగర్ సొసైటీకి చెందిన 37 ఎకరాల స్థలంలో ఏర్పాటైందన్నారు. అప్పటి మంత్రి దివంగత పీజేఆర్ గజానికి రూ. 25 చొప్పున అగ్రిమెంట్ చేయించారని తెలిపారు. దాదాపు 200 మంది బ్యాంకులో జమచేశారని వివరించారు. 2021లో కళ్యాణ్‌నగర్ సొసైటీ రాష్ట్ర హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, దీని ప్రకారం కళ్యాణ్‌నగర్ సొసైటీకి మున్సిపల్ ముఖ్య కార్యదర్శి నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించిందన్నారు. అప్పటి నుంచి బస్తీలోని 37 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసుకున్న నివాసాలకు రిజిస్ట్రేషన్ కాలేదని చెప్పారు. బస్తీవాసులు చిరకాల వాంఛ రిజిస్ట్రేషన్ జరుగలేదని ఆయన వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక జీఓను విడుదల చేయించాలని వినోద్‌కుమార్ గౌడ్ కోరారు. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హనుమంతు, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ అభ్యర్థిని గెలిపిస్తేనే జూబ్లీహిల్స్ అభివృద్ధి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రహమత్‌నగర్: అధికార కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తేనే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యం అవుతుందని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో అక్కడి ప్రజలు అధికార కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి సరైన నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తుచేశారు. రహమత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో పొన్నం ప్రభాకర్, వివేక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పది సంవత్సరాలు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్క పేదకూ రేషన్ కార్డు అందలేదని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఆర్థికంగా భారమైనా ఆరు గ్యారంటీలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నదన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ పాలకులు కేవలం కమీషన్ల కోసం పనిచేశాని ఆరోపించారు. కార్పొరేషన్ చైర్మన్లు మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కేశవేణు, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, నవీన్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వేదికపై మంత్రులు పొన్నం, వివేక్

శ్రీకృష్ణానగర్ డ్రైనేజీ సమస్యకు త్వరలో పరిష్కారం

వెంగళరావునగర్: శ్రీకృష్ణానగర్‌లో అతిపెద్ద డ్రైనేజీ సమస్య ప్రజలను వెంటాడుతుందని, కాంగ్రెస్ హయాంలోనే దానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో శుక్రవారం సాయంత్రం మంత్రులు పర్యటించారు. మురుగునీటిలో కొంతసేపు స్థానికులతో కలిసి పాదయాత్ర చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ... భారీ వర్షాలకు శ్రీకృష్ణానగర్‌లో వరద పరిస్థితి మరింత ఇబ్బందిగా మారిందన్నారు. త్వరలో వరద నివారణ చర్యలను ప్రారంభిస్తామన్నారు. డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్‌యాదవ్, రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

ఫిలింనగర్: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారికి వేకువజామునే పంచామృతాలతో అభిషేకాతో పాటు హోమం నిర్వహించారు. ఫిలింనగర్ ప్రధాన రోడ్డులో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వాంగ సుందరంగా సుందరంగా ముస్తాబు చేసిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు.

టీటీడీ శ్రీవారి ఆలయంలో...

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయ మండపంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహిచారు. వేకువజామునే అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్ర నామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. స్కంద పురాణంలోని వరలక్ష్మి వ్రత సంకల్పం కథను వివరించారు. అనంతరం వివిధ రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. ఆలయ ఏఈఓ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దైవసన్నిధానంలో వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

ఏఐ ఆధారిత 'రెసో-స్మార్ట్' ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: జేఈఈ, నీట్ కోచింగ్‌లో అగ్రగామి అయిన రెసోనెన్స్, శామ్‌సంగ్ మద్దతు కలిగిన ఎడ్‌టెక్ కంపెనీ టాగ్‌హైవ్‌లు కలిసి స్మార్టర్, ఫాస్టర్ లర్నింగ్ కోసం రెసో-స్మార్ట్‌ను ప్రారంభించాయి. ఇది కృత్రిమ మేధ ఆధారిత లెర్నింగ్ ప్రోగ్రామ్. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ... సాంకేతిక రంగంలో ఇది ఒక ముందడుగు అని చెప్పారు. కృత్రిమ మేధ తరగతి గదుల్లో ఇచ్చే శిక్షణ వల్ల సుమారు 20 వేల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. రెసో-స్మార్ట్ సాంకేతికంగానే కాకుండా అధ్యయన విధానంలో విద్యార్థుల్లో సంపూర్ణమైన మార్పు తెస్తుందన్నారు. ప్రతి తరగతి గదిలో అడాప్టివ్ లర్నింగ్‌ను తెచ్చేందుకు దీన్ని రూపొందించినట్లు చెప్పారు. డేటా ఆధారిత విద్యా వాతావరణాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా టాగ్‌హైవ్ వ్యవస్థాపకులు, సీఈవో పంకజ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఆధునిక కృత్రిమ మేధో సాధనాలను విద్యార్థులకు అందజేసేందుకు రెసోనెన్స్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఘనంగా రాఖీ సంబురాలు



రక్షాబంధన్ వేడుకల్లో చిన్నారులు

శ్రీనగర్‌కాలనీ: రక్షాబంధన్ వేడుకలు మోతీనగర్‌లోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. అన్నాచెల్లెల్ల బంధాన్ని, పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు చిన్నారులకు తెలియజేశారు. శుక్రవారం రాఖీలు కట్టి చిన్నారులు రక్షాబంధన్ వేడుకల్లో సందడిగా గడిపారు. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలిటీషియన్ జేఏసీ స్టీరింగ్ కమిటీ ఎన్నిక

హిమాయత్‌నగర్: సమర్థులైన మంచి నాయకులు సర్పంచులుగా, కార్పొరేటర్లుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ప్రజలు గెలిపించుకున్నప్పుడే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యా పరిష్కారం అవుతుందని పొలిటీషియన్ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. పొలిటీషియన్ జేఏసీ నూతన స్టీరింగ్ కమిటీని శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఎన్నుకున్నారు. జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా కుల్లపరెడ్డి సురేష్ బాబు, వెంకటేష్ ఇంద్రపల్లి, కూనపరెడ్డి హరిప్రసాద్, సింగం శ్రీనివాస్ రావు, దమ్మిగారి కనకయ్య ఎన్నికయ్యారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

హిమాయత్‌నగర్: సేవా కార్యక్రమాలతో ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అన్నారు. రాధే రాధే గ్రూప్ హైదరాబాద్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనిరుధ్ గుప్తా పాల్గొన్ని మాట్లాడారు. డబ్బుకు ప్రాముఖ్యత లేదని, మనతో ఉండేవి మన సంకల్పం, సంస్కారాలు మాత్రమే అని అన్నారు. గ్రూప్ కన్వీనర్లు సతీష్ కుమార్ గుప్తా, మహేష్, జగత్‌నారాయణ్, రామ్ ప్రకాష్, సునీతా, రాజ్ కుమారి, శ్యామ్ సుందర్, భగత్‌రామ్ గోయల్, నందకిషోర్, రోహిత్, సుమన్, మాయారామ్‌జీ, మనీష్ చండాలియా, అశోక్ గుప్తా, ఎస్.జె. గోపాల్ గోయల్, కైలాష్ చంద్ కేడియా, నిర్మలా కేడియా, మనోజ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


'కేర్'లో అడ్వాన్స్‌డ్ హార్ట్ రిథమ్ క్లినిక్



క్లినిక్‌ను ప్రారంభించిన వైద్యులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ హార్ట్ రిథమ్ క్లినిక్‌ను శుక్రవారం ప్రారంభించారు. హృదయ సంబంధిత అరిథ్మియా, అడ్వాన్స్‌డ్ హార్ట్ ఫెయిల్యూర్ సమస్యల గుర్తింపు, చికిత్స కోసం ఈ రిథమ్ క్లినిక్ ప్రారంభానికి నోచుకుంది. కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ క్లినికల్ డైరెక్టర్, ప్రఖ్యాత ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణ ఎస్వీకే నాయకత్వంలో కొనసాగనున్న దీనిని కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుండె సంరక్షణలో ఈ క్లినిక్ పెద్ద పురోగతిగా చెప్పారు. ఇది ఏట్రియల్ ఫైబ్రిలేషన్, బ్రాడీకార్డియా, టాచీకార్డియా వంటి లయ సమస్యలతో బాధపడుతున్న వారికి, అలాగే ఆకస్మిక గుండె మరణం ప్రమాదం ఉన్న రోగులకు ప్రయోజనం చేకూర్చడానికి రూపొందించినట్లు పేర్కొన్నారు. కేర్ హాస్పిటల్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజునాయర్ మాట్లాడుతూ... దేశంలోని అత్యంత విశ్వసనీయమైన, ఆధునిక కార్డియాక్ ప్రోగ్రామ్‌లలో బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్ ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. ఈ క్లినిక్‌తో బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్ అరిథ్మియా నిర్వహణలో కీలక భూమిక పోషిస్తోందన్నారు. కార్డియాక్ చికిత్సలో నూతన ప్రమాణాలను నెలకొల్పుతూ ఈ ప్రాంతంల ముందున్న ఆస్పత్రిగా నిలిచిందన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ సత్తాచాటాలి



షేక్‌పేటలో పర్యటిస్తున్న ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి త్వరలో జరుగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ విజయాన్ని అందించాలని ఏఐసీసీ సెక్రటరీ, మాజీ ఎంపీ పి.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. శుక్రవారం షేక్‌పేట డివిజన్‌లో మొదటి పది బూత్‌లలో డివిజన్ సీనియర్ నేతలు, బూత్‌కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ కమిటీలతోనే భారీ విజయం సాధ్యమని, బూత్‌కమిటీలు బలంగా పనిచేయాలని కోరారు. బూత్‌కమిటీల ఇంచార్జ్, సెక్రటరీలను నియమించి, బూత్‌కమిటీ సభ్యులతో క్షేత్రస్థాయిలో ఎలా పనిచేయాలనే పలు అంశాలను వివరించారు. పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అసద్, అఫ్రోజ్, జ్యోతి, ఒమర్, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్‌, శనివారం
9 ఆగస్టు 2025



అందాల ప్ర'దక్షిణం'..

పోటీల్లో నాలుగు దక్షిణాది రాష్ట్రాల అమ్మాయిలు

సౌత్ బ్యూటీ పేజెంట్ ఎట్ యూకే | 2026లో యూకే వేదికగా ఫైనల్స్

ప్రాజెక్ట్, వెబ్‌సైట్ ఆవిష్కరించిన బాలీవుడ్ నటి వామికా గబ్బి

కోటి రూపాయల ప్రైజ్ మనీ ప్రకటించిన నిర్వాహకులు

దేశంలోని దక్షిణాది రాష్ట్రాలు ఫ్యాషన్ బ్యూటీ పేజెంట్స్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతున్నారు. కొద్ది రోజుల క్రితమే హైదరాబాద్ వేదికగా ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలు జరిగిన విషయం విదితమే. బ్యూటీ పేజెంట్ రంగానికి దక్షిణాది రాష్ట్రాలు ఇస్తున్న ఆదరణ, ప్రోత్సాహానికి ఇదొక నిదర్శనం. ఇది పూర్తయ్యిందో లేదో మరో ప్రతిష్టాత్మక బ్యూటీ ఈవెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తోంది. యూకేలోని దక్షిణాది రాష్ట్రాలకు (ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక) చెందిన ఫ్యాషన్ ఔత్సాహికుల కోసం ప్రతిష్టాత్మకంగా 'మిస్ సౌత్ ఇండియా యూకే' పేజెంట్ నిర్వహించనున్నారు. ఈ మిస్ సౌత్ ఇండియా యూకే ప్రాజెక్టును, దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రముఖ బాలీవుడ్ నటి వామికా గబ్బి నగరంలోని తాజ్ డెక్కన్ వేదికగా శుక్రవారం ఆవిష్కరించారు. స్టార్ డస్ట్ పేజెంట్స్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ పేజెంట్ యూకేలోని దక్షిణాది తారలకు అద్భుత అవకాశంగా మారనుంది. – సాక్షి, సిటీబ్యూరో

మిస్ సౌత్ ఇండియా యూకే పేజెంట్‌కు సంబంధించిన వివరాలను స్టార్ డస్ట్ పేజెంట్స్ ప్రతినిధులు సత్య, క్రాంతి వెల్లడిస్తూ.. యూకేలో నివాసముంటున్న 18 నుంచి 28 ఏళ్ల వయసున్న దక్షిణాది అమ్మాయిలు ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. బాలీవుడ్ నటి వామికా గబ్బి ప్రారంభించిన తమ వెబ్‌సైట్‌లో నేటి నుంచి ఔత్సాహికులు రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. దాదాపు మూడువేల మంది రిజిస్టర్ చేసుకుంటారని అంచనా. సన్నాహక కార్యక్రమాలు ఈ జూలై నుంచి మొదలై వచ్చే ఏడాది జూలైలో యూకే వేదికగా పోటీలను నిర్వహించనున్నారు. మిస్ సౌత్ ఇండియా యూకే విన్నర్‌కు కోటి రూపాయలకు పైగా ప్రైజ్ మనీ ఉంటుంది. 4 దక్షిణాది రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరిని రన్నరప్‌గా ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.10 లక్షల ప్రైజ్ మనీ అందిస్తారు. ఈ పోటీల్లో భాగంగా తొలుత మిస్ తెలుగు యూకే, మిస్ తమిళ యూకే, మిస్ కన్నడ యూకే, మిస్ మలయాళం యూకే పోటీలు నిర్వహిస్తారు. పేజెంట్‌లో అందాల పోటీలే కాకుండా దక్షిణ భారతీయుల సంప్రదాయాలను ప్రపంచ వేదికకు పరిచయం చేసేందుకు ప్రణాళికలను రూపొందించామని పేర్కొన్నారు.

అందం.. ఆత్మస్థైర్యం..

మహిళలు కాన్ఫిడెంట్‌గా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలుగుతారు. అమ్మాయిలకు ఆత్మస్థైర్యం, సెల్ఫ్‌కాన్ఫిడెన్స్ అవసరం. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై పోటీ పడే అమ్మాయిలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. నేను గతంలో ఎలాంటి పేజెంట్‌లో పోటీ చేయలేదు. కానీ ఆ రంగంలో రాణిస్తున్న వారి అంకిత భావం, ఆలోచనా విధానం నాపై ఎంతో ప్రభావం చూపించాయి. నేను నటించిన తెలుగు నటుల్లో అడవి శేష్ మంచి నటుడు. తనతో గూఢాచారిలో నటించడం సంతోషం. షూటింగ్‌లో అడవి శేష్‌తో యాక్టింగ్‌కు సంబంధించి మంచి జ్ఞాపకాలు ఉన్నాయి.
– వామికా గబ్బి, బాలీవుడ్ తార.





హైదరాబాదీలు ఆహార ప్రియులు.. అందుకే దేశంలోని వివిధ ప్రాంతాలే కాకుండా.. ఇతర దేశాల వంటకాలకూ ఇక్కడ మంచి డిమాండ్ ఉంటుంది.. వివిధ రాష్ట్రాల, దేశాల సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు నగరంలో సర్వసాధారణం. ఇందులో భాగంగానే ఉత్తరాది ఫేవరెట్ రుచుల్లో ఒక్కటైన పంజాబీ వంటకాలను నగరానికి తీసుకొచ్చింది నోవోటెల్. హైదరాబాద్ విమానాశ్రయం వేదికగా 'స్వాద్ పంజాబ్ దా' పేరుతో పంజాబ్ సంప్రదాయ వంటకాలను మూడు రోజుల పాటు ఆహార ప్రియులకు అందించనున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

వాహ్.. స్వాద్..



నగరంలో ఉత్తరాది వంటకాల సందడి

నోరూరిస్తున్న పంజాబీ వంటకాలు | ఎయిర్‌పోర్ట్ నోవోటెల్ వేదికగా ఫుడ్ ఫెస్ట్ | పంజాబీ సంప్రదాయ వంటకాలు, స్ట్రీట్‌ఫుడ్

ఆకట్టుకుంటున్న గెస్ట్ చెఫ్ సందీప్ సింగ్ సభర్వాల్ | వైవిధ్యాన్ని చాటుతున్న స్వాద్ పంజాబ్ దా

ఎయిర్‌పోర్టులోని నోవోటెల్ వేదికగా నిర్వహిస్తున్న పంజాబీ ఫుడ్ ఫెస్ట్ 'స్వాద్ పంజాబ్ దా'లో ప్రముఖ పంజాబీ చెఫ్ సందీప్ సింగ్ సభర్వాల్ పసందైన రుచులను అందిస్తున్నారు. ఇందులో భాగంగా అమృత్‌సర్ నుంచి తీసుకొచ్చిన ప్రత్యేకమైన ఫుడ్ ఇంగ్రిడియన్స్ నగరంలోని ఆహార ప్రియులను అలరిస్తున్నాయి.





రుచుల సమ్మేళనం..



స్థానిక భోజనప్రియులతో పాటు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఆహ్వానం పలికే నోవోటెల్ ఎయిర్‌పోర్ట్.. ఈ సారి 'స్వాద్ పంజాబ్ దా'తో విభిన్న రుచులను అందిస్తోంది. టమాటో ధనియా షోర్బా, ఖడోడే దా వంటి సూప్‌లతో మొదలై చట్నీ పనీర్ టిక్కా, మలై మసాలా సోయా చాప్, మటన్ సీక్ కబాబ్, తందూరీ ముర్గ్, అజ్వానీ జింగా తలాహువా వంటి నోరూరించే స్టార్టర్లు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు పంజాబీ స్పెషల్ బటర్ చికెన్, రారా మీట్, దాల్ మఖ్నీ, ధాబా కడై మష్రూమ్, హరే చోలియేట్ పన్నీర్, సబ్జ్ పాటియాలా వంటి వంటకాలు వావ్ అనిపిస్తున్నాయి. ఈ రుచులను ముట్టర్ దమ్ పులావ్, కుక్కడ్ దే దమ్ వాలే చౌల్ మసాలాలతో అందిస్తుండటం విశేషం. ప్రస్తుతం వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగల నేపథ్యంలో ప్రత్యేకమైన మిఠాయిలు, డెజర్ట్స్ వీటికి జత చేశారు. ఇందులో పిన్ని (దాల్, అట్టెకి), గజ్రెల్లా, రబ్రీ, గులాబ్ జామున్, పాలతో పంజిరి, ఖీర్, కుల్ఫీ, ఫలూదా వంటి తీపి పదార్థాలతోపాటు స్ట్రీట్ ఫుడ్ వెరైటీలు వావ్ అనిపిస్తున్నాయని, ఇవి మంచి ముగింపుని ఇస్తున్నాయని నోవోటెల్ హెడ్ చెఫ్ అమన్నా రాజు తెలిపారు.

భావోద్వేగాలను పంచుతూ..

ఈ మహానగరంలో ఆహార వైవిధ్యాన్ని సృష్టించడానికి స్వాద్ పంజాబ్ దా వేదికగా మలుచుకున్నాను. పంజాబీ సంస్కృతిలోని ప్రతి వంటకం, ముఖ్యంగా హైదరాబాదీయులు అమితంగా ఇష్టపడే పంజాబీ స్ట్రీట్ ఫుడ్ తయారు చేస్తున్నాను. మా వంటకాలు భావోద్వేగాలతో పాటు సాంస్కృతిక వైవిధ్యాన్ని, వైభవాన్ని ప్రతిబింబిస్తాయి. హైదరాబాద్.. దేశంలోని పాకశాస్త్ర రంగానికి అద్భుతమైన వేదికని మరోసారి తెలుసుకున్నాను. ఇక్కడి ఫుడ్‌లవర్స్ నాకెంతో నచ్చారు. ఈ ఫుడ్ ఫెస్ట్ సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభమవుతుంది.
– సందీప్ సింగ్ సభర్వాల్, పంజాబీ గెస్ట్ చెఫ్.





సాంకేతిక శిక్షణకు.. టెక్ అకాడమీ..

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక, ఆర్థిక అడ్డంకుల కారణంగా ఉన్నత చదువులను కొనసాగించలేని యువతకు తోడ్పడేందుకు టెక్ రంగంలో కెరీర్ అందించేందుకు ఫ్రెష్‌వర్క్స్, ఎడ్యునెట్ ఫౌండేషన్ సంయుక్తంగా నగరంలో అకాడమీ ఫర్ కెరీర్స్ ఇన్ టెక్నాలజీ ఏర్పాటు చేశాయి. దీనిని నిర్వాహకులు శుక్రవారం ప్రారంభించారు. టెక్ కెరీర్‌లో ఉద్యోగాల సాధనే లక్ష్యంగా మొదటి బ్యాచ్‌లో 12వ తరగతి ఉత్తీర్ణులైన 30 మంది విద్యార్థులకు అకాడమీలో సాంకేతిక శిక్షణ ఇస్తామని, అర్హులైన అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఔత్సాహిక యువతకు పరిశ్రమ–సంబంధిత నైపుణ్యాలను అందించడానికి నగరంలోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎడ్యునెట్ ఫౌండేషన్ ఛైర్మన్ నగేష్ సింగ్, ఫ్రెష్‌వర్క్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ గాదె పాల్గొన్నారు.

రుతురాగాలతో.. 10న బర్ఖా రుతు..



సాక్షి, సిటీబ్యూరో: ఎంతో కాలంగా భారతీయ శాస్త్రీయ సంగీతానికి గొప్ప వనరుగా అత్యుత్తమ ప్రేరణగా నిలుస్తోంది వర్షం. అదే మేఘరంజని, వరుణప్రియ తదితర అనేక మనోహరమైన రాగాల సృష్టికి దోహదం చేసింది. ఈ రాగాలు వర్షాల అనుభవంతో ముడిపడి ఉన్న విభిన్న మనోభావాలను స్పృశిస్తాయి. ఈ నేపథ్యంలో నగరంలో బన్యన్ ట్రీ ఆధ్వర్యంలో 'బర్ఖా రీతు– విద్వాంసులతో ఒక సంగీత వేడుక' జరుగనుంది. ఇది శాస్త్రీయ సంగీతాభిమానులను రాగాల జల్లుల్లో ఓలలాడించనుంది. వర్షాలు మనలో రేకెత్తించే భావోద్వేగాలకు అద్దం పట్టేలా ప్రముఖ గాయకులు, సంగీత విద్వాంసులు ఉస్తాద్ సుజాత్ ఖాన్, రాహుల్, ఖబ్రా ఖాన్‌లు వీనుల విందు చేయనున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఈ నెల 10న రాత్రి 6.15 గంటల నుంచి 3 గంటల పాటు ఈ సంగీత వేడుక కొనసాగుతుంది.

'రీజెన్సీ'లో ఫ్రెంచ్ రుచులు..



పంజాగుట్ట: నోరూరించే ఫ్రెంచ్ రుచులకు రీజెన్సీ కళాశాల వేదికైంది. ఎర్రమంజిల్‌లోని రీజెన్సీ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఫ్రెంచ్ డే పురస్కరించుకుని విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రెంచ్ ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. అలియన్స్ ఫ్రాంచైజ్ డైరెక్టర్ మౌద్ మిఖావ్, బ్యూరో ఆఫ్ ఫ్రాన్స్ రోహిణి రెడ్డిపల్లి ముఖ్య అతిథులుగా శుక్రవారం ప్రారంభించారు. ప్రాచీన ఫ్రెంచ్ వంటకాలతో పాటు ఫ్రెంచ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పలు చిత్రాలను ప్రదర్శించారు. మౌద్ మిఖావో విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు వెన్నతో రూపొందించిన ఐఫిల్ టవర్ ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ నాగరాజు, యంగ్ చెఫ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి దేబ్‌రాజ్ భౌమిక్, చెఫ్ రిజ్వాన్ ఖదీర్, రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి. రమేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.





గోమయం.. రక్షణ బంధం..

పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా
ఆవుపేడ, ఎర్రమన్ను, చెట్ల గింజలతో తయారీ
తెలంగాణ గోశాల ఫెడరేషన్ వినూత్న కార్యక్రమం



కాచిగూడ : అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమ బంధానికి చిహ్నం రక్షాబంధనం.. దీనినే రాఖీ అని కూడా అంటారు. శ్రావణ పౌర్ణమిన జరుపుకునే ఈ పండుగ సోదర ప్రేమకి సంకేతం. అక్క లేదా చెల్లెలు, సోదరుని చేతికి 'రాఖీ' కట్టి, పది కాలాల పాటు చల్లగా ఉండాలని మనసారా కోరుకుంటారు.. తమ సుఖాన్నీ, సంతోషాన్నీ కోరుకునే సోదరిపై సహజంగానే అన్నదమ్ములకి ఆత్మీయత బలపడుతుంది. ఆమెను జీవితాంతం రక్షించడానికి, కంటికి రెప్పలా కాపాడటానికి సిద్ధంగా ఉంటానని చెప్పడమే ఈ పండుగ విశేషం. అయితే గతంలో ఈ పండుగ పూర్తిగా పర్యావరణ హితంగా జరిగేది. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పూలు, ఇతర చెట్ల నుంచి వచ్చే ఉత్పత్తులతో రాఖీలను తయారు చేసేవారు. రాను రాను ఇది ఆధునిక పోకడల కారణంగా ప్లాస్టిక్, ఇతర లోహాలతో తయారుచేసేవాటిని వినియోగిస్తున్నారు. దీనికి భిన్నంగా పర్యావరణ హితమైన గోమయం, ఎర్రమన్ను, నేత దారం, చెట్ల గింజలతో రాఖీలను అందుబాటులోకి తీసుకొచ్చారు తెలంగాణ గోశాల ఫెడరేషన్ సభ్యులు.

తయారీ విధానం

పర్యావరణ హితమైన ఎర్రమట్టి, పేడను మిశ్రమంగా చేసి అందులో గింజలు చేర్చి, వివిధ ఆకారాల్లో రాఖీలు తయారు చేసి ఆరబెడతారు. అవి గట్టిపడగానే సహజమైన రంగులు, రంగురాళ్లు అద్దుతారు. వీటితోపాటు తులసి కొమ్మలను చిన్నచిన్న కర్రలుగా చేసి రెండుగా చీల్చి అందులో గింజలు చేర్చి దారం చుట్టి రాఖీలుగా తయారు చేస్తారు. వీటిని వారం రోజుల పాటు ఎండబెడితే గట్టిపడతాయి. శనివారం రాఖీ పండుగ సందర్భంగా ఈ గోమయ రాఖీలను కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవితో కలిసి మహేష్ అగర్వాల్ విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేశారు. వీటి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.



పర్యావరణ పరిరక్షణకు..

పర్యావరణ పరిరక్షణకు మా వంతు కృషి చేస్తున్నాం. పేడలో కూరగాయలు, పూల మొక్కలు, చెట్ల గింజలను చేర్చి తయారు చేస్తాం. పండుగ అనంతరం ఈ రాఖీలను ఇంటి పెరట్లో, వ్యవసాయ క్షేత్రాల్లో, ఇతర ఖాళీ స్థలాల్లో విసిరేస్తే, అవి మొలకెత్తి మానవాళికి ఉపయోగపడతాయి. వీటి పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలి.
– మహేష్ కుమార్ అగర్వాల్, తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు

'ది వరల్డ్' ఎక్స్‌పీరియన్స్ సెంటర్..

› గ్లోబల్ లగ్జరీ లేబుల్స్‌కు వేదికగా హైదరాబాద్
› అలరించిన అజియో లగ్జరీ ప్రైవ్ షోకేస్..



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్ ప్రపంచంలో ఐకానిక్‌గా నిలిచే బొట్టెగా వెనెటా, వెర్సేస్, యాక్నే స్టూడియోస్, సెల్ఫ్–పోర్ట్రెయిట్, జిమ్మీ చూ, బెనెడెట్టా బ్రూజిచెస్, కల్ట్ గయా, పామ్ ఏంజిల్స్ వంటి గ్లోబల్ లగ్జరీ లేబుల్స్ నగరంలో లభించనున్నాయి. హైదరాబాద్‌లోని అత్యంత ప్రీమియం క్యూరేటెడ్ జీవనశైలిని అందించే 'ది వరల్డ్' ఎక్స్‌పీరియన్స్ సెంటర్ జూబ్లీహిల్స్‌లో ప్రారంభమైంది. ఐకానిక్ ఆర్కిటెక్చర్, వావ్ అనిపించే సెంట్రల్ ప్లాజా, కళ, ఫ్యాషన్, ఫుడ్, డిజైన్ సమ్మిళితంగా నగరవాసులను అలరిస్తుంది ఈ ప్రత్యేక జోన్ ఫ్యాషన్ వేదిక. ఇటీవల ఈ వేదికగా ప్రదర్శించిన అజియో లగ్జరీ ప్రైవ్ షోకేస్ విశేషంగా అలరించింది.

క్లుప్తంగా...

మహిళా సంక్షేమంలో రాజీ లేదు

- అక్కాచెల్లెళ్లందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది
- సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: శనివారం రాఖీ పండుగ పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన ఆకాంక్షించారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందని తెలిపారు. వారి అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అక్కాచెల్లెళ్లందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజాపాలన సాగిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యేతంవరకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆడబిడ్డల ఆర్థిక సాధికారతే అసలైన రక్షాబంధన్ అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ కూడా రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్కచెల్లెమ్మలకు వైఎస్ జగన్ రాఖీ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మీయతలు, అనురాగాల పండుగ రక్షాబంధనం అని.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, రక్షణపరంగా మహిళలకు ఎల్లప్పుడూ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ దేవుడి ఆశీస్సులు ఎల్లకాలం లభించాలని కోరుకుంటున్నానని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

టీడీపీ తొండాట!

వైఎస్సార్‌సీపీకి పట్టు ఉన్న పల్లెల్లో పోలింగ్ బూత్‌ల మార్పిడి

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ కుట్రలు, కుతంత్రాలు

- నల్లపురెడ్డిపల్లి, ఎర్రబల్లె కొత్తపల్లె, నల్లగొండువారిపల్లెలో మాయాజాలం
- ఓటు వేసేందుకు ఎక్కువ మంది వెళ్లకూడదని ఎత్తుగడ
- అల్లర్లు సృష్టించి పోలింగ్ శాతం పెరగకుండా అడ్డుకునే పన్నాగం
- గతంలో ఏ గ్రామం వారికి ఆ గ్రామంలోనే ఓటు
- ఇప్పుడు బూత్‌లను మార్చిన ఎన్నికల కమిషన్
- ఈ కారణంగా దాదాపు 4 కిలోమీటర్లు వెళ్లి ఓటేయాల్సిన పరిస్థితి
- టీడీపీ నేతల కుట్ర రాజకీయానికి పూర్తిగా సహకరిస్తున్న అధికార గణం
- టీడీపీ ప్రభావం నుంచి ఎన్నికల సంఘం బయటకు రావాలి : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కొద్ది రోజులుగా వరుస దాడులు



సాక్షి ప్రతినిధి, కడప: 'ఏం చేస్తారో చేయండి.. అక్కడ మనం బలం చాటుకోవాలి.. ఎప్పటికప్పుడు మీకు ఏ సహాయం కావాలో చెబితే వెంటనే అందే ఏర్పాటు చేస్తాం.. అధికారులంతా మీకు సహకరిస్తారు.. రాష్ట్రంలో అందరి దృష్టి ఆ ఎన్నికపైనే ఉండాలి' అని 'ముఖ్య' నేత కొందరు టీడీపీ నేతలకు పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికపై దిశా నిర్దేశం చేయడం వల్లే కొద్ది రోజులుగా ఇక్కడ అరాచకం రాజ్యమేలుతోంది. స్థానిక టీడీపీ నేత బీటెక్ రవి, మరికొందరు నేతలు రెచ్చిపోతున్నారని స్పష్టమవుతోంది. ఈ క్రమంలో చోటు చేసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, తప్పుడు కేసులు, భయభ్రాంతులకు గురి చేయడాలు, ప్రలోభాలు.. ఇలా ఏవీ ఫలితమివ్వక పోవడంతో తాజాగా మరో కుట్రకు తెరలేపారు. ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం తగ్గించి, అధికార టీడీపీకి మేలు చేకూర్చాలన్న కుట్రలకు పదును పెడుతున్నారు. ఏ గ్రామంలోని ఓటర్లు ఆ గ్రామంలోనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండా అక్కడి ఓట్లు ఇక్కడికి, ఇక్కడి ఓట్లు అక్కడికి మార్చేస్తున్నారు. పులివెందుల మండలంలోని ఎర్రబల్లె కొత్తపల్లె పంచాయతీలో 6, 7 నంబర్ల పోలింగ్ బూత్‌లు, నల్లగొండువారిపల్లెలో పోలింగ్ బూత్ 8, నల్లపురెడ్డిపల్లెలో 9, 10, 11 బూత్‌లు ఉన్నాయి. ఇది వరకు ఏ గ్రామానికి చెందిన ఓటర్లు ఆ గ్రామంలోని పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకునే వారు. తాజాగా ఎర్రబల్లె కొత్తపల్లె ఓటర్లు నల్లపురెడ్డిపల్లె బూత్‌లలో, నల్లపురెడ్డిపల్లె ఓటర్లు ఎర్రబల్లె కొత్తపల్లె బూత్‌ల పరిధిలోకి వచ్చేలా అధికారులు మార్పిడి చేశారు. ఓటర్ల పరిశీలన (వెరిఫికేషన్) సందర్భంగా ఈ విషయం బహిర్గతం కావడంతో పలువురు అవాక్కవుతున్నారు. ఇలాగైతే తాము మూకుమ్మడిగా పోలింగ్ బహిష్కరిస్తామని నల్లగొండువారిపల్లె గ్రామస్తులు అధికారులకు తేల్చి చెప్పారు. ఎప్పుడూ లేనిది ఇప్పుడే ఎందుకు ఇలా మార్చారని ఆరా తీస్తే.. టీడీపీ నేతల కుట్రను అధికారులు అమలు చేస్తున్నారని స్పష్టమైంది.

పోలింగ్ శాతం తగ్గించడమే లక్ష్యం

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో మొత్తం 10,601 ఓట్లు ఉన్నాయి. అందులో కణంపల్లె, కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె పంచాయతీల్లో 65 శాతం ఓటర్లు ఉన్నారు. ఆయా పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీకి గట్టి పట్టు ఉంది. ఈ పరిస్థితిలో అక్కడి ఓటర్లు ఓట్లు వేస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు సునాయాసం. ఈ క్రమంలో ఓటర్ల బూత్‌లను తారుమారు చేశారు. దీంతో స్వల్ప వివాదాలు తలెత్తినా.. అంత దూరం వెళ్లి ఓటు వేసేందుకు ఓటర్లు స్వతహాగా నిరాసక్తత చూపుతారన్నది అధికార పార్టీ నేతల ఎత్తుగడ. పైగా ఓటింగ్ వెళ్లే దారిలో ప్రలోభ పెట్టేందుకు, భయభ్రాంతులకు గురిచేసేందుకు అవకాశం ఉంటుందని కూడా ఎత్తు వేసినట్టు తెలుస్తోంది. దీంతోపాటు ఓటర్లను పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేయడం మొదలెట్టారు. ఇంకోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పడిన ఓట్లు ఎక్కువగా చెల్లనివిగా చేసేందుకు బ్యాలెట్ పేపర్ ముద్రించడంలో కూడా ఎత్తుగడలు వేశారని తెలుస్తోంది. 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున ఒక్క పేజీలో బ్యాలెట్ పేపర్ ముద్రిస్తే సరిపోతుంది. అలా కాకుండా డబుల్ సైడ్ గుర్తులు ఇస్తూ బ్యాలెట్ ముద్రించేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. తద్వారా ఒకటవ గడిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి గుర్తుపై ఓటు వేయడం ద్వారా ఆ ఓటు చెల్లకుండా పోవాలనే కుట్ర దాగి ఉంది. 'ప్రజాస్వామ్యానికి ఓటే పునాది. మెరుగైన సమాజం కోసం ఓటు అనే ఆయుధాన్ని ప్రయోగించండి. ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనండి.. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి' అన్న ప్రచారానికి భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎలాగైనా సరే గెలవడానికి ఓటర్లను గందరగోళానికి గురి చేసి, పోలింగ్ కేంద్రం వద్దకు రాకుండా చేయాలన్న ప్రభుత్వ పెద్దల కుతంత్రానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారు.

రోజుకో దాడితో భయభ్రాంతులకు గురిచేసే ఎత్తుగడ

వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ చంద్రబాబు అండ్ గ్యాంగ్ బరితెగించి కుట్రలు, కుతంత్రాలకు తెర లేపింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే గెలుపు దరిదాపులకు వెళ్లడం అటుంచి.. డిపాజిట్ కూడా దక్కదనే విషయం తెలిసి దౌర్జన్యం, రౌడీయిజంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసేందుకు విఫల యత్నం చేస్తోంది. ప్రజల్లోనూ ఆందోళన, అలజడి సృష్టించడమే లక్ష్యంగా రోజుకో రీతిలో దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. వైఎస్సార్‌సీపీకి గట్టి పట్టు ఉన్న ఈ మండలంలో ఎలాగూ గెలవలేమని తెలిసినా.. సామ దాన భేద దండోపాయాలతో నెగ్గాలని బరితెగిస్తోంది. ఈ క్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలపై తొలుత దాడులకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా మంగళవారం పులివెందుల శ్రీకర్ ఫంక్షన్ హాల్‌లో వివాహానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి (చంటి), అమరేష్‌రెడ్డి, నాగేష్, శ్రీకాంత్, తన్మోహన్‌రెడ్డిలపై టీడీపీ రౌడీ మూకలు హత్యాయత్నం చేశాయి. అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌బాషా (కిరికిరి బాషా) ముఠా దాడి చేసి వెళ్లిపోయింది. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఏమాత్రం పట్టించుకోలేదు. బుధవారం నల్లగొండువారిపల్లెలో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై బందిపోటు దొంగల ముఠా తరహాలో టీడీపీ రౌడీ మూకలు మెరుపు దాడి చేశాయి. ఒక్కసారిగా దాదాపు 100 మంది రాడ్లు, కర్రలు, ఇతర మారణాయుధాలతో వారిని చుట్టుముట్టి మట్టు బెట్టేందుకు యత్నించారు. వేల్పుల రామలింగారెడ్డి తలపై రాడ్డుతో కొట్టారు. దీంతో తల పగిలి ఆయన కింద పడిపోయారు. పక్కనే ఉన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పైనా అదే స్థాయిలో దాడి చేశారు. రమేష్ యాదవ్ తల తిప్పడంతో భుజంపై రాడ్ల దెబ్బలు పడ్డాయి. ఎమ్మెల్సీ రేంజ్ రోవర్, వేల్పుల రామలింగారెడ్డికి చెందిన ఫార్చ్యూనర్, స్కార్పియో వాహనాలనూ సమ్మెటలతో ధ్వంసం చేశారు. రామలింగారెడ్డి ఉన్న ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించబోయారు. గ్రామస్తులు ప్రతిఘటించేందుకు సిద్ధమవడంతో రౌడీ మూకలు పారిపోయాయి. ఈ ఘటన చోటుచేసుకున్న ప్రాంతానికి సమీపంలోనే పోలీసు క్యాంప్ ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోక పోవడం గమనార్హం. పైగా టీడీపీ నేతల ఎదురు ఫిర్యాదుతో బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు. అతిచిన్న చిన్న కారణాలతో వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎంతగా బరితెగించి దాడులు చేస్తున్నా, పోలీసులు, ఇతర అధికారులు వారికి అండగా ఉంటున్నారు.

శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు

- జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్ నియామకం



జస్టిస్ హరినాథ్ | జస్టిస్ కిరణ్మయి | జస్టిస్ సుమతి | జస్టిస్ విజయ్

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ నోటిఫికేషన్ జారీ చేశారు. శాశ్వత న్యాయమూర్తులుగా వీరితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వచ్చే వారం ప్రమాణం చేయించనున్నారు. జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్‌లు 2023 అక్టోబర్ 21న హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. ఆ పదవీ కాలం ఈ నెల 20వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. వీరి నియామకంతో హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తుల సంఖ్య 24కి చేరింది.

గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తెలంగాణ

- ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- జపాన్ కంపెనీ తోషిబా ప్లాంట్‌కు భూమిపూజ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని జపాన్ కంపెనీ తోషిబా ట్రాన్స్ మిషన్ – డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) పరిశ్రమలో రూ.347 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన కొత్త ప్లాంట్ల విస్తరణకు శుక్రవారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనతికాలంలోనే తెలంగాణ తయారీరంగంలో దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. 2024–25లో దేశ పారిశ్రామికోత్పత్తి రూ.2.77 లక్షల కోట్లు కాగా, ఇందులో తయారీ రంగం వాటా 48 శాతం ఉంటుందన్నారు. ఈ తొమ్మిది నెలల్లోనే రూ.లక్ష కోట్ల విలువైన పారిశ్రామికోత్పత్తి రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యాయన్నారు. తోషిబాలాంటి దిగ్గజ సంస్థలను తెలంగాణకు ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా గ్రీన్ ఎనర్జీ ఎక్విప్‌మెంట్ జోన్లు ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో కొత్త పరిశ్రమలను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జపాన్ పర్యటన సందర్భంగా రూ.562 కోట్ల పెట్టుబడులకు సంబంధించి తోషిబా కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకుందని గుర్తు చేశారు.

పరిశ్రమలతో మెరుగైన ఉపాధి: మంత్రి వివేక్

కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐటీ శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్, జపాన్ ఎంబసీ ఎకనామిక్ – డెవలప్‌మెంట్ మంత్రి కియోకీ హోకుగో, తోషిబా వైస్‌ప్రెసిడెంట్ హిరోషి కనేట, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ

శనివారం
09-08-2025



దేశంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఆఫీస్ మార్కెట్లలో నగరం అగ్రగామిగా నిలిచిందని, ఈ ఏడాది తొలి అర్ధభాగం నగర ఆఫీస్ మార్కెట్ అనూహ్యమైన డిమాండ్‌ను చవిచూసిందని 'ఎ బిలియన్ స్క్వేర్ ఫీట్ అండ్ కౌంటింగ్ – ఇండియా ఆఫీస్ సప్లై' నివేదికలో నైట్ ఫ్రాంక్ ఇండియా సంస్థ తెలిపింది. ఈ నివేదిక వెల్లడించిన ఇతర విశేషాల ప్రకారం..

–సాక్షి, సిటీబ్యూరో

ఆఫీస్ స్పేస్..

సిటీ టాప్ ప్లేస్..

దేశంలోని ఇతర మెట్రోల కంటే అత్యధిక వృద్ధి

- వేగంగా విస్తరిస్తున్న నగర ఆఫీస్ మార్కెట్
- దాదాపు 12 కోట్ల 30లక్షల చ.అ.కు చేరిక
- వెల్లడించిన నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక

ఈ ఏడాది మొదటి అర్ధభాగం పూర్తయ్యే నాటికి, నగరం మొత్తం ఆఫీస్ స్టాక్ 123 మిలియన్ చదరపు అడుగులు, ఇది భారతదేశపు మొత్తం ఆఫీస్ మార్కెట్‌లో 12% కాగా వార్షికంగా చూస్తే 9.2% అభివృద్ధితో టాప్ ఆరు మెట్రో నగరాల్లోనే అత్యధిక వృద్ధిని ప్రదర్శించింది. టెక్ రంగంలో బలమైన ప్రగతి, నిరంతరం కొనసాగుతున్న మౌలిక సదుపాయాల మెరుగుదల, వాణిజ్య కార్యకలాపాలకు అనువైన వాతావరణం నగర కార్యాలయ విస్తృతికి దోహదం చేస్తున్నాయి.

టాప్ ప్లేస్‌లో ఈ ఏరియాలు..

కొండాపూర్, మణికొండతో సహా సెకండరీ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లు(ఎస్‌బీడీలు) నగర వాణిజ్య కార్యాలయ ల్యాండ్‌స్కేప్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇవే మొత్తం కార్యాలయ సముదాయంలో 47% వాటా కలిగి ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో గచ్చిబౌలి, కోకాపేట, నానక్‌రామ్‌గూడ వంటివి 41% వాటాను దక్కించుకున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి సంప్రదాయ సెంటర్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లు ఇప్పుడు 11% వాటాను కలిగి ఉన్నాయి. మెట్రో కనెక్టివిటీ వంటి బలమైన మౌలిక సదుపాయాలు తక్కువ కార్యాచరణ ఖర్చులు వంటివి ఈ వృద్ధికి ఆజ్యం పోస్తున్నాయి.

నాణ్యతలో టాప్ 3..

గ్రేడ్ ఏగా లెక్కించిన 68% కార్యాలయ సముదాయంతో నగరంలోని ఆఫీస్ స్పేస్ నాణ్యతపరంగా మొదటి మూడు భారతీయ నగరాల్లో ఒకటిగా ఉంది. నగరంలో గ్రేడ్ బీ 30% వాటాను కలిగి ఉండగా, గ్రేడ్ సీ కేవలం 1% మాత్రమే ఉండటం గమనార్హం. నగరం కొంత కాలంగా ఐటీ/ఐటీఇఎస్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీలు), ఫార్మా లైఫ్ సైన్సెస్ సంస్థలకు ఆకర్షణీయంగా, అయస్కాంతంలా మారింది. ఇవే ప్రధానంగా లీజింగ్ కార్యకలాపాలకు ఊపు నిస్తున్నాయి. ఈ ఏడాది అర్ధభాగంలో, నగరంలోని కీలక టెక్ కారిడార్లలో ఫ్లెక్స్–ఎనేబుల్డ్ వర్క్‌స్పేస్‌లను కోరుకునే బహుళజాతి సంస్థల నుంచి సిటీ బలమైన డిమాండ్‌ను చవి చూసింది.

విజేతకు.. విజయమూ ప్రత్యర్థే!

గెలుపుతో పాటే ఒత్తిడి • విమర్శలూ మొదలవుతాయి
ప్రతిస్పందన పెద్ద సవాల్ • తల్లిదండ్రులే కనురెప్పలు

చిన్న గెలుపు కూడా పెద్ద సంతోషాన్నిస్తుంది. అదే పెద్ద గెలుపైతే! అదికూడా - ప్రపంచాన్నే జయించినంత గొప్ప గెలుపైతే! లోకం మొత్తం ఏకమై జయజయధ్వానాలు చేస్తుంది. పూల వర్షం కురిపిస్తుంది. విజేతను కీర్తి సింహాసనంపై కూర్చోబెడుతుంది. చిన్న వయసులోనే జగదేక వీరులైన వారినైతే ముద్దు చేస్తుంది. మురిపాలు కురిపిస్తుంది. వరాలు, వరహాలు కుమ్మరిస్తుంది. విశ్వనాథన్ ఆనంద్, సచిన్ టెండూల్కర్, సానియా మీర్జా, పీవీ సింధు.. ఇలా ఒక్క స్పోర్ట్స్‌లోనే కాదు, ప్రపంచ పోటీలు జరిగే ప్రతి రంగంలోనూ దివి నుంచి భువికి దిగినట్లుగా విజేతలపై ఒక్కసారిగా మహోజ్వలమైన వెలుగు ప్రసరిస్తుంది. మరి అంతటి వెలుగును తట్టుకోవటం అందరికీ చేతనవుతుందా? చిన్న వయసులోనే స్టార్‌డమ్ సంపాదించినవారికి అసలే సాధ్యమవుతుందా?

సాక్షి స్పెషల్ డెస్క్

భారతదేశ చదరంగ వినీలాకాశంలో సరికొత్త ధ్రువతార 19 ఏళ్ల దివ్యా దేశ్‌ముఖ్ ప్రస్తుతం ఒక అపరిచిత ప్రత్యర్థితో రేయింబవళ్లూ తలపడుతూ ఉంది! ఆ ప్రత్యర్థి పేరు 'గెలుపు!' జార్జియాలోని బాటుమిలో జరిగిన ఫిడే మహిళల ప్రపంచ కప్ విజేతగా నిలిచిన దివ్య, ఆ గెలుపును తట్టుకుని నిలబడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూ ఉంది. ఆలోచించి మరీ 'ఆనందాల పావులను' కదుపుతోంది. వినేందుకు ఇది విచిత్రంగా ఉండొచ్చు. కానీ, ఓటమిని తట్టుకోవటం ఎంత కష్టమో, గెలుపును తడబడకుండా పట్టుకుని నిలబడటమూ అంతే కష్టం.

ఉక్కిరి బిక్కిరి

ఫిడే ప్రపంచ కప్పును, గ్రాండ్ మాస్టర్ టైటిల్‌ను సాధించిన తర్వాత నాగ్‌పూర్‌కు తిరిగి వచ్చిన ఈ టీనేజర్‌కు భారీ స్వాగతం లభించింది. 'జన ఘన సందోహం' ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసింది. నిజానికి, బాటుమిలో 'ట్రోఫీ' చేతికి అందిన క్షణం నుంచే గెలుపుతో దివ్యా దేశ్‌ముఖ్ 'సమస్యలు' మొదలయ్యాయి! తొలి సమస్య... ఇన్‌స్టాగ్రామ్‌లో తన ట్రోఫీతో ఎలా ఫోజు ఇవ్వాలి అన్నదే!

ఇంటర్వ్యూలు

అర్జెంటీనా ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనెల్ మెస్సీ వరల్డ్ కప్ ట్రోఫీని హత్తుకుని పడుకున్న ఫొటోలకు ఇన్‌స్టాగ్రామ్‌లో 5 కోట్ల లైక్‌లు రావటం దివ్యకు గుర్తుంది. 'నేను కూడా అలాగే చేయాలనుకున్నాను. కానీ దురదృష్టవశాత్తూ, అలసటతో నిద్రపట్టేసింది' అని దివ్య ఒక ఇంటర్వ్యూలో చెబుతూ, నవ్వేసింది. గెలుపు అలసటను మాత్రమే కాదు, ఇంటర్వ్యూలను కూడా తీసుకొస్తుంది. టీనేజ్ జగజ్జేతలకు ఈ సంతోషాన్ని తట్టుకోవటం కాస్త కష్టమైన వ్యవహారమే.



అంత సులభం కాదు

ఆట అనే కాదు.. ఒక పాటల కార్యక్రమం, డ్యాన్స్ ప్రోగ్రామ్.. ఇలా రాష్ట్ర లేదా జాతీయ స్థాయి కార్యక్రమంలో విజేతలుగా రాణిస్తున్న చిన్నారులు మన కళ్ల ముందే ఎంతోమంది ఉన్నారు. ఆ చిన్న మనసులకు ఆ గెలుపు ఎంతో కిక్కునిస్తుంది. ఆ తరువాత వచ్చే ప్రశంసలు, జరిగే సన్మానాలు వారిని మునగచెట్టు ఎక్కిస్తాయి. అక్కడే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే.. చిన్నపిల్లలు వాళ్లకేం తెలుసు, అంత ఎత్తునుంచి జారిపడే ప్రమాదం ఉందని, పడితే నడుం విరుగుతుందని! గెలుపు రుచి చూసిన తమ పిల్లలను కంటికి రెప్పల్లా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఆ మత్తు వారి తలకెక్కకుండా.. చదువు పక్కదారి పట్టకుండా.. స్నేహితులను దూరం చేసుకోకుండా చూసుకోవాలి. నిజానికి దివ్య వ్యవహరించిన శైలి ఎంతోమందికి ఆదర్శం. సచిన్, విశ్వనాథన్ ఆనంద్ లాంటి మహామహులు.. దివ్య ఇప్పుడున్న దశను దాటిన తరువాత వ్యవహరించిన తీరు దివ్యకు ఆదర్శం కావాలి.

ప్రముఖుల సందేశాలు

'విజేత' అనే టైటిల్ దివ్యకు మరో పరీక్ష పెట్టింది! ఆమె విజయంలో పాలు పంచుకోవాలని యావద్దేశం ఉవ్విళ్లూరింది. 'మనమ్మాయి' అని ఉప్పొంగింది. కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఆమెకు వీడియో కాల్ చేశారు. అంతటి మహామహులు తనకు ఫోన్ చేసి, స్క్రీన్‌పై తన కళ్ల ముందు ప్రత్యక్షమై అభినందనలు తెలుపుతుంటే ఏడు గుర్రాలపై విజయ విహారం చేయటమే. అక్కడితో అయిపోలేదు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి దేశ రాజధానికి దివ్యను ఆహ్వానించారు. ఇక ఆమె ఫోన్‌కు వస్తున్న సందేశాలకైతే లెక్కేలేదు. ఆ వరదలో దివ్య మునకలేస్తోంది. అంతమందికి ఒక్కొక్కరిగా కృతజ్ఞతలు ఎప్పటికి చెప్పగలను అని సతమతం అవుతోంది. అంతేనా, నాగపూర్‌లో మహా పట్టాభిషేకం, వరుసగా సన్మానాలు, ఇంటికి వచ్చి వెళుతున్న శ్రేయోభిలాషులు!

చిన్నారులకు ఆదర్శం

టైటిల్ గెలుచుకుని నాగ్‌పూర్‌లో అడుగుపెట్టినప్పుడు, అంతమంది జనాన్ని, ముఖ్యంగా పిల్లలను చూడటంతో దివ్య తబ్బిబ్బయింది. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఆమెను సత్కరించే కార్యక్రమంలో కనీసం 50 శాతం మంది పిల్లలే ఉన్నారు. ఆ చిన్నారుల్లో ఒక చిన్నారిగా దివ్య కలిసిపోయింది. అక్కడి కేరింతలకు ఆమెకు కన్నీళ్లొచ్చినంత పనైంది. అయినా హుందాగానే ఆ పరిస్థితిని ఎదుర్కొంది.

విజయాన్ని తట్టుకోవటానికి 5 మెట్లు!

1. ఒక్కసారిగా వచ్చిన కీర్తి దిక్కుతోచని స్థితిలో పడేస్తుంది. చిన్నపిల్లలు, టీనేజర్‌లకైతే అంతా అయోమయంగా ఉంటుంది. ఇలాంటప్పుడు మొదటి అడుగుగా మౌనం, చిరునవ్వే వారిని గట్టెక్కిస్తాయి.
2. విజయోత్సాహం దినచర్యలను క్రమరహితం చేసే అవకాశం ఉంది. అలా జరక్కుండా ఎప్పటిలా ఆహారం, వ్యాయామం, నిద్ర ఉండేలా జాగ్రత్తపడాలి.
3. ప్రతి ప్రశంసకూ, మీడియా సంధించే ప్రశ్నలకు స్పందించే క్రమంలో తీవ్రమైన ఒత్తిడికి లోనవటం జరుగుతుంది. ఆ సమయంలో తల్లిదండ్రులే తమ చిన్నారి విజేతకు సహాయంగా ఉండి, వారి ఒత్తిడిని తగ్గించేలా చూడాలి.
4. విజేతలు కొన్నిసార్లు తమ వస్త్రధారణ, శరీరాకృతి విషయమై సోషల్ మీడియాలో విమర్శలకు గురికావచ్చు. వాటిని తేలిగ్గా తీసుకోవాలి. మాటకు మాట చేటు తెస్తుంది.
5. గెలుపు గుర్తింపునే కాదు, గుర్తించలేని శత్రువులను కూడా వెంట తీసుకొస్తుంది. కొందరు మాట్లాడటం మానేస్తారు. కొందరు చాటుగా ఏదో అంటున్నారని తెలుస్తుంది. వాళ్ల నుంచి చిన్నారి విజేతల్ని వారి కోచ్‌లు, పేరెంట్స్ కాపు కాచుకోవాలి.

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.ప్రవీణ్ కుమార్ దర్శించుకున్నారు.

22న గోదావరి-కావేరి అనుసంధానంపై భేటీ



సాక్షి, హైదరాబాద్: గోదావరి– కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి, అక్కడి నుంచి నీళ్లను తరలించాలనే ప్రతిపాదనలపై చర్చించడానికి నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ) ఈ నెల 22న జలసౌధలో సమావేశం నిర్వహించనుంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్ జైన్‌అధ్యక్షతన జరగనున్న ఈ భేటీకి ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను ఎన్‌డబ్ల్యూడీఏ ఆహ్వానించింది. గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును నిర్మించడానికి ఏపీ సన్నాహాలు చేస్తుండగా, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు ప్రాజెక్టును చేపట్టాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

మళ్లీ అటవీ ఆక్రమణలు షురూ!

- కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో వెలుస్తున్న గ్రామాలు
- రాష్ట్రంలో మొత్తంగా 7 లక్షల ఎకరాలు ఆక్రమించినట్లు అంచనా
- 13లోగా నివేదికలు పంపాలని జిల్లా అధికారులకు ఆదేశాలు



జన్నారం సెక్షన్‌లోని గడ్డంగూడలో మళ్లీ వెలిసిన గుడిసెలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ అటవీ ఆక్రమణలు ఊపందుకుంటున్నాయి. అనధికార లెక్కల ప్రకారం ఇప్పటికే 7 లక్షల ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైనట్టు అంచనా వేస్తున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లోని కోర్ ఏరియా జన్నారం సెక్షన్‌లోని గడ్డంగూడలో ఈ ఏడాది జనవరిలోనే అటవీ అధికారులు ఆక్రమణలను తొలగించారు. అయితే ఏప్రిల్ నాటికి మళ్లీ అవి యథాస్థానానికి చేరుకున్నాయి. కవ్వాల్ సెక్షన్ (కోర్ ఏరియా)లోని అటవీ ఆక్రమణలను గతేడాది అధికారులు తొలగించగా.. అదే ప్రాంతంలో తాజాగా కొన్ని గుడిసెలు వెలిశాయి. శుక్రవారం నాటికి ఈ కోర్ ఏరియాలో ఒక గ్రామం మాదిరిగా గుడిసెలు ఏర్పడ్డాయి. పెద్ద సంఖ్యలో గుడిసెలు వెలియడంతో అధికారులు ఏంచేయాలో తెలియని పరిస్థితిలో పడ్డారు. ఇది సంప్రదాయ గిరిజనులు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన గిరిజనుల మధ్య ఆధిపత్య పోరుకు ఎక్కడ దారితీస్తుందోనని భయపడుతున్నారు. కేటీఆర్‌లో అటవీశాఖ-అటవీ ఆక్రమణదారుల మధ్య రోజురోజుకు యుద్ధవాతావరణం ఏర్పడుతోంది. తాజాగా 150 ఎకరాల్లో కొత్తగా పోడు, ఇతర రూపాల్లో ఆక్రమణలు జరిగాయని అధికారుల దృష్టికి వచ్చింది. గత నెలలో ఒక వర్గానికి చెందిన 200 మంది దాకా కోర్ ఏరియాలోని 150 ఎకరాల అడవిని ఆక్రమించారు. కోర్ ఏరియాలోని గడ్డంగూడ గ్రామంలో ఆక్రమణలు తొలగించిన రెండుమూడు నెలల్లోనే మళ్లీ వెలిశాయని, ఆక్రమణదారులను బయటకు పంపించడం రోజురోజుకు మరింత కష్టతరంగా మారుతోందని సాక్షితో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అటవీ అధికారి ఒకరు వాపోయారు.

నివేదికలు పంపాలని ఆదేశాలు

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా అటవీ ఆక్రమణలపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రాలవారీగా ఈ ఆక్రమణలకు సంబంధించిన పూర్తి వివరాలు పంపించాలని ఆదేశించింది. ఆక్రమణలకు సంబంధించి డేటాను ఈ నెల 13లోగా పంపించాలని శుక్రవారం అరణ్యభవన్ నుంచి జిల్లాలవారీగా ఆదేశాలు పంపించారు. ఈ నివేదికను 18వ తేదీలోగా కేంద్ర అటవీ శాఖకు పంపించాల్సి ఉండడంతో తక్షణం ఈ–మెయిల్ ద్వారా ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం. అయితే, గత ఏడాది మేలోనే దీనికి సంబంధించిన వివరాలను కేంద్రం కోరినట్టు తెలుస్తోంది. ఇటీవల కేంద్ర అటవీ పరిరక్షణ విభాగాలతో సమావేశమైన సందర్భంగా రాష్ట్రం నుంచి నివేదికలు పంపకపోవడం కూడా చర్చకు వచ్చినట్టు తాజా జిల్లా అధికారులకు పంపిన లేఖలోపేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) కేసుకు సంబంధించి అటవీ ఆక్రమణల వివరాలు సమర్పించాల్సిన అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఈ ఏడాది జూలై 31 నాటికి జరిగిన ఆక్రమణల సమాచారం, కోల్పోయిన అటవీ భూమి, గత ఐదేళ్లలో ఆక్రమణలపై తీసుకున్న చర్యలు తదితర వివరాలను పంపించాలని అటవీశాఖ ఆదేశించింది.

'రేడియో కాలర్స్'పై అటవీ శాఖ నిరాసక్తత



- పులులు, చిరుతల కదలికల గుర్తింపు, సంరక్షణలో 'కాలర్స్' కీలకం
- ఖరీదు ఎక్కువ కావడంతో దాతలకోసం ఎదురు చూపులు

సాక్షి, హైదరాబాద్: పెద్ద పులులు, చిరుతల సంరక్షణలో కీలకంగా మారిన 'రేడియో కాలర్స్'వినియోగంలో రాష్ట్ర అటవీ శాఖ వెనుకబడిందని విమర్శలు వస్తున్నాయి. పులులు, చిరుతల వంటివి ఎక్కడైనా బోన్లలో చిక్కినా లేదా ఏదైనా ఘటనలో దొరికినా వాటికి రేడియో కాలర్స్ అమర్చి.. వాటి కదలికలను గమనిస్తూ, రక్షణ చర్యలు తీసుకుంటారు. మహారాష్ట్రతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఈ విధానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటుండగా, తెలంగాణలో మాత్రం ఇవి అటవీ శాఖ వద్ద అందుబాటులో లేవని తెలుస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఈ కాలర్స్‌ను పులులు, చిరుతలకు అమర్చిన దాఖలాలే లేవని సమాచారం. ఇటీవలి కాలంలో రెండు చిరుతలను పట్టుకోగా వాటికి కూడా ఈ కాలర్స్‌ను అమర్చలేకపోయారు. ఒక్కో రేడియో కాలర్ ఖరీదు రూ.లక్ష నుంచి లక్షన్నర దాకా ఉండగా.. ఆ మొత్తాన్ని కూడా వెచ్చించలేకనో మరే ఇతర కారణాలతోనో వీటిని కొనుగోలు చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఈ విషయం గురించి సాక్షి అడగ్గా.. ఎవరైనా దాతలు ఆర్థిక సహకారం అందిస్తే వీటిని కొంటామంటూ ఓ అధికారి పేర్కొనడం గమనార్హ. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పెద్దపులుల సంఖ్య 36కు చేరుకోగా, పులుల వృద్ధికి ఇక్కడ అనుకూల పరిస్థితులు ఉన్నట్టు స్పష్టమవుతోంది. అదే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఒక్క రెసిడెంట్ టైగర్ (స్థిరనివాసం ఏర్పరచుకున్న పులి) కూడా లేకపోవడం, గత పదేళ్లలో ఈ ప్రాంతంలో మూడు, నాలుగు పులులు వేటగాళ్ల ఉచ్చులకు బలి కావడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.



గుంటూరులోని గంటలమ్మ చెట్టు వీధిలో ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారిని బంగారు చీరతో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వరలక్ష్మీ వ్రతం చేసుకున్నారు.
– సాక్షి, గుంటూరు

'వేతన బకాయిలు చెల్లించండి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో కొనసాగుతున్న మహిళా శక్తి కేంద్రాల సోషల్ కౌన్సిలర్లు, లీగల్ కౌన్సిలర్లు, పోలీస్ కానిస్టేబుళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. 2019 ఏప్రిల్ నుంచి వీరికి వేతనాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషన్.. తక్షణమే చెల్లించడంతో పాటు నివేదిక కూడా అందజేయాలని ఆదేశించింది. ప్రజాసేవలందించే వారికి వేతన చెల్లింపుల్లో జాప్యం చేయడం .. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వారి జీవనోపాధి, గౌరవంగా జీవించే హక్కులను ఉల్లంఘించడమేనని కమిషన్ వ్యాఖ్యానించింది.

శుక్రవారం నల్లగొండ బస్టాండ్‌లో ఇదీ పరిస్థితి..



సెలవులతో బస్సులు కిటకిట..

నల్లగొండ, చౌటుప్పల్: వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో.. స్వస్థలాలకు వెళ్లేవారితో బస్టాండ్లు, రహదారులు కిక్కిరిసిపోయాయి. నల్లగొండ బస్టాండ్‌లో బస్సులు సరిపోక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. గంటల తరబడి నిలబడి బస్సుల కోసం ఎదురు చూశారు. కిక్కిరిసిన బస్సుల్లో వెళ్లేందుకు నానా తంటాలు పడ్డారు. చిన్నారులను బస్సు కిటికీల్లోంచి లోపలికి ఎక్కించాల్సి వచ్చింది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం విపరీతమైన రద్దీ నెలకొంది. ప్రధానంగా విజయవాడ మార్గంలో.. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు భారీగా వాహనాల రద్దీ నెలకొంది. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జనం నానా తిప్పలు పడ్డారు. ప్రధానంగా జంక్షన్ వద్ద రోడ్డును దాటేందుకు సాహసాలు చేయాల్సి వచ్చింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు భారీగానే మోహరించారు.

పాము కరిచిందని చూపిస్తున్న రాజు



కాటేసిందని పామును చంపాడు.. వైద్యులు దగ్గరకు వెళ్తే కరవలేదని తేల్చారు



వర్ధన్నపేట: పాము కాటు వేసిందనే భయంతో.. ఒక వ్యక్తి ఆ పామును చంపి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. నందనం గ్రామానికి చెందిన ఉల్లెంగుల రాజు ప్రస్తుతం అదే మండలం రాంనగర్ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలోని ఇంటి వద్ద పాము తన కాలు మీదుగా వెళ్లడంతో భయాందోళనకు గురయ్యాడు. కాటు వేసిందో.. లేదో తెలియక అయోమయానికి గురైన రాజు.. ఆ పామును చంపాడు. అనంతరం ప్లాస్టిక్ కవర్‌లో పామును భద్రపరచి.. సహచర సిబ్బందితో కలిసి వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. ప్లాస్టిక్ కవర్‌లో పామును చూసిన వైద్యులు ఆశ్చర్యపోయారు. రాజును పరీక్షించి అతని శరీరంపై ఎలాంటి పాము కాటు వేయలేదని నిర్ధారించారు. ప్రథమ చికిత్స చేసి అతన్ని ఇంటికి పంపారు.



మూసీ ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తివేత

కేతేపల్లి: మూసీనదికి వరద పోటెత్తింది. దీంతో అధికారులు శుక్రవారం నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టు ఐదు క్రస్ట్‌గేట్లను పైకెత్తి నీటిని దిగువకు వదిలారు. హైదరాబాద్ నగరంతోపాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మూసీ ప్రాజెక్టుకు 13,546 క్యూసెక్కులకు వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 643.50 అడుగుల (గరిష్ట నీటిమట్టం 645 అడుగులు) వద్ద స్థిరంగా ఉంచుతూ.. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. 4.46 టీఎంసీల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

అప్‌స్ట్రీమ్ ఎర్త్‌డ్యామ్‌కు ప్రమాదం పొంచి ఉంది

సింగూరు ప్రాజెక్టును సందర్శించిన ఉన్నతస్థాయి ఇంజనీర్ల బృందం



సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇంజనీర్ల బృందం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/పుల్‌కల్: సింగూరు ప్రాజెక్టును రాష్ట్ర ఉన్నతస్థాయి ఇంజనీర్ల బృందం శుక్రవారం పరిశీలించింది. ప్రాజెక్టు లోపలి భాగంలోని మట్టికట్టకు (అప్‌స్ట్రీమ్ ఎర్త్ డ్యామ్) ప్రమాదం పొంచి ఉందని ఇంజనీర్ల బృందం నిర్ధారణకు వచ్చింది. డ్యామ్‌కు తాత్కాలిక మరమ్మతులు, నీటినిల్వ సామర్థ్యంపై రెండు మూడు రోజుల్లో నివేదిక అందజేస్తామని ఇంజనీర్ల బృందం తెలిపింది. గేట్లు, గేట్ల రూఫ్‌లు, కూలిన ప్యారాపిట్ వాల్‌ను పరిశీలించింది. ఉన్నతస్థాయి ఇంజనీర్ల బృందం వెంట డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈ మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

ఇన్‌ఫ్లో అంతా దిగువకే...

సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వ విషయంలో నీటి పారుదలశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఏ క్షణమైనా గండి పడే ప్రమాదం ఉందని డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానెల్ హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్న వరద నీటినంతా ఆపకుండా., ఎప్పటికప్పుడు దిగువకు వదలాలని ఆ శాఖ నిర్ణయించింది. ప్రాజెక్టులో 21 టీఎంసీల నీటినే నిల్వ చేయనున్నారు. ఇంత కంటే ఎక్కువ నీటిని నింపితే, ప్రాజెక్టుకు గండి పడి ఆస్తి, ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వను కనీసం పది టీఎంసీలకు తగ్గిస్తేనే మట్టికట్టకు మరమ్మతు పనులు చేసేందుకు వీలు కలుగుతుందని ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

13న బంగాళాఖాతంలో అల్పపీడనం

- ప్రస్తుతం చండీగఢ్, డెహ్రాడూన్ నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి
- రానున్న 3 రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాతం, సమీప ప్రాంతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో సీజనల్ వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఫిరోజ్‌పూర్, చండీగఢ్, డెహ్రాడూన్, కేరి, పాట్నా, బంకురా, దిగా, తూర్పు ఆగ్నేయ దిశలో ఈశాన్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. మరోవైపు దక్షిణ ఆంధ్ర కోస్తా తీరం వద్ద సగటు సముద్ర మట్టం నుంచి 1.5 అండ్ 3.1 కి.మీ. మధ్యలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది ఉత్తర దక్షిణ కోస్తాంధ్ర తీరం నుంచి ఉత్తర శ్రీలంక వరకు తమిళనాడు తీరం గుండా 1.5 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి పడిపోయాయి. అంతకు ముందు వరకు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీ సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం, తేమ శాతం పెరగడంతో ఉక్కపోత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని సూచించింది.

కాస్త పెరిగిన సగటు వర్షపాతం

రాష్ట్రంలో వర్షపాత గణాంకాలు కాస్త పెరిగాయి. గురువారం ఉదయం వరకు 11శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాలు భారీ ఊరటనిచ్చాయి. దీంతో 11 శాతం లోటు కాస్త 5 శాతానికి పతనమైంది. ఈనెల 8వ తేదీ నాటికి రాష్ట్రంలో 41.58 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 39.41సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 3.05 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుత నైరుతి సీజన్‌లో ఇదే అతిపెద్ద వర్షమని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 6.66 సెంటీమీటర్లు, ఆ తర్వాత జనగామ జిల్లాలో 6.64 సెంటీమీటర్లు, హైదరాబాద్ జిల్లాలో 6.56 సె.మీ., హనుమకొండ జిల్లాలో 5.33 సె.మీ., సూర్యాపేట జిల్లాలో 5.32 సె.మీ., రంగారెడ్డి జిల్లాలో 5.21 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా.. .22 జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిశాయి. 6 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.



ఆర్మీ అన్నలకు 'రాఖీ' సెల్యూట్!

కళ్ల ఎదుటే ఉన్న అన్నకు చెల్లెలెలాగూ రాఖీ కడుతుంది.

'అండగా ఉండన్నా' అంటూ అన్నదమ్ముల్ని అడుగుతుంది.

కానీ... కొందరు అన్నలు అక్కడెక్కడో సుదూర మంచు పర్వత సానువుల్లోనో, ఎగిరి పడే రేణువుల ఎర్రటెడారి ఇసుకల్లోనే గస్తీ తిరుగుతూ ఉంటారు.

అప్రమత్తంగా ఉంటూ అనునిత్యం మన సరిహద్దులకు కాపలా కాస్తూ ఉంటారు.

వాళ్లకు ఏ చెల్లెమ్మలూ కనబడరు. ఏ అక్కలకూ వాళ్లందుబాటులో ఉండరు. అయితే...

సొంత అన్నదమ్ములైనా అవసరమైనప్పుడు రక్షణ కల్పించడానికి వస్తారో రారోగానీ ఆ సోదరులు మాత్రం ఎవరు రాఖీ కట్టినా కట్టకున్నా... శత్రువుల నుంచి నిర్భీతిగా నిత్యరక్షణకవచంలా నిరంతరమూ మనకడ్డుగా నిలబడిపోతుంటారు.

వాళ్లే మన సరిహద్దులను అనుక్షణం రక్షిస్తుండే మన ఆర్మీ జవాన్లు!

ఆ ఆర్మీ అన్నలకు చెల్లెళ్ల ప్రేమానురాగాలు తప్పక దక్కాలనే సంకల్పంతో కొందరు చెల్లెళ్లు గత 28 ఏళ్లుగా ప్రయాసపడుతునే ఉన్నారు. వాళ్లు పడే ఈ ప్రయాస ప్రాధాన్యమేమింటే... వాళ్లకు అత్యంత ఆనందాన్నిచ్చే ఓ అందమైన శ్రమ. ఆ చెల్లెళ్లు మరెవరో కాదు... మహారాష్ట్ర జలగావ్‌లోని 'ఇందిరాగాంధీ సెకండరీ స్కూల్'కు చెందిన విద్యార్థినులు.

ఒకటీ రెండేళ్లుగా కాదు... అసిధారావ్రతంలా అచ్చంగా గత ఇరవయ్యెనిమిదేళ్లుగా సైనిక సోదరులకిలా రాఖీలు పంపుతున్నారు. వాటిని ఆ విద్యార్థినులు ఇంకెవరినుంచో తీసుకోరు. మరెక్కణ్నుంచో కొనరు.

స్వయంగా తమ చేతులతో ప్రేమగా తయారు చేస్తారు. ఇందుకు కావాల్సిన ముడి సరుకులనూ తమ పాకెట్ మనీతోనే కొంటారు. ఇలా ప్రతి ఏడాదీ వాళ్లు కనీసం 28,000 లకు తగ్గకుండా రాఖీలు తయారు చేసి పంపుతూ రక్షాబంధన్ పండుగ వేడుకలకు నిజమైన సంప్రదాయాన్నీ, స్ఫూర్తినీ అద్దుతున్నారు.

వంద నుంచి వేలాది రూపాయల వరకు...

ఓ చెల్లి తన అన్నకు రాఖీ కట్టాక ఉద్వేగాలను అదుపులో ఉంచుతూ ఆ అన్న తనకున్నంతలో తన చెల్లెలికిచ్చే బహుమతులు వంద రూపాయల నుంచి వేలలో ఉంటాయి. ఉదాహరణకు వంద రూపాయలలోపు వచ్చే రిబ్బన్‌ర్యాప్‌లో కట్టిన చాక్లెట్ బాక్సునో, రెండొందల్లో వచ్చే ఆమె పేరులోని మొదటక్షరమో, ఆమె రాశీచక్రపు గుర్తుతో దొరికే కీచైనో, వెయ్యి రూపాయల విలువైన వన్ గ్రామ్ గోల్డ్ గొలుసో, రెండువేల విలువైన డ్రస్సు– దుపట్టానో, పదివేల విలువ చేసే పెండెంటో లేదా లక్షల విలువ చేసే నిజం బంగారమో ఏదో ఒకటి రిటన్ గిఫ్టుగా ఇచ్చేందుకు ఇప్పుడు మార్కెట్లో రెడీలీ అవైలబుల్ గిఫ్టులు ఎన్నో ఉన్నాయి.

మరి ఆ ఆర్మీ అన్నయ్యలేమిస్తారో...

ఎర్రటెండల్లో వాచీతో పాటు రాఖీని చూసినపుడు తగిలే చల్లగాలి తెమ్మెరలాంటి హర్షోల్లాసపు ఆహ్లాదభావన ఆ చెల్లెలు అందించే గిఫ్ట్ అయితే...

గస్తీ పనిలో భాగంగా పర్వతసానువులపైన పైపైకిపాకేవేళల... మణికట్టుపై కట్టి ఉన్న ఆ రాఖీని చూసినప్పుడు... ఆ తెలిమంచు తెరలపై తన చెల్లెలి ముఖం కనిపిస్తే కంటికి అడ్డుపడే ఆ కన్నీటితెరతోపాటు సంతోషాలు ఉబికి వస్తుండటమే ఆ అన్నయ్యిచ్చే అమూల్యమైన రిటర్న్ గిఫ్ట్. దేశరక్షణతో పాటు మనకు అది అదనం.

– యాసీన్

● స్ఫూర్తి

అమృతమూర్తి

పుట్టే బిడ్డకు రోగ నిరోధక శక్తినిచ్చేది తల్లి పాలు. ఇదే పోషకాహారం కూడా. అందాన్ని కాపాడుకునేందుకు కొద్దిమంది తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వడం మానేసిన ఈ రోజులలో తిరుచ్చికి చెందిన బృంద నెలల తక్కువతో పుట్టే బిడ్డలకు అమృత మూర్తి అయ్యారు. తమిళనాడులోని తిరుచ్చి ప్రభుత్వ మహాత్మా గాంధి స్మారక ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లి పాల బ్యాంక్‌కు 300.17 లీటర్ల పాలను దానం చేసి రికార్డులోకి ఎక్కారు. తిరుచ్చి కాట్టూరుకు చెందిన సెల్వ బృంద (34) ఇద్దరు బిడ్డల తల్లి.

తల్లి పాలు పిల్లలకు శ్రేయస్కరం అని చాటే విధంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది బృంద. పసి బిడ్డల పాలిట అమృత మూర్తిగా ఉన్న సెల్వ బృంద దాన గుణానికి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఆమెకు 'అమృతం ఫౌండేషన్' అండగా నిలిచింది.

'సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలు, వ్యక్తిగత కారణాల వల్ల తల్లులు పాలను దానం చేయడానికి ముందుకు రావడం లేదు. తొలి నాళ్లలో నన్ను చాలా మంది తక్కువగా అంచనా వేశారు. నిరాశపరిచే మాటలు వినిపించేవి. అయినా వెనక్కి తగ్గలేదు. తల్లిపాల దానంపై అవగాహన విస్తృతం కావాలి. పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలి' అంటుంది సెల్వ బృంద.

– అస్మతీన్ మైదీన్, సాక్షి–చెన్నై



సోదరికి ఎప్పటికీ రక్షణగా ఉండాలని సోదరుడు అనుకుంటాడు. సోదరుడు ఎప్పుడూ క్షేమంగా ఉండాలని కోరుకుంటుంది సోదరి. హవీష్, నిఖిల అలాంటి అన్నాచెల్లెళ్లే. అయితే... సోదరికి ఎప్పటికీ రక్షణగా ఉంటానని భరోసా ఇవ్వడంతో పాటు 'నిన్ను నువ్వు కాపాడుకునేంత ధైర్యం నీలో ఉండాలి... ఎవరి మీదా ఆధారపడకూడదు' అని కూడా చెబుతుంటారు హవీష్. అలాగే... అన్నయ్యను ఎవరైనా ఏమైనా అంటే... వాళ్లను ఏమాత్రం క్షమించరు నిఖిల. 'నువ్విలా, జీనియస్, రామ్‌లీల' తదితర చిత్రాల్లో నటించిన హవీష్ ప్రస్తుతం 'నేను రెడీ'లో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా తన చెల్లెలు నిఖిలను నిర్మాతగా పరిచయం చేస్తున్నారు. నేడు 'రాఖీ పండగ' సందర్భంగా ఈ అన్నాచెల్లెళ్లు 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పిన విశేషాలు.


● నిఖిల, హవీష్

భవిష్యత్‌లో నా చెల్లెలే నా మదర్ – హవీష్

మా అన్నయ్య నాకు ఫాదర్ ఫిగర్ – నిఖిల

హవీష్: రాఖీ పండగకి ఎక్కడున్నా సరే నిఖిల నన్ను కలిసి, రాఖీ కడుతుంది. నా చేతికి తను రాఖీ కడుతున్నప్పుడు 'నువ్వు క్షేమంగా ఉండాలి. ఎప్పటికీ నీకు రక్షణగా ఉంటాను' అని అనుకుంటాను. అయితే రక్షణగా ఉండటం అంటే తనని నా మీద ఆధారపడేలా చేయడం కాదు. లైఫ్‌లో ఏ విషయాన్నయినా హ్యాండిల్ చేసే నేర్పు, ధైర్యం తనకి ఉండాలి. అదే చెల్లితో చెబుతాను.

నిఖిల: 'నీ లైఫ్ లాంగ్ నువ్వు క్షేమంగా ఉండాలి. ఏ విషయంలో అయినా నీకు తోడుగా ఉంటాను' అనుకుంటూ అన్నయ్య చేతికి రాఖీ కడుతుంటాను. 'డిపెండ్ కావొద్దు' అని అంటుంటాడు. కానీ ఏ క్షణంలో అయినా నీకు నేను తోడుగా ఉంటాననే భరోసాను అన్నయ్య ఇస్తాడు.

హవీష్: నా చెల్లెలు అనే కాదు... ఏ అమ్మాయికి అయినా నేను ఒకటే చెబుతాను. మీరు అనుకున్నది సాధించడానికి రాజీపడొద్దు. 'అమ్మాయి కదా ఏం చేస్తుందిలే... అమ్మాయిలు ఇలాంటి ఉద్యోగానికి పనికి రారు' అని సొసైటీలో ఓ అభిప్రాయం ఉంది. అయితే అమ్మాయిలు ఎంత పెద్ద బాధ్యత అయినా సమర్థవంతంగా స్వీకరించగలరు.

నిఖిల: అన్నయ్య చెప్పిన ఈ మాటతో నేను ఏకీ భవిస్తున్నాను. 'నేను సంపాదించుకుంటేనే' అనే పరిస్థితి నాకు లేదు. అయినప్పటికీ నా అవసరాల కోసం నేను సంపాదించుకుంటే ఆ తృప్తి, ధైర్యం వేరు.

హవీష్: యాక్చువల్లీ చెల్లి బిజినెస్ ఫీల్డ్‌లో ఉంది. గవర్నమెంట్ కాంట్రాక్ట్స్ కూడా చేస్తుంటుంది. సినిమా ప్రొడక్షన్ డిఫరెంట్ అయినప్పటికీ నేను హీరోగా నటిస్తున్న 'నేను రెడీ' సినిమాని ప్రొడ్యూస్ చేయమన్నాను. రెండే రోజుల్లో గ్రిప్ తెచ్చేసుకుని పర్ఫెక్ట్‌గా షూటింగ్ షెడ్యూల్స్ ప్లాన్ చేస్తోంది.

నిఖిల: ప్రొడ్యూసర్‌గా 'నేను రెడీ' నా ఫస్ట్ మూవీ. ప్రొడక్షన్ చూసుకోమని అన్నయ్యే ఎంకరేజ్ చేశాడు. హీరోగా నటిస్తూ, ప్రొడక్షన్ కూడా చూసుకుంటే యాక్టింగ్ మీద ఫుల్ ఫోకస్ పెట్టలేనని తనకి అనిపించింది. దాంతో నన్ను అడిగాడు... వెంటనే ఓకే అన్నాను.

హవీష్: నా చిన్నప్పుడు నన్నెవరైనా ఏమైనా అన్నారని తెలిస్తే... నాక్కూడా చెప్పకుండా వెళ్లి వార్నింగ్ ఇచ్చి, ఆ తర్వాత నాకు చెప్పేది. కానీ మా ఇద్దరికీ ఒకే ఒక్క విషయంలో పడేది కాదు. ఎప్పుడూ తను స్కూల్‌కి లేటే. తనవల్ల నేనూ గేటు బయట నిలబడాల్సి వచ్చేది. కోపం పట్టలేక కొట్టేవాణ్ణి (నవ్వుతూ).

నిఖిల: చిన్నప్పుడు ఆ ఒక్క విషయంలో తప్ప మాకు వేరే గొడవలేం ఉండేవి కావు. ఇప్పుడు సినిమా ప్రొడక్షన్ విషయంలో మళ్లీ గొడవలు మొదలయ్యాయి (నవ్వుతూ). డైరెక్టర్ త్రినాథరావు గారికి నేను కొంచెం ఉత్సాహంగా ఏదైనా చెప్పబోతే అన్నయ్యకి నచ్చదు. డైరెక్టర్ ఏది చెబితే అది చేయాలన్నది తన మైండ్‌సెట్.

హవీష్: నా చెల్లెలు నా సినిమాని నిర్మించడం ఈ రాఖీకి తను నాకు ఇస్తున్న బెస్ట్ గిఫ్ట్.

నిఖిల: 'నేను రెడీ'ని 'ది బెస్ట్' సినిమాగా చేసి, అన్నయ్యకి గిఫ్ట్ ఇస్తాను.

– డి.జి. భవాని

నా పెళ్లి ప్లాన్ అంతా తనదే

నిఖిల: నాది లవ్ మ్యారేజ్. నా భర్త తెలుగు అయినప్పటికీ తమిళనాడులో పుట్టి, అక్కడే పెరిగారు. మా పేరెంట్స్ ఓకే అన్నారు కానీ, తెలుగు తెలియని వ్యక్తితో ఎలా మాట్లాడాలి? అంటూ అన్నయ్య పెద్దగా ఇష్టపడలేదు. అయితే నా ఇష్టాన్ని కాదనలేదు. పెళ్లికి ఏ థీమ్ అయితే బాగుంటుంది? ఎలాంటి వేదిక ఏర్పాటు చేయించాలి? ఫుడ్ మెనూ ఎలా ఉంటే బాగుంటుంది... ఇలా ప్రతిదీ దగ్గరుండి బాగా ప్లాన్ చేసి, ఓ తండ్రిలా నిలబడి చేశాడు. నా చిన్నప్పట్నుంచి మా అన్నయ్య నాకు 'ఫాదర్ ఫిగర్'లా ఉన్నాడు.

నాకు పెళ్లి చేసుకునే ఆలోచన లేదు

హవీష్: నాకు పెళ్లి చేసుకోవాలని లేదు. మ్యారేజ్ అంటే పెద్దగా నమ్మకం లేదు. మరి... భవిష్యత్‌లో నిన్నెవరు చూసుకుంటారు? అని ఎవరైనా అడిగితే 'మా చెల్లి' అని చెబుతాను. ఇప్పుడు నా పేరెంట్స్‌తో ఉంటున్నాను. ఫ్యూచర్‌లో నా చెల్లెలే నాకు మదర్.

నిఖిల: అవును... చూసుకుంటాను. అయితే పెళ్లి చేసుకోమని తనని ఒత్తిడి చేయను. నా చిన్నప్పట్నుంచి నన్ను తండ్రిలా చూసుకుంటున్నాడు. భవిష్యత్‌లో నేను తనని తల్లిలా చూసుకుంటాను.


సాక్షి సినిమా

పేరు జడల్


● నాని

'ది ప్యారడైజ్' సినిమా కోసం రగ్డ్ అండ్ స్టైలిష్ అవతార్‌తో జడల్‌గా మారిపోయారు నాని. 'దసరా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. హైదరాబాద్–సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో రాఘవ్ జుయల్ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో జడల్ అనే పాత్రలో నాని నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఈ పాత్ర తాలూకు కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. 'వాడి పేరు జడల్' అంటూ ఈ లుక్‌ను 'ఎక్స్'లో షేర్ చేశారు నాని. ''అంతర్జాతీయ స్థాయిలో 'ది ప్యారడైజ్' సినిమా విడుదలై, భారతీయ సినిమాను గ్లోబల్ మ్యాప్‌లో మరింత ఎత్తుకు తీసుకెళ్లేలా ఉంటుంది. ఈ చిత్రాన్ని 2026 మార్చి 26న విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

మైథలాజికల్ థ్రిల్లర్


● సుధీర్‌బాబు, సోనాక్షీ సిన్హా

లోభం వర్సెస్ త్యాగం, చీకటి వర్సెస్ దైవత్వం... ఇవి ప్రధానాంశాలుగా రూపొందుతున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ సినిమా 'జటాధర'. సుధీర్‌బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఉమేష్ కుమార్ బన్సల్, ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్పా సింగాల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం 'జటాధర' సినిమా టీజర్‌ను హీరో ప్రభాస్ విడుదల చేశారు.

వినూత్న కథాంశంతో...

అంజలి లీడ్ రోల్‌లో ఓ లేడీ ఓరియంటెడ్ మూవీకి శ్రీకారం జరిగింది. 9 క్రియేషన్స్ నిర్మాణంలో రాజశేఖర్ రెడ్డి పులిచెర్ల దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగాయి. ఈ చిత్రానికి రాజచంద్రశేఖర్ రెడ్డి నిర్మాత. ''సుడిగాలి సుధీర్‌తో 'సాఫ్ట్‌వేర్ సుధీర్, గాలోడు' వంటి కమర్షియల్‌గా విజయం సాధించిన చిత్రాలు తెరకెక్కించిన రాజశేఖర్ రెడ్డి ఓ వినూత్న కథాంశాన్ని సిద్ధం చేశారు. ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ ఆయన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ని త్వరలో ప్రారంభిస్తాం'' అని రాజచంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సి. రాంప్రసాద్.


● రాజశేఖర్ రెడ్డి, అంజలి, రాజచంద్రశేఖర్ రెడ్డి



● ఎల్విన్, రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఆయన తమ్ముడు ఎల్విన్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'బుల్లెట్టు బండి'. ఇన్నాసి పాండియన్ దర్శకత్వంలో ఈ సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీని కదిరేసన్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, టీజర్ బాగుందని చిత్రబృందాన్ని అభినందించారు. ఇన్నాసి పాండియన్ మాట్లాడుతూ– ''ఇది ఫుల్ లెంగ్త్ సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్. 1980, 90ల్లో ఓ వెలుగు వెలిగిన డిస్కో శాంతి శ్రీహరి ఈ సినిమాలో ఒక ముఖ్య పాత్ర చేశారు. 28 ఏళ్ల తర్వాత ఆమె సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనున్న సినిమా ఇదే. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తాం'' అని చెప్పారు.

కనకావతి


రుక్మిణీ వసంత్

వరమహాలక్ష్మి పండగ సందర్భంగా కనకావతిగా కనిపించారు రుక్మిణీ వసంత్. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కాంతార: చాప్టర్1'. ఈ చిత్రంలో కనకావతి పాత్రలో హీరోయిన్ రుక్మిణీ వసంత్ నటించినట్లుగా వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. హోంబలే ఫిలిమ్స్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా, కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో అక్టోబరు 2న విడుదల కానుంది. ఇక రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'కాంతార' (2022)కు ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' రూపొందిన సంగతి తెలిసిందే.

అమ్మాయి గౌరవం పెంచేలా...


● వర్ష బొల్లమ్మ

హీరోయిన్ వర్ష బొల్లమ్మ టైటిల్ రోల్‌లో నటించిన యాక్షన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'కానిస్టేబుల్ కనకం'. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 14 నుంచి ఈటీవీ విన్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా 'కానిస్టేబుల్ కనకం' ట్రైలర్‌ను చిరంజీవి విడుదల చేశారు. ఈ సిరీస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ– ''ఒక అమ్మాయి గౌరవం పెంచేలా ఈ సిరీస్ ఉంటుంది. నాకు కానిస్టేబుల్ కనకం రోల్ ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు. ''ఈ కథను నాకంటే ఎక్కువగా నమ్మిన సాయికృష్ణ, నితిన్‌గార్లకు ధన్యవాదాలు'' అని తెలిపారు ప్రశాంత్. ''ఈ సిరీస్‌ను వీక్షకులు తప్పక చూడండి'' అని పేర్కొన్నారు సత్య సాయిబాబా.

పెళ్ళిలో ట్విస్ట్


● గణేశ్, ఆకాశ్, శ్రీకాంత్ సంబరం

శివ సాయిరిషి, సంస్కృతి గోరే, విష్ణుప్రియ, ఉమా మహేశ్వరరావు, తనికెళ్ల భరణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పెళ్ళిలో పెళ్ళి'. శ్రీకాంత్ సంబరం దర్శకత్వంలో గౌరి ఫిలింస్, సుఖకర్త ఫిలింస్‌లపై కె. గణేశ్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరగ్గా, తనికెళ్ల భరణి, హీరో ఆకాశ్ జగన్నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో శివ సాయిరిషి మాట్లాడుతూ– ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అని కోరారు. ''షోలాపూర్‌కు తెలుగు వాళ్లు వెళ్లి వందేళ్లవుతోంది. కానీ అక్కడి నుంచి ఒక తెలుగు సినిమా చేసింది మాత్రం మేమే. ఎంఎల్ రాజాగారి మ్యూజిక్ ఈ సినిమాకు సోల్‌లాంటిది. ఈ చిత్రం మా అందరికీ ఓ ఎమోషనల్ జర్నీ'' అన్నారు శ్రీకాంత్ సంబరం. ''ఈ కథలో ట్విస్ట్ ఏంటనేది ఇంకా నాకు కూడా తెలియదు. నేనూ ఆడియన్స్‌తో పాటే థియేటర్స్‌లో చూస్తాను'' అన్నారు నిర్మాత గణేశ్. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎల్ రాజా, హీరోయిన్ సంస్కృతి గోరే, నటి దివిజ పాల్గొన్నారు.

షూటింగ్‌లు ఆపండి – నిర్మాతలకు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఆదేశం?

తెలుగు సినిమా నిర్మాతలు – కార్మికుల సంఘం నాయకుల మధ్య జరుగుతున్న వేతనాల పెంపునకు సంబంధించిన సమస్య పరిష్కారం కాకముందే తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి మరో కీలక నిర్ణయం తీసుకుందనే వార్త వెలుగులోకి వచ్చింది.

''మా అనుమతి లేకుండా షూటింగ్స్ జరపకూడదు'' అన్నట్లుగా నిర్మాతలను ఆదేశిస్తూ తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి విడుదల చేసిన ఓ లేఖ ప్రచారంలోకి వచ్చింది. దీనికి కారణం... 30 శాతం వేతనం పెంపుకి అంగీకరించిన కొందరు నిర్మాతల షూటింగ్స్‌కి కార్మికులు హాజరు కావడమే అని తెలుస్తోంది.

వేతన పెంపు కోరుతూ తెలుగు చలన చిత్ర కార్మికుల సంఘం బంద్‌కి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మరో రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అవుతుందని అందరూ భావిస్తున్న తరుణంలో ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తన అనుమతి లేకుండా ఎలాంటి షూటింగ్స్ జరపవద్దని నిర్మాతలను ఆదేశించడం చర్చనీయాంశమైంది. ఇక సమ్మె వల్ల నిర్మాతలకు రోజుకి రూ. కోటిన్నర నష్టం వాటిల్లుతోందంటూ సివిల్ కోర్టులో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కేసు వేయడం మరో వివాదానికి దారి తీసింది. సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్న దశలో విశ్వప్రసాద్ కేసులు వేయడం దారుణమని ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు పేర్కొన్నారు. తెలుగు సినీ కార్మికులందరూ విశ్వప్రసాద్ తీరుపై ఆగ్రహంతో ఉన్నారని, పని కట్టుకుని తమ మీద కేసులు వేయడం బాధాకరమని అమ్మిరాజు అన్నారు. విశ్వప్రసాద్ వేసిన కేసులపై తమ లీగల్ టీమ్ చూసుకుంటుందని, ఫెడరేషన్ ఆఫీస్ నుంచి ఛాంబర్ వరకూ కార్మికులందరూ ధర్నా చేస్తామని కూడా అమ్మిరాజు తెలిపారు. ఇక తెలుగు చలన చిత్రపరిశ్రమలోని ఈ తాజా సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందనేది వేచి చూడాల్సిందే.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
ఆగస్టు 8న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,01,310	1,04,420	1,03,310	1,04,420	1,00,750	1,03,300
బంగారం (22 క్యారెట్లు)	94,000	94,700	94,700	97,540	92,690	94,700
వెండి	1,18,300	1,18,300	1,27,000	1,18,300	1,17,800	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
765	233
79,857	24,363

విదేశీ సూచీలు


నాస్‌డాక్	21,441	▲	198
డోజోన్స్	44,213	▲	244
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,089	▽	12
డాక్స్	24,199	▲	6
షాంఘై	3,635	▽	5
నికాయ్	41,820	▲	761

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.15	88.17
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.74
€	యూరో	ఎస్‌బీఐ	100.80	103.59
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.76	60.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.03	58.29
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.89	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.49	23.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.98	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.33	13.15

కనకం.. కొత్త శిఖరం!



కొనసాగుతున్న రికార్డు పరుగు...

- ఢిల్లీలో ధర రూ.1,03,420; రూ.800 అప్
- అంతర్జాతీయంగా ఔన్స్ 3,534 డాలర్లకు...

న్యూఢిల్లీ: అమెరికా విధానాల కారణంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. వరుసగా రెండో రోజు కొనుగోళ్ల మద్దతుతో బంగారం దేశీయంగా నూతన జీవితకాల గరిష్టానికి (ఆల్‌టైమ్ హై) చేరుకుంది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.800 పెరిగి రూ.1,03,420 స్థాయికి చేరింది. గురువారం ఒక్కరోజే రూ.3,600 పెరగడం తెలిసిందే. ముఖ్యంగా గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో రూ.5,800 లాభపడింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.800 పెరిగి రూ.1,03,000ను తాకింది. మరోవైపు వెండి కిలోకి రూ.1,000 పెరిగి రూ.1,15,000కు చేరుకుంది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో వెండి సైతం రూ.5,500 పెరిగింది. ''స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి అయ్యే కిలో, 100 ఔన్స్‌ల బంగారం బిస్కెట్లపై 39 శాతం టారిఫ్‌లను అమెరికా ప్రకటించడం కీలక సరఫరా మార్గంపై ప్రభావం చూపించింది. బులియన్ మార్కెట్లలో తాజా అస్థిరతలకు ఆజ్యం పోసింది. బంగారం రిఫైనరీకి కీలక మార్కెట్ అయిన స్విట్జర్లాండ్‌పై అమెరికా టారిఫ్‌లు విధించడం సరఫరాలపరంగా అనిశ్చితికి దారితీసింది. దీనికి తోడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య సురక్షిత సాధనమైన బంగారానికి తిరిగి డిమాండ్ ఏర్పడింది'' అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ప్రకటించిన టారిఫ్‌లు అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలకు దారితీశాయని, ఇవి బంగారం ధరల పెరుగుదలకు కారణమైనట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. యూఎస్ ఫెడ్ సెప్టెంబర్‌లో రేట్ల కోతను చేపట్టొచ్చన్న అంచనాలు సైతం పెరిగినట్టు చెప్పారు. కాగా, అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ బంగారం 3,534 డాలర్ల వద్ద నూతన జీవితకాల గరిష్టాన్ని తాకి.. 3,500 డాలర్ల పైన ట్రేడ్ అవుతోంది.

ఎస్‌బీఐ లాభం అప్

క్యూ1 లాభం రూ. 21,201 కోట్లు



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 21,201 కోట్లను తాకింది. ట్రెజరీ, ఫారెక్స్ ఆదాయం ఇందుకు తోడ్పడింది. స్టాండెలోన్ నికర లాభం రూ. 17,035 కోట్ల నుంచి రూ. 19,160 కోట్లకు పుంజుకుంది. రుణాల్లో 11.6 శాతం వృద్ధి సాధించినప్పటికీ నికర వడ్డీ ఆదాయం నామమాత్ర క్షీణతతో రూ. 41,072 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్లు(ఎన్‌ఐఎం) 0.33 శాతం నీరసించి 3.02 శాతానికి చేరాయి.

ఇతర ఆదాయం జూమ్

సమీక్షా కాలంలో ఎస్‌బీఐ వడ్డీయేతర ఆదాయం 55 శాతం జంప్‌చేసి రూ. 17,346 కోట్లకు చేరడం లాభాలకు సహకరించినట్లు శెట్టి వివరించారు. ఇందుకు 352 శాతం పెరిగిన ఫారెక్స్ ఆదాయం(రూ. 1,632 కోట్లు), పెట్టుబడుల విక్రయంపై లభించిన రూ. 6,326 కోట్లు(144 శాతం వృద్ధి) ప్రధానంగా తోడ్పడినట్లు పేర్కొన్నారు. మరోవైపు వ్యయాలను(రూ. 27,874 కోట్లు) 8 శాతానికి పరిమితం చేయడం సైతం ఇందుకు జత కలసినట్లు వెల్లడించారు. ఈ కాలంలో తాజా స్లిప్పేజీలు రూ. 7,945 కోట్లను తాకగా.. ప్రొవిజన్లు రూ. 3,449 కోట్ల నుంచి రూ. 4,759 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) యథాతథంగా 1.83 శాతానికి చేరాయి. కనీస మూలధన నిష్పత్తి 14.63% గా నమోదైంది. అనుబంధ సంస్థలలో ఎస్‌బీఐ లైఫ్ నికర లాభం రూ. 520 కోట్ల నుంచి రూ. 594 కోట్లకు వృద్ధి చూపగా.. ఎస్‌బీఐ కార్డ్ లాభం రూ. 594 కోట్ల నుంచి రూ. 556 కోట్లకు క్షీణించింది. జనరల్ ఇన్సూరెన్స్ నుంచి రూ. 188 కోట్లు నమోదైంది.

3 శాతం మార్జిన్లపై దృష్టి...

ఈ ఏడాది మార్జిన్లు యూషేప్‌లో కదులుతున్నాయి. రెండో త్రైమాసికంలోనూ సవాళ్లకు అవకాశమున్నప్పటికీ ద్వితీయార్ధం నుంచి మెరుగుపడనున్నాయి. వార్షిక ప్రాతిపదికన పూర్తి ఏడాదికి 3 శాతం మార్జిన్లు లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతిపాదన లుసహా రూ. 7 లక్షల కోట్ల రుణాలను విడుదల చేయవలసి ఉంది. రాజకీయ, భౌగోళిక అనిశ్చి తులు రుణాల విడుదలలో ఆలస్యానికి కారణమవుతున్నాయి. ఈ ఏడాది కార్పొరేట్ రుణాల్లో 10 శాతం వృద్ధి నమోదయ్యే వీలుంది. యూఎస్ టారిఫ్‌లతో ప్రభావితమయ్యే 4–5 రంగాలకు ప్రత్యక్షంగా రుణాలందించినప్పటికీ వీటి వాటా 2 శాతమేకావడంతో బ్యాంక్‌పై ప్రభావం ఉండబోదు. ఐటీ నిపుణుల ఉద్యోగాలలో కోతల ప్రభావం సైతం ఉండబోదు. అధిక శాతం రిటైల్ రుణాలు ప్రభుత్వోద్యోగులకే ఇచ్చాం.

– సీఎస్ శెట్టి, చైర్మన్, ఎస్‌బీఐ

ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు యథాతథంగా రూ. 805 వద్ద ముగిసింది.

టాటా మోటార్స్ రివర్స్ గేర్



క్యూ1 లాభం రూ. 4,003 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం 62% క్షీణించి రూ. 4,003 కోట్లను తాకింది. యూఎస్ టారిఫ్‌లతో జేఎల్‌ఆర్ లాభాలు తగ్గడం, అమ్మకాలు క్షీణించడం, అధిక బేస్ తదితర అంశాలు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 10,587 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,07,102 కోట్ల నుంచి రూ. 1,04,407 కోట్లకు నీరసించింది. గతంలో అంటే 2024 ఏప్రిల్‌లో పూర్తి అనుబంధ సంస్థ టాటా మోటార్స్ ఫైనాన్స్‌ను టాటా క్యాపిటల్(టీసీఎల్)లో విలీనం చేయడంతో రూ. 8,016 కోట్ల టీసీఎల్ ఈక్విటీ షేర్లను అందుకుంది. తద్వారా రూ. 4,975 కోట్ల లాభం జమ చేసుకుంది. ఇది అధిక బేస్‌కు కారణం.

జేఎల్‌ఆర్ తీరిలా: యూకే, ఈయూలో తయారైన కార్లపై యూఎస్ టారిఫ్‌ల కారణంగా బ్రిటిష్ అనుబంధ కంపెనీ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్‌ఆర్) ఆదాయం 9% తగ్గి 6.6 బిలియన్ పౌండ్లకు పరిమితమైంది. టారిఫ్‌ల వల్ల జేఎల్‌ఆర్‌పై 25 కోట్ల పౌండ్ల ప్రభావం పడినట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ చెప్పారు. తదుపరి తరం ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై 3.8 బిలియన్ పౌండ్లను ఇన్వెస్ట్ చేయనున్నట్లు జేఎల్‌ఆర్ సీఈవో అడ్రియన్ మార్డెల్ పేర్కొన్నారు.

టాటా మోటార్స్ షేరు 2.2% క్షీణించి రూ. 633 వద్ద ముగిసింది.

80,000 దిగువకు సెన్సెక్స్

- టారిఫ్ విధింపు ఆందోళనలు
- ఎఫ్‌ఐఐల అమ్మకాల ప్రభావం
- నిఫ్టీకి 233 పాయింట్ల నష్టం
- 3 నెలల కనిష్టానికి స్టాక్ సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం మూడు నెలల కనిష్ఠం వద్ద ముగిశాయి. భారత్ దిగుమతులపై ట్రంప్ అదనపు వాణిజ్య సుంకాన్ని 50 శాతానికి పెంచడం, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 765 పాయింట్లు కోల్పోయి 80 వేల దిగువున 79,857 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 233 పాయింట్లు పతనమై 24,363 వద్ద నిలిచింది. ఇటీవల విడుదలైన దేశీయ కార్పొరేట్ క్యూ1 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడమూ ఒత్తిడి పెంచింది. ఉదయమే బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 847 పాయింట్లు కోల్పోయి 79,776 వద్ద, నిఫ్టీ 259 పాయింట్లు కుప్పకూలి 24,337 వద్ద కనిష్టాన్ని తాకాయి. సూచీల 1% పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.440.63 లక్షల కోట్లకు దిగివచ్చింది. ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్ 1–3% క్షీణించి సూచీల పతనాన్ని శాసించాయి.
- మెటల్, రియల్టీ షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు చోటు చేసుకున్నాయి. బీఎస్‌ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో రియల్టీ, టెలికమ్యూనికేషన్ 2%, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీ సూచీలు ఒకటిన్నర శాతం నష్టపోయాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.50%, స్మాల్ క్యాప్ సూచీ 1% పతనమయ్యాయి.
- క్యూ1లో నికర లాభం 5% వృద్ధితో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి నమోదుపై విశ్వాసం వ్యక్తం చేయడంతో ఎల్‌ఐసీ షేరు 3% పెరిగి రూ.913 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలి | ఎలక్ట్రిక్ వాహన అమ్మకాల్లో జోష్

ఓపెన్ ఏఐ నుంచి జీపీటీ 5

- కంపెనీకి అతి పెద్ద మార్కెట్‌గా మారనున్న భారత్
- సంస్థ సీఈవో ఆల్ట్‌మన్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రస్తుతం అంతర్జాతీయంగా తమకు అతి పెద్ద మార్కెట్లలో రెండో స్థానంలో ఉన్న భారత్ త్వరలోనే అగ్రస్థానానికి చేరుతుందని ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్లో ప్రజలు, వ్యాపార సంస్థలు గణనీయ స్థాయిలో కృత్రిమ మేధను వినియోగిస్తున్నాయని ఆయన వివరించారు. కొత్త తరం మోడల్ జీపీటీ–5ని ఆల్ట్‌మన్ ఆవిష్కరించారు. ఇది అందరికీ ఉచితమని వివరించారు. తాము మరిన్ని ఉత్పత్తులను భారత మార్కెట్లో ప్రజలకు ఏఐని మరింతగా అందుబాటులోకి తేవడంపై కసరత్తు చేస్తున్నామని, స్థానిక భాగస్వాములతో కూడా కలిసి పని చేస్తున్నామని ఆల్ట్‌మన్ చెప్పారు. జీపీటీ–5 గురించి వివరిస్తూ, కోడింగ్.. ఏజెంటిక్ టాస్క్‌లకు ఇప్పటివరకు వచ్చిన మోడల్స్‌లో ఇది అత్యుత్తమమైనదని వివరించారు. డెవలపర్లకు మరింత వెసులుబాటు లభించేలా ఏపీఐలో జీపీటీ–5, జీపీటీ–5–మినీ, జీపీటీ–5–నానో అని మూడు విధాలుగా ఇది అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కొత్త మోడల్ 12 భారతీయ భాషలను అర్థం చేసుకోగలుగుతుందని ఆల్ట్‌మన్ చెప్పారు. ఉచిత, ప్లస్, ప్రో యూజర్లకు జీపీటీ–5 ఆగస్టు 7 నుంచి అందుబాటులోకి రాగా, ఎంటర్‌ప్రైజ్.. ఎడ్యుకేషన్ యూజర్ల సెగ్మెంట్‌కు వారం తర్వాత నుంచి లభిస్తుందని వివరించారు.

సాక్షి స్పోర్ట్స్



మనిక బత్రాకు నిరాశ

యోకోహామా (జపాన్): వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్స్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రాకు నిరాశ ఎదురైంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 52వ ర్యాంకర్ మనిక 16–18, 8–11, 10–12తో ప్రపంచ 24వ ర్యాంకర్ ఆస్ట్రేలియా ప్లేయర్ యాంగ్‌జి లియు చేతిలో ఓడిపోయింది. 29 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మనిక మొత్తం 34 పాయింట్లు గెలిచింది. ఇందులో తన సర్వీస్‌లో 14, ప్రత్యర్థి సర్వీస్‌లో 20 పాయింట్లు ఉన్నాయి. మనిక తొలి గేమ్‌లో ఒకదశలో 9–4తో ఆధిక్యంలో నిలిచింది. అయితే కీలకదశలో తప్పిదాలు చేసి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లో మనిక ఆరంభంలోనే వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయి కోలుకోలేకపోయింది. మూడో గేమ్‌లో స్కోరు 10–10 వద్ద మనిక వరుసగా రెండు పాయింట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకుంది. మనికకు 4,500 డాలర్ల (రూ. 3 లక్షల 93 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

చెన్నైతో అశ్విన్ కటీఫ్!

జట్టు నుంచి తప్పుకునే యోచనలో స్పిన్నర్



చెన్నై: సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్–2026కు ముందు కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమయ్యాడు. తన సొంత జట్టులాంటి చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) నుంచి అతను తప్పుకోవాలనే యోచనలో ఉన్నాడు. ఈ విషయాన్ని అతను సీఎస్‌కే మేనేజ్‌మెంట్‌తో ఇప్పటికే చర్చించాడు. ఆటగాళ్లను అట్టిపెట్టుకునే కటాఫ్ తేదీకి ముందు సాధారణంగా అన్ని జట్లూ తమ ఆటగాళ్లతో భేటీ అవుతాయి. ఇందులో భాగంగానే జరిగిన సమావేశంలో అశ్విన్ తన మనసులో మాటను చెప్పాడు. అతని నిర్ణయం వెనుక కారణాలు తెలియకపోయినా... త్వరలోనే దీనిపై సీఎస్‌కే స్పష్టత నివ్వనుంది. మరో సమాచారం ప్రకారం వచ్చే ఏడాది కోసం జట్టు పునర్నిర్మాణంలో భాగంగా అశ్విన్‌ను తప్పించాలని మేనేజ్‌మెంట్ స్వయంగా భావిస్తోంది. దీంతో అశ్విన్ కూడా మరో జట్టు వైపు చూస్తున్నాడు. 'కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్' సమస్య రాకూడదని సీఎస్‌కే ఆధ్వర్యంలోని అకాడమీ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ పదవికి కూడా అశ్విన్ రాజీనామా చేసే అవకాశం ఉంది. 2025 సీజన్‌లో చెత్త ప్రదర్శనతో చెన్నై చివరి స్థానంలో నిలిచింది. 9 మ్యాచ్‌లే ఆడిన అశ్విన్ ఏకంగా 9.12 ఎకానమీతో 7 వికెట్లే తీయగలిగాడు.

సీఎస్‌కే దిద్దిన స్టార్...

చెన్నై సూపర్ కింగ్స్ అతి పెద్ద మ్యాచ్ విన్నర్‌లలో ఒకడిగా అశ్విన్ గుర్తింపు పొందాడు. తొలిసారి అతను 2009లో సీఎస్‌కే టీమ్ ద్వారానే లీగ్‌లో అడుగు పెట్టాడు. రెండు సీజన్లు నిలకడైన ప్రదర్శన, ధోని అండతో అతనికి భారత జట్టులో స్థానం దక్కింది. 2010, 2011లో సీఎస్‌కే టైటిల్స్ సాధించడంలో అతను కీలకపాత్ర పోషించాడు. వరుసగా ఏడేళ్ల పాటు 2015 వరకు చెన్నైకి ఆడిన అనంతరం ఆ తర్వాత ఎనిమిది సీజన్లు వరుసగా రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లకు అశ్విన్ ప్రాతినిధ్యం వహించాడు. 2025 వేలంలో రూ.9 కోట్ల 75 లక్షల మొత్తానికి చెన్నై అతడిని మళ్లీ సొంతం చేసుకుంది. సూపర్ కింగ్స్ తరఫున 106 మ్యాచ్‌లు ఆడిన అశ్విన్ 6.68 ఎకానమీతో 97 వికెట్లు తీశాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో అతను 221 మ్యాచ్‌లలో 7.20 ఎకానమీతో 187 వికెట్లు పడగొట్టాడు. 39 ఏళ్ల అశ్విన్ గత డిసెంబర్‌లో ఆస్ట్రేలియాపై అడిలైడ్‌తో టెస్టు మ్యాచ్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు.

అర్జున్ గేమ్ 'డ్రా'



చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ 'మాస్టర్స్' కేటగిరీలో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. జోర్డాన్ వాన్ ఫారెస్ట్ (నెదర్లాండ్స్)తో శుక్రవారం జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను అర్జున్ 42 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్ వరుసగా రెండో విజయం నమోదు చేశాడు. భారత గ్రాండ్‌మాస్టర్ వి.ప్రణవ్‌తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌లో కీమెర్ 46 ఎత్తుల్లో గెలిచాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతితో జరిగిన గేమ్‌లో అమెరికా ప్లేయర్ రే రాబ్సన్ 54 ఎత్తుల్లో విజయం సాధించాడు. కార్తికేయన్ మురళీ (భారత్)–లియాంగ్ (అమెరికా) గేమ్ 42 ఎత్తుల్లో... అనీశ్ గిరి (నెదర్లాండ్స్)–నిహాల్ సరీన్ (భారత్) గేమ్ 60 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి.

హారిక ఓటమి

ఇదే వేదికపై జరుగుతున్న చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ 'చాలెంజర్స్' టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్‌కు చెందిన ద్రోణవల్లి హారిక వరుసగా రెండో ఓటమిని చవిచూసింది. భారత్‌కే చెందిన ఇనియన్‌తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌లో హారిక 39 ఎత్తుల్లో ఓడిపోయింది. అభిమన్యు పురాణిక్ (భారత్) 48 ఎత్తుల్లో లియోన్ ల్యూక్ (భారత్)పై గెలిచాడు. వైశాలి (భారత్)–ఆధిబన్ (భారత్) గేమ్ 36 ఎత్తుల్లో... ప్రాణేశ్ (భారత్)–దీప్తాయన్ ఘోష్ (భారత్) గేమ్ 29 ఎత్తుల్లో... ఆర్యన్ చోప్రా (భారత్)–హర్షవర్ధన్ (భారత్) గేమ్ 21 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి.

ఇంగ్లండ్‌లో పాక్ క్రికెటర్ హైదర్ అలీ అరెస్ట్

- ప్రస్తుతం బెయిల్‌పై విడుదల
- సస్పెండ్ చేసిన పీసీబీ



లండన్: పాకిస్తాన్ క్రికెట్ క్రీడేతర వ్యవహారాలతో మరోమారు వార్తల్లో నిలిచింది. ఈసారి ఏకంగా తీవ్రమైన నేరారోపణతో పాక్ క్రికెటర్ హైదర్ అలీని ఇంగ్లండ్‌లో అరెస్ట్ చేశారు. అతను అత్యాచారానికి పాల్పడినట్లుగా గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు (జీఎంపీ) కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతానికి అతన్ని బెయిల్‌పై విడుదల చేసినప్పటికీ పాస్‌పోర్ట్‌ను సీజ్ చేయడంతో స్వదేశానికి చేరుకునే అవకాశం మాత్రం లేదు. పాకిస్తాన్ షాహిన్స్ ('ఎ' జట్టు) ఇంగ్లండ్‌లో పర్యటించింది. ఈ 'ఎ' జట్టులో 24 ఏళ్ల బ్యాటర్ హైదర్ అలీ కూడా ఉన్నాడు. ఇంగ్లండ్ టూర్ గత నెల 17 మొదలై ఈ నెల 6న ముగిసింది. ఇందులో భాగంగా 2 మూడు రోజుల మ్యాచ్‌లు, మరో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడింది. పర్యటన పూర్తవడంతో ఆటగాళ్లంతా పాక్ చేరుకున్నారు. అయితే కెప్టెన్ సౌద్ షకీల్‌తో పాటు హైదర్ అలీలు మాత్రం ఇంగ్లండ్‌లోనే ఉన్నారు. బెయిల్‌పై విడుదలకు ముందే అతని పాస్‌పోర్ట్‌ను మాంచెస్టర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రిమినల్ కేసు నమోదైన హైదర్ అలీని తక్షణం సస్పెండ్ చేస్తున్నట్లు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వెల్లడించింది. ఇంగ్లండ్ పోలీసులు చేసే దర్యాప్తునకు పీసీబీ సహకరిస్తుందని, అలాగే తమ క్రికెటర్‌కు న్యాయ సాయం చేస్తామని చెప్పింది. చిత్రంగా హైదర్ అలీ క్రికెట్ కెరీర్ మొదలైన చోటే అరెస్టు కూడా జరిగింది. 2020లో మాంచెస్టర్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టి20లోనే అతను అరంగేట్రం చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో 2 వన్డేలు సహా ఇప్పటివరకు 35 టి20లు ఆడాడు.

ఇంతకీ ఏం జరిగింది?

పాకిస్తాన్ షాహిన్స్ జట్టు సభ్యుడైన హైదర్ అలీ పాక్ సంతతికి చెందిన ఓ బాలికను అత్యాచారం చేసినట్లు తెలిసింది. గత నెల 23న మాంచెస్టర్ నగర పరిధిలో బాలికపై అత్యాచారానికి పాల్పడగా, ఆలస్యంగా... సోమవారం (ఈ నెల 4న) ఫిర్యాదు రావడంతో వెంటనే బెకెన్‌హామ్ మైదానంలో ఉన్న హైదర్ అలీని అరెస్టు చేశారు. ఈ మైదానంలోనే ఇంగ్లండ్‌కు చెందిన ఎంసీఎస్‌ఏసీ జట్టుతో పాకిస్తాన్ షాహిన్స్ జట్టు మ్యాచ్‌లాడింది. కేసు విచారణ దశలోనే ఉండటంతో హైదర్ పేరును ఇంగ్లండ్ పోలీసులు వెల్లడించడం లేదు. గతంలో కోవిడ్ ప్రొటోకాల్‌ను అతిక్రమించడంతో 2021లో పాక్ బోర్డు సస్పెన్షన్ వేటు వేసింది. అయితే ఈసారి అతనిపై విదేశంలో క్రిమినల్ కేసు నమోదైంది. సరిగ్గా 15 ఏళ్ల క్రితం 2010లో లండన్‌లో వెలుగు చూసిన స్పాట్ ఫిక్సింగ్ కేసులో ముగ్గురు పాక్ క్రికెటర్లు సల్మాన్ భట్, ఆమిర్, ఆసిఫ్‌లు ఫిక్సింగ్‌కు పాల్పడి జైలు శిక్ష కూడా అనుభవించారు.

10 స్వర్ణాలపై భారత బాక్సర్ల గురి

బ్యాంకాక్: ఆసియా అండర్–19 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 10 మంది భారత బాక్సర్లు ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఇందులో ఏడుగురు మహిళా బాక్సర్లు ఉన్నారు. మహిళల విభాగంలో నిషా (54 కేజీలు), ముస్కాన్ (57 కేజీలు), వినీ (60 కేజీలు), నిషా (65 కేజీలు), ఆర్తి కుమారి (75 కేజీలు), ప్రాచీ (80+కేజీలు), కృతిక (80 కేజీలు) తుది పోరుకు అర్హత సాధించి కనీసం రజత పతకాలు ఖాయం చేసుకున్నారు. పురుషుల విభాగంలో మౌసమ్ సుహాగ్ (65 కేజీలు), రాహుల్ (75 కేజీలు), హేమంత్ సాంగ్వాన్ (90 కేజీలు) ఫైనల్‌కు చేరారు. మహిళల సెమీఫైనల్స్‌లో నిషా 5–0తో హిమారి వటనబె (జపాన్)పై, వినీ 5–0తో రియుక్సు లీ (చైనా)పై, నిషా 5–0తో జియూ బావో (చైనా)పై, ముస్కాన్ 4–1తో జియాన్ వాంగ్ (చైనా)పై, ప్రాచీ 3–2తో సనినా (కజకిస్తాన్)పై విజయాలు సాధించారు. పురుషుల సెమీఫైనల్స్‌లో మౌసమ్ 5–0తో అక్షాన్ హాషిమి (ఇరాన్)పై, రాహుల్ 5–0తో నూర్ సుల్తాన్ (కజకిస్తాన్)పై, హేమంత్ 5–0తో క్యూరి హె (చైనా)పై గెలిచి ఫైనల్ చేరారు. మహిళల విభాగంలో యషిక (51 కేజీలు), ఆకాంక్ష (70 కేజీలు)... పురుషుల విభాగంలో శివమ్ (55 కేజీలు), గౌరవ్ (85 కేజీలు) సెమీఫైనల్స్‌లో ఓడి కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

తొలిసారి రెండేళ్ల నిషేధం... రెండోసారి జీవితకాలం!

న్యూఢిల్లీ: భారత క్రీడారంగంలో సుదీర్ఘ కాలంగా ఉన్న సమస్య ఆటగాళ్లు తమ వయసును తప్పుగా చూపించడం. నకిలీ వయోధ్రువీకరణ పత్రాలతో ఎంతోమంది ఇతర వయోవిభాగాల పోటీల్లో పాల్గొని వాటి ద్వారా ప్రయోజనం పొందారు. వైద్యపరీక్షల్లో అప్పుడప్పుడు ఇలాంటి కేసులు కొన్ని పట్టుబడినా... కఠినమైన శిక్షలు లేక అందరూ బయటపడిపోయారు. అయితే ఇప్పుడు దీనిని నిలువరించేందుకు ప్రభుత్వం 'ఎన్‌సీఏఏఎఫ్‌ఎస్' పేరుతో కొత్తగా నేషనల్ కోడ్‌ను తీసుకువస్తోంది. ఈ కోడ్‌కు సంబంధించిన ముసాయిదాను గత మార్చిలోనే

వయసును తప్పుగా చూపిస్తే తీవ్ర చర్యలు

రూపొందించిన ప్రభుత్వం... ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలు కోరింది. అనంతరం వయో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. కేంద్ర క్రీడా శాఖ వద్ద తమ పేరును నమోదు చేసుకున్న ఆటగాడు ఎవరైనా బర్త్ సర్టిఫికెట్, ఆధార్, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. వీటి విశ్వసనీయతను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) పరీక్షిస్తుంది. అంతా బాగుంటే ఈ పుట్టిన తేదీనే శాశ్వతంగా రికార్డుల్లోకి చేరుస్తారు. ఆటగాడి కెరీర్ ముగిసే వరకు ఇదే తేదీ ప్రామాణికంగా మారుతుంది. ఆటగాడు తన వయసును తప్పుగా చూపించాడని తేలితే మొదటిసారి రెండేళ్ల నిషేధాన్ని విధిస్తారు. రెండోసారి కూడా ఇదే తప్పు చేసినట్లు తేలితే జీవితకాల నిషేధం విధించి భారతీయ న్యాయ సంహిత ప్రకారం కేసు కూడా నమోదు చేస్తారు. ఇప్పటికే రిజిస్టర్ అయిన ఆటగాళ్లలో ఎవరైనా తమ వయసును తప్పుగా నమోదు చేసి ఉంటే... కోడ్ అమల్లోకి వచ్చిన ఆరు నెలల్లోగా స్వచ్ఛందంగా తామే చెప్పి దానిని సరి చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు.


R.V. TOURS AND TRAVELS PVT. LTD.
12-6-11/4, 3rd Floor, Bhagyanagar Complex, Opp. BJP Office, Metro Pillar No. 822, Kukatpally, Hyderabad - 5000072
R.V. TOURS AND TRAVELS WINTER
BUMPER OFFERS
2N / 3D షిరిడి-త్రయంబకేశ్వర్ 6,999/- +5% GST Per Person
2N / 3D ఢిల్లీ-హరిద్వార్ 8,999/- +5% GST Per Person
2N / 3D ఢిల్లీ-ఆగ్రా 9,499/- +5% GST Per Person
3N / 4D గోవా 9,999/- +5% GST Per Person
3N / 4D మైసూర్-కూర్గ్ 11,999/- +5% GST Per Person
3N / 4D కేరళ 12,999/- +5% GST Per Person
3N / 4D నైనిటాల్-జిమ్ కార్బెట్ 12,999/- +5% GST Per Person
3N / 4D మురుడేశ్వర్-గోకర్ణ 12,999/- +5% GST Per Person
3N / 4D గుజరాత్ 12,999/- +5% GST Per Person
3N / 4D జైపూర్-ఉదయ్ పూర్ 12,999/- +5% GST Per Person
3N / 4D బెంగుళూరు-చిక్ మంగళూరు 12,999/- +5% GST Per Person
3N / 4D రామేశ్వరం 13,999/- +5% GST Per Person
SPECIAL OFFER
కాశీ - అయోధ్య 3N / 4D 9,999/- +5% GST Per Person
బ్యాంకాక్-పట్టాయా 4 N /5 D 35,999/- (ఫ్లైట్ ప్యాకేజీ) +5% GST + 5% TCS Per Person
6N / 7D ఫుకెట్ - క్రాబి Ex. Hyderabad (ఫ్లైట్ ప్యాకేజీ) 49,999/- +5% GST Per Person
6N / 7D వియత్నం - బాలి (ఫ్లైట్ ప్యాకేజీ) 90,000/- +5% GST+5% TCS Per Person
7N / 8D శ్రీలంక - దుబాయ్ (ఫ్లైట్ ప్యాకేజీ) 99,999/- +5% GST+5% TCS Per Person
6N / 7D ప్యారిస్ -స్విజర్లాండ్ (ఫ్లైట్ ప్యాకేజీ) 2,45,000/- +5% GST+5% TCS Per Person
13N / 14D యూరోప్ (ఫ్లైట్ ప్యాకేజీ) 3,25,000/- +5% GST + 5% TCS Per Person
5N / 6D సింగపూర్ మలేషియా (ఫ్లైట్ ప్యాకేజీ) 1,06,000/- +5% GST + 5% TCS Per Person
3N / 4D దుబాయ్ (ఫ్లైట్ ప్యాకేజీ) 79,999/- +5% GST + 5% TCS Per Person
5N / 6D శ్రీలంక (ఫ్లైట్ ప్యాకేజీ) 57,000/- +5% GST + 5% TCS Per Person
10N / 11D కంబోడియా - వియత్నాం (ఫ్లైట్ ప్యాకేజీ) 1,75,000/- +5% GST + 5% TCS Per Person
4N / 5D బాలి (ఫ్లైట్ ప్యాకేజీ) 79,999/- +5% GST + 5% TCS Per Person
4N / 5D అండమాన్ స్పెషల్ Ex. Vizag (ఫ్లైట్ ప్యాకేజీ) 39,999/- +5% GST Per Person
4N / 5D వియాత్నం (ఫ్లైట్ ప్యాకేజీ) 69,999/- +5% GST Per Person
*T&C Apply
4N / 5D సిమ్లా - మనాలి (స్పెషల్ ప్యాకేజీ) 16,999/- +5% GST Per Person
4N / 5D కేరళ (ఫ్లైట్ ప్యాకేజీ) 39,999/- +5% GST Per Person
6N / 7D కాశ్మీర్ (స్పెషల్ ప్యాకేజీ) 39,000/- +5% GST Per Person
11N / 12D చార్ధామ్ (ఫ్లైట్ ప్యాకేజీ) 59,800/- +5% GST Per Person
7N / 8D తమిళనాడు (ఫ్లైట్ ప్యాకేజీ) 48,900/- +5% GST Per Person
6N / 7D కర్ణాటక (ఫ్లైట్ ప్యాకేజీ) 42,000/- +5% GST Per Person
R.V. Ramana Garu
Chairman & Founder
Contact: 9154225674, 8712036636, 8712018330, 9063843410

ఫార్మాపైనా.. టారిఫ్ పిడుగు?

భారతదేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నామని ప్రకటించిన అమెరికా... రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొంటున్నదన్న కారణంతో మరో 25 శాతం పెనాల్టీ సుంకాలు కూడా విధించింది. వెరసి ఈ 50 శాతం సుంకాలూ ఈ నెల్లోనే అమల్లోకి రానున్నాయి. దీనివల్ల చాలా భారత కంపెనీలు తమ ఉత్పత్తుల ధరల్ని పెంచాలి. ఇలా పెంచితే మిగతా దేశాల నుంచి ఎదురయ్యే పోటీలో వెనకబడిపోవచ్చు. ఇవన్నీ పలు కంపెనీల ఆదాయాలకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. సెక్షన్ 232 ప్రకారం దిగుమతి సుంకాల నుంచి ఫార్మా సహా కొన్ని ఉత్పత్తులకు మినహాయింపు ఉండటంతో ఫార్మా కంపెనీలు ప్రస్తుతానికి ధీమాగానే ఉన్నాయి. కానీ ఫార్మాను కూడా సుంకాల్లో చేరుస్తామని, 250 శాతం టారిఫ్‌లు వేస్తామని ట్రంప్ వార్నింగ్‌లు ఇస్తున్నారు. ఇదే జరిగితే అమెరికాయే ప్రధాన ఆదాయ వనరుగా సాగుతున్న పలు భారత ఫార్మా కంపెనీలకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. అమెరికా జనరిక్ డ్రగ్ మార్కెట్లో భారత్‌ది ఏకంగా 33 శాతం వాటా. టారిఫ్‌లు గనక వర్తిస్తే మన కంపెనీలకు ఎదురయ్యే ఇబ్బందులపై 'సాక్షి బిజినెస్' ప్రత్యేక కథనమిది...

- సాక్షి బిజినెస్ డెస్క్

ప్రస్తుతానికైతే సెక్షన్ 232 ప్రకారం ఫార్మాకు మినహాయింపు

కానీ.. భారీగా టారిఫ్‌లు తప్పవంటూ ట్రంప్ వార్నింగ్

ఇదే జరిగితే భారత కంపెనీలకు ఎదురుదెబ్బే



పోటీ పెరిగి... ఆదాయాలు 17–20 శాతం పడిపోయే ప్రమాదం

వ్యూహాత్మక టేకోవర్లు, స్థానిక కంపెనీలతో డీల్స్‌కు అవకాశం

కొన్ని భారత కంపెనీలకు పూర్తిగా అమెరికా మార్కెట్టే ఆధారం





ఇవీ.. మన సానుకూలతలు

- మన దేశంలో కార్మికుల వ్యయాలు తక్కువ. నిపుణుల లభ్యత ఎక్కువ. టెక్నాలజీ కూడా ఉంది. అందుకనే యూఎస్ ఎఫ్‌డీఏ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను భారత ఫార్మా సంస్థలు తయారు చేయగలుగుతున్నాయి. అమెరికా మార్కెట్లో ధరలపరమైన ఒత్తిళ్లు ఉన్నప్పటికీ మన కంపెనీలు గట్టి పోటీనివ్వగలుగుతున్నాయి.
- అమెరికా మార్కెట్లో అమ్ముడుపోయే ప్రతి మూడు జనరిక్ ఔషధాల్లో ఒకటి భారత కంపెనీలు సరఫరా చేస్తున్నదేనంటే... కారణమిదే
- మన ఫార్మా రంగం గనక 25– 50 శాతం టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి వస్తే అప్పుడు మన ఔషధాలు అమెరికా మార్కెట్లో ప్రియమవుతాయి. ధరల పరంగా ఉన్న వెసులుబాటు తగ్గిపోతుంది.
- తక్కువ ధరలకే ఉత్పత్తులు విక్రయించే అవకాశం పోయినట్లయితే... పోటీలో వెనకబడే ప్రమాదం ఉంటుంది. తక్కువ మార్జిన్ ఉండే జనరిక్స్‌లో ఇది మరింత సుస్పష్టం.

ఆదాయం, లాభాలకు గండి

- చాలా ఫార్మా సంస్థల ఆదాయాల్లో అమెరికా మార్కెట్ వాటా 30–55 శాతం వరకు ఉంటోంది.
- అరబిందో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, లుపిన్, సిప్లా, గ్లాండ్ ఫార్మా తదితర సంస్థలపై అధిక ప్రభావం పడుతుంది.
- కనీసం 17 శాతం వరకు ఆదాయాలు తగ్గిపోతాయన్నది విశ్లేషకుల అంచనా.

వ్యూహాత్మక అడుగులు

- ఫార్మా ఉత్పత్తులపై సుంకాలు విధిస్తే... అమెరికాలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేయటం.. అక్కడి కంపెనీలను కొనుగోలు చేయటం వంటి ప్రత్యామ్నాయాలను మన కంపెనీలు పరిశీలించే అవకాశం ఉంటుందన్నది నిపుణుల మాట. అరబిందో ఫార్మా ఇటీవలే యూఎస్‌కు చెందిన లానెట్ ఫార్మాను 250 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయడాన్ని ఈ కోణంలో చూడొచ్చు.
- ప్రత్యామ్నాయ మార్కెట్లలో... అంటే యూరప్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా మార్కెట్లో అవకాశాలపై ఫార్మా కంపెనీలు దృష్టి పెట్టొచ్చు.
- అమెరికా మార్కెట్‌పై ఆధారపడడాన్ని తగ్గించేందుకు కొత్త ఆవిష్కరణలు, బయోసిమిలర్స్, స్పెషాలిటీ డ్రగ్స్ దిశగా కంపెనీలు అడుగులు వేయొచ్చు.
- ప్రభుత్వాల మధ్య ఫార్మా డీల్స్ కోసం లాబీయింగ్ చేయొచ్చు.

సింహ భాగం అమెరికా నుంచే..

2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత ఫార్మా మొత్తం ఎగుమతులు 30.47 బిలియన్ డాలర్లయితే... అందులో 9.8 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అమెరికాకే వెళ్లాయి. అంటే.. మూడో వంతు ఔషధాలు అమెరికాకే వెళ్లాయి. ఈ సమయంలో అమెరికా మార్కెట్ నుంచే అత్యధిక ఆదాయాన్ని పొందిన కొన్ని భారత ఫార్మా కంపెనీలను చూస్తే...

కంపెనీ	అమెరికా నుంచి ఆదాయం	కంపెనీ ప్రత్యేకత
అరబిందో ఫార్మా	48%	హైదరాబాద్‌కు చెందిన ఈ కంపెనీ జనరిక్స్, ఏపీఐ మార్కెట్లో దిగ్గజ సంస్థ
పిరమల్ ఫార్మా	41%	ఇన్హలేషన్ అనెస్థిటిక్స్‌లో కీలకంగా ఉంది
గ్లాండ్ ఫార్మా	54%	హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈ సంస్థది కాంప్లెక్స్ ఇంజెక్టబుల్స్ సరఫరాలో కీలక పాత్ర.
సన్‌ఫార్మా	32%	డెర్మటో-జనరిక్స్‌లో ప్రధాన ఎగుమతిదారు
డాక్టర్ రెడ్డీస్	47% (జనరిక్స్)	అమెరికా మార్కెట్‌కు జనరిక్స్‌లో భారీ ఎగుమతులు చేస్తోంది

ఫార్మా ఉత్పత్తులపైనా టారిఫ్‌లు బాదేస్తే.. అమెరికా మార్కెట్‌లో కీలకంగా పనిచేస్తున్న ఈ కంపెనీల ఆదాయాలపై గణనీయమైన ప్రభావం పడనుంది. సన్‌ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, బయోకాన్ సంస్థలకు 17 శాతం వరకు ఆదాయం తగ్గొచ్చన్నది విశ్లేషకుల మాట. దివీస్ ల్యాబొరేటరీస్ ఇటీవలే ప్రకటించిన జూన్ త్రైమాసికం ఫలితాలు నిరుత్సాహకరంగా ఉన్నాయి. అమెరికా మార్కెట్లో తలెత్తిన ధరలపరమైన ఒత్తిళ్ల వల్లే ఇలా జరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

ఏ దేశం నుంచి పోటీ ఉండొచ్చు?

చైనా

- యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్స్ (ఏపీఐ) మార్కెట్లో బలంగా ఉంది.
- భారత ఫార్మా సంస్థలు ఫార్ములేషన్లపై ప్రధానంగా దృష్టి సారించడంతో ఏపీఐ మార్కెట్లో చైనా వాటా పెరిగింది.
- చైనా మందులపై అమెరికాలో నమ్మకం తక్కువ. కోవిడ్ తరవాత ఇది మరింత పెరిగింది కూడా.
- నాణ్యత, నమ్మకం, నియంత్రణల పరమైన అంశాల కారణంగా ఫార్మా విషయంలో భారత్ స్థానాన్ని చైనా భర్తీ చేయలేదు.

మెక్సికో

- అమెరికా మార్కెట్లోకి పన్నుల్లేకుండా వెళ్లగలగటం మెక్సికోకు ఉన్న సానుకూలత.
- మెక్సికోలో జనరిక్స్ తయారీ సదుపాయాలు తక్కువే. గణనీయంగా ఎగుమతులు చేసే స్థాయిలో లేదు. దగ్గర్లో ఉండడం వల్ల, వాణిజ్య ఒప్పందాల వల్ల భవిష్యత్తులో మార్కెట్‌ను పెంచుకోగలదు.

పోలాండ్, తూర్పు యూరప్

- కాంట్రాక్టు తయారీ పరంగా పోటీనిస్తున్నాయి. ఈయూ నియంత్రణపరమైన నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి.
- భారత్‌తో పోల్చి చూస్తే తయారీ వ్యయాలు బాగా ఎక్కువ. కాకపోతే భౌగోళికంగా చూస్తే అమెరికా, ఈయూకు దగ్గర.
- డిమాండ్‌లో మార్పులతో కొంత లాభపడొచ్చు.

బంగ్లాదేశ్

- తక్కువ ఖర్చుకే జనరిక్స్ ఔషధాలు తయారు చేయడంలో బంగ్లాదేశ్ ముందుంది.
- వెనకబడిన దేశాలకు కల్పించిన 'ట్రిప్స్ వైవర్' కారణంగా ప్రయోజనం పొందగలదు.
- అయితే భారత్‌లో మాదిరి ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ప్లాంట్లు ఇక్కడ చెప్పుకోతగ్గ స్థాయిలో లేవు.
- కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేసి ఎఫ్‌డీఏ ప్రమాణాలను అందుకోవటం అంత తేలిక కాదు.

బ్రెజిల్

- ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఫార్మా మార్కెట్. ఎగుమతి సదుపాయాలు తక్కువే. దేశీయంగా ఉన్న డిమాండ్‌ను అందుకోవటమే ఇక్కడి కంపెనీలకు కష్టం. కనుక భారత ఎగుమతులకు ముప్పు కాదు.

అమెరికా వినియోగదారులపైనే భారం..



భారత ఫార్మా రంగంపై టారిఫ్‌లు విధించడం ప్రతికూల పరిణామాలకు దారి తీస్తుంది. అంతిమంగా అమెరికా వినియోగదారులపైనే భారం పడుతుంది. భారతీయ కంపెనీలు ఎక్కువగా మార్జిన్ లభించని అత్యంత చౌకైన జనరిక్స్‌ను తయారు చేస్తాయి. కాబట్టి, టారిఫ్‌లపరంగా భారం మోపితే అది అమెరికన్ వినియోగదారుల మీదే పడుతుంది. ఉత్పత్తి పరిమాణం, ఖరీదు తదితర అంశాలపరంగా భారత్ తరహా సామర్థ్యాలను సాధించాలంటే కనీసం 3–5 ఏళ్లు పట్టేస్తుంది. దేశీ సంస్థలకు 700 పైగా అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ప్లాంట్లు ఉండగా, 12 శాతం ఆదాయాలను నిబంధనలను పాటించడంపై వెచ్చిస్తున్నాయి.

–నమిత్ జోషి, చైర్మన్, ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఫార్మెక్సిల్

టారిఫ్‌లు తీవ్రంగా ఉండకపోవచ్చు..



గత నాలుగు దశాబ్దాలుగా, భారత ఫార్మా రంగం బాగా పెరిగి అంతర్జాతీయ హెల్త్‌కేర్ సరఫరా వ్యవస్థల్లో కీలకంగా మారింది. మన సంస్థలు ఏపీఐలు, ఇంటర్మీడియట్స్, స్పెషలైజ్డ్ ఫార్ములేషన్లను విస్తృత స్థాయిలో తయారు చేస్తాయి. విశేషమైన నైపుణ్యాలు, తక్కువ ధరకే అందించగలిగే సామర్థ్యాలతో పాటు అమెరికా హెల్త్‌కేర్ వ్యవస్థతో గణనీయంగా అనుసంధానమయ్యాయి. ఒకరిపై ఒకరు ఆధారపడటం వల్లే ప్రస్తుత టారిఫ్ వ్యవస్థలో ఫార్మాకు మినహాయిపు ఉంటోంది. ఈ నేపథ్యంలో మన ఫార్మా మీద మిగతా పరిశ్రమల్లాగా అమెరికా తీవ్ర స్థాయి టారిఫ్‌లు వేయకపోవచ్చు.

– డి. శ్రీనివాస రెడ్డి, చైర్మన్, ఆప్టిమస్ ఫార్మా

మన బలాన్ని మనమూ ఉపయోగించుకోవాలి..



మన ఫార్మాపై టారిఫ్‌లు విధిస్తే ఇవి అమెరికా ప్రయోజనాలకే విఘాతం కలిగిస్తాయి. 2013– 2022 మధ్య పదేళ్లలో మన జనరిక్స్ కారణంగా అమెరికా ఎకానమీకి 1.3 లక్షల కోట్ల డాలర్లు ఆదా అయ్యాయి. 200–250 శాతం స్థాయిలో టారిఫ్‌లు వేయకపోవచ్చు కానీ, మిగతా వాటిలా 50 శాతం వేసినా మన ఫార్మాకు ఇబ్బందికరమైన పరిస్థితే ఉంటుంది. ప్రస్తుతానికైతే జనరిక్స్‌కి సంబంధించి భారత్‌కి ప్రత్యామ్నాయం లేదు. కాబట్టి మనం కూడా మన బలాన్ని ఉపయోగించుకుని, గట్టిగా మాట్లాడాలి.

– రావి ఉదయ భాస్కర్, డైరెక్టర్ జనరల్, అఖిల భారత ఔషధ నియంత్రణ అధికారుల సమాఖ్య (ఏఐడీసీవోసీ)

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


BANTIA
Furnitures
మరింత తెలుసుకోవడానికి స్కాన్ చేయండి
సింగిల్ రిక్లైనర్ సోఫా
MRP ₹32,999
Sale ₹ 8,999
PER DAY EMI ₹18
సఫారీ సోఫా సెట్: 3 + 2 + దివాన్ (8 సీటర్) + ఉచితం సెంటర్ టేబుల్
MRP ₹62,999
Sale ₹ 23,333
PER DAY EMI ₹25
బ్రెజిల్ సోఫా సెట్:
+ ఉచితం సెంటర్ టేబుల్
3+1+1
MRP ₹44,999
Sale ₹ 18,999
PER DAY EMI ₹20
3 + 2 + 1 + దివాన్
Sale ₹ 25,999
PER DAY EMI ₹28
హాయ్: టేకఉడ్ క్వీన్ సైజ్ బెడ్
రూ. 15,000 విలువ గల మ్యాట్రెస్ ఉచితం
కొనుగోలు చేయుటకు స్కాన్ చేయండి
MRP ₹46,999
Sale ₹ 19,999
PER DAY EMI ₹22
స్టోరేజ్‌తో బెడ్ + 10" యూరో టాప్ స్ప్రింగ్ మ్యాట్రెస్ విలువ రూ. 20,000 గలది ఉచితం
MRP ₹42,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
ప్రీమియం క్వాలిటీ క్వీన్ సైజ్ బెడ్
MRP ₹21,499
Sale ₹ 4,999
PER DAY EMI ₹ 5
కింగ్ సైజ్ ₹ 5,999
గ్లాస్ డైనింగ్ టేబుల్ 6 చైర్స్‌తో
MRP ₹47,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
గ్లాస్ డైనింగ్ టేబుల్ 4 చైర్స్‌తో
MRP ₹32,499
Sale ₹ 13,999
PER DAY EMI ₹15
6 చైర్స్‌తో రూ. 21,999
మార్బుల్ డైనింగ్ టేబుల్ 4 చైర్స్‌తో
MRP ₹25,499
Sale ₹ 11,999
PER DAY EMI ₹13
ప్రీమియం క్వాలిటీ వార్డ్ రోబ్
మిర్రర్‌తో 2 డోర్
MRP ₹ 27,449
₹ 8,999
PER DAY EMI ₹10
మిర్రర్‌తో 3 డోర్
₹ 12,999
2 మిర్రర్స్‌తో 4 డోర్ ₹ 16,999


ప్రీ 79th ఇండిపెండెన్స్ డే
SALE
వరకు 79% తగ్గింపు
ఈరోజు & రేపు మాత్రమే !
ఇటాలియన్ ఫుల్ A లెదర్ సోఫా సెట్ : 3+2+1
పూర్తిగా మోటరైజ్డ్ ఎలక్ట్రికల్ రిక్లైనర్ 6 సీటర్
MRP ₹5,09,999
Sale ₹ 1,99,999
PER DAY EMI ₹216
రిక్లైనర్ సోఫా సెట్ : 3+2+1
MRP ₹2,09,999
Sale ₹ 89,999
PER DAY EMI ₹97
ప్రీమియం క్వాలిటీ ఎలక్ట్రిక్ రిక్లైనర్, లాంజర్‌తో
MRP ₹1,59,999
Sale ₹ 69,999
PER DAY EMI ₹75
రిక్లైనర్ సోఫా సెట్ : 2 రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ & కన్సోల్ టేబుల్
MRP ₹1,49,499
Sale ₹ 59,999
PER DAY EMI ₹65
L టైప్ / కార్నర్ సోఫా సెట్ (7 సీటర్)
MRP ₹52,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
రివాల్వింగ్ చైర్
MRP ₹14,279
FREEDOM OFFER
₹ 2,999
విజిటర్ చైర్
MRP ₹11,499
FREEDOM OFFER
₹ 2,999
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ 6 సీటర్ (4 చైర్స్ + 1 బెంచ్)
MRP ₹55,999
Sale ₹ 24,999
PER DAY EMI ₹27
An ISO-9001:2015 Certified Company
BANTIA
Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
79950 00930, 040-27841562 79933 33351
www.bantia.in



పెళ్లి ఖర్చుతో జేబు గుల్ల

ఫంక్షన్ హాళ్లు, వేదిక వ్యయం రూ.లక్షల్లో .. ● భోజనాలకూ అడ్డగోలు ఖర్చు ● అప్పులపాలవుతున్న కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: గతంలో ఇంటి దగ్గరే పెళ్లిళ్లు జరిగేవి. వాకిలి నిండా పచ్చని పందిరి వేసేవారు. పందిళ్ల వేయడానికి, వంటలు వండేందుకు ఇరుగు పొరుగు వాళ్లు, బంధువులు సహకరించేవారు. దీంతో పెద్దగా ఖర్చు ఉండేది కాదు. పెళ్లి కొడుక్కి అమ్మాయి తరపు వారు తమ స్తోమత మేరకు కట్నకానుకలు ఇచ్చేవారు. ఇప్పుడు కట్నకానుకల సంగతి చెప్పనలవి కాదు. పెళ్లి కుదిరి నిశ్చితార్థం జరగకముందే ఫంక్షన్ హాళ్లను వెతకాల్సిన పరిస్థితి. అనుకూలమైన హాల్ దొరికితే.. ఆయా తేదీల్లోనే ముహూర్తాలు పెట్టుకుంటున్నారు. హాళ్లకు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఇక భోజనాల రిస్క్ ఉండొద్దని క్యాటరింగ్‌కు ఇచ్చేస్తున్నారు. తిండికి కూడా రూ.లక్షలకు లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఫంక్షన్ హాళ్లు, వివాహ వేదిక, డెకరేషన్, మేళతాళం, ఫొటో, వీడియోగ్రఫీ, ఆఖరుకు భోజనాలు.. ఇలా అన్నింటికీ అడ్డగోలుగా ఖర్చు చేస్తున్నారు. పెళ్లి ఖర్చు అమ్మాయి కుటుంబం భరిస్తుంటే, పెళ్లి తరువాత అబ్బాయి తరపున రిసెప్షన్‌లకు చేస్తున్న ఖర్చు కూడా తక్కువేం కాదు. కట్నకానుకలు ఎన్ని వచ్చినా, పెళ్లి, రిసెప్షన్‌లకు రూ.లక్షలు ఖర్చు పెడుతున్నారు. కొందరు స్టేటస్ కోసం, మరికొందరు నలుగురిలో తాము తక్కువ కాకూడదని అప్పులు చేసి మరీ పెళ్లిళ్లు చేసి అప్పులపాలవుతున్నారు.

కట్నంగా బంగారం, ఆస్తులు..

పెళ్లి సంబంధం మాట్లాడుకునే క్రమంలో వరకట్నం ముందే మాట్లాడుకుంటారు. గతంలో సంబంధం నచ్చితే ఇరువైపుల పెద్దలు కూర్చుని.. ఎంతో కొంత కట్నం మాట్లాడుకుని సంబంధం ఖాయం చేసేవారు. అప్పట్లో కొంత నగదు, ఆవుదూడ, బంగారం, సైకిల్, గడియారం, రేడియో తదితరాలు కట్నంగా ఇచ్చేవారు. తరువాతి కాలంలో సైకిల్ స్థానంలో సైకిల్ మోటార్లు, ఈమధ్య కార్లు కట్నంగా అడుగుతున్నారు. వరకట్నంలో డబ్బుకు బదులు బంగారం కట్నంగా తీసుకుంటున్నారు. ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, భూములు కూడా కట్నం కింద సమర్పించుకుంటున్నారు. తమ కూతురు గొప్ప ఇంటికి వెళ్లాలన్న ఉద్దేశంతో తమకంటే ఉన్నత కుటుంబంతో వియ్యం అందుకోవాలని చాలామంది తల్లిదండ్రులు అనుకుంటారు. వాళ్ల స్థాయికి తగినట్టు కట్నకానుకలు పెట్టాలని భావిస్తారు. ఇదే సమయంలో చదువు, హోదా, ఉద్యోగం, సంపాదన, ఆస్తులు... ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కట్నకానుకలు మాట్లాడుతున్నారు. కనీసం పది తులాల బంగారం పెట్టాలన్నా రూ.10 లక్షలు ఖర్చు చేయాల్సిందే. ఇతర ఖర్చులకు కూడా ఎక్కువే ఖర్చు చేస్తున్నారు.

ఫంక్షన్ హాళ్ల ఖర్చే ఎక్కువ..

పెళ్లిళ్లలో ఫంక్షన్ హాల్ అద్దె, పెళ్లి మండపాలకు ఎక్కువ మొత్తంలో ఖర్చవుతున్నాయి. మామూలు ఫంక్షన్ హాల్ తక్కువలో తక్కువ రూ.30 వేల నుంచి రూ.లక్ష దాకా అద్దె తీసుకుంటున్నారు. పెద్ద హాళ్లు, ఏసీ హాళ్లయితే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా వసూలు చేస్తున్నారు. పెళ్లి వేదికకు కూడా తక్కువేం కాదు. రూ.లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు తీసుకుంటారు. ఫంక్షన్ హాల్ ఎంట్రన్స్, భోజనాలయాల వద్ద డెకరేషన్‌కు అదనంగా వసూలు చేస్తారు. హాల్ నిర్వహణతో పాటు విద్యుత్ చార్జీలు కూడా రూ.వేలల్లోనే అవుతున్నాయి. దీనికి తోడు విద్యుత్ సరఫరా ఆగిపోయినప్పుడు.. వెంటనే జనరేటర్ సౌకర్యం కల్పించేందుకు అదనంగా తీసుకుంటారు. ఫంక్షన్ హాల్, వేదిక నిర్వహణ అన్నీ కలిపి.. తక్కువలో తక్కువ రూ.లక్ష నుంచి రూ.10 లక్షల దాకా ఖర్చవుతాయి.

అప్పులపాలవుతున్న కుటుంబాలు

కూతురి పెళ్లి గొప్పగా చేయాలని, నలుగురి ముందు మనం గొప్పగా ఉండాలనుకుని చాలామంది ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. పెళ్లికయ్యే ఖర్చు కూడా తిరిగి వచ్చేది కాదని తెలిసినా సరే.. స్టేటస్ కోసం చాలా మంది స్థాయికి మించి ఖర్చు పెడుతున్నారు. దీంతో అప్పులపాలై అవస్థలు పడుతున్నారు. కొందరు పిల్లల పెళ్లిళ్ల కోసం, చేసిన అప్పులు తీర్చడం కోసం ఆస్తులు అమ్ముకున్నారు. సామాన్యులైతే అప్పులు తీర్చే మార్గం కానరాక.. కొందరి కుటుంబాల్లో కలహాలు మొదలై ఆత్మహత్యలు చేసుకున్నవారు లేకపోలేదు.



ఫొటో, వీడియోగ్రఫీ ఖరీదైన వ్యవహారం

పెళ్లి ఫొటోలు, వీడియోలు ఎప్పటికీ గుర్తుండిపోయేలా అల్బంలు, సీడీలు తయారు చేయించుకుంటారు. ఫొటో, వీడియోగ్రఫీలో అనేక ఆధునిక పరికరాలు వచ్చాయి. డ్రోన్ ద్వారా ఫొటోలు, వీడియోలు తీయడం వాటిని మిక్సింగ్, అల్బంలు తయారు చేయడానికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఖర్చవుతున్నాయి. ఈ మధ్య కాలంలో ప్రీ వెడ్డింగ్ షూట్‌ల పేరుతో జరుగుతున్న వ్యవహారం మరింత ఖరీదైపోయింది. మంగళవాయిద్యాలు, వేద పండితులకు కూడా అయ్యే ఖర్చు రెట్టింపయ్యింది. పెళ్లి బట్టలకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు.



క్యాటరింగ్ ఖర్చు ఎక్కువే..


ఇంతకుముందు ఇంటివాళ్లు, చుట్టాలు కలిసి వంటలు చేసేవారు. పెళ్లికి వచ్చిన వారందరికీ కడుపునిండా భోజనం పెట్టి పంపించేవారు. ఇప్పుడు భోజనాల ట్రెండ్ కూడా మారింది. ఎంత మంది వస్తారో అంచనా వేసుకుని.. అంతమందికి ఎన్ని రకాల వంటలు చేయాలి, ఏయే రకం స్వీట్లు పెట్టాలి, మాంసాహారమైతే మటన్, చికెన్, ఫిష్, ప్రాన్స్.. ఇలా రకరకాల వంటలు, కూరగాయల భోజనాలైతే ఎన్ని రకాల కూరలు వండాలి, పండ్లు, ఐస్ క్రీం, కిల్లీ... ఇలా అన్ని లెక్కలు గట్టి ప్లేట్ భోజనానికి కనీసం రూ.250 నుంచి రూ.5 వేల దాకా వెచ్చిస్తున్నారు. చిన్న కుటుంబాలకైతే రూ.లక్ష నుంచి రూ.3 లక్షల దాక భోజనాలకు ఖర్చవుతుండగా, పెద్ద కుటుంబాలు, ఉన్నతంగా చేయాలనుకునేవారు రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా భోజనాలకు వెచ్చిస్తున్నారు.

ఆదివాసీలకు సీతక్క శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: శనివారం అంతర్జాతీయ ఆది వాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ, గిరిజన సమాజానికి పీఆర్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీలు ఈ దేశంలో అత్యంత పురాతన సాంకేతికతను, విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. వారిని అన్ని రంగాల్లో ముందుకు నడిపించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రాఖీ పండుగ సందర్భంగా కూడా రాష్ట్ర ప్రజలకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ల ప్రేమకు, అనుబంధానికి ప్రతీకైన రాఖీ పండుగను.. ప్రతి కుటుంబం ఆనందంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

మండలి చైర్మన్ రాఖీ శుభాకాంక్షలు




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకయిన ఈ పండుగను.. రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన ఆకాంక్షించారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ డ్రామాలు


- బీఆర్‌ఎస్‌ది గోడ మీది పిల్లి తీరు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ డ్రామాలు చేస్తోందని, బీఆర్‌ఎస్ వ్యవహారం గోడ మీది పిల్లి తీరుగా ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ రెండు పార్టీలు బీసీలకు చేసింది ఏమిటని ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కల్వకుంట్ల కుటుంబానికి రేవంత్ ఫోబియా పట్టుకుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు దేశంలోని అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని గుర్తుచేశారు. అయితే.. బీఆర్‌ఎస్ పార్టీ ధర్నాకు ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య ఫెవికాల్ బంధం ఉందన్న విషయం స్పష్టమవుతోందన్నారు. 'బీసీ బిల్లును బీఆర్‌ఎస్ ఎందుకు పట్టించుకోవడంలేదు? బీజేపీపై ఎందుకు ఒత్తిడి తేవడంలేదు' అని ప్రశ్నించారు. బీసీల పట్ల బీఆర్‌ఎస్ కపట ప్రేమ చూపడం మానుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కాకుండా ఢిల్లీలో ధర్నాలు చేయాలని ఆది శ్రీనివాస్ హితవు పలికారు.




పటిష్టంగా సీఎస్‌ఈఏఎం కేసుల దర్యాప్తు

151 మంది అధికారులకు టీజీ సైబర్ సెక్యూరిటీ శిక్షణ



సాక్షి, హైదరాబాద్: చిన్నారులపై ఆన్‌లైన్లో లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై తెలంగాణ పోలీసులు దృష్టి పెట్టారు. చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూస్ మెటీరియల్ (సీఎస్‌ఈఏఎం)కు సంబంధించిన కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై తెలంగాణలో దర్యాప్తు చేస్తున్న 151 మంది అధికారులకు వారం రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), ఇండియన్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఐసీపీ) న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు టీజీసీఎస్‌బీ ప్రధాన కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు తెలంగాణ పోలీసు శాఖ.. 561 ఈ తరహా కేసులు నమోదు చేసింది. వాటి ఆధారంగా 510 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వారం రోజుల శిక్షణలో మొత్తం 26 పోలీస్ యూనిట్లకు చెందిన 151 మంది దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు. ఈ తరహా నేరాలకు సంబంధించి ఆధారాల సేకరణ, సెర్చ్, ఆధారాలను భద్రపరచడం.. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, డేటింగ్ యాప్‌లలో నిందితుల గుర్తింపు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఆది శ్రీనివాస్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: వేములవాడ ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలుపొందిన బీఆర్‌ఎస్ నేత చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరసత్వాన్ని దాచి ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. 2018 ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం బెంచ్ కొట్టివేసింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎస్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆది శ్రీనివాస్ పిటిషన్‌ను శుక్రవారం విచారించింది. ఇప్పటికే ఆ ఎన్నికల కాలం ముగిసిపోయినందున ప్రస్తుతం దీనిపై కోర్టు ఏమీ చేయలేదని స్పష్టం చేసింది. 'ఇది పునర్జీవింపజేయలేని వ్యవహారం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. చెన్నమనేని మోసం చేశారని హైకోర్టే స్పష్టం చేసినప్పటికీ, ఎన్నికల చట్టం ప్రకారం రెండో స్థానంలో ఉన్న అభ్యర్థిని నేరుగా ఎమ్మెల్యేగా ప్రకటించలేదని పేర్కొన్నారు. చెన్నమనేని ఇంకా శాసనసభ్యుడిగా లాభాలు పొందుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు చెల్లవని నిర్ణయానికి ఏడేళ్లకు పైగా సమయం తీసుకున్న హైకోర్టు... 2025 మార్చి 19న మాత్రమే తీర్పు ఇచ్చిందని తెలిపారు. చెన్నమనేనికి ఎన్నికల హక్కు లేదని తేల్చినప్పటికీ, తనను నేరుగా ఎన్నికైన ఎమ్మెల్యేగా ప్రకటించలేదని అభ్యంతరం తెలిపారు. అంతేగాక చెన్నమనేని పేరు ఎన్నికల సంఘం, శాసనసభ రికార్డుల నుంచి తొలగించాలని పిటిషన్‌లో ఆది శ్రీనివాస్ కోరారు. అయితే ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది.

మా ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లు


జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పింక్ చొక్కాలు వేసుకున్న వారికే పక్కా ఇళ్లు మంజూరు చేసే వారని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీలు చూడడం లేదని, తొలి దఫాలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన 3,500 మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి కనుకనే ప్రతి రోజూ గాంధీభవన్‌లో ప్రజాప్రతినిధులను అందుబాటులో ఉంచుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాతే రైతులకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా, నూతన రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు.

పిల్లల పోషణపై తెలంగాణకు రూ.430 కోట్ల నిధులు

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా బాలల పోషణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా తెలంగాణకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో మిషన్ సక్షం అంగన్‌వాడీ–పోషణ్ 2.0 కింద రూ.430.76 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ వెల్లడించింది. శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. పోషణ్ 2.0లో భాగంగా తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లో కీలక చర్యలు చేపట్టామని కేంద్రం తెలిపింది.



చిలుకల నారు!

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం నుంచి కొత్తపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ రైతు నారు పోసుకున్నాడు. పచ్చని ఆ నారు మడిలో రామచిలుకల గుంపు వాలింది. ఆహారం కోసం అవి నారులో వెతుకుతున్న దృశ్యం చిలుకల నారును తలపించింది.

\- కొత్తగూడ

'రక్షాబంధన్'కు సెలవు ప్రకటించాలి: వీహెచ్‌పీ

సాక్షి, హైదరాబాద్: రక్షాబంధన్ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలతో పాటు అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు వీహెచ్‌పీ లేఖ రాసింది. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు కలిసి ఆత్మీయతను పంచుకునే పవిత్రమైన పండుగ రాఖీ వేడుకని పేర్కొంది. గురుకులాలలో విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. రాఖీ పండుగ నిమిత్తం విద్యార్థులను వారి ఇళ్లకు పంపేందుకు నిరాకరిస్తున్నారని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఆరోపించారు.

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పనులు శరవేగంగా..

రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ ప్రశ్నకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ : కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు పనులు వేగంగా కొనసాగుతున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. ఈ ఫ్యాక్టరీని ఏపీ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 13 ప్రకారం ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రకటించిందని, ఇందులో భాగంగా రూ.521.36 కోట్ల వ్యయంతో రైల్వే తయారీ యూనిట్ నిర్మాణం చేపట్టినట్టు కేంద్రమంత్రి రాజ్యసభలో తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇస్తూ, ఇప్పటివరకు రూ.310.78 కోట్లు ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీకి ఖర్చు అయినట్టు పేర్కొన్నారు. సివిల్, ఎలక్ట్రికల్ నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయని, అవసరమైన మెషినరీ, ప్లాంట్లు ఎక్కువగా ఇప్పటికే డెలివరీ అయ్యాయని తెలిపారు. ఆధునిక రోలింగ్ స్టాక్ తయారీ లక్ష్యంగా ఈ యూనిట్ పనిచేయనుందని..కోచ్‌ల తయారీతోపాటు నిర్వహణ కూడా ఈ యూనిట్‌లో జరగనుందన్నారు. దేశీయంగా ఆధునిక రైళ్ల తయారీలో ఈ ఫ్యాక్టరీ కీలకపాత్ర పోషించనుందని చెప్పారు.



ధనలక్ష్మి

శ్రావణ శుక్రవారం సందర్భంగా విజయనగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను గాజులు, పూలతో పాటు కొన్ని చోట్ల కరెన్సీ నోట్లతో అందంగా అలంకరించారు. నగరంలోని విజయసాగర దుర్గామల్లీశ్వరి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించగా, కన్యకా పరమేశ్వరి అమ్మవారిని బంగారు చీర, కరెన్సీనోట్లతో అలంకరించారు.



ప్రకృతితో మమేకం



చుట్టూ ఎత్తయిన కొండలు..విసిరితే పడినట్టు ఉండే గ్రామాలు.. వాటి మధ్య వైవిధ్యమైన జీవనం ఆదివాసీల సొంతం. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం కుమడ పంచాయతీలో దిగువ కుమడ ఆదివాసీ గ్రామం ఇదే కోవకు చెందుతుంది. ఇక్కడి గిరిజనులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రకృతితో మమేకమై జీవిస్తున్నారు. ముంచంగిపుట్టు నుంచి భూసిపుట్టు వెళ్లే రోడ్డులో తొంగి చూస్తే లోతట్టు ప్రాంతంలో ఉన్న ఈ గ్రామం కనువిందు చేస్తోంది. ఇక్కడ 15 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. - ముంచంగిపుట్టు

ధరలేక దయనీయం

ఏజెన్సీలో అల్లం సాగుకు వాతావరణం అనుకూలించినా మార్కెట్లో పరిస్థితులు గిరి రైతులకు శాపంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇక్కడ పండించే అల్లంకు మంచి డిమాండ్ ఉన్నా గిరి రైతులు మాత్రం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడం వల్ల ఆదాయం కోల్పోతున్నారు. కనీసం పెట్టుబడి పొందలేని దయనీయ స్థితిలో ఉన్నామని వారు ఆవేదన చెందుతున్నారు.



వారపు సంతలకు అల్లంను తీసుకువెళ్తున్న గిరి యువతులు

అల్లం రైతుల ఆశలు ఆవిరి

- సంతల్లో గిట్టుబాటు కరువు
- కిలో రూ.25కు మించని వైనం
- మైదాన ప్రాంతాల్లో రూ.60కు అమ్మకం
- వ్యాపారులకు లాభాలు
- గిరి రైతులకు నష్టాలు



వారపు సంతలో అల్లం నిల్వలు

సాక్షి, పాడేరు: అల్లం పండించే గిరి రైతులకు గిట్టుబాటు ధర కరువైంది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర పతనం చేయడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. అల్లూరి జిల్లాలో గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో పండించే అల్లంకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయినా గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు. వీరి వద్ద వ్యాపారులు కిలో రూ.25కు కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.60కు విక్రయిస్తున్నారు. కష్టపడి పండించిన రైతుకు శ్రమ మిగులుతుండగా వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు.

సిండికేట్ల రాజ్యం

హుకుంపేట, అరకు, కించుమండ, పెదబయలు, సుంకరమెట్ట, కాశీపట్నం, జి.మాడుగుల, అన్నవరం, చింతపల్లి వంటి పెద్ద వారపుసంతల్లోను వ్యాపారుల సిండికేట్ రాజ్యమేలుతుంది.అల్లం ధరలను పతనం చేసి వ్యాపారం చేస్తూ మైదాన ప్రాంతాలకు భారీగా రవాణా చేస్తున్నారు. దళారులు సిండికేట్‌గా ఏర్పడటం వల్ల నష్టపోతున్నామని, ప్రభుత్వం తమకు మద్దతు ధర కల్పించాలని అల్లం రైతులు కోరుతున్నారు.

ఈ ఏడాది నష్టమే



ఎకరాలో అల్లం సాగు చేపట్టా. గతేడాది కన్నా ఈఏడాది ధర పతనమైంది. గతేడాది రూ.లక్ష వరకు ఆదాయం పొందా. ప్రస్తుతం వ్యాపారులు కిలో రూ.25కు మించి కొనుగోలు చేయడం లేదు. దీనివల్ల కనీసం రూ.50 వేలు కూడా వచ్చే పరిస్థితి లేనందదున ఈ ఏడాది నష్టమే.

-వంతాల మల్లేశ్వరరావు, అల్లం రైతు, చెలిమారువలస, డుంబ్రిగుడ మండలం



హుకుంపేటలో అల్లం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ధర సగం తగ్గించేశారు



ఏజెన్సీ సంతల్లో వ్యాపారులంతా సిండికేట్‌గా మారడంతో అల్లంకు గిట్టుబాటు ధర కరువైంది. అరకు, కించుమండ, హుకుంపేట సంతల్లో అల్లం విక్రయిస్తున్నాం. గత ఏడాది కిలో రూ.50కు కొన్న వ్యాపారులు ఈసీజన్‌లో మాత్రం ధర సగానికి తగ్గించేశారు.

- సాకేరి ప్రసాద్, అల్లం రైతు, డుంబ్రిగుడ

అనుకూలించిన వాతావరణం

వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది ఎకరాకు ఆరు టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ఇక్కడ పండించే అల్లం ఘాటుగా ఉండటంతో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, విజయనగరం, తెలంగాణా ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల గతేడాదితో పోలిస్తే కిలోకు రూ.20 వరకు గిరిజన రైతులు ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది.

దిగుబడి బాగున్నా..

ఏజెన్సీలోని పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో సుమారు 1400 ఎకరాల విస్తీర్ణంలో అల్లంను ఖరీఫ్‌లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దిగుబడులు ప్రారంభం కావడంతో గత నెల రోజుల నుంచి ఏజెన్సీలోని వారపు సంతల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. అయితే సీజన్ ప్రారంభం నుంచి గిట్టుబాటు ధర లేదు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో కిలో అల్లంను రూ.40 నుంచి రూ.50కు వ్యాపారులు కొనుగోలు చేశారు. అదే వ్యాపారులు ఈ ఏడాది కిలో అల్లంను రూ.20 నుంచి రూ.25కు మించి కొనుగోలు చేయడం లేదని గిరి రైతులు వాపోతున్నారు.



డుంబ్రిగుడ ప్రాంతంలో అల్లం తవ్వకాలు

మాయమై పోతున్నది



- కబ్జా కోరల్లో 'పెన్నా'
- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- ఆక్రమిత భూములను అమ్మకానికి పెట్టిన ప్రబుద్ధులు
- కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

తాడిపత్రి సమీపంలోని కొత్త బ్రిడ్జి వద్ద పెన్నా నదిని ఆక్రమించి సాగు చేసిన పంటలు

తాడిపత్రి రూరల్: పెన్నా నది కబ్జాదారుల కోరల్లో చిక్కిశల్యమైపోతోంది. వేగంగా రూపురేఖలు కోల్పోతోంది. నదిని చెరబట్టిన కొందరు ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమించిన భూములను పలువురు ప్రబుద్ధులు అమ్మకానికి పెట్టారు. అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రాంతంలో ఒకప్పుడు అర కిలోమీటరు వెడల్పున ప్రవహించిన నది నేడు పిల్లకాలువలా మారిందంటే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో పెన్నానదికి భారీగా వరద వస్తే తాడిపత్రి మున్సిపాలిటీకి పెనుముప్పుగా పరిణమించే అవకాశం లేకపోలేదు. గతంలో వరద నుంచి రక్షించేందుకు కోట్లాది రూపాయల వ్యయంతో దాదాపు రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన కట్టడం నేడు పలు చోట్ల దెబ్బతిన్న నేపథ్యంలో ముప్పు తీవ్రత మరింత పెరిగింది.

1,800 ఎకరాల్లో కబ్జా

తాడిపత్రి మండలంలో 1,800 ఎకరాల్లో పెన్నా నది కబ్జాకు గురైందని తేలింది. ఎక్కువగా మునిసిపాలిటీ పరిధిలో, ఆ తర్వాత కొత్త బ్రిడ్జి, పాత బ్రిడ్జిల వద్ద నది దురాక్రమణకు గురైంది. కబ్జా చేసిన భూమిలో పండ్ల తోటలను సాగు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ఆక్రమించిన భూమిలో నుంచి ఇసుక కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో పెన్నానది పరిసరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఒకప్పుడు తాడిపత్రి మునిసిపాలిటీ ప్రజల దాహార్తిని పెన్నానది తీర్చేది. అయితే, నదిలో ఆక్రమణలు పెరిగిపోవడంతో నీటి లభ్యత తగ్గి, గండికోట నీటిపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది.

నదిలోనే వరిమళ్లు.. పూల తోటలు..

పామిడి: మండలంలోనూ పెన్నానది ఆక్రమణకు గురైంది. నదిలోనే వరిమళ్లు, పూల తోటలు, ఇటుక బట్టీలు పుట్టుకొచ్చాయి. దీనికితోడు 'తెలుగు తమ్ముళ్లు' ఇసుక కోసం విచ్చలవిడిగా తవ్వేస్తుండడంతో నది రూపురేఖలే మారిపోయాయి. ఆక్రమణల కారణంగా పెన్నానదికి వరదల సమయంలో పామిడిలో లోతట్టు ప్రాంతాలైన బీసీ కాలనీ, నెహ్రూకాలనీ, సీఎస్‌ఐ చర్చి కాలనీ, మదీనా కాలనీ, వెంగమనాయుడు కాలనీ, చైతన్యకాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, నాయీ బ్రాహ్మణ కాలనీలు జలమయమవుతున్నాయి.అక్రమంగా ఇసుక తోడేయడంతో ఏర్పడ్డ గుంతలు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. పామిడిలోని సర్వే నంబర్ 1,247లో పెన్నానది మొత్తం విస్తీర్ణం 968.18 ఎకరాలు కాగా, ఇందులో 410 ఎకరాల మేర ఆక్రమణకు గురైనట్లు తెలిసింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పామిడి: తెలుగు తమ్ముళ్ల ఇసుక తవ్వకాలతో పెన్నాలో ఏర్పడిన గుంతలు



పామిడి: నదిలో సాగు చేసిన పూల తోట

పూరీ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

ఒంగోలు రైల్వే స్టేషన్లో పోలీసుల తనిఖీలు

ఒంగోలు టౌన్: గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడంలో భాగంగా పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగల్ టీమ్, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా ఒంగోలు రైల్వే స్టేషన్లో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ తో కలిసి రైల్వేస్టేషన్ పరిసరాలు, అనుమానస్పద పార్శిళ్లు, ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. పూరి ఎక్స్‌ప్రెస్‌లో మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు నిమిత్తం జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలను రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు ఆంజనేయులు, శ్రీకాంత్, మధుసూదన్ రావు, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎంపీగా కొనసాగే నైతిక హక్కు భరత్‌కు ఉందా?

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి సొంత గనుల సాధన పక్కనపెట్టి, అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఆరాటపడుతున్న టీడీపీ విశాఖ ఎంపీ భరత్‌కు ఎంపీగా కొనసాగే నైతిక హక్కు ఉందా? అని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ప్రకటనలో ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించకపోవడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతోందని, దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు కేటాయించి, విశాఖ ఉక్కుపైనే వివక్ష ఎందుకని ప్రశ్నించారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధిస్తామని చేసిన వాగ్దానాన్ని ప్రజలు నమ్మి ఎంపీగా భరత్‌ను గెలిపించారన్నారు. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ విశాఖ ఉక్కుకు సొంత గనుల సాధనకు కృషి చేయకపోవడం ఆక్షేపణీయమన్నారు.

కుంకీ ఆపరేషన్



పలమనేరు కౌండిన్య అభయారణ్యం నుంచి బయటకు వస్తున్న ఏనుగుల గుంపు(ఫైల్)



మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపులోని కుంకీలు

- ఇప్పటి దాకా పంటలపైకి ఏనుగులు రాకుండా మళ్లించడమే..
- క్యాప్చరింగ్‌తోనే మదపుటేనుగల కట్టడి
- కర్ణాటకలో ఇప్పటికే సత్ఫలితాలు
- కార్యాచరణ చేపట్టనున్న అటవీశాఖ అధికారులు

పలమనేరు : చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య దశాబ్దాలుగా తీరని సమస్యగా మారింది. అడవిని దాటుతున్న ఏనుగులు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. ఏనుగుల దాడుల్లో రైతుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అడవిని దాటి బయటకొచ్చిన ఏనుగులు సైతం వివిధ కారణాలతో మృతి చెందుతున్నాయి. అడవిలోంచి ఏనుగులు బయటకు రాకుండా కట్టడి చేసేందుకు ఇప్పటి దాకా అటవీశాఖ చేపట్టిన సోలార్ ఫెన్సింగ్, కందకాలు ప్రయోజనం లేకుండా పోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలంలోని మొసలిమడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు చేపట్టింది. ఇటీవలే టేకుమంద ఫారెస్టులో కుంకీ ఏనుగుల ట్రయల్ రన్ చేపట్టి అది విజయవంతమైందని అధికారులు చెబుతున్నారు. కానీ అడ ఏనుగులతో సమస్యలేదు గాని మదపుటేనుల కారణంగానే ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతోంది. వీటిని అదుపు చేయడమే కుంకీ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందు కోసం అత్యంత కీలకమైన ప్రక్రియ క్యాప్చరింగ్ మాత్రమే. మదపు టేనుగుల క్యాప్చరింగ్ త్వరలో చేపడతామని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ప్రక్రియ జరిగి ఇక్కడి గుంపుల్లోని, ఒంటరిగా సంచరిస్తున్న మదపు టేనుగులను బంధిస్తేనే ఏనుగుల సమస్యకు చెక్ పెట్టినట్లు అవుతుంది.

ఇప్పటి వరకు 34 మంది ప్రాణాలు కోల్పోయారు

2012 నుంచి గతనెల 26న సోమలలో మృతి చెందిన క్రిష్ణంరాజు దాకా మొత్తం 34 మంది ప్రాణాలను కోల్పోయారు. ఏనుగుల దాడుల్లో 24 మందికి పైగా గాయపడ్డారు. ఏనుగుల బారిన పడి 63 పశువులు మృతి చెందాయి. ఈ దాడులను ఎక్కువగా చేసింది మదపుటేనుగులే. ఇక ఏనుగుల కారణంగా 8602 ఎకరాల పంటలు నాశనమయ్యాయి.

లక్ష్యం ఇదీ...

కుంకీ ఏనుగుల ద్వారా ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కుంకీ ఆపరేషన్లు కొన్నేళ్లుగా జరుగుతున్నాయి. అక్కడ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు దుబేరా బేస్ క్యాంపు నుంచి నాలుగు, రామ కుప్పం ననియాల నుంచి రెండు ఏనుగులను తెప్పించారు. వీటికి ఈ ప్రాంతాన్ని అలవాటు చేసి ఆపై అడవిలోని ఏనుగులకు కట్టడి చేయాలి. ఇందులో అత్యంత ముఖ్యమైన పని క్యాప్చరింగ్. అంటే మదపు టేనుగులను గుర్తించి వాటికి మత్తుచ్చి కుంకీల సాయంతో క్యాంపునకు తీసుకొచ్చి ఎలిఫెంట్ క్రాల్స్‌లో బంధించాలి. ఆపై ఆరు నెలలపాటు శిక్షణ ఇస్తే ఇవి కుంకీల మాదిరి దాడులు చేయకుండా పోతాయి.

ప్రస్తుతం జరుగుతున్నది ఏంటి?

ఇక్కడి క్యాంపులో అభిమన్యు, క్రిష్ణ, జయంత్, వినాయక, దేవా, రంజన్‌లున్నాయి. ఇటీవల సోమలలో రైతును ఏనుగులు చంపడంతో రైతులు రోడ్డెక్కారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేఖత వస్తుందని ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అటవీశాఖ హుటాహుటిన కుంకీ ట్రయల్ రన్ చేసి ప్రజల దృష్టిని మళ్లించిదనే మాట వినిపిస్తోంది. ఆ మేరకు టేకుమంద అడవిలో ఏనుగుల మళ్లింపునకు పూర్తి ఫిట్‌నెస్ కలిగిన క్రిష్ణ, జయంత్, వినాయక్‌లను మాత్రం మావటీల ద్వారా పంపారు. అడవిలోని ఏనుగుల గుంపును అక్కడి నుంచి కౌండిన్య ఫారెస్టులోకి మళ్లించారు. ఇది కేవలం ట్రయల్ రన్ మాత్రమే. దీంతోనే ఏనుగులను పూర్తిస్థాయిలో కట్టడి చేయలేరు.

మదపుటేనుగులు అదుపులోకి తెస్తేనే..

ప్రజల ప్రాణాలు తీస్తున్న వాటిలో 90 శాతం మదపుటేనుగులే. ప్రస్తుతానికి కొన్ని ఒంటరిగా సంచరిస్తుండగా మరికొన్ని గుంపుల్లో ఉన్నాయి. ఇక్కడి ఎలిఫెంట్ క్యాంపులోని దేవా, రంజన్ సైతం కుంకీలుగా మారాలి. అప్పుడు కుంకీలు నాలుగు దిశల్లో వెళ్లి గుంపులోని మదపు టేనుగులను అదుపుచేయాలి. ఆ సమయంలో మావటీలు మత్తు సూదిచ్చి దాన్ని బంధించి క్యాంపునకు తీసుకురావాలి. ఈ ప్రక్రియలో కుంకీల పని ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వాహనం ఎక్కించడం చేస్తాయి. ఇలా తీసుకొచ్చిన మదపు టేనుగులను క్యాంపులోని క్రాల్స్‌లో బంధించి మూడు నుంచి ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చాకే ఇవి కుంకీలుగా మారుతాయి. ఇలా మదపు టేనుగులన్నింటిని కట్టడి చేస్తేగాని సమస్య పరిష్కారం కాదు.



ఇటీవల టేకుమంద అడవిలోకి కుంకీలను ట్రయల్ ఆపరేషన్‌కు తీసుకెళ్తున్న మావటీలు

జిల్లాలో ఏనుగుల పరిస్థితి ..



పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంపు స్కెచ్

పలమనేరు, కుప్పం, పూతలపట్టు, పుంగనూరు పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీపైగా మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అడవులకు ఆనుకొని ఏనుగుల సంచరిస్తున్నాయి. ఈ ప్రాంతంలో మొత్తం 105 దాకా ఏనుగులుండగా ఇందులో కౌండిన్య ఎలిఫెంట్ శాంచురీలోనే 56 దాకా గుంపులుగా ఉన్నాయి. ఇవిగాక పక్క రాష్ట్రాల నుంచి వలస ఏనుగులు ఇక్కడికి వస్తుంటాయి.

వచ్చిన చోటుకే మళ్లీ వస్తున్నాయి



మేం పొలం వద్ద కాపురం ఉంటున్నాం. ఓ మదపు టేనుగు మా పొలం వద్దకు ఇప్పటికే నాలుగైదు సార్లు వచ్చి పంటను తొక్కి నాశనం చేసింది. మొన్న వచ్చినప్పుడు ఇంటిని మొత్తం కూల్చేసింది. దీంతో మేము ఎలాగో తప్పించుకొని ప్రాణాలతో భయటపడ్డాం. కుంకీలో ఏమోగాని ఏనుగులు అడవిలోంచి బయటకు రాకుండా చేయాలి.

- చంద్రయ్య, బాధిత రైతు, ఇందిరానగర్

రైతుల ప్రయోజనాలే ముఖ్యం

- పరిరక్షించకపోతే ఎంఎన్‌సీల నుంచి రైతులకు ముప్పు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక



న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో భారత్ ఆచితూచి వ్యవహరించాలని.. అంతర్జాతీయ కంపెనీలు అనుసరించే దోపిడీ విధానాల నుంచి భారత రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలని ఎస్‌బీఐ అధ్యయన నివేదిక సూచించింది. అమెరికాతో భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు నిర్వహిస్తుండడం తెలిసిందే. ఈ నెలలో తదుపరి చర్చల కోసం అమెరికా బృందం భారత్‌ను సందర్శించాల్సి ఉంది. ''బలమైన బహుళజాతి సంస్థలు భారత మార్కెట్లో సదుపాయాలు, వ్యవసాయ విలువ ఆధారిత ఉత్పత్తుల కల్పన, రైతుల సంక్షేమం, వారి శ్రేయస్సు దిశగా పెద్దగా పెట్టుబడులు పెట్టకుండానే ఇక్కడి మార్కెట్ అవకాశాలను కొల్లగడతాయి. కనుక వీటి బారి నుంచి రైతుల ప్రయోజనాలను తప్పకుండా కాపాడాలి'' అని ఈ నివేదిక సూచించింది.

ఒత్తిడి పెంచుతున్న ట్రంప్...

బహుళజాతి సాగు సంస్థలు బడా మార్కెట్లలో అవకాశాల కోసం ఎదురు చూస్తుండడాన్ని ప్రస్తావించింది. మొక్కజొన్న, సోయాబీన్, యాపిల్స్, బాదం, ఇథనాల్‌పై టారిఫ్‌లు తగ్గించాలని అమెరికా డిమాండ్ చేస్తుండడం గమనార్హం. వీటితోపాటు అమెరికా పాడి ఉత్పత్తులకు అవకాశాలు కల్పించాలంటూ డిమాండ్ చేస్తోంది. మన రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్న ఆందోళనతో కేంద్ర సర్కారు అమెరికా డిమాండ్లను అంగీకరించడం లేదు. దీంతో వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన ఏర్పడింది. రైతులు, మత్స్యకారులు, పాడి పెంపకందారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీపడబోదని ప్రధాని మోదీ రెండు రోజుల క్రితం తేల్చి చెప్పారు. భారత ఉత్పత్తులపై టారిఫ్‌లను 50 శాతానికి పెంచుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన రోజే ప్రధాని మోదీ ఈ ప్రకటన చేయడం ద్వారా యూఎస్‌కు స్పష్టమైన సంకేతం పంపారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను తగ్గించుకునే దిశగా భారత్‌పై ఒత్తిడి పెంచేందుకు టారిఫ్‌లను అమెరికా అధ్యక్షుడు పెంచేయడం గమనార్హం.

ఇంధన బిల్లు పెరగొచ్చు..

ఒకవేళ అమెరికా ఒత్తిళ్ల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలానికి భారత్ నిలిపివేసినట్టయితే చమురు దిగుమతుల బిల్లు 9 బిలియన్ డాలర్లు మేర పెరుగుతుందని.. 2026–27లోనూ 11.7 బిలియన్ డాలర్లు అధికం కావొచ్చని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది.'' అంతర్జాతీయ చమురు సరఫరాలో రష్యా 10 శాతం వాటా కలిగి ఉంది. అన్ని దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తే, అదే సమయంలో మిగిలిన దేశాలు ఉత్పత్తిని పెంచకపోతే చమురు ధరలు 10 శాతం పెరిగే అవకాశం ఉంది''అని ఈ నివేదిక పేర్కొంది.

క్యూ1 ఫలితాలు

గ్రాసిమ్ లాభం జూమ్

క్యూ1లో రూ. 2,767 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 34 శాతం జంప్‌చేసి రూ. 2,767 కోట్లను తాకింది. సిమెంట్, కెమికల్స్ బిజినెస్‌లలో లాభదాయకతతోపాటు.. కీలక విభాగాలలో వృద్ధి ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 2,066 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 16 శాతం ఎగసి రూ. 40,118 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 34,610 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు 14 శాతం పెరిగి రూ. 36,657 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో గ్రాసిమ్ షేరు బీఎస్‌ఈలో 2 శాతం నీరసించి రూ. 2,690 వద్ద ముగిసింది.

సన్ టీవీ లాభం డీలా

రూ. 529 కోట్లు



న్యూఢిల్లీ: బ్రాడ్‌క్యాస్టింగ్ రంగ మీడియా దిగ్గజం సన్ టీవీ నెట్‌వర్క్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 529 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 559 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 2 శాతం నీరసించి రూ. 1,290 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 1,314 కోట్ల ఆదాయం సాధించింది. అయితే మొత్తం వ్యయాలు మాత్రం 10 శాతం పెరిగి రూ. 782 కోట్లను తాకాయి. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ క్రికెట్ ఫ్రాంచైజీ, దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఆఫ్ క్రికెట్‌ను కలిగిన కంపెనీ ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డ్‌తో నార్తర్న్ సూపర్ చార్జర్స్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందుకు రూ. 1,050 కోట్లు వెచ్చించనుంది.

ఫలితాల నేపథ్యంలో సన్ టీవీ షేరు బీఎస్‌ఈలో 2 శాతం నష్టంతో రూ. 550 వద్ద ముగిసింది.

భారతీ ఎయిర్‌టెల్ వాటా విక్రయం

0.98% విలువ రూ. 11,227 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రమోటర్ సంస్థలలో ఒకటైన ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్(ఐసీఐఎల్) తాజాగా 0.98 శాతం వాటా విక్రయించింది. ఎన్ఎస్ఈ బల్క్‌డీల్ గణాంకాల ప్రకారం రెండు దశలలో 6 కోట్ల షేర్లు అమ్మివేసింది. ఒక్కో షేరుకి రూ. 1,870–1,872 ధరల శ్రేణిలో రూ. 11,227 కోట్లకు వాటా విక్రయించింది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. తాజా లావాదేవీ తదుపరి ఎయిర్‌టెల్‌లో ఐసీఐఎల్ వాటా 2.47 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గింది. వెరసి మొత్తం ప్రమోటర్ల వాటా 51.25 శాతం నుంచి 50.27 శాతానికి దిగివచ్చింది. ప్రమోటర్లలో భారతీ టెలికం అత్యధికంగా 40.47 శాతం వాటా కలిగి ఉంది.

వాటా విక్రయం నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు ఎన్ఎస్ఈలో 3.3 శాతం క్షీణించి రూ. 1,860 వద్ద ముగిసింది.

ఎలక్ట్రిక్ వాహన అమ్మకాల్లో జోష్

జూలైలో ఈవీ ప్యాసింజర్ విక్రయాలు 93% వృద్ధి



ముంబై: ఎలక్ట్రిక్ వాహన ప్యాసింజర్ విక్రయాలు జూలైలో 93% వృద్ధిని సాధించినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్(ఫాడా) గణాంకాలు తెలిపాయి. సమీక్షించిన నెలలో 15,528 ఈవీ కార్లు అమ్ముడయ్యాయి. గతేడాది జూలైలో విక్రయాలు 8,037 యూనిట్లుగా ఉన్నాయి. ఇందులో ఏకంగా 6,047 ఈవీ కార్లను విక్రయించి టాటా మోటార్స్ ఆధిపత్యం కొనసాగించింది. గతేడాది కంపెనీ జూలైలో 5,100 యూనిట్ల అమ్మకాలను సాధించింది. అయితే ఈవీ టూవీలర్స్ విక్రయాల్లో 4% క్షీణత నమోదైంది. గతేడాది జూలైలో 1,07,655 యూనిట్లు అమ్మకాలు జరగ్గా ఈ జూలైలో 1,02,973 యూనిట్లకు పరిమితయ్యాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ 22,256 యూనిట్ల రిజిస్ట్రేషన్లతో అగ్రస్థానంలో ఉంది. ఎలక్ట్రిక్ త్రీ–వీలర్స్ 63,675 యూనిట్ల నుంచి 9% పెరిగి 69,146 యూనిట్లకు చేరాయి. ఈ విభాగంలో 9,766 యూనిట్ల విక్రయాలతో మహీంద్రా గ్రూప్ అగ్రస్థానంలో ఉంది. గతేడాది కంటే మహీంద్రా 40 శాతం ఎక్కువ అమ్మకాలను సాధించింది. ఎలక్ట్రిక్ వాణిజ్య వాహన రిటైల్ అమ్మకాలు జూలైలో 52 శాతం పెరిగి 1,244 యూనిట్లకు చేరాయి. ఈ సెగ్మెంట్‌లోనూ టాటా మోటార్స్ 333 యూనిట్లతో ముందుంది. ''భారత్ ఆటో పరిశ్రమలో ఈవీ పరివర్తన వేగంగా కదులుతుందనేందుకు గణాంకాలు నిదర్శనం. ప్రభుత్వం నుంచి లభిస్తున్న మద్దతు, ఫైనాన్స్, చార్జింగ్ మౌలిక సదుపాయాల కారణంగా అమ్మకాలు సానుకూలంగా ఉన్నాయి'' అని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.

డేటా లీకేజీలతో కంపెనీలకు ఆర్థిక భారం

13 % పెరిగిన సగటు మూల్యం



ముంబై: డేటా లీకేజీ ఉదంతాల్లో దేశీ కంపెనీలు భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది ఇది సగటున 13 శాతం పెరిగి రూ. 22 కోట్లకు చేరింది. 2025లో ఇది రూ. 19.5 కోట్లుగా నమోదైనట్లు టెక్ దిగ్గజం ఐబీఎం ఓ నివేదికలో వెల్లడించింది. డేటా ఉల్లంఘనలకు సంబంధించి మోసగాళ్లు అమలు చేసే విధానాల్లో ఫిషింగ్ ఎటాక్‌లు (మోసపూరిత కమ్యూనికేషన్ పంపించడం ద్వారా వ్యక్తిగత వివరాలను చోరీ చేయడం) అత్యధికంగా 18 శాతంగా ఉండగా, థర్డ్ పార్టీ వెండార్ల హామీల రూపంలో మోసాలు 17 శాతంగా నమోదయ్యాయి. ఇక యూజర్ల బలహీనతలను మోసగాళ్లు సొమ్ము చేసుకునే ఉదంతాలు 13 శాతంగా నమోదయ్యాయి. పరిశోధనల విభాగంపై అత్యధికంగా డేటా ఉల్లంఘనల ప్రభావం ఉంటోంది. సగటున చెల్లించుకుంటున్న మూల్యం రూ. 28.9 కోట్లుగా నమోదైంది.

ఆ తర్వాత స్థానాల్లో రూ. 28.8 కోట్లతో రవాణా పరిశ్రమ, రూ. 26.4 కోట్లతో పారిశ్రామిక రంగాలు ఉన్నాయి. కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్నప్పటికీ, 60 శాతం బాధిత కంపెనీల్లో ఇప్పటికీ ఏఐ గవర్నెన్స్ విధానాలు లేవు. లేదా ఇప్పుడిప్పుడే పాలసీని తయారు చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఏఐని వాడేసుకోవాలనే ఆత్రంలో పలు కంపెనీలు సెక్యూరిటీని, గవర్నెన్స్‌ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇదే వాటిని బలహీనంగా మారుస్తోందని ఐబీఎం ఇండియా, సౌత్ ఏషియా వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథ్ రామస్వామి చెప్పారు.

ఎన్‌ఏసీఎల్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు 53% వాటాలు

న్యూఢిల్లీ: షేర్ల కొనుగోలు ఒప్పందం ద్వారా ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్‌లో 53 శాతం వాటాలను దక్కించుకునే ప్రక్రియ పూర్తయినట్లు అగ్రి–సొల్యూషన్స్ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. పబ్లిక్ షేర్‌హోల్డర్ల నుంచి 26 శాతం వరకు వాటాలను కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ కూడా ఇస్తున్నట్లు తెలిపింది. తాజా పరిణామం నేపథ్యంలో ఎన్‌ఏసీఎల్ బోర్డులో కోరమాండల్‌కి చెందిన ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లు.. నటరాజన్ శ్రీనివాసన్, ఎస్ శంకరసుబ్రమణియన్, రఘురామ్ దేవరకొండ చేరారు. దేవరకొండను కంపెనీ ఎండీ, సీఈవోగా ఎన్‌ఏసీఎల్ బోర్డు నియమించింది. ఆయన గతంలో కోరమాండల్ పంట సంరక్షణ ఉత్పత్తులు తదితర విభాగాలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.



వోల్టాస్ లాభం నేలచూపు

రూ. 141 కోట్లు



న్యూఢిల్లీ: ఏసీల తయారీ, ఇంజినీరింగ్ దిగ్గజం వోల్టాస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 58 శాతం క్షీణించి రూ. 141 కోట్లకు పరిమితమైంది. ముందస్తు రుతుపవనాలు, అకాల వర్షాలు కూలింగ్ ప్రొడక్టుల డిమాండ్ దెబ్బతీయడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 335 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 20 శాతం నీరసించి రూ. 3,912 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 4,904 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 16 శాతం తగ్గి రూ. 3,792 కోట్లకు పరిమితమయ్యాయి. రూమ్ ఏసీ బిజినెస్‌గల యూనిటరీ కూలింగ్ ప్రొడక్టుల విభాగం ఆదాయం 25 శాతం వెనకడుగుతో రూ. 2,868 కోట్లకు చేరింది. గత క్యూ1లో ఇది రూ. 3,802 కోట్లుగా నమోదైంది. ఎలక్ట్రో మెకానికల్ ప్రాజెక్టుల ఆదాయం 3 శాతం తక్కువగా రూ. 922 కోట్లను తాకింది. ఈ బాటలో ఇంజినీరింగ్ ప్రొడక్టులు, సర్వీసుల ఆదాయం 16 శాతం క్షీణతతో రూ. 922 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో వోల్టాస్ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం నష్టంతో రూ. 1,300 వద్ద ముగిసింది.

పెరిగిన రామ్‌కో సిమెంట్స్ లాభం

రూ. 182 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం భారీ వృద్ధితో రూ. 182 కోట్లకు చేరింది. నిర్వహణా సామర్థ్యం, సిమెంట్‌కు అధిక ధరలు ఇందుకు దోహదపడ్డాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 37 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 2,094 కోట్ల నుంచి రూ. 2,074 కోట్లకు బలహీనపడింది. ఈ కాలంలో సిమెంట్ విక్రయాలు 4.29 మిలియన్ టన్నుల(ఎంటీ) నుంచి 4 ఎంటీకి తగ్గాయి. ఇది 7 శాతం క్షీణతకాగా.. సిమెంట్ ధరలు పుంజుకోవడంతో నిర్వహణ లాభం(ఇబిటా) 23 శాతం ఎగసి రూ. 404 కోట్లను తాకింది. కాగా.. మొత్తం వ్యయాలు 4 శాతం తగ్గి రూ. 1,965 కోట్లకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 6 శాతం పతనమై రూ. 1,069 వద్ద ముగిసింది.

ఎమ్‌క్యూర్ ఫార్మా లాభం జూమ్

క్యూ1లో రూ. 215 కోట్లు



న్యూఢిల్లీ: ఔషధ రంగ దిగ్గజం ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 41 శాతం వృద్ధితో రూ. 215 కోట్లను తాకింది. దేశ, విదేశీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 153 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,815 కోట్ల నుంచి రూ. 2,101 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,631 కోట్ల నుంచి రూ. 1,810 కోట్లకు పెరిగాయి. మొత్తం ఆదాయంలో అంతర్జాతీయ వాటా 22 శాతం ఎగసి రూ. 1,106 కోట్లకు చేరగా.. దేశీ అమ్మకాలు 9 శాతం పుంజుకుని రూ. 995 కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో ఎమ్‌క్యూర్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం నీరసించి రూ. 1,385 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
9-8-2025	
విశాఖ	500–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	450–00
వరంగల్	452–00
రిటైల్ ధర	5.10

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	335	1.59
TITAN	3,466.70	1.49
DRREDDY	1,215.00	1.18
HDFCLIFE	759.8	0.54
BAJAJFINSV	1,919.00	0.26

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	780.55	-3.32
BHARTIARTL	1,859.50	-3.28
ADANIENT	2,179.00	-3.15
SHRIRAMFIN	609	-2.93
TATAMOTORS	630.8	-2.43

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	15,524
ఎన్ఎస్ఈ	1,00,445
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,42,271
ఎఫ్ఐఐ	+ 1,933
డీఐఐ	+ 7,724

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.90 (రాత్రి 11.30కు)	$ 63.88 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.64 (రాత్రి 11.30కు)	$ 66.43 (క్రితం ముగింపు)

తెలంగాణలో రూ. 5,200 కోట్లకు పిరమల్ ఫైనాన్స్ రుణాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తెలంగాణలో గృహ రుణాలు, వ్యాపార రుణాలు మొదలైన వాటికి గణనీయంగా డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలో తమ లోన్ పోర్ట్‌ఫోలియో సుమారు రూ. 5,200 కోట్లకు చేరిందని పిరమల్ ఫైనాన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ జగ్‌దీప్ మల్లారెడ్డి తెలిపారు. తమ మొత్తం వ్యాపారంలో రాష్ట్రం వాటా దాదాపు 10 శాతంగా, టాప్ 5 మార్కెట్లలో ఒకటిగా ఉంటోందని ఆయన చెప్పారు. 23 నగరాల్లో 29 శాఖలు ఉండగా, కార్యకలాపాలను మరింత పెద్ద ఎత్తున విస్తరిస్తున్నామన్నారు. కలలను సాకారం చేసుకోవడంలో రుణగ్రహీతల వాస్తవ గాథలను వివరించేలా రూపొందించిన 'సమీక్ష' డిజిటల్ సిరీస్‌ను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు.

జీడీపీపై టారిఫ్ ఎఫెక్ట్!!

- ఈసారి వృద్ధి రేటు 6 శాతానికి పరిమితం
- మూడీస్ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: అమెరికా ఆగస్టు 27 నుంచి 50 శాతం టారిఫ్‌లను అమలు చేస్తే భారత జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి)పై ప్రభావం పడనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 30 బేసిస్ పాయింట్లు నెమ్మదించి 6 శాతానికి పరిమితం కావొచ్చని మూడీస్ రేటింగ్స్ అంచనా వేసింది. అయితే, దేశీయంగా డిమాండ్ మెరుగ్గా ఉండటం, సర్వీసుల రంగం పటిష్టంగా ఉండటం వంటి అంశాలు భారత్‌పై ఒత్తిడిని తగ్గిస్తాయని పేర్కొంది. భారీ అమెరికా టారిఫ్‌లపై భారత్ స్పందించే తీరే అంతిమంగా వృద్ధి రేటు, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుందని వివరించింది. 'భారత్ ఎగుమతులకు అమెరికా అతి పెద్ద గమ్యస్థానంగా ఉంటోంది. అలాంటప్పుడు అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరిస్తున్నా, రష్యా నుంచి చమురును కొనుగోలు చేయడాన్ని కొనసాగిస్తే 2025–26లో భారత జీడీపీ వృద్ధి రేటు ముందుగా అంచనా వేసిన 6.3 శాతంతో పోలిస్తే 30 బేసిస్ పాయింట్లు (0.3 శాతం) మేర నెమ్మదించవచ్చు' అని మూడీస్ పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకుగాను భారత్‌పై అమెరికా టారిఫ్‌లను రెట్టింపు చేసి 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఈ కొత్త టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచుకునే లక్ష్యంతో ఇరు దేశాలు మార్చి నుంచి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి.

ఆసియా-పసిఫిక్ దేశాలతో పోటీ..

అమెరికా విధానాల్లో మార్పుల వల్ల సరఫరా సిస్టంలు పునర్వ్యవస్థీకరణకు లోనవుతున్న నేపథ్యంలో వాణిజ్యం, పెట్టుబడుల్లో మరింత వాటా కోసం ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని పలు దేశాలు పోటీ పడుతున్నాయని తెలిపింది.2025 తర్వాత మిగతా ఆసియా–పసిఫిక్ దేశాలతో పోలిస్తే టారిఫ్‌ల అంతరాలు భారీగా పెరిగిపోవడం వల్ల తయారీ రంగ హబ్‌గా ఎదగాలన్న భారత ఆకాంక్షలకు గండి పడొచ్చని మూడీస్ పేర్కొంది. అంతేగాకుండా ఇటీవలి కాలంలో పెట్టుబడుల రూపంలో ఒనగూరిన కొన్ని ప్రయోజనాలు కూడా వెనక్కి తరలిపోవచ్చని తెలిపింది. అయితే, అంతర్జాతీయ ఒడుదుడుకులను ఎదుర్కొనడానికి భారత్ వద్ద ప్రస్తుతం తగినంత విదేశీ మారక నిల్వలు ఉన్నాయని వివరించింది.

బజాజ్ ఎలక్ట్రికల్స్ లాభం డౌన్

క్యూ1లో రూ. 0.91 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం బజాజ్ ఎలక్ట్రికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 97 శాతం క్షీణించి రూ. 0.91 కోట్లకు పరిమితమైంది. కన్స్యూమర్ ప్రొడక్టుల అమ్మకాలు క్షీణించడంతోపాటు.. నాసిక్ ప్లాంట్ పరిహార(ఎక్స్‌గ్రేషియా) చెల్లింపులు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 28 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,155 కోట్ల నుంచి రూ. 1,065 కోట్లకు నీరసించింది. ఈ కాలంలో రూ. 6.7 కోట్లమేర ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,127 కోట్ల నుంచి రూ. 1,086 కోట్లకు తగ్గాయి. కస్టమర్ ప్రొడక్టుల ఆదాయం రూ. 905 కోట్ల నుంచి రూ. 807 కోట్లకు క్షీణించగా.. లైటింగ్ సొల్యూషన్ల నుంచి రూ. 8 కోట్లు అదనంగా రూ. 258 కోట్లు అందుకుంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 4 శాతం నష్టపోయి రూ. 585 వద్ద ముగిసింది.

కల్పతరు ప్రాజెక్ట్స్ లాభం దూకుడు

క్యూ1లో రూ. 214 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 3 రెట్లు జంప్‌చేసి రూ. 214 కోట్లను తాకింది. అధిక ఆదాయం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 84 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,609 కోట్ల నుంచి రూ. 6,188 కోట్లకు ఎగసింది. 2025 జూన్‌కల్లా నికర రుణ భారం 26 శాతం తగ్గి రూ. 2,765 కోట్లకు పరిమితమైనట్లు కంపెనీ పేర్కొంది. కొత్త ఏడాదిలో సాధించిన రూ. 9,899 కోట్ల కాంట్రాక్టులతో కలిపి మొత్తం ఆర్డర్‌బుక్ విలువ రికార్డ్ స్థాయిలో రూ. 65,475 కోట్లకు చేరినట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కల్పతరు షేరు బీఎస్‌ఈలో 6 శాతం పెరిగి రూ. 1,185 వద్ద ముగిసింది.

ఆస్ట్రేలియా అండర్-19 జట్టులో ఆర్యన్ శర్మ, యశ్ దేశ్‌ముఖ్

- ఇద్దరు భారత సంతతి కుర్రాళ్లు ఎంపిక
- వచ్చే నెలలో యువ భారత్‌తో సిరీస్


యశ్


ఆర్యన్

మెల్‌బోర్న్: క్రికెట్‌లో మేటి జట్టయిన ఆస్ట్రేలియా జట్టులో భారత సంతతి కుర్రాళ్లు స్థానిక ఆటగాళ్లను వెనక్కినెట్టి మరీ ఎంపిక య్యారు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) సెలక్షన్ కమిటీ శుక్రవారం ప్రకటించిన అండర్-19 జట్టులో విక్టోరియాకు చెందిన బ్యాటర్ ఆర్యన్ శర్మ, న్యూసౌత్‌వేల్స్ ఆల్‌రౌండర్ యశ్ దేశ్‌ముఖ్‌లకు చోటు దక్కింది. ఈ యువ జట్టుకు టిమ్ నీల్సన్ హెడ్ కోచ్‌గా ఉన్నారు. ఆయన గతంలో 2007 నుంచి 2011 వరకు ఆస్ట్రేలియా సీనియర్ పురుషుల జట్టుకు కోచ్‌గా పనిచేశారు. ఈ టీమ్ వచ్చే నెలలో భారత అండర్-19 జట్టుతో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుంది. ముందుగా బ్రిస్బేన్ వేదికగా సెప్టెంబర్ 21, 24, 26 తేదీల్లో మూడు వన్డేలు ఆడుతుంది. అనంతరం రెండు అనధికారిక టెస్టుల్లో తలపడుతుంది. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 3 వరకు బ్రిస్బేన్‌లో తొలి మ్యాచ్, అక్టోబర్ 7 నుంచి 10 వరకు మెక్‌కేలో రెండో మ్యాచ్ జరుగుతాయి. క్రికెట్ ఆస్ట్రేలియా దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా యువ జట్టుకు వన్డేలతో పాటు నాలుగు రోజుల అనధికారిక టెస్టుల్ని ఏర్పాటు చేసినట్లు సీఏ నేషనల్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ సాన్యా థాంప్సన్ చెప్పారు.

ఆస్ట్రేలియా అండర్-19 జట్టు: ఆర్యన్ శర్మ, యశ్ దేశ్‌ముఖ్, టర్నర్, స్టీవ్ హోగన్, టామ్ హోగన్ విల్ మలజుక్, జేమ్స్, హేడెన్, లచ్ మండ్, బెన్ గార్డన్, బైరామ్, కేసీ బార్టన్, లీ యంగ్, డ్రాపర్; రిజర్వ్: జెడ్ హోలిక్, పాడింగ్టన్, ఒస్బార్న్.

విక్టరీ విక్టోరియాదే...

మాంట్రియల్ ఓపెన్ టైటిల్ నెగ్గిన కెనడా టీనేజర్

'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగి ట్రోఫీ హస్తగతం




ఒసాకా

మాంట్రియల్: తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న క్రీడాకారిణులను ఓడిస్తూ... సంచలన ప్రదర్శన చేసిన కెనడా టెన్నిస్ టీనేజర్ విక్టోరియా ఎంబోకో... మాంట్రియల్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో అద్భుతమైన 'ఫినిషింగ్' ఇచ్చింది. 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగిన 18 ఏళ్ల ఎంబోకో చివరకు చాంపియన్‌గా అవతరించి ఔరా అనిపించింది. ఈ టోర్నీకి ముందు మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) టూర్‌లో ఒక్క టైటిల్ నెగ్గని ఎంబోకో... గ్రాండ్‌స్లామ్ తర్వాతి స్థాయి టోర్నీగా పరిగణించే డబ్ల్యూటీఏ-1000 లెవెల్ టోర్నీనే మొదటి టైటిల్‌గా గెల్చుకోవడం విశేషం. ప్రపంచ మాజీ నంబర్‌వన్, నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత, 49వ ర్యాంకర్ నయోమి ఒసాకా (జపాన్)తో జరిగిన ఫైనల్లో విక్టోరియా ఎంబోకో 2-6, 6-4, 6-1తో గెలిచింది. విజేత ఎంబోకోకు 7,52,275 డాలర్ల (రూ. 6 కోట్ల 58 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రన్నరప్ ఒసాకా ఖాతాలో 3,91,600 డాలర్లు (రూ. 3 కోట్ల 42 లక్షలు) చేరాయి. టైటిల్ నెగ్గిన క్రమంలో ఎంబోకో తొలి రౌండ్‌లో ప్రపంచ 79వ ర్యాంకర్ కింబర్లీ బిరెల్ (అమెరికా)పై, రెండో రౌండ్‌లో 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ 27వ ర్యాంకర్ సోఫియా కెనిన్ (అమెరికా)పై, మూడో రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ మేరీ బుజ్‌కోవా (చెక్ రిపబ్లిక్)పై, ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్, 2023 యూఎస్ ఓపెన్, 2025 ఫ్రెంచ్ ఓపెన్ విజేత కోకో గాఫ్ (అమెరికా)పై, క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 51వ ర్యాంకర్ జెస్సికా మనీరో (స్పెయిన్)పై, సెమీఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్, 2022 వింబుల్డన్ విజేత ఎలీనా రిబాకినా (కజకిస్తాన్)పై గెలిచింది.

ఈ టోర్నీకి ముందు 85వ ర్యాంక్‌లో ఉన్న ఎంబోకో తాజా టైటిల్‌తో సోమవారం విడుదలయ్యే ర్యాంకింగ్స్‌లో 60 స్థానాలు ఎగబాకి 25వ ర్యాంక్‌కు చేరుకోనుంది. ఫాయె అర్బన్ (1969లో), బియాంక ఆండ్రెస్కు (2019లో) తర్వాత మాంట్రియల్ ఓపెన్ టైటిల్ సాధించిన మూడో కెనడా ప్లేయర్‌గా ఎంబోకో గుర్తింపు పొందింది. మరియా షరపోవా (రష్యా; 2011లో సిన్సినాటి ఓపెన్), బియాంక ఆండ్రెస్కు (కెనడా; 2019లో ఇండియన్ వెల్స్ ఓపెన్) తర్వాత... 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగి డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో విజేతగా నిలిచిన మూడో ప్లేయర్‌గా ఎంబోకో ఘనత సాధించింది.



సూపర్ షెల్టన్

కెరీర్‌లో తొలి మాస్టర్స్ టైటిల్ గెలిచిన అమెరికా ప్లేయర్

టొరంటో: అమెరికా రైజింగ్ టెన్నిస్ స్టార్ బెన్ షెల్టన్ తన కెరీర్‌లోనే గొప్ప టైటిల్ సాధించాడు. నేషనల్ బ్యాంక్ ఓపెన్ టొరంటో ఏటీపీ మాస్టర్స్-1000 టోర్నీలో ప్రపంచ ఆరో ర్యాంకర్ షెల్టన్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో షెల్టన్ 6-7 (5/7), 6-4, 7-6 (7/3)తో ప్రపంచ 12వ ర్యాంకర్ కరెన్ ఖచనోవ్ (రష్యా)పై విజయం సాధించాడు. 2 గంటల 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో షెల్టన్ 16 ఏస్‌లు సంధించి, 6 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. విజేత షెల్టన్‌కు 11,24,380 డాలర్ల (రూ. 9 కోట్ల 84 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

వీనస్ అవుట్



సిన్సినాటి (ఒహాయో): గత నెల టెన్నిస్ సర్క్యూట్‌లోకి పునరాగమనం చేసిన అమెరికన్ దిగ్గజం వీనస్ విలియమ్స్‌కు సిన్సినాటి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆమె 4-6, 4-6తో స్పెయిన్‌కు చెందిన బౌజస్ మనీరో చేతిలో వరుస సెట్లలో పరాజయం చవిచూసింది. ఈ ఏడాది ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమైన వీనస్ సన్నాహకంగా ఈ హార్డ్‌కోర్ట్ టెన్నిస్ టోర్నీలో ఆడింది. 7 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు, 14 డబుల్స్ టైటిళ్లు నెగ్గిన అమెరికన్ వెటరన్ స్టార్‌కు స్వదేశంలోని యూఎస్ ఓపెన్ నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చారు. 45 ఏళ్ల అమెరికన్ నాలుగు (వింబుల్డన్-2000, 2001; యూఎస్ ఓపెన్ 2000, 2001) గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచేనాటికి బౌజస్ మనీరో పుట్టనేలేదు. తాజాగా 51 ర్యాంకర్ మనీరో వరుస సెట్లలోనే ఓ దిగ్గజ ప్లేయర్‌కు ఇంటిదారి చూపింది. మ్యాచ్ ముగిసిన తర్వాత 22 ఏళ్ల స్పెయిన్ అమ్మాయి నిజంగానే అద్భుతంగా ఆడిందని వీనస్ కితాబిచ్చింది. సిన్సినాటిలో ఆమె బరిలోకి దిగడం ఇది 11వ సారి! టైటిల్ గెలవనప్పటికీ 2012లో సెమీస్, 2019లో క్వార్టర్స్ చేరింది. ఈ నెల 19 నుంచి జరిగే యూఎస్ ఓపెన్‌లో వీనస్ సింగిల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ బరిలోనూ దిగుతోంది. మిక్స్‌డ్‌లో సహచర క్రీడాకారుడు రీలీ ఒపెల్కాతో జతకట్టింది.

మేటి జట్టుతో ఆడినపుడే...




మెగా టోర్నీకి సరైన సన్నాహాలు

- భారత హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వ్యాఖ్య
- నాలుగు మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు ఆస్ట్రేలియా బయలుదేరిన టీమిండియా

బెంగళూరు: ఆసియా కప్ టోర్నమెంట్ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా వంటి మేటి జట్టుతో తలపడితే లోపాలు సవరించుకొని మరింత మెరుగయ్యే అవకాశం ఉంటుందని భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అభిప్రాయపడ్డాడు. ఈ నెల 29 నుంచి రాజ్‌గిర్ వేదికగా పురుషుల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ ప్రారంభం కానుండగా... అంతకుముందు భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. ఈ టూర్‌లో భాగంగా పెర్త్‌లోని హాకీ స్టేడియంలో ఆతిథ్య ఆస్ట్రేలియాతో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం శుక్రవారం బెంగళూరు నుంచి జట్టు ఆస్ట్రేలియాకు పయనమైంది. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ... 'ఆస్ట్రేలియా వంటి బలమైన ప్రత్యర్థితో వారి సొంతగడ్డపై మ్యాచ్‌లు ఆడటం సవాలుతో కూడుకున్నది. ఆసియా కప్ ప్రారంభానికి ముందు ఇలాంటి క్లిష్టమైన సిరీస్ ఆడనుండటం జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మేమంతా ఇలాంటి సన్నద్ధతే కోరుకున్నాం. ఆసియా కప్ కోసం జట్టును సిద్ధం చేసుకునేందుకు ఈ సిరీస్ ఉపయోగపడనుంది. బలమైన ప్రత్యర్థితో తలపడినప్పుడే మన లోపాలు బయటపడతాయి. వాటిని ఎలా అధిగమించాలో మార్గాలు వెతికి మరింత మెరుగైన ప్రదర్శన చేయవచ్చు. జట్టు మొత్తం సమష్టిగా రాణించాలని భావిస్తున్నాం. ఈ సన్నద్ధత ఆసియా కప్‌లో తప్పక ఉపయోగపడుతుంది' అని అన్నాడు. ఆగస్టు 15, 16, 19, 21న పెర్త్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య హాకీ మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రదర్శన ఆధారంగా ఆసియాకప్ తుది జట్టు కూర్పు ఉండనుంది. మెరుగైన ఆటతీరు కనబర్చిన ప్లేయర్లనే ఆసియాకప్‌నకు ఎంపిక చేయనున్నారు. ప్రస్తుత జట్టులో అటు అనుభవజ్ఞులు, ఇటు యువకులు ఉండటంతో... ఆస్ట్రేలియాపై వారి ఆటతీరును అంచనా వేసిన తర్వాతే ఆసియాకప్‌నకు జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ టోర్నీలో సత్తా చాటిన జట్టు వరల్డ్‌కప్‌నకు నేరుగా అర్హత సాధించనుంది.

న్యూజిలాండ్ శతకాల మోత


నికోల్స్


కాన్వే


రచిన్

కాన్వే, నికోల్స్, రచిన్ భారీ సెంచరీలు

- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 601/3
- 476 పరుగుల ఆధిక్యం
- జింబాబ్వేతో రెండో టెస్టు

బులవాయో: జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగుల పండగ చేసుకున్నారు. ఒకరి తర్వాత ఒకరు వంతులు వేసుకున్నట్లు సెంచరీలతో విజృంభించారు. ఫలితంగా ఓవర్‌నైట్ స్కోరు 174/1తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... చివరకు 130 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 601 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (245 బంతుల్లో 153; 18 ఫోర్లు), హెన్రీ నికోల్స్ (245 బంతుల్లో 150 బ్యాటింగ్; 15 ఫోర్లు), రచిన్ రవీంద్ర (139 బంతుల్లో 165 బ్యాటింగ్; 21 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ శతకాలతో కదంతొక్కారు. నైట్‌వాచ్‌మన్ జాకబ్ డఫీ (36; 6 ఫోర్లు) త్వరగానే అవుట్ కాగా... కాన్వే, నికోల్స్ మూడో వికెట్‌కు 110 పరుగులు జోడించారు. ఈ క్రమంలో కాన్వే 143 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రచిన్ రవీంద్ర క్రీజులోకి వచ్చిన తర్వాత ఆట స్వరూపమే మారిపోయింది. అప్పటి వరకు వరకు టెస్టు మ్యాచ్ తరహాలో సాగిన పోరును... రచిన్ వన్డేలాగా మార్చేశాడు. ధనాధన్ షాట్లతో రెచ్చిపోతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. మరో ఎండ్‌లో నికోల్స్ కాస్త నిదానంగా ఆడగా... రచిన్ మాత్రం జింబాబ్వే బౌలర్లను ఆటాడుకున్నాడు. నికోల్స్ 166 బంతుల్లో మూడంకెల స్కోరుకు చేరగా... రవీంద్ర చూస్తుండగానే 104 బంతుల్లో సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత మరింత రెచ్చిపోయిన ఈ జంట ఆఖరి సెషన్ చివరి గంటలో చెలరేగిపోయింది. ఎడాపెడా బౌండరీలు బాదుతూ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. సెంచరీ నుంచి 150కి చేరేందుకు రవీంద్ర 29 బంతులు మాత్రమే తీసుకున్నాడంటే అతడి జోరు ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. రచిన్, నికోల్స్ అభేద్యమైన నాలుగో వికెట్‌కు 256 పరుగులు జోడించారు. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ, ట్రీవర్, మసెకెసా తలా ఒక వికెట్ పడగొట్టారు. అంతకుముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే ఆలౌట్ కాగా... చేతిలో 7 వికెట్లు ఉన్న న్యూజిలాండ్ 476 పరుగుల ఆధిక్యంలో ఉంది.

భారత్‌కు సులువైన 'డ్రా'

అక్టోబర్‌లో వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీకి ఆతిథ్యం



న్యూఢిల్లీ: వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ టీమ్ విభాగం (సుహాస్‌దినాతా కప్)లో భారత జట్టుకు సులువైన 'డ్రా' ఎదురైంది. అసోంలోని గువహటిలో అక్టోబర్ 6 నుంచి 11 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. రెండో సీడ్‌గా బరిలోకి దిగనున్న భారత్‌తో పాటు గ్రూప్ 'హెచ్'లో హాంకాంగ్, నేపాల్, ఘనా ఉన్నాయి. 2008 తర్వాత ఈ టోర్నీ భారత్‌లో జరగడం ఇదే తొలిసారి. టోర్నీలో పాల్గొంటున్న మొత్తం 37 జట్లను ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన టీమ్‌లు క్వార్టర్ ఫైనల్‌కు చేరతాయి. 14 సార్లు విజేత చైనా జట్టు జపాన్, సింగపూర్, బ్రెజిల్, భూటాన్‌లతో కలిసి గ్రూప్ 'ఇ'లో భాగంగా ఉంది. రిలే ఫార్మాట్‌లో స్వల్ప మార్పులతో ఈసారి టోర్నీని నిర్వహిస్తున్నారు. ఒక్కో పోరు మూడు సెట్‌ల పాటు జరుగుతుంది. ప్రతీ సెట్‌లో పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో ఈవెంట్‌లో గరిష్ఠంగా 9 పాయింట్లు సాధించగానే తర్వాత ఈవెంట్ మొదలవుతుంది. మొత్తంగా మూడు సెట్‌లలో కలిపి ముందుగా 45 పాయింట్లు సాధించిన టీమ్ విజేతగా నిలుస్తుంది. గతంలో ఒకే సెట్‌లో 10 మ్యాచ్‌ల ద్వారా ముందుగా 110 పాయింట్లు సాధించిన టీమ్ గెలిచేది. 2025 ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో గెలిచిన ఆటగాళ్లకు భారత జట్టులో నేరుగా చోటు దక్కుతుంది. ఇతర స్థానాల కోసం నేటి నుంచి నాలుగు రోజుల పాటు సెలక్షన్ ట్రయల్స్ జరగనున్నాయి. బీడబ్ల్యూఎఫ్ జూనియర్ ర్యాంకింగ్స్‌లో టాప్-20లో ఉన్న ఆటగాళ్లు మాత్రమే ట్రయల్స్‌లో పోటీ పడతారు. సుహాస్‌దినాతా కప్ ముగిసిన తర్వాత అక్టోబర్ 13 నుంచి 19 వరకు వ్యక్తిగత విభాగంలో పోటీలు నిర్వహిస్తారు.

ఐఎస్ఎల్ సమస్యను 'సుప్రీం' దృష్టికి తీసుకురండి!

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎస్) ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహణపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఐఎస్ఎల్ జట్ల యాజమాన్యాల్లో కూడా ఆందోళన పెరుగుతోంది. దీని సత్వర పరిష్కారానికి తగిన చర్య తీసుకోవాలని వారు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్)ను కోరుతున్నారు. ఈ క్రమంలో ఐఎస్ఎల్ తాజా పరిస్థితిని సుప్రీం కోర్టు దృష్టికి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు. మొత్తం 13 క్లబ్‌లలో మోహన్‌బగాన్ సూపర్ జెయింట్, ఈస్ట్ బెంగాల్ మినహా మిగతా 11 క్లబ్‌ల ప్రతినిధులు ఏఐఎఫ్ఎఫ్‌కు రాసిన లేఖపై సంతకం చేశారు. ఐఎస్ఎల్ నిర్వహణ హక్కులు ఉన్న ఫుట్‌బాల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (ఎఫ్ఎస్‌డీఎల్)కు, ఏఐఎఫ్ఎఫ్‌కు మధ్య 2010లో ఒప్పందం కుదిరింది. అయితే ఈ ఏడాది డిసెంబర్‌లో ముగిసే ఈ ఎంఓయూను పునరుద్ధరించుకునే విషయంలో స్పష్టత రాకపోవడంతో టోర్నీని ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఎస్‌డీఎల్ ప్రకటించింది. ఈ ఒప్పంద పునరుద్ధరణ అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. తాము తుది ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎలాంటి ఎంఓయూ కుదుర్చుకోరాదని సుప్రీం ఇప్పటికే ఆదేశించింది. న్యాయపరంగా ఎంఓయూలో తాము భాగం కాదు కాబట్టి నేరుగా ఈ కేసులో జోక్యం చేసుకోలేకపోతున్నామని... సుప్రీం కోర్టులో సమస్యను వివరించి ఫుట్‌బాల్‌ను కాపాడమంటూ ఐఎస్ఎల్ టీమ్‌లు విజ్ఞప్తి చేశాయి. 'న్యాయపరమైన చిక్కులు ఇప్పుడు భారత ఫుట్‌బాల్‌ను బాగా నష్టపరుస్తున్నాయి. ఐఎస్ఎల్ క్లబ్‌లలో పెట్టుబడులు, వాణిజ్యపరమైన కాంట్రాక్ట్‌లు గందరగోళంలో పడటంతో ఆటగాళ్లు, సిబ్బంది, ఇతర భాగస్వాముల భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయి. దీని వల్ల దేశంలో ఆట ఆగిపోతుంది. కాబట్టి సుప్రీం దృష్టికి దీనిని తీసుకురండి' అని ఐఎస్ఎల్ ఫ్రాంచైజీలు కోరుతున్నాయి. ఐఎస్ఎల్ భవిష్యత్తుపై అనిశ్చితి కారణంగా చెన్నై, బెంగళూరు జట్ల యాజమాన్యాలు కూడా ఇప్పటికే తమ సిబ్బందికి జీతాలు ఆపేయడంతో పాటు టీమ్ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లుగా కూడా స్పష్టం చేశాయి.

'మదురో అరెస్టు' బహుమతి రెట్టింపు

రూ. 438 కోట్లు ఇస్తామన్న అమెరికా

వాషింగ్టన్: వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్టుకు సమాచారం ఇచ్చిన వారికి రూ.438 కోట్లు బహుమానంగా ఇస్తామని అమెరికా ప్రకటించింది. మదురోను ప్రపంచంలోనే అతి పెద్ద డ్రగ్ స్మగ్లర్‌గా అభివర్ణించింది. గతంలో రూ.250 కోట్లుగా ఉన్న బహుమతిని మళ్లీ పెంచినట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండీ ప్రకటించారు. మదురోకి డ్రగ్స్ స్మగ్లర్లతో నేరుగా సంబంధాలున్నాయని ఆమె ఆరోపించారు. మదురో, అతని సహచరులతో సంబంధం ఉన్న 30 టన్నుల కొకైన్‌ను డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) స్వాధీనం చేసుకుందని, అందులో 7 టన్నులు మదురోకి చెందినవని అన్నారు. ఈ ఆరోపణలను వెనిజులా విదేశంగ మంత్రి ఇవాన్ గిల్ ఖండించారు. బహుమతి ప్రకటనను రాజకీయ ప్రచారంగా అభివర్ణించారు. తమ దేశ గౌరవం అమ్మకానికి లేదన్నారు. జెఫ్రీ ఎపిస్టీన్ కేసు వ్యవహారంలో విమర్శల నుంచి దృష్టి మళ్లించేందుకే బోండీ ఈ చర్య తీసుకున్నారని ఆయన ఆరోపించారు.

మొదటి పదవీకాలం నుంచే..

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మదురోపై చాలాకాలంగా విమర్శలు చేస్తున్నారు. తన తొలి పదవీకాలంలోనే మదురో, పలువురు ఉన్నతాధికారులపై డ్రగ్ ట్రాఫికింగ్, నార్కో టెర్రరిజం, అవినీతి ఆరోపణలు మోపారు. మదురో కొలంబియా రెబెల్ గ్రూప్ 'ఫార్క్'తో కలిసి కొకైన్‌ను అమెరికాకు పంపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆ సమయంలో మదురో అరెస్టుకు రూ.150 కోట్ల బహుమతిని ప్రకటించారు. బైడెన్ పాలనలో ఆ మొత్తాన్ని 250 కోట్లకు పెంచింది. 2024 జూలై 29న వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో నికోలస్ మదురో గెలిచారు. ప్రతిపక్ష అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్‌పై విజయం సాధించారు. మూడోసారి అధ్యక్షపీఠాన్ని అధిష్టించారు. బస్సు డ్రైవర్ నుంచి రాజకీయవేత్తగా ఎదిగిన మదురో వివాదాస్పదంగా నిలిచారు. హ్యూగో చావెజ్ మరణం తరువాత 2013లో యునైటెడ్ సోషలిస్టు పార్టీ బాధ్యతలు తీసుకున్నారు. 2024 ఎన్నికల్లో మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలతో అమెరికా వెనిజులాపై ఆంక్షలు విధించింది. మదురోను అధ్యక్షుడిగా తిరస్కరించింది. అమెరికాతోపాటు యురోపియన్ యూనియన్, యూకే కూడా వెనిజులా చర్యలను ఖండించాయి. తమ దేశంలో తవ్వకాలు జరిపేందుకు అమెరికా చమురు దిగ్గజం చెవ్రాన్‌ను అనుమతించడంతో వెనిజులాపై కొన్ని ఆంక్షలను సడలించింది.

కొత్త రోబోలు వచ్చాయి..



డ్రమ్ము వాయిస్తూ...



పాప్‌కార్న్ వేయిస్తూ...



సందర్శకుడితో ముచ్చటిస్తూ...



పక్క సర్దుతూ...



వస్తువులను అమరుస్తూ...



పెట్టె మోస్తూ...

✿ బీజింగ్‌లో జరుగుతున్న ప్రపంచ రోబో సదస్సులో శుక్రవారం నాడు సందర్శకులను అబ్బురపరిచిన రోబోలు

హరియాణా గ్రామంలో.. 3 వేల ఏళ్లనాటి మానవ నివాసం ఆనవాళ్లు

చండీగఢ్: హరియాణాలోని యమునానగర్ జిల్లాలో సుమారు 3,500 ఏళ్లనాటి మానవ నాగరికత ఆనవాళ్లు బయటపడ్డాయి. టోప్రా కలాన్ గ్రామంలో అప్పటి వస్తువులు, కళాఖండాలు లభ్యమయ్యాయని పురాతత్వ విభాగం అధికారి ఒకరు వివరించారు. ఈ ప్రాంతంలో మరిన్ని తవ్వకాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భూమి పొరల్లో దొరికే వస్తువులు, ఇతర ఆధారాలను బట్టి మాత్రమే ఆ నాగరికత ఎన్నేళ్ల కాలం నాటితో కచ్చితంగా చెప్పగలమని వివరించారు. జనసమ్మర్థం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో మరింత విస్తారంగా తవ్వకాలు సాగించడం సవాళ్లతో కూడుకున్న విషయమని పేర్కొన్నారు. రాడార్‌తో చేపట్టిన సర్వేలో బోలుగా ఉండే నిర్మాణాలు, గుండ్రటి నిర్మాణాలు, గోడలు తదితరాలను గుర్తించామన్నారు. ప్రస్తుతం ఫిరోజ్ షా కోట్లాలో ఉన్న క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం మౌర్యుల కాలంనాటి అశోక స్తంభం టోప్రా కలాన్‌లో దొరికిందేనని ఆ అధికారి వివరించారు. ఈ ప్రాంతానికి చారిత్రకంగా, పురాతత్వ పరంగా ఎంతో ప్రాధాన్యముందని పేర్కొన్నారు. యమునానగర్ ప్రాంతం ఒకప్పుడు బౌద్ధమతానికి కేంద్ర స్థానంగా ఉండేదన్నారు. ఇందుకు సంబంధించిన మరిన్ని విశేషాలను వెలికితీసే లక్ష్యంతో హరియాణా రాష్ట్ర పురాతత్వ విభాగం టోప్రా కలాన్ చుట్టూ రెండేళ్లుగా తవ్వకాలు సాగిస్తోందని తెలిపారు.

బీజేపీ రిగ్గింగ్ వల్లే 2019లో ఓడిపోయా: ఖర్గే

బెంగళూరు: 2019 లోక్‌సభ ఎన్నికల్లో గుల్బర్గా స్థానంలో తన ఓటమికి ఓట్లలో మోసాలే కారణమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో 2019 ఎన్నికల్లో మినహా ఎన్నడూ తనకు ఓటమి ఎదురుకాలేదని పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో జరిగిన రిగ్గింగ్‌కు తాను బాధితుడిగా మారానని వ్యాఖ్యానించారు. శుక్రవారం బెంగళూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన 'ఓట్ అధికార్ ర్యాలీ'లో ఖర్గే మాట్లాడారు. 'నా జీవితంలో 12 ఎన్నికల్లో విజయం సాధించా. ఒక్క 2019 ఎన్నికల్లో తప్ప. ఈ ఎన్నికల్లో జరిగిన మోసం కారణంగా మొదటిసారిగా ఓటమి పాలయ్యా. బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడటంతో గుల్బర్గా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మొత్తం ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో 20 వేల చొప్పున బోగస్ ఓట్లు పడ్డాయి'అని ఆయన ఆరోపించారు. అధికారంలో కొనసాగేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలను ఆయుధాలుగా వాడుకుంటోందని మండిపడ్డారు.

అమెరికా సరిహద్దుల్లో పట్టుబడిన ఇద్దరు భారతీయులు

న్యూయార్క్: అమెరికాలోకి దొంగతనంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తూ ఇద్దరు భారతీయులు పట్టుబడ్డారు. ఆగస్టు ఒకటో తేదీన మైన్ రాష్ట్రంలోకి కాలినడకన ప్రవేశించిన ఇద్దరు భారతీయులను హౌల్టన్ సెక్టార్ బోర్డర్ పెట్రోల్ విభాగం అరెస్ట్ చేసిందని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్(సీబీపీ) తెలిపింది. వీరిద్దరిపై విచారణ జరిపి, వెనక్కి పంపించేందుకు చర్యలు చేపడతామని పేర్కొంది. పట్టుబడిన వారి పేరు, ఇతర వివరాలను వెల్లడించలేదు. అక్రమంగా ప్రవేశించిన వారు స్వచ్ఛందంగా తిరిగి వెళ్లేందుకు సిద్ధమైన పక్షంలో ప్రోత్సాహకాలు సైతం అందజేస్తామని తెలిపింది. సీబీపీ హోం యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరింది.

ఇబ్బంది కలిగించడం మా ఉద్దేశం కాదు

అలహాబాద్ హైకోర్టు జడ్జీపై ఉత్తర్వుల్ని వెనక్కి తీసుకున్న సుప్రీం

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు జడ్జికి వ్యతిరేకంగా ఈ నెల 4వ తేదీన వెలువరించిన ఉత్తర్వుల్ని వెనక్కి తీసుకుంటూ సుప్రీంకోర్టు అనూహ్య నిర్ణయం తీసుకుంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ అనే న్యాయమూర్తిని రిటైరయ్యే వరకు క్రిమినల్ కేసులను విచారించరాదని, సీనియర్ న్యాయమూర్తి పక్కన కూర్చోవాలని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం ఆదేశించడం తెల్సిందే. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. తీర్పును సమీక్షించాలంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ అంశంపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. 'గౌరవ ప్రధాన న్యాయమూర్తి నుంచి మాకు లేఖ అందింది. తీర్పులోని కొన్ని అంశాలను సమీక్షించాలంటూ ఆ లేఖలో కోరారు. ఈ పరిస్థితుల్లో పునః పరిశీలన చేపట్టాం. సంబంధిత జడ్జీపై వివక్ష చూపడం లేదా ఎవరికీ ఇబ్బంది కలిగించడం మా ఉద్దేశం కాదని స్పష్టం చేస్తున్నాం. అలా చేయాలని మేం ఆలోచించలేదు కూడా' అని ధర్మాసనం తెలిపింది. ఈ పరిణామంపై అలహాబాద్ హైకోర్టు హర్షం వ్యక్తం చేసింది.

కుండపోత వానలు, విరిగిన కొండచరియలు

చైనాలో 17 మంది మృతి..33 మంది గల్లంతు

బీజింగ్: కుండపోత వానలు, కొండచరియలు విరిగి పడుతున్న ఘటనలు చైనాను అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాలకు సంబంధించిన వివిధ ఘటనల్లో కనీసం 17 మంది చనిపోగా, 33 మంది వరకు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. పర్వతప్రాంతాల్లో కురిసిన వర్షాలు, వరదల ప్రభావం గన్సు ప్రావిన్స్‌పై ఎక్కువగా పడింది. ఈ ప్రాంతంలో 10 మంది చనిపోగా 33 మంది జాడ తెలియకుండా పోయిందని అధికార జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని గ్వాంగ్‌ఝూలో కొండచరియలు విరిగిపడి ఏడుగురు చనిపోగా, మరో ఏడుగురు గాయపడ్డారు. గ్వాంగ్‌ఝూ ప్రావిన్స్‌లోని దయువాన్ గ్రామంపై కొండచరియలు విరిగి పడటంతో పలు ఇళ్లు ధ్వంసం కాగా, 14 మంది శిథిలాల్లో చిక్కుకుపోయారు. గాయాలపాలైన వీరిని రక్షించి ఆస్పత్రులకు తరలించారు. గన్సు ప్రావిన్స్‌లోని యుఝొంగ్‌లోని పలు టౌన్‌షిప్పులు చెట్లు కూలి, వరద, బురద రోడ్లపై నిలిచిపోయింది. నివాస భవనాలు, వాహనాలు ధ్వంసమయ్యాయి. అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టింది. సుమారు 2,700 మంది సహాయక సిబ్బందితోపాటు 980 వాహనాలు, యంత్రాలను, 8,530 అత్యవసర సామగ్రిని బాధిత ప్రాంతాలకు తరలించింది. రెండు వారాల క్రితం రాజధాని బీజింగ్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో 44 మంది చనిపోగా 9 మంది గల్లంతయ్యారు.

ఢిల్లీలో పార్కింగ్ వివాదం.. దాడిలో సినీ నటి బంధువు మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని భోగాల్ ప్రాంతంలో వాహన పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదంలో సినీ నటి హుమా ఖురేషి వరుసకు సోదరుడయ్యే వ్యక్తి తీవ్రగాయాలతో ప్రాణాలు కోల్పోయారు. భోగాల్‌లోని చర్చిలేన్‌లో నివాసం ఉంటున్న ఆసిఫ్ ఖురేషి ఇంటి ముందు గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఓ వ్యక్తి స్కూటర్ పార్కు చేశాడు. దీనిపై మొదలైన వివాదం తీవ్రవాదులాటకు దారి తీసింది. కోపంతో ఉన్న ఇద్దరు టీనేజర్లు ఓ పదునైన వస్తువుతో ఆసిఫ్ ఛాతీపై బలంగా పొడిచారు. తీవ్ర గాయం కావడంతో ఆసిఫ్ కిందపడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనపై ఉజ్వల్, గౌతమ్ అనే వారిపై హజ్రత్ నిజాముద్దీన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులిద్దరూ అదే వీధిలో ఆసిఫ్ నివాసానికి సమీపంలోని ఓ ఇంట్లో రెండో అంతస్తులో ఉంటున్నారని పోలీసులు తెలిపారు.

వారిని సెలవుపై వెళ్లమనండి..!

- పెండింగ్ కేసులకు తీర్పులు సిద్ధం చేయమనండి
- జార్ఖండ్ హైకోర్టు జడ్జీలకు సుప్రీం ఉత్తర్వులు

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వింత ఆదేశాలు జారీ చేసింది. జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తులు ఇద్దరు పెద్ద సంఖ్యలో తీర్పుల్ని పెండింగ్‌లో ఉంచడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఆ ఇద్దరినీ వారికున్న 10- 12 వారాల సెలవుపై వెళ్లమనండి. మొత్తం పెండింగ్‌లో ఉన్న 61 కేసుల తీర్పుల్ని రాయమనండి. జడ్జీలకు ఉండే సెలవులు చాలా వరకు మిగిలిపోతున్నాయి. ఈ కేసుల్ని పరిష్కరించమనండి. ప్రజలకు కావాల్సింది తీర్పులు. వాళ్లు మిగతా విషయాల్ని పట్టించుకోరు. తీర్పుల్ని సరైన రీతిలో ఇవ్వమనండి'అంటూ జార్ఖండ్ హైకోర్టు తరఫున హాజరైన సీనియర్ లాయర్ అజిత్ సిన్హాను కోరింది. ఈ విషయాలను ప్రధాన న్యాయమూర్తికి తెలపాలని పేర్కొంది. ఈ విషయంలో న్యాయమూర్తులు వేగంగా స్పందించాలి. మూడు నెలల తర్వాత సమీక్ష చేపడతామని తెలిపింది. హోం గార్డుల నియమాకానికి సంబంధించిన 2023 నాటి కేసులో ఇప్పటికీ హైకోర్టు తీర్పు వెలువరించక పోవడంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామంటూ జార్ఖండ్‌లోని మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థులు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. క్రిమినల్ కేసుల్ని తేల్చకుండా నాన్చుతున్నారంటూ జార్ఖండ్ హైకోర్టు జడ్జీలపై సుప్రీంకోర్టు గతంలో హెచ్చరికలు చేసిన సందర్భాలున్నాయి.

చొరబాటుదార్లకు ఓటు హక్కు ఇవ్వాలా?

- ఎస్ఐఆర్‌పై విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం

సీతామర్హి: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)ను తప్పుపడుతున్న ప్రతిపక్షాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ చొరబాటుదార్లకు కూడా ఓటు హక్కు ఇవ్వాలా? అని ప్రశ్నించారు. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం బిహార్‌లోని సీతామర్హి జిల్లాలో బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదార్ల పేర్లను తొలగించాల్సిందేనని తేల్చిచెప్పారు. వారికి ఇక్కడ ఓటు వేసే హక్కు లేదన్నారు. చొరబాటుదార్లను పక్కనపెట్టడాన్ని కాంగ్రెస్, ఆర్జేడీ జీర్ణించుకోలేకపోతున్నాయని, అందుకే ఎస్ఐఆర్‌పై రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌ను కూడా విపక్షాలు వ్యతిరేకించాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను దెబ్బకొడితే విపక్షాలకు వచ్చిన ఇబ్బంది ఏమిటని నిలదీశారు. బిహార్‌లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే మరోసారి ఘన విజయం సాధించడం ఖాయమని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

ఈసీ బీజేపీకి మాత్రమే జవాబుదారీయా?

కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా

న్యూఢిల్లీ: ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ తీవ్ర ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని ఆధారాలు చూపాలని ఎన్నికల కమిషన్(ఈసీ) కోరడంపై ఆ పార్టీ నేత ప్రియాంకా గాంధీ వాద్రా నిప్పులు చెరిగారు. కేవలం బీజేపీకే జవాబుదారీగా ఉండాలనుకుంటున్నారా అంటూ ఈసీని నిలదీశారు. భారీగా అక్రమాలు జరిగాయని రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై దర్యాప్తు జరిపించి, చేతనైతే నిగ్గు తేల్చాలన్నారు. మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఎన్నికల జాబితాను ఎందుకివ్వడం లేదు, ఆరోపణలపై ఎందుకు దర్యాప్తు చేపట్టడం లేదు?అని పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో మీడియా ఎదుట ప్రశ్నించారు. ఇంతటి సీరియస్ విషయంపై విచారణ జరపకుండానే తప్పుడు ఆరోపణలని ఈసీకి ఎలా అంటుందన్నారు. 'ఇది మన దేశ ప్రజాస్వామ్యం. ఇదేమీ తమాషా కాదు. ఇదేదో ఒక పార్టీకే సంబంధించిన అంశమూ కాదు. దర్యాప్తు చేపట్టకుండా ఆరోపణలను ఈసీ కొట్టివేయజాలదు'అని ప్రియాంక అన్నారు. 'ఈసీకి చాలా పెద్ద బాధ్యత ఉంది. తమ బాధ్యత కేవలం బీజేపీకి మాత్రమే అని భావిస్తుంటే పునరాలోచన చేసుకోవాలి. ఎందుకంటే, నా సోదరుడు చెప్పినట్లుగా మరొకరు అధికారం చేపట్టే రోజు తప్పక వస్తుంది. మన ప్రజాస్వామ్యం నాశనానికి కుట్ర పన్నిన వారు అప్పుడు సమాధానం చెప్పాల్సి ఉంటుంది'అని ఆమె అన్నారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందన్న విషయం తేటతెల్లమవుతోంది, దీనిపై తదుపరి స్పందనపై ఇండియా కూటమి నేతలు చర్చిస్తున్నారని చెప్పారు.

ఎస్ఐఆర్.. సంస్థాగత చోరీ

రాహుల్ గాంధీ ఆగ్రహం

న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'సంస్థాగత దొంగతనం'గా అభివర్ణించారు. ఓట్లు చోరీ చేయడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం బహిరంగంగా బీజేపీతో చేతులు కలిపిందని ఆరోపించారు. పేదల ఓటు హక్కును లాగేసుకోవడమే ఈసీ ధ్యేయంగా మారిపోయిందని విమర్శించారు. ఈ మేరకు రాహుల్ గాంధీ శుక్రవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఎన్నికల్లో అక్రమంగా గెలిచేందుకు ఈసీ, బీజేపీ కుట్రలు సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్ఐఆర్ చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఓట్ల చోరీ అనేది కేవలం ఎన్నికల కుంభకోణం మాత్రమే కాదని.. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న అదిపెద్ద మోసమని తేల్చిచెప్పారు. గత ఎన్నికల్లో బీజేపీకి 15 సీట్లు తక్కువగా వచ్చి ఉంటే మోదీ మళ్లీ ప్రధానమంత్రి అయ్యేవారు కాదని, 'ఇండియా'కూటమి అధికారంలోకి వచ్చేదని పునరుద్ఘాటించారు. బెంగళూరులోని మహాదేవపుర అసెంబ్లీ స్థానంలో జరిగిన ఓట్ల దొంగతనం గురించి వివరాలు పంచుకున్నారు. 'ఇంటి నెంబర్ 0'తో అక్కడ పెద్ద ఎత్తున ఓట్లు నమోదయ్యాయని తెలిపారు. 'ఇంటి నెంబర్ 35'లో ఏకంగా 80 ఓట్లు ఉన్నాయని, అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో చేర్చిన కొత్త ఓట్ల గురించే తాము మాట్లాడుతున్నామని, నిజానికి తొలగించిన ఓట్లే ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ పట్ల ప్రజల్లో భారీ వ్యతిరేకత ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ గెలిచిందన్నారు. చోట్ల చౌర్యమే ఇందుకు కారణమని తేల్చిచెప్పారు. దేశ ద్రోహానికి పాల్పడొద్దని ఎన్నికల సంఘం అధికారులకు రాహుల్ గాంధీ హితవు పలికారు.

వెట్టి చాకిరీ నుంచి తప్పించుకోవడానికి...

150 కిలోమీటర్లు నడిచిన బాల కార్మికుడు

గురుగ్రామ్: ప్రాథమిక విద్య హక్కుగా ఉన్నా... అది ఆచరణకు నోచుకోవడం లేదు. బాల కార్మిక నిర్మూలనకు ప్రభుత్వాలెన్ని పథకాలు పెడుతున్నా.. అమలులో విఫలమవుతూనే ఉందని మళ్లీ మళ్లీ రుజువవుతూనే ఉంది. తాజాగా బీహార్‌కు చెందిన ఓ బాలుడు.. ఆ వెట్టి నుంచి తప్పించుకోవడానికి 150 కిలోమీటర్లు నడిచాడు. చివరకు తన చేయి కూడా పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. 15 ఏళ్ల బాలుడు హర్యానా, జింద్ జిల్లాలోని ఒక పాడి పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతని స్వస్థలం బీహార్‌లోని కిషన్‌గంజ్ జిలా. నెలకు రూ.10,000 వేతనం ఇస్తామన్న హామీతో అతడిని పనిలోకి తీసుకెళ్లారు. డైరీ ఫామ్‌లో అతన్ని మోటరైజ్డ్ ఫీడర్ చాపర్ ఆపరేటర్‌గా పెట్టారు. ఆ ఫామ్ దగ్గరే ఓ గదిలో నివాసం. వేతనం మాట అటుంచితే.. సరైన ఆహారం కూడా పెట్టలేదు. చాపర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సమయంలో అతని చేతికి గాయమైంది. ఆ తరువాత అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. మెలకువ వచ్చేసరికి అతను డిస్పెన్సరీలో ఉన్నాడు. ప్రాథమిక చికిత్స చేసిన డిస్పెన్సరీ సిబ్బంది బాలుడిని వెళ్లిపోవాల్సిందిగా సూచించారు. మళ్లీ ఫామ్‌కు వెళ్లడం ఇష్టం లేని బాలుడు బీహార్‌కు నడక మొదలు పెట్టాడు. దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరం మొండిగా వెళ్లాలి. దాదాపు 150 కిలోమీటర్లు నడిచిన తరువాత నుహ్‌జిల్లాలోని టౌరు సమీపంలో అతన్ని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు చూశారు. భోజనం పెట్టి, పోలీసులకు అప్పగించారు. వివరాలు అడిగి తెలుసుకున్న పోలీసులు.. చేతి గాయానికి చికిత్స కోసం నుహ్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అతని సోదరుడు, ఇతర బంధువులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబం హుటాహుటిన వచ్చిన బాలుడిని తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. గాయం తీవ్రమవ్వడంతో మోచేతి వరకు చేయిని తొలగించాల్సి వచ్చింది.

కెనడాలో భారతీయ విద్యార్థిపై కాల్పులు

న్యూఢిల్లీ: కెనడాలో భారతీయ విద్యార్థి హర్‌సిమ్రత్ రంధావా(21)పై ఓ యువకుడు కాల్పులు జరిపాడు. నిందితుడిని 32 ఏళ్ల జెర్డాయిన్ ఫోస్టర్‌గా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఫస్ట్-డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. మంగళవారం అంటారియాలోని నయగారా జలపాతం వద్ద ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. హర్‌సిమ్రత్ మొహాక్ కాలేజీలో ఫిజియోథెరపీ కోర్సు రెండో సంవత్సరం చదువుతున్నారు. బస్ స్టాప్ సమీపంలో నిల్చొని ఉండగా బుల్లెట్ దూసుకొచ్చింది. తీవ్రంగా గాయపడిన హర్‌సిమ్రత్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పారు. ఆ సమయంలో బస్‌స్టాప్ సమీపంలోనే ఏడుగురు వ్యక్తులు మధ్య గొడవ జరిగిందని, వారిలో ఒకరు తుపాకీతో కాల్పులు జరపడంతో బుల్లెట్ హర్‌సిమ్రత్ వైపు దూసుకొచ్చిందని పోలీసులు తెలిపారు.



కాలిఫోర్నియాను చుట్టుముడుతున్న కార్చిచ్చు

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియా దక్షిణప్రాంతంలో కార్చిచ్చు వేగంగా వ్యాప్తిస్తోంది. మంటలను అదుపు తెచ్చేందుకు పెద్ద సంఖ్యలో ఫైర్ సిబ్బందిని రంగంలోకి దించారు. వెంచురా కౌంటీలోని లేక్ పిరు వద్ద గురువారం మధ్యాహ్నం మొదలైన మంటలు మొదట 50 ఎకరాల ప్రాంతానికి పరిమితమయ్యాయి. ఇవి ఒక్క రోజులోనే వెయ్యి ఎకరాలకు విస్తరించాయని అధికారులు తెలిపారు. లాస్ ఎంజెలెస్ కౌంటీలోకి ప్రవేశించాయన్నారు. లాస్ ఎంజెలెస్ కౌంటీ, హోల్సర్ కెన్యన్‌లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరికలను జారీ చేశారు. కొన్ని నెలల క్రితం కాలిఫోర్నియాలో సంభవించిన భారీ కార్చిచ్చులో 50 వేల ఎకరాల్లో అడవిని దహించివేగా, 18 వేల నివాసాలు బూడిదయ్యాయి. కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయారు. రెండు లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలిఫోర్నియా ప్రాంతంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 4,400 కార్చిచ్చు ఘటనలు నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలో నమోదైన ఇలాంటి ఘటనలు 3,800 కావడం గమనార్హం.

ఓటరు జాబితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు: ఈసీ

న్యూఢిల్లీ: వివిధరాష్ట్రాలకు సంబంధించిన వెబ్‌సైట్లు పనిచేయడం లేదు, వాటిలోని ఓటరు జాబితాలు కనిపించడం లేదు అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్(ఈసీ) స్పందించింది. ఓటరు జాబితాల్లో ఉన్న తప్పులపై రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని కోరింది. రాతపూర్వక డిక్లరేషన్ అందించలేకుంటే అసంబద్ధంగా చేస్తున్న ఆరోపణలపై దేశ ప్రజలు క్షమాపణ చెప్పాలని స్పష్టం చేసింది. ఆరోపిస్తున్నట్లుగా జాబితా నుంచి అక్రమంగా పేర్లను తొలగించిన, చేర్చిన వివరాలను సంతకం చేసిన ధ్రువీకరణ పత్రంతో అందజేయాలని, దీనిపై తగు రీతిలో చర్యలు తీసుకుంటామని రాహుల్ ఆరోపణలు చేసిన మూడు రాష్ట్రాల ఎలక్టోరల్ అధికారులు గురువారం కోరారు. దీనిపై ఈసీ 'ఎక్స్'లో స్పందించింది. 'రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారుల వెబ్‌సైట్లలో ఉన్న ఓటర్ల జాబితాను మేం తొలగించలేదు. ఓటరు జాబితాలను ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గురువారం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడాక చాలా రాష్ట్రాల ఈ-ఓటర్ జాబితాలు మాయమయ్యాయంటూ ఒక యూజర్ చేసిన ఆరోపణలను పరిశీలిస్తున్నాం'అని తెలిపింది.

గాజాపై పూర్తి నియంత్రణ

నెతన్యాహూ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదం

టెల్అవీవ్: గాజాను పూర్తిగా ఆక్రమించుకోవాలన్న వివాదాస్పద నిర్ణయాన్ని ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదించింది. శుక్రవారం జరిగిన రక్షణ కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై సుమారు 10 గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. గాజాపై పూర్తి స్థాయి నియంత్రణ సాధించడమే తన లక్ష్యమని ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తెలిపారు. ఆయన కార్యాలయం ఇందుకు సంబంధించి విడుదల చేసిన ప్రకటనలో ఆక్రమణ అనే మాటను వాడనప్పటికీ, వాస్తవానికి ఈ ప్రణాళిక ఉద్దేశం అదేనని తెలుస్తోంది. ఒక వైపు హమాస్ చెరలోని బందీల భద్రతపై బాధిత కుటుంబాలు, మరో వైపు మరింత మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ నెతన్యాహూ ప్రభుత్వం ఈ ప్రణాళికను ముందుకు తెచ్చింది. గాజాలో మూడొంతుల ప్రాంతం ఇప్పటికే ఇజ్రాయెల్ ఆర్మీ నియంత్రణలో ఉంది. అయితే, తాజా ప్రణాళిక ఇజ్రాయెల్‌ను అంతర్జాతీయంగా ఏకాకిగా మార్చే ప్రమాదముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

గాజాను పూర్తిగా ఆధీనంలోకి తెచ్చేందుకు కొన్ని నెలలపాటు పట్టే ఈ కార్యక్రమం ఎప్పుడు మొదలవుతుందనే విషయంలో స్పష్టత లేదు. అయితే, అక్టోబర్ 7వ తేదీ నాటికి గాజా సిటీని ఖాళీ చేయించాలని డెడ్‌లైన్ పెట్టుకుంది. నగరంలో ఆహార పంపిణీ నిలిపివేయడం, అక్కడి వారిని బలవంతంగా ఖాళీ చేయించడం ఈ ప్రణాళికలో భాగాలు. ఇందుకోసం వేలాది మంది అదనపు బలగాలను రంగంలోకి దింపాల్సి ఉంటుంది. ఇప్పటికే గాజాలో కరవు కాటకాలు, ఆకలి చావులకు కారణమవుతోందంటూ ఇజ్రాయెల్‌పై ఆగ్రహంతో ఉన్న పలు దేశాలు తాజా ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఇజ్రాయెల్‌ది తప్పుడు నిర్ణయమని యూకే ప్రధాని స్టార్మర్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ సైనిక అవసరాలు తీర్చే రెండో అతిపెద్ద సరఫరాదారు జర్మనీ కూడా..మిలటరీ పరికరాలను ఇకపై విక్రయించబోమని స్పష్టం చేసింది. నెతన్యాహూ మాత్రం ఈ విషయంలో మనస్సు మార్చుకునే ఉద్దేశంతో లేరు. ఇజ్రాయెలీలు సైతం హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకుని బందీలను త్వరగా బయటకు తీసుకురావాలనే కోరుకుంటున్నారు. అయితే, షరతులు పెట్టకుండా హమాస్‌పై ఒత్తిడి తెచ్చి, బందీలను విడుదల చేయించడమే లక్ష్యంగా నెతన్యాహూ గాజా పూర్తి నియంత్రణ అనే బెదిరింపునకు దిగారని భావిస్తున్నారు. దీనిని ట్రంప్ యంత్రాంగం సైతం వ్యతిరేకించలేదు. అతివాద పార్టీలతో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్న నెతన్యాహూ అధికారంలో కొనసాగేందుకే ఈ సంక్షోభాన్ని వాడుకుంటున్నారన్న విశ్లేషణలూ ఉన్నాయి. ఇప్పటికే గాజాలోని 8 లక్షల మంది పాలస్తీనియన్లను బలవంతంగా ఉత్తరం నుంచి దక్షిణానికి, తిరిగి ఉత్తరాదికి ఖాళీ చేయిస్తూ, క్షేత్రస్థాయిలో దాడులు, వైమానిక నిఘాలతో ఆర్మీ అసహనంతో ఉంది. గాజాను నియంత్రణలోకి తెచ్చుకోవడమంటే మరింత ఊబిలోకి దిగడమేనని ఆర్మీ వర్గాలు అంటున్నాయి.

అశోక్ మెహతా కమిటీ దేనికి సంబంధించినది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

బ్రిటిష్ వారి పాలనకు ముందు భారత దేశంలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధితో ఉండేవి. అగస్త్యుని ప్రజాపాలనా సూత్రాలు దేశంలోని పాలనా వ్యవస్థను వివరిస్తున్నాయి. కౌటిల్యుని అర్థశాస్త్రంలో గ్రామిక, గ్రామకూటలాంటి గ్రామాధికారుల సమాచారం ఉంది. లార్డ్ రిప్పన్ 1882 మే 18న స్థానిక సంస్థల మాగ్నాకార్టాను విడుదల చేశారు. ఇతడ్ని స్థానిక స్వపరిపాలనా పితామహుడిగా పేర్కొంటారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను రాజస్థాన్‌లోని 'నాగౌర్' జిల్లాలో 1959 అక్టోబర్ 2న భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు.



స్థానిక ప్రభుత్వాలు

బౌద్ధమతం వెల్లివిరిసిన కాలంలోనే భారతదేశంలో స్థానిక సంస్థలు ఉండేవని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. అగస్త్యుని ప్రజాపాలనా సూత్రాలు మన దేశంలోని పాలనా వ్యవస్థను వివరిస్తున్నాయి. కౌటిల్యుని అర్థశాస్త్రంలో గ్రామిక, గ్రామ కూటలాంటి గ్రామాధికారుల గురించి వివరించారు. మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో పాటలీపుత్ర నగరంలోని మున్సిపల్ ప్రభుత్వం గురించి సమగ్రంగా పేర్కొన్నారు. చోళుల కాలంలో స్థానిక స్వపరిపాలనా స్వర్ణయుగంగా సాగింది. షేర్షా కాలంలో రాష్ట్రాన్ని సర్కారు (జిల్లాలు)గా విభజించారు. బ్రిటిష్ వారి పాలనకు ముందు మన దేశంలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధితో ఉండేవి. ఈస్టిండియా కంపెనీ కాలం(1687)లో తొలిసారిగా మద్రాస్‌లో మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. 1726లో ముంబై, కోల్‌కతా నగరాల్లో మేయర్ బోర్డ్‌లను ఏర్పాటు చేశారు. 1793లో మద్రాస్, ముంబై, కోల్‌కతా నగరాల్లో వేర్వేరుగా మున్సిపల్ పరిపాలనను ప్రారంభించారు. 1870లో లార్డ్ మేయో ఆర్థిక వికేంద్రీకరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

లార్డ్ రిప్పన్ తీర్మానం

లార్డ్ రిప్పన్ 1882 మే 18న స్థానిక సంస్థల మాగ్నాకార్టాను విడుదల చేశారు.ఇతడ్ని స్థానిక స్వపరిపాలనా పితామహుడిగా పేర్కొంటారు. రిప్పన్ తీర్మానం రాజకీయ విజ్ఞానానికి, వికాసానికి దోహదపడింది. 1907లో సర్ చార్లెస్ అధ్యక్షతన నియమించిన రాయల్ కమిషన్ ఆర్థిక వికేంద్రీకరణ అంశాల ద్వారా స్థానిక సంస్థలను అభివృద్ధి చేయడానికి కొన్ని సూత్రాలను సూచించింది. 1919 మాంటెగు చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం స్థానిక సంస్థల ప్రగతికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొంది. స్థానిక స్వపరిపాలనా అంశాన్ని 1919 మాంటెగు చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం -(ట్రాన్స్‌ఫర్డ్, బదిలీ)లో చేర్చారు. మహాత్మాగాంధీ గ్రామ రాజ్యం రావాలని గ్రామాల ద్వారా అభివృద్ధి సాధించాలని, ప్రతీ గ్రామం రిపబ్లిక్‌గా అవతరించాలని సూచించారు. గాంధీజీ ఆశయం మేరకు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని నాలుగో భాగంలోని 40వ అధికరణం గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి గ్రామీణాభివృద్ధి చేయాలని సూచిస్తుంది. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్డ్‌లోని ఐదో అంశం స్థానిక స్వపరిపాలను వివరిస్తుంది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో టి.టి.కృష్ణమాచారి కమిటీ సిఫార్సు మేరకు సమాజాభివృద్ధి పథకాలను రూపొందించారు.

సామాజిక అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ)

గ్రామీణ ప్రజల ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి కోసం 1952 అక్టోబర్ 2న 55 బ్లాకుల్లో మొదటిసారిగా సామాజికాభివృద్ధి విధానాన్ని ప్రవేశ పెట్టారు. 70,000 జనాభాకు ఒక బ్లాక్ ఏర్పాటు చేశారు. సామాజికాభివృద్ధి విధానం ద్వారా పశుపోషణ, ప్రాథమిక విద్య, ఆరోగ్యం, గృహవసతి, కుటీర పరిశ్రమలు, సమాచార సౌకర్యం, స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. వీటి అమలు కోసం ఒక్కో బ్లాక్‌కు బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బీడీవో)ను నియమించారు. ఈ పథకం ద్వారా వ్యవసాయం, సహకా ర రంగాలనూ అభివృద్ధి చేశారు. ఈ కార్యక్రమ ప్రచారానికి 10 గ్రామాలకు ఒక గ్రామ సేవక్ అధికారిని నియమించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుంది.

రిప్పన్ తీర్మానంలోని ప్రధానాంశాలు

- స్థానిక సంస్థలను ఏర్పాటు చేసి విద్యావంతులైన భారతీయుల సేవలను వినియోగించుకుని, వారికి స్వపరిపాలన ద్వారా కొంత తృప్తిని కలిగించాలి.
- స్థానిక ప్రభుత్వ ప్రాంతం తాలుకా (డివిజన్) లేక తహసీల్ (మండలం)గా ఉండాలి.
- స్థానిక సంస్థల్లో అనధికారిక సభ్యులు ఎక్కువ సంఖ్యలో ఉండాలి.
- అన్ని ప్రాంతాల్లో సభ్యుల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతి ద్వారా నిర్వహించాలి.
- సభ్యుల ఎన్నికకు అన్ని ప్రాంతాల వారు పాల్గొనాలి.
- స్థానిక సంస్థలకు అవసరమయ్యే ఆర్థిక వనరులను ప్రభుత్వం సమకూర్చాలి.
- ప్రముఖులైన సభ్యులను బోర్డ్ సభ్యులుగా, అధ్యక్షులుగా నియమించాలి.
- స్థానిక సంస్థల్లో బాగా పనిచేసేవారికి రావు బహదూర్, ఖాన్ బహదూర్ బిరుదులను ప్రదానం చేయాలి.

జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం

సామాజికాభివృద్ధి కార్యక్రమాన్ని విస్తరించి 1953 అక్టోబర్ 2న 1700 బ్లాక్‌ల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి, నూతన వంగడాల రూపకల్పన గ్రామీణ ప్రజల వికాసం కోసం ఈ కార్యక్రమాన్ని విస్తరించారు.

బల్వంతరాయ్ మెహతా కమిటీ

ప్రణాళిక ప్రాజెక్ట్‌ల సంఘం వారు సామాజిక అభివృద్ధి పథకం, జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం అమలు తీరును అధ్యయనం చేయడానికి 1957 జనవరిలో బల్వంత్‌రాయ్ మెహతా కమిటీని నియమించారు. ఈ కమిటీ తన నివేదికను 1957 నవంబర్‌లో సమర్పించింది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫార్సు చేసింది. ఈ కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫార్సు చేసింది.

సిఫార్సులు:

- బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ, మధ్యస్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్‌లను సిఫార్సు చేసింది.
- గ్రామ పంచాయతీ వ్యవస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి.
- జిల్లా పరిషత్, పంచాయతీ సమితీలకు పరోక్షంగా ఎన్నికలు నిర్వహించాలి.
- అభివృద్ధి కార్యక్రమాలన్నీ పంచాయతీరాజ్ సంస్థల ద్వారానే నిర్వహించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు అధికార వికేంద్రీకరణ జరగాలి.
- పంచాయతీ సమితికి కార్య నిర్వహణాధికారాలు కల్పించాలి.
- జిల్లా పరిషత్‌లకు సలహా, పర్యవేక్షణ అధికారాలు కల్పించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు ప్రణాళికా, అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు అప్పగించాలి.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫార్సుల ను జాతీయ అభివృద్ధి మండలి (ఎన్‌డీసీ) 1958 ఏప్రిల్‌లో ఆమోదించింది. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను అమలు చేసిన మొదటి రాష్ట్రం 'రాజస్థాన్'. ఆ రాష్ట్రంలోని 'నాగౌర్' జిల్లాలో 1959 అక్టోబర్ 2న భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పశ్చిమ బెంగాల్‌లో నాలుగంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఉంది. అన్ని రాష్ట్రాల్లో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. ఒడిశా, హర్యానా, అసోం, తమిళనాడు రాష్ట్రాల్లో రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఉంది. గోవా, సిక్కిం, త్రిపుర, కేరళ, జమ్మూకశ్మీర్‌లో ఒక అంచె పంచాయతీరాజ్ వ్యవస్థ ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్‌లో జిల్లా పరిషత్‌లకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. బిహార్, ఉత్తరప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థకు తగిన ప్రాధాన్యం లేదు.

అశోక్ మెహతా కమిటీ

పంచాయతీరాజ్ వ్యవస్థను అధ్యయనం చేయడానికి ఆనాటి జనతా ప్రభుత్వం 1977 డిసెంబర్‌లో అశోక్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ 1978 ఆగస్టులో 132 సిఫార్సులతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

సిఫార్సులు:

- రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫార్సు చేసింది
- జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, కొన్ని గ్రామాలతో కలిపి మండల పంచాయతీ ఏర్పాటు చేయాలి.
- 15,000 నుంచి 20,000 జనాభా ఉన్న కొన్ని గ్రామాల సముదాయాన్ని మండల పంచాయతీగా ఏర్పాటు చేయాలి.
- జిల్లా స్థాయిలో అధికార వికేంద్రీకరణ జరగాలి.
- జిల్లా పరిషత్ కార్యనిర్వాహణ అధికారాలు కలిగి ఉండాలి.
- పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా పోటీ చేయాలి
- జిల్లా పరిషత్ అధ్యక్షులు ప్రత్యక్షంగా, పరోక్షంగా కానీ ఎన్నిక కావాలి
- పంచాయతీరాజ్ సంస్థలలోని అన్ని పదవులకు కాల పరిమితి ఐదేళ్లుగా నిర్ణయించాలి
- న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి.
- నిధుల కోసం స్వయంగా పన్నులు వసూలు చేసుకునే అధికారం పంచాయతీరాజ్ సంస్థలకు ఉండాలి.
- పంచాయతీరాజ్ సంస్థలు ఖర్చు చేసిన నిధులపై సామాజిక తనిఖీ నిర్వహించాలి
- పంచాయతీరాజ్ వ్యవస్థల కోసం రాష్ట్రం లో ప్రత్యేకంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రిని నియమించాలి.
- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.

అశోక్ మెహతా కమిటీ సిఫార్సులను 1979లో జరిగిన రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చర్చించి కొన్ని మార్పులతో ఆమోదించారు. ఈ కమిటీ సిఫార్సుల ప్రకారం కొన్ని మార్పులతో కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లలో పంచాయతీరాజ్ వ్యవస్థను అమలు చేశాయి. మండల పరిషత్‌ను ప్రవేశపెట్టిన తొలిరాష్ట్రం కర్ణాటక, 1985 అక్టోబర్, 2న రామకృష్ణా హెగ్డే ఈ వ్యవస్థను ప్రారంభించారు. మండల వ్యవస్థను ప్రవేశపెట్టిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1986 జనవరి, 13న సంక్రాంతి రోజు ఎన్.టి.రామారావు దీన్ని ప్రవేశపెట్టారు.

గమనిక: ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ మండలాలను మాత్రం 1985లోనే ప్రారంభించారు.

దంత్‌వాలా కమిటీ (1978)

బ్లాక్‌స్థాయి ప్రణాళీకీకరణపై ఒక నివేదికను సమర్పించడానికి ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

సిఫార్సులు:

జిల్లాస్థాయి ప్రణాళిక వికేంద్రీకరణ జరగాలి. జిల్లా కలెక్టర్ ముఖ్య భూమిక పోషించాలి. సర్పంచ్‌లను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి.

సి.హెచ్. హనుమంతరావు కమిటీ


జిల్లా ప్రణాళికలపై ఒక నివేదికను సమర్పించడానికి 1984లో సి.హెచ్. హనుమంతరావు అధ్యక్షతన ఒక అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు.

సిఫార్సులు:

- జిల్లా స్థాయిలోని అన్ని అభివృద్ధి, ప్రణాళికా రచన గ్రామీణ సంక్షేమం తదితర కార్యకలాపాల్లో కలెక్టర్ సమన్వయకర్తగా వ్యవహరించాలి.
- ప్రత్యేక జిల్లా ప్రణాళికా సంఘాన్ని సంబంధిత జిల్లా కలెక్టర్ లేదా ఒక మంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేయాలి.
- జిల్లా ప్రణాళికా బోర్డులను ఏర్పాటు చేయాలి..

భూమి ఉపరితలానికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర ?

టీఎస్‌పీఎస్సీ ప్రవేశపెట్టిన జనరల్ స్టడీస్ పేపర్‌లో పర్యావరణ అంశాలను చేర్చారు. పర్యావరణ విభాగాలు, జీవావరణ శాస్త్రం, పర్యావరణ కాలుష్యం, జీవ వైవిధ్యం, వన్య ప్రాణుల సంరక్షణ, ఘన వ్యర్థ పదార్థాలు - నిర్వహణ, శీతోష్ణస్థితి మార్పు, అంతర్జాతీయ, జాతీయ పర్యావరణ ఒప్పందాలు, చట్టాలు... పర్యావరణ అంశాల పరిధిలోకి వస్తాయి.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పర్యావరణం

భూమిపై ఉన్న ఘన, ద్రవ, వాయు, జీవ సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు. జీవుల మనుగడకు అవసరమైన గాలి, నీరు, ఆహారం పూర్తిగా కలుషితమవుతున్నాయి. సహజ వనరులు తరిగిపోతుండటంతో డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా వాటి దుర్వినియోగం కూడా అధికమై పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిగతులపై పర్యావరణ నష్ట ప్రభావం తీవ్రంగా ఉంది. వంట చెరకు లభ్యత, పశుగ్రాసం, భూగర్భ, ఉపరితల వనరులు తగ్గి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. ఒక ప్రాంత సుస్థిరాభివృద్ధి పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉంటుంది.

పర్యావరణ విభాగాలు

పర్యావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి..

1. వాతావరణం(అట్మాస్ఫియర్)
2. శిలావరణం(లిథోస్ఫియర్)
3. జలావరణం(హైడ్రోస్ఫియర్)
4. జీవావరణం(బయోస్ఫియర్)

వాతావరణం (అట్మాస్ఫియర్)

భూమి ఉపరితలంపై ఉన్న వాయు పొరల నిర్మాణమే వాతావరణం లేదా అట్మాస్ఫియర్. గురుత్వాకర్షణ శక్తి వల్ల ఇది భూమిపై ఉంటుంది. ఇందులో ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్, థర్మోస్ఫియర్ అనే నాలుగు విభాగాలున్నాయి. రెండు పొరల మధ్య హద్దుగా ఉండే ప్రాంతాన్ని 'పాజ్' అంటారు. ఉదాహరణకు.. స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్ మధ్యనున్న ప్రాంతాన్ని స్ట్రాటోపాజ్ అంటారు.

ట్రోపోస్ఫియర్

ఇది భూమి ఉపరితలానికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర. ఈ పొర ధ్రువాల వద్ద 6-8 కి.మీ. ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. పైకి వెళ్లేకొద్దీ ప్రతి కిలోమీటరుకు ఉష్ణోగ్రత ఆరు డిగ్రీల చొప్పున తగ్గుతుంది. సుమారు 12 కి.మీ. ఎత్తు వద్ద ట్రోపోపాస్ అనే పరివర్తన ప్రాంతం మొదలవుతుంది. ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతాయి.

స్ట్రాటోస్ఫియర్

వాతావరణంలోని రెండో పొర అయిన స్ట్రాటోస్ఫియర్, ట్రోపోపాజ్ నుంచి మొదలై 50 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 60 డిగ్రీలుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో గంటకు 320 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ అధిక మోతాదులో ఉండటం వల్ల దీన్ని ఓజోనోస్ఫియర్ అని కూడా అంటారు. హానికర అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరకుండా ఈ పొర అడ్డుకుంటుంది.

మీసోస్ఫియర్

స్ట్రాటోపాజ్ నుంచి దాదాపు 80 కి.మీ. ఎత్తు వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతాయి. మీసోస్ఫియర్ పైనున్న ప్రాంతం వాతావరణంలోని అన్ని భాగాల కంటే అత్యంత శీతలంగా ఉంటుంది. ఉల్కాపాతం భూమిని చేరకపోవడానికి మీసోస్ఫియరే కారణం.

థర్మోస్ఫియర్

ఇది మీసోపాజ్ నుంచి మొదలవుతుంది. థర్మోస్ఫియర్‌ను ఐనోస్ఫియర్, ఎక్సోస్ఫియర్‌లుగా విభజిస్తారు. కింది భాగమైన ఐనోస్ఫియర్ భూవాతావరణంలో 100-120 కి.మీ. ఎత్తు నుంచి 550 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఐనోస్ఫియర్‌లో నత్రజని, ఆక్సిజన్ లాంటి మూలకాల పరమాణువులు సౌర వికిరణాన్ని గ్రహించి అయానీకరణం చెందుతాయి. భూ ఉపరితలం నుంచి వచ్చే రేడియో తరంగాలను పరావర్తనం చేసి సమాచార ప్రసారానికి ఐనోస్ఫియర్ తోడ్పడుతోంది. బలమైన సౌరగాలులు వీచినప్పుడు ఐనోస్ఫియర్ సంఘటనం మారే ప్రమాదం ఉంది. ఫలితంగా సమాచార వ్యవస్థలు దెబ్బతింటాయి.

శిలావరణం

భూమిపై ఉన్న ఖండాలన్నింటినీ కలిపి శిలావరణం అంటారు. భూమి ఉపరితలం మొత్తం కొన్ని ప్రత్యేక ఫలకాలపై అమరి ఉంటుంది. ఈ ఫలకాల నిర్మాణం, వాటి కదలికలను ప్లేట్ టెక్టానిక్స్ సిద్ధాంతం వివరిస్తుంది. 200 మిలియన్ సంవత్సరాల కిందట భూభాగం మొత్తం ఒకే చోట కలిసి ఉండేది. దీన్ని పాంజియా అని పిలుస్తారు. 50 మిలియన్ ఏళ్ల క్రితం ఇది రెండు భాగాలుగా చీలింది. ఉత్తరంగా ఉన్న భాగాన్ని లారెన్షియా అని, దక్షిణ దిశగా విడిపోయిన ప్రాంతాన్ని గోండ్వానా అని పిలుస్తారు. ఇవి మరింత దూరం కదిలి ప్రస్తుత ఖండాలు ఏర్పడ్డాయి. ఖండ చలన సిద్ధాంతం.. ఖండాల నిర్మాణం, వాటి కదలికలను వివరిస్తుంది. భూమి ఉపరితలం నుంచి లోపలి వైపు మూడు భాగాలుంటాయి. భూపటలం(క్రస్ట్), భూప్రావారం (మాంటెల్), భూకేంద్రం(కోర్). భూపటలం ఉపరితలం నుంచి సుమారు 100 కి.మీ. లోతు వరకు ఉంటుంది. భూపటల ఉపరితలంపై వదులుగా ఉండే పొరలను మృత్తిక లేదా నేల అంటారు. 100 కి.మీ. లోతు నుంచి 2900 కి.మీ. లోతు వరకు భూప్రావారం(మాంటెల్) అనే పొర ఉంటుంది. దీని తర్వాత మధ్యభాగం భూకేంద్రం(కోర్). దీనిలో బాహ్యకేంద్రం, అంతర కేంద్రం అనే రెండు భాగాలు ఉంటాయి. బాహ్యకేంద్రం 2900 కి.మీ. నుంచి 5100 కి.మీ. వరకు ఉంటుంది. అంతర కేంద్రం 5100 కి.మీ. నుంచి సుమారు 6378 కి.మీ. వరకు ఉంటుంది.

జలావరణం

భూమిపై వివిధ రూపాల్లో ఉన్న మొత్తం నీటిని జలావరణం లేదా హైడ్రోస్ఫియర్ అంటారు. పూర్వం సముద్ర జలమంతా పూర్తిగా సాదుజలంగా ఉండేది. కొన్ని మిలియన్ సంవత్సరాల నుంచి నేల క్రమక్షయం జరిగి ఖనిజాలు సముద్రంలోకి చేరడంతో లవణీయత పెరిగింది. భూమి ఉపరితలం 75 శాతం నీటితో నిండి ఉంది. భూమిపై ఉన్న మొత్తం నీటిలో 97.5 శాతం సముద్రాల్లోనే ఉంది. మిగతా 2.5 శాతం నీరు సాదుజలం లేదా మంచి నీరు. మంచి నీటిలో 0.3 శాతం నదులు, సరస్సుల్లో ఉంది. భూగర్భ జలంగా 30.8 శాతం, హిమనీనదాల రూపంలో 68.9 శాతం ఉంది.

భూమిపై నీటి విస్తరణను జల వలయం నిర్ధారిస్తుంది. నీరు ఆవిరై మేఘాల రూపంలోకి సాంద్రీకరణం చెంది ఆ తర్వాత మంచు, వర్షం రూపంలో భూమిని చేరుతుంది. ఇలా చేరిన నీటిలో కొద్ది మొత్తం భూగర్భంలోకి ఇంకుతుంది. మిగతాది నదులు, సముద్రాల్లోకి చేరుతుంది. ధ్రువ ప్రాంతాల్లో శీతాకాలంలో ఈ నీరు గడ్డకట్టి వేసవిలో కరుగుతుంది. ఈ రకమైన నిరంతర నీటి ఆవిరి కదలికలను జలవలయం అంటారు.

జీవావరణం

భూమిపై ఉన్న జీవులు, జీవం విస్తరించిన ప్రాంతాలన్నింటినీ కలిపి బయోస్ఫియర్ అంటారు. భూమిపై సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల క్రితం జీవం ఆవిర్భవించింది. అనేక సిద్ధాంతాలు భూమిపై జీవం ఆవిర్భవించే విధానాన్ని వివరిస్తున్నాయి. వీటిలో ముఖ్యమైనవి...

1. **ప్రత్యేక సృష్టి సిద్ధాంతం:** దీని ప్రకారం భూమిపై జీవులను దేవుడు సృష్టించాడు. ఈ సిద్ధాంతానికి తగిన నిదర్శనాలు లేని కారణంగా దీన్ని నమ్మకంగానే భావిస్తారు.
2. **పాన్‌స్పెర్మియ సిద్ధాంతం:** దీని ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించలేదు. భూమి ఆవల నుంచి గ్రహశకలాలు లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామ క్రమంలో మార్పు చెందాయి.
3. **జీవ ఆవిర్భావ సిద్ధాంతం:** అలెగ్జాండర్ ఇవనోవిచ్ ఒపారిన్, జె.బి.ఎస్. హాల్డెన్ అనే శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం భూమిపై జీవ ఆవిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి. ఈ జీవ రసాయనాల చర్యల ద్వారా భూమిపై పూర్వ జీవకణాలు ఏర్పడ్డాయి. తర్వాత వాటి నుంచి సంపూర్ణ జీవ కణాలు ఆవిర్భవించాయి. భూమిపై ఆవిర్భవించిన తొలి తరం జీవులన్నీ అవాయు జీవులు. ఇలాంటి కొన్ని అవాయు జీవులు నీటి అణువులను విచ్ఛిన్నం చేయడంతో గాల్లోకి క్రమంగా ఆక్సిజన్ విడుదలైంది. తొలుత కేంద్రక పూర్వ జీవులు ఏర్పడి ఆ తర్వాత నిజ కేంద్రక జీవులు ఆవిర్భవించాయి..

సముద్ర నీటి లవణీయత 3.5%	సాదు జల లవణీయత 0.5%.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవరణ వ్యవస్థలో గతిశీల భాగం? (గ్రూప్-2, 2008)
   ఎ) ఆహార గొలుసు బి) ఇకలాజికల్ నిచే
   సి) ఎకోటోన్ డి) ఏదీకాదు
2. పాన్‌స్పెర్మియ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది? (2004 గ్రూప్-1)
   ఎ) అర్హీనియస్ బి) ఒపారిన్
   సి) స్వారెజ్ డి) ఎవరూ కాదు
3. తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకునే జీవులను ఏమంటారు? (గ్రూప్-1 2010 రీ ఎగ్జామ్)
   ఎ) స్టోనోథర్మల్ బి) సైక్రోఫైల్స్
   సి) యూరిథర్మల్ డి) పైకిలో థర్మల్
4. భారతదేశంలోని విశిష్టమైన స్త్రీ పర్యావరణ వేత్త (ఎన్విరాన్‌మెంటలిస్ట్) ఎవరు? (గ్రూప్-1, 1999)
   ఎ) మేధాపాట్కర్ బి) మమతా బెనర్జీ
   సి) సరోజిని మహర్షి
   డి) మార్గరెట్ ఆల్వా
5. కింది వాటిలో ఫ్లోటింగ్ నేషనల్ పార్కు ఏది? (సివిల్స్ ప్రిలిమ్స్-2015)
   ఎ) కజిరంగ జాతీయ పార్కు
   బి) కైబుల్ లామ్జావు జాతీయ పార్కు
   సి) కార్బెట్ జాతీయ పార్కు
   డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఓజోన్ పొర సంరక్షణకు ఏర్పాటైన అంతర్జాతీయ ఒప్పందం?
   ఎ) క్యోటో ఒప్పందం
   బి) మాంట్రియాల్ ఒప్పందం
   సి) స్టాక్‌హోమ్ ఒప్పందం
   డి) రామ్సార్ ఒప్పందం
2. కింది వాటిలో ఓజోన్ పొరను దెబ్బతీసేది?
   ఎ) క్లోరోఫ్లోరో కార్బన్లు
   బి) హాలోన్లు సి) మిథైల్ బ్రోమైడ్
   డి) పైవన్నీ
3. చిప్కో ఉద్యమం ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   ఎ) ఉత్తరాంచల్ బి) కర్ణాటక
   సి) బిహార్ డి) మధ్యప్రదేశ్
4. చిప్కో ఉద్యమంలో పాల్గొన్నవారు?
   ఎ) సుందర్‌లాల్ బహుగుణ
   బి) చండీ ప్రసాద్ భట్
   సి) సుదేశాదేవి డి) పైవారందరూ
5. సైలెంట్ స్ప్రింగ్ అనే గ్రంథాన్ని రచించి అమెరికాలో డి.డి.టి.కి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించింది ఎవరు?
   ఎ) జాన్ ముయర్
   బి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
   సి) రాచెల్ కార్సన్ డి) ఎవరూ కాదు
6. 'ఎ శాండ్ కౌంటీ ఆల్మనాక్' గ్రంథ రచయిత ఎవరు?
   ఎ) డేవిడ్ హెన్రీ బి) ఆల్డో లియోపోల్డ్
   సి) జాన్ ముయర్
   డి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
7. అటవీ హక్కు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
   ఎ) 2006 బి) 2007
   సి) 2008 డి) 2009
8. 1986లో అమల్లోకి వచ్చిన చట్టం?
   ఎ) జల కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   బి) వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   సి) పర్యావరణ పరిరక్షణ చట్టం
   డి) జల కాలుష్య సుంకం చట్టం
9. జీవవైవిధ్య చట్టాన్ని అమలు చేసే నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై, తమిళనాడు
   బి) బెంగళూరు, కర్ణాటక
   సి) హైదరాబాద్, తెలంగాణ
   డి) తిరువనంతపురం, కేరళ
10. భూమిపై ఆవిర్భవించిన మొదటి పూర్వ కణానికి ఒపారిన్ ఇచ్చిన పేరు?
   ఎ) ప్రోటినాయిడ్ బి) సింబయాంట్
   సి) కొయసెర్వేట్ డి) ప్రోక్వారియోట్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) డి; 5) సి; 6) బి; 7) ఎ; 8) సి; 9) ఎ; 10) సి.

హైదరాబాద్ సంస్థానం చివరి పాలకుడు?

హైదరాబాద్ సంస్థానంలో ఉద్యమకారులు

అసఫ్ జాహీ వంశంలో ఏడో నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో ఎందరో వీరులు పోరాటం చేశారు. కొందరు ఉద్యోగాలు వదులుకున్నారు. మరికొందరు ప్రాణాలకు తెగించి, నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమించారు. అరెస్టులు, లాఠీ చార్జీలు వారిని అడ్డుకోలేకపోయాయి. తెలంగాణ మాగాణంలో సామాన్యులు నిజాంకు వ్యతిరేకంగా విప్లవ జ్వాలలు రగిలించారు. ఈ కాలంలో ఎన్నో విప్లవ గీతాలు పుట్టుకొచ్చాయి. కొందరు నాయకులు గాంధేయ మార్గంలో శాంతియుత ఉద్యమాలు చేపట్టారు. మరికొందరు ఆయుధాలతో విప్లవ పోరాటం చేశారు. వారు ఎంచుకున్న మార్గం ఏదైనా తెలంగాణ విముక్తే ఏకైక లక్ష్యం. ఈ క్రమంలో కొందరు ఉద్యమ వీరులుగా చిరస్మరణీయులయ్యారు.

జమలాపురం కేశవరావు (1908-1953)

హైదరాబాద్ సంస్థాన చివరి పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపిన గొప్ప నాయకుడు సర్దార్ జమలాపురం కేశవరావు. నిజాం రజాకార్ల దురంగతాలకు వ్యతిరేకంగా పండిట్ నరేంద్రజీతో కలిసి తెలంగాణ గ్రామాల్లోని ప్రజలను సమీకరించి పోరాటం చేసిన ధీశాలి.

'పాశ్చాత్య విద్యతో మానసిక దౌర్బల్యం, సంకుచితత్వం తద్వారా దౌర్జన్య ప్రవృత్తి మన సమాజంలో ప్రబలాయి. ప్రజల మధ్య అంతరాలు ఎక్కువయ్యాయి. వెనుకటి తరాల్లో కనిపించే సరళత్వం, కలివిడితనం, సానుభూతి, నేటి సమాజంలో లోపించాయి. స్వాతంత్ర్య ఫలితంతో గ్రామాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలి. రైతు దేశానికి వెన్నెముక. గ్రామం దేశ సౌభాగ్యానికి పునాది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించుకోవాలి'..ఇలా తన అభిప్రాయాలను తెలంగాణ గ్రామాల్లో ప్రచారం చేసిన సాహసికుడు సర్దార్ జమలాపురం కేశవరావు.

ఉన్నత ఆలోచనలున్న కేశవరావు ఒక గొంగడి భుజాన వేసుకొని, తెలంగాణ గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయడానికి విస్తృత ప్రచారం చేశారు. 'అపర సరిహద్దు గాంధీ'గా పేరు పొందారు. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు నిజాం నిరంకుశ ఉద్యోగుల అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. తెలంగాణలోని తండాలు, గూడేలు, హరిజన, గిరిజన వాడలకు వెళ్లి వారి బాగోగులు, స్థితిగతులు తెలుసుకునేవారు.


20వ శతాబ్ద పూర్వార్ధంలో తెలంగాణలో జరిగిన ప్రజాపోరాటాల్లో ప్రజలకు అతి సన్నిహితుడైన గొప్ప కార్యకర్త. 18 ఏళ్ల వయసులోనే రాజకీయ ప్రవేశం చేశారు. 1938నుంచి ఆయన ప్రజా పోరాటాలు చేసి 'సర్దార్'గా ప్రజలతో గౌరవం పొందారు. రజాకార్ల దురాగతాలను, దాడులను ఎదుర్కొగల ఆత్మస్థైర్యాన్ని నింపుతూ ప్రజలను చైతన్యం చేశారు. హైదరాబాద్ సంస్థానంలో మత సామరస్యం కోసం ఎనలేని కృషి చేశారు.

నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణలో సామాన్యులు సైతం పోరాడారు. ఆ కాలంలో ఎన్నో విప్లవ గీతాలు పుట్టుకొచ్చాయి. ఆఖరి అసఫ్ జాహీ వంశీయుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపిన మేటి నాయకుడు సర్దార్ జమలాపురం కేశవ రావు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు ఆదిరాజు వీరభద్రరావు పంతులు. 'హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం' గ్రంథాన్ని వెల్దుర్తి మాణిక్యరావు రాశారు.

1938, 1947లో బేడీలు, నడుం పటకాతో జైలు జీవితం గడిపారు. ఆయనకు రామాయణ, మహాభారతాలంటే చాలా ఇష్టం.

కేశవరావు జీవితంలో ముఖ్య సంఘటనలు

- 1908లో ఆనాటి వరంగల్ జిల్లాలోని మధిర తాలూకా, ఎర్రుపాలెం (ప్రస్తుతం ఖమ్మం జిల్లా)లో కేశవరావు జన్మించారు.
- ప్రాథమిక విద్య ఖమ్మం, ఉన్నత విద్య హైదరాబాద్‌లో జరిగింది.
- తల్లిదండ్రులు, వెంకటరామారావు, వెంకట నరసమ్మ
- 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పిలుపు మేరకు సత్యాగ్రహంలో పాల్గొన్నారు.
- దీంతో రెండేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించారు.
- కేశవరావు మధిర తాలూకాలోని రెండు వందల గ్రామాల్లో పాదయాత్ర చేసి ప్రజల్లో పోరాట స్ఫూర్తి నింపారు.
- 1945 ఆంధ్ర మహాసభకు మందుమల నరసింగరావు అధ్యక్షుడుగా, కేశవరావు ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.
- 1946లో మెదక్ జిల్లా కంది గ్రామంలో జరిగిన పదమూడో ఆంధ్రమహాసభకు కేశవరావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- కేశవరావును కొంతకాలం వరంగల్, నిజామాబాద్ జైల్లో నిజాం నిర్బంధించారు. ఆయనతో పాటు మహాకవి దాశరథి కృష్ణమాచారి, రామ్ హీరాలాల్ మోర్యా, కొలిపాక కిషన్‌రావు, ఊటుకూరి నారాయణరావు, గంధం మాణిక్యం తదితరులు జైలు శిక్ష అనుభవించారు.
- 1948లో హైదరాబాద్ సంస్థానంపై పోలీసు చర్య అనంతరం వీరందరూ జైలు నుంచి విడుదలయ్యారు.
- సుమారు 13 నెలలు శిక్ష అనుభవించారు.
- పోలీసు చర్య అనంతరం వెల్లోడి నాయకత్వంలో మిలటరీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పుడు కేశవరావు హైదరాబాద్ సంస్థానంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు.
- 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పాకాల నియోజకవర్గం నుంచి ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అక్కడ కమ్యూనిస్టు అభ్యర్థి విజయం సాధించారు.
- 1953 మార్చి 30న జమలాపురం కేశవరావు హైదరాబాద్‌లో మరణించారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

ఆదిరాజు వీరభద్రరావు (1890-1978)

తెలంగాణలో తెలుగు భాషకు, సంస్కృతికి ఆదరణ లేని రోజుల్లో మాతృభాషాభివృద్ధికి విశేష కృషి చేసిన నిస్వార్థ దేశ భక్తుడు ఆదిరాజు వీరభద్రరావు పంతులు. ఆ రోజుల్లో హైదరాబాద్ సంస్థానంలో అధికార భాష, పాఠశాలల్లో బోధనాభాష ఉర్దూయే. అలాంటి పరిస్థితుల్లో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి తదితరులు మాతృభాషోద్ధరణ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో తెలుగు సంస్కృతి పునరుజ్జీవనం కోసం తెలుగు చరిత్ర, పరిశోధనలకు ఆదిరాజు వీరభద్రరావు రూపకల్పన చేశారు

1890లో ఖమ్మం జిల్లా మధిర తాలూకా దెందుకూరు గ్రామంలో వీరభద్రరావు జన్మించారు. ఆయన తండ్రి ఆదిరాజు లింగయ్య, తల్లి వెంకమాంబ. ఆమె ఊటుకూరు వారి ఆడపడుచు. లింగయ్య కరోడ్గిరీ నాకా సేగేదార్‌లో ఉద్యోగి. జాగీర్దార్ రావిచెట్టు రంగారావు ఆర్థిక సాయంతో వీరభద్రరావు హైదరాబాద్ చాదర్‌ఘాట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రాథమిక విద్యనభ్యసించారు. అనంతరం సుమారు 40 ఏళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. హైదరాబాద్‌లోని 'శ్రీకృష్ణదేవరాయ-ఆంధ్ర భాషా నిలయాన్ని 1901 సెప్టెంబర్ 1న స్థాపించారు. అందులో ఉన్న తెలుగు, సంస్కృత గ్రంథాలన్నీ వీరభద్రరావు క్షుణ్నంగా అధ్యయనం చేశారు. భాషా నిలయం గ్రంథ పాలకుడిగా కొంత కాలం పనిచేశారు.

కొమర్రాజు లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు స్థాపించిన 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' కార్యాలయాన్ని 1908లో హైదరాబాద్ నుంచి మద్రాసుకు మార్చారు. అప్పటి నుంచి 1914 వరకు మద్రాసులో విజ్ఞాన చంద్రికా గ్రంథం మండలిలో పనిచేశారు. తర్వాత హైదరాబాద్ తిరిగి వచ్చారు. ఇక్కడ మహబూబ్ కాలేజీ, చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వహించారు. మాడపాటి హనుమంతరావు స్థాపించిన నారాయణగూడలోని ఆంధ్ర బాలిక పాఠశాలలో పదహారేళ్లు పనిచేశారు. 1948లో ఉద్యోగ విరమణ పొందారు.

హైదరాబాద్ 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం' కార్యదర్శిగా ఆయన నగరంలో తెలుగు భాషావృద్ధికి కృషి చేశారు. ప్రాచీనాంధ్ర చరిత్ర, శాసన పరిశోధన, ఆంధ్రనగర చరిత్ర, సాంస్కృతిక చరిత్ర ఆదిరాజు అభిమాన అంశాలు 1921లో ఆంధ్ర జన సంఘాన్ని స్థాపించారు. దానికి అనుబంధంగా 'ఆంధ్ర పరిశోధక మండలి'ని ప్రారంభించారు. తెలంగాణ సాహితీ సాంస్కృతిక వికాసానికి ఆ సంస్థ కృషి చేసింది. ఆంధ్ర పరిశోధక మండలికి వీరభద్రరావు మూలస్తంభం లాంటి వారు. కొమర్రాజు లక్ష్మణరావు మరణానంతరం 1931లో 'ఆంధ్ర పరిశోధక మండలి'ని లక్ష్మణరాయ పరిశోధక మండలి'గా మార్చారు.

మునగాల రాజా నాయిని వెంకటరంగారావు దీనికి అధ్యక్షులుగా, వీరభద్రరావు కార్యదర్శిగా పని చేశారు. తెలంగాణలోని శిలాశాసనాలను పరిశోధించడానికి శేషాద్రి రమణ కవులను మండలి పక్షాన నియమించారు. వారు వివిధ ప్రాంతాలను సందర్శించి, శిల్పాలు, శాసనాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు సేకరించారు. ప్రసిద్ధ చరిత్రకారులతో వ్యాఖ్యానాలు రాయించి, 129 శాసనాలతో ఒక సంపుటిని 'తెలంగాణ శాసనాలు' అనే పేరుతో 1935 లో ప్రచురించారు. ఇందులో కాకతీయుల నాటి 57 శాసనాలు, చాళుక్యుల కాలంనాటివి 42, ఇతర 24 శాసనాలున్నాయి. ఈ సంపుటి రూపకల్పనలో ఆదిరాజు వీరభద్రరావు కృషి ఎనలేనిది.

- 1960లో 85 శాసనాలతో రెండో సంపుటి ప్రచురితమైంది.
- 1910లో వీరభద్రరావు 'జీవిత చరితావళి' రచించారు.
- 1912లో 'దేశ భక్తుల జీవిత చరితావళి' ప్రచురించారు.

చారిత్రక గ్రంథాలు

'షితాబుఖాన్ (లేక) సీతాపతిరాజు చరిత్ర' ను లక్ష్మణరాయ పరిశోధక మండలి తరపున వీరభద్రరావు ప్రకటించారు. లక్ష్మణరాయ పరిశోధక మండలి సేకరించిన అనేక అముద్రిత తాళపత్ర గ్రంథాలను పరిశోధించి, గోల్కొండ, సుజాత, తెలంగాణ పత్రికలకు వ్యాసాలుగా రాశారు.

వీరభద్రరావు రాసిన 'ప్రాచీనాంధ్ర నగరాలు' ప్రసిద్ధ చారిత్రక గ్రంథం. ఇందులో అలంపురం, అనెగొంది, భువనగిరి, రాచకొండ, ఓరుగల్లు, కొలనుపాక, కళ్యాణి, కొండాపురం, గోల్కొండ, పానగల్లు, ప్రతిష్ఠానపురం, ఖమ్మం మెట్టు, వేల్పుకొండ నగరాల ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ గ్రంథాన్ని మునగాల రాజా నాయిని వెంకటరంగారావుకు అంకితమిచ్చారు. వీరభద్రరావు రాసిన 'మన తెలంగాణం' గ్రంథాన్ని దేశోద్ధారక గ్రంథ మండలి ప్రచురించింది. ఇందులో తెలంగాణలోని 9 జిల్లాల నైసర్గిక, చారిత్రక అంశాలను వివరించారు.

ఆయన రచించిన మరో గ్రంథం 'గ్రీకు పురాణ గాథలు' ఇందులో గ్రీకు, బాబిలోనియ, రోమ్ నగరాల పురాణ గాథల్ని అభివర్ణించారు.

వీరభద్రరావు లలిత కథావళి, రత్నప్రభ, నవ్వులు- పువ్వులు, భాగ్యనగరం, మిఠాయి చెట్టు వంటి ఎన్నో కథలు రాశారు. చరిత్ర, బాలుర కోసం బాల వాఙ్మయానికి కృషి చేశారు. వీటిని ఆంధ్ర సారస్వత పరిషత్తు (హైదరాబాద్) ప్రచురించింది

1946లో జరిగిన మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి సంచికను వీరభద్రరావు సంపాదకులుగా తీర్చిదిద్దారు. 'గోల్కొండ కవుల సంచిక ప్రచురణలో సురవరం ప్రతాపరెడ్డికి వీరభద్రరావు సహాయ సహకారాలు అందించారు.

నీలగిరి, సుజాత, గోల్కొండ , తెలంగాణ పత్రిక, భాగ్యనగర్, ఆంధ్రపత్రిక, ప్రగతి, కాకతీయ, తెలుగుదేశం, మీజాన్, పద్మశాలి మొదలైన పత్రికల్లో ఆదిరాజు వీరభద్రరావు ఎన్నో వ్యాసాలు, కథలు, రాశారు. వీటితో పాటు రేడియో ప్రసంగాలు చేశారు.

1972లో ఆదిరాజు వీరభద్రరావును కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో సన్మానించారు. 1973 అక్టోబర్‌లో ఆదిరాజు వీరభద్రరావు మరణించారు.

పండితుడు, పరిశోధకుడు, బహుభాషా కోవిదుడు, నిస్వార్థపరుడు, తెలుగు భాషా వాఙ్మయానికి, చరిత్రకు, సంస్కృతికి వీరభద్రరావు అందించిన సేవలు మరువలేనివి.

వెల్దుర్తి మాణిక్యరావు

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వెల్దుర్తి మాణిక్యరావు మెదక్ జిల్లాలోని వెల్దుర్తి గ్రామంలో 1913లో జన్మించారు. 1935 నుంచి 1948 వరకు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. పలుమార్లు జైలుకు వెళ్లారు. 1935లో 'ఆంధ్ర మహాసభకు' కార్యదర్శిగా పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'గోల్కొండ' పత్రికకు సహాయ సంపాదకుడిగా, 'మద్యపాన నిరోధం' తెలుగు మాసపత్రిక, 'టర్కిముస్కిరాత్' ఉర్దూ మాస పత్రికకు సంపాదకులుగా పనిచేశారు.

నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజకీయ సంస్కరణల విషయంలో 'అరవముద అయ్యంగార్ కమిషన్ నివేదికను సవివరంగా వ్యాఖ్యానిస్తూ ఒక పుస్తకాన్ని వెల్దుర్తి మాణిక్యరావు, కె.సి.గుప్తా ఆధ్వర్యంలో 'అణాగ్రంథమాల' ప్రచురించింది. ఈ పుస్తకానికి మాడపాటి హనుమంతరావు పీఠిక రాశారు.

రాజకీయ సంస్కరణల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించడానికి, అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధానమంత్రి 'సర్ అక్బర్ హైదరీ' 1937లో అరవముద అయ్యంగార్ కమిషన్ నియమించారు. ఆ నివేదికను ముస్లింలు, హిందువులూ వ్యతిరేకించారు. వీరు రచించిన 'రైతు' అనే పుస్తకాన్ని నిజాం నవాబు నిషేధించాడు. 'మాణిక్యవీణ' పేరుతో వీరి కవితలను సంకలనం చేశారు. 'హైదరాబాద్ రాజ్యాంగ సంస్కరణలు, 'ఖాదీ' 'మాడపాటి వారి జీవితం', 'సర్దార్ జమలాపురం కేశవరావు - జ్ఞాపకాలు' నిరంతర కృషి, తదితర గ్రంథాలు రచించారు.

హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం అనే గ్రంథాన్ని ఆయన ఆంగ్లంలో రాశారు. ఈ గ్రంథాన్ని తెలుగులో 'జి. సురమౌళి'తో భారత ప్రభుత్వ పబ్లికేషన్స్ డివిజన్ 1992లో ప్రచురించింది. నిజాం వ్యతిరేక పోరాట ఘట్టాలను ఈ పుస్తకంలో మాణిక్యరావు విశదీకరించారు.

Common nouns followed by 'of'..

NOUNS

We use nouns to refer to animals, people, places and things.

Kinds and uses

- **Proper nouns:** The specific names by which we know an individual animal, a person, a place, such as an institution, a building or a town, or something such as a month, a day of the week, a season or a festival.

E.g. Smith; Delhi; India Gate; January; Sankranthi.. etc.

Note: that all proper nouns begin with a capital letter.

- **Common nouns:** words that name people, animals, places and things of the same kind Dog (as in my dog, Goldie), doctor (as in Satish, a doctor), library (as in central library), spoon(as in a plastic spoon)

Note: that all common nouns begin with a lower-case letter.

- **Common nouns are countable when:**
  - We use a / an in front of them.
  A bag, an orange, a shirt, an engineer
  - We can talk about many of them using their plural forms, with or without numbers in front of them.
  Ships, two books, seven women, many sheep, a few lemons.
  - We can use them in questions that begin with 'how many'.
  How many pens do you need? How many children are present today?
- **Common nouns are uncountable when:**
  - We do not use a/an in front of them.
  Not a slat, but salt; not an oil, but oil.
  - We do not use their plural forms, with or without numbers in front of them, to specify what quantity we are talking about.
  Not a sugar, two sugars, many milks, but a grain of/two spoons of/four bags of/ ten kilograms of / many packets of / a lot of sugar, a little milk.
- We do not use them in questions that begin with 'how many', but only in those that begin with 'how much'.

Not How money do you owe him? but How much money do you owe him? not A How many plastic is manufactured in a day?, but How much plastic is manufactured in a day?

- **Note:** that some nouns can be used both as countables, when they refer to a thing, and as uncountables, when they refer to the substance or material it is made up of.

There are three glasses on the tray. ('glasses', countable noun).

The tray is made of glass. ('glass', uncountable noun).

Some countable nouns are concrete and represent people, things or activities that can be seen, touched or heard, for example rose, table, basket. Other countable nouns are abstract and represent states, feelings or qualities, which can only be felt or imagined, for example hop, ambition, joy. Similarly, some uncountable nouns are concrete, for example cotton, clothing, bread, while others are abstract, for example peace, pain, anger.

- **Collective nouns:** common nouns followed by 'of' and referring to groups of people or things.

A team of players, an army of soldiers, a bouquet of flowers.

- **Note:** that when using collective nouns, you will usually have to use the complete expression in order to make sense. For example, the collective noun 'bunch' by itself would not tell people what you are talking about because it could be used for grapes, roses or letters. Exceptions to this are, for example, 'an army', 'a bouquet' and 'a gang', which are usually used for soldiers, flowers and thieves respectively.

Plural forms of nouns

We use plural forms of nouns to talk about people, places and things that are more than one in number, for example 'two trolleys', 'a box of brushes', 'a few monkeys'.

Regular forms: You can follow the patterns below to form the plural forms of most nouns.

1. **Add-s in the case of most nouns:** mugs, pets, beds, cups, tubs, chiefs, cans, sums, teachers, dolls, months, smiles, tongues, days, windows.
2. **Add-es after nouns ending in:**
   -s: glasses, classes, passes, masses.
   -x: boxes, taxes, faxes.
   -ch: matches, clutches, stitches.
   -sh: wishes, bushes, dishes.



3. **Add-s after nouns ending in -ay, -ey,-oy, -uy:** rays, keys, toys, guys.
4. **In nouns ending in a consonant letter+-y, replace the final-y with 'ies':** countries, cities, ladies, babi es.
5. **In nouns ending in-fe, replace the letters with-ves:** knives, lives, wives.

Irregular forms: There are some nouns for which you cannot find the plural forms by following the patterns above. You will have to learn the plurals of these nouns through reading or by looking them up in a standard dictionary Look at some plurals that do not follow the usual pattern.

1. **Nouns ending in-f forms plurals:**
   - **With a final -f :** roof/ roofs, chief/ chiefs, proof/ proofs.
   - **With a final -ves in place of the -f :** calf/calves, loaf/loaves, leaf/ leaves.
   - **With either a final-s or a final -ves:** dwarf/ dwarfs or dwarves, hoof / hoofs or hooves, scarf/ scarfs or scarves.
2. **Nouns ending in -o form plurals:**
   - **Always with a final-oes:** potatoes, tomatoes, echoes.
   - **With either a final-oes or-os:** buffaloes/ buffalos.
   - **Always with a final-os:** kilos, radios, videos, photos.
3. **Nouns whose plural forms are formed by adding-en/-ren:** oxen, children
4. **Nouns whose plural forms are formed by changes in letters within the singular form:** foot/feet, mouse/mice, man/men.

Tips to remember

- The following words are countable and are normally used in singular form only. The indefinite article a/an should not be used with them.

BANK EXAMS

ENGLISH

- The words such as measles, mumps, ethics, maths, politics, phonetics, rickets, billiards and innings look like plural nouns but give singular meaning. So, they take singular form of verbs.
- Some nouns have the same form whether singular or plural.

Sheep, deer, service, series, species, apparatus.

- The following nouns are always used in the plural form only.

Cattle, scissors, spectacles, electorate, binoculars, crackers, clergy. These are used with plural form of verbs.

- Add**'s'** to the main word in compound noun to make it plural.
  Sister-in-law, sister's- in-law
- The possessive case of a compound noun is formed by adding**'s'** to the last word.
  Father-in-law's property.
- After the phrases *one of, some of, each of, either of, neither of, any of, none of,* a plural form of a noun is used.
- Nouns indicating numerals should be used in singular form.
  A dozen eggs/ two dozen oranges.
- After collective noun either a singular or plural form of verb is used.
- An apostrophe and 's' is used with living beings only to show possession.
- When two nouns are connected by **'and'** and are closely related add an apostrophe and **s** to the last noun.
- Collective nouns, such as ***family, majority, audience,*** and ***committee*** are singular when they act in a collective fashion or represent one group. They are plural when the members of the collective body act as individuals. Collective nouns will usually be singular in Sentence Correction sentences.

A majority of the shareholders wants the merger.

This sentence is grammatically correct - but confusing. To determine whether a confusing noun requires a singular or plural verb, it might be helpful to visualize what's actually going on in the sentence. Is the sentence talking about something that acts as a *singular entity*? Or is it talking about the individual elements *within* that entity?

In the sentence here, there is no indication that the sentence is referring to the *individuals within* the majority. The "majority" acts as one - as a singular entity - and therefore requires a singular verb, "wants."

Again, the "flock of birds" is referred to as a singular group - we're not talking about *each bird's* direction of flight, but the direction of the flock as a whole - thus it requires the singular verb "is" not the plural verb "are".

The team are always fighting amongst themselves.

This is an example of a collective noun that requires a ***plural*** verb. While 'team' is often used as a singular collective noun, in this case, the sentence describes the fighting that occurs *between the individual members of the team.* "Team" therefore refers to several *individual members*, and requires a plural verb, "are," as a result.

The key to these questions is simplicity: recognize the collective noun, visualize what's going on in the sentence, and proceed.

Directions (Q. 1-15): *Each question below has a blank, indicating that something has been omitted. Choose the word from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.*

1. The work increases our ___ about how the body fights disease.
   1) knowledge 2) knowledges
   3) knowledgably 4) acknowledge
   5) knowledgeable
2. They are doing some fascinating- __________ into the language of dolphins.
   1) Researches 2) researcher
   3) research 4) re searches
   5) re search
3. In our family, we share the ______ between us.
   1) Houseworks 2) housework
   3) houses works 4) house works
   5) house working
4. The first task is to clean up the _____ left behind by the factories.
   1) Pollutions 2) pollution
   3) polluting 4) pollute
   5) polite
5. They are suffering from _____ lack of medical supplies.
   1) a serious 2) serious
   3) seriously 4) seriousness
   5) series
6. He's starting to get a few grey _____ now.
   1) Hair 2) heirs 3) heir
   4) hairs 5) hairy
7. Would you like some more ___ on your plate?
   1) Cauliflower 2) cauliflowers
   3) the cauliflowers
   4) a cauliflowers
   5) an cauliflowers
8. The doctor said that she was making _____ and she would probably be out of hospital by next week.
   1) a good progress
   2) good progress
   3) good progresses
   4) better progress
   5) good progressing
9. The book has ______ at the end of every chapter.
   1) Exercises 2) exercise
   3) excess 4) exceed
   5) execute
10. Do you want any help in bringing your ______ from the van?
    1) stuffs 2) stuff 3) stuffing
    4) stuffy 5) stuffed
11. _____ was the ideal punishment for her.
    1) A prison 2) Prison 3) prisons
    4) the prisons 5) an prison
12. Emily ate six _____ and two eggs for breakfast.
    1) bacons 2) rashers of bacon
    3) bacon 4) rash of bacon 5) bake
13. Is there _____ for all of us to fit in?
    1) a room 2) rooms 3) room
    4) the room 5) room's
14. They think she put _____ on their family.
    1) a curse 2) curse 3) cursory
    4) curses 5) an curse
15. Their offices have small upholstered _____ and comfortable chairs.
    1) sofa 2) sofa's 3) sofas
    4) an sofa
    5) the sofas

Key:

1) 1	2) 3	3) 2	4) 2
5) 1	6) 4	7) 1	8) 2
9) 1	10) 2	11) 2	12) 1
13) 3	14) 1	15) 3.	